# శివ నాటకము

## యక్షగానము

**మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రణీతము**

సాధారణ సంపాదకులు
**బి.యస్. రెడ్డి (భూమన్)**
సంచాలకులు, తరిగొండ వెంగమాంబ వాజ్మయప్రాజెక్టు,
"శ్వేత", తి.తి.దే. తిరుపతి.

**పరిష్కర్త : ఆచార్య కె.జె. కృష్ణమూర్తి**
తరిగొండ వెంగమాంబ వాజ్మయ ప్రాజెక్టు
"శ్వేత", తి.తి.దే. తిరుపతి.

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**
**2009**

# ŚIVA NĀṬAKAMU

(YAKṢA GĀNAMU)

**MĀTṚŚRĪ TARIGOṆḌA VEṄGAMĀMBA**

Edited by
Prof. K.J.Krishnamoorthy
Tarigoṇḍa Veṅgamāmba Vāṅmaya Project,
"SVETA", T.T.D., TIRUPATI.

T.T.D "SVETA" Religious Publications Series No.

© All Rights Reserved
First Edition: 2009
Copies : 1000

Published by
I.Y.R. Krishna Rao, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

D.T.P. SVETA T.T.D

Printed at
TirumalaTirupati Devasthanams Press.
Tirupati.

శ్రీనివాసో విజయతే

# ముందుమాట

**ఐ.వై.ఆర్.కృష్ణారావు,** ఐ.ఏ.యస్.,            27-06-2009
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దేవస్థానములు,
తిరుపతి.

కలియుగ ప్రత్యక్ష దైవంగా ప్రశస్తి వహించిన తిరుమల వేంకటేశ్వరుని భక్త బృందంలో ఒక్కొక్కరిది ఒక ప్రత్యేకత! ఆ ప్రత్యేకత ఆ యా భక్తవర్యులు శ్రీ స్వామివారిని ఆరాధించటంలో అనుసరించిన మార్గాల ద్వారా లోకానికి వెల్లడవుతూ వుంటుంది.

అలాంటి భక్తవరేణ్యులలో అగ్రగణ్యురాలు, శ్రీనివాసుని అంతరంగిక భక్తశిరోమణి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ. పరమయోగిని (Woman Saint)గా, భక్త కవయిత్రిగా విలసిల్లిన ఈ సాహితీమూర్తి విశిష్టతను గుర్తించిన తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం ఆమె పేరిట ఒక వాఙ్మయ పీఠాన్ని రెండేళ్లక్రిందట “శ్వేత” భవనంలో నెలకొల్పింది.

“తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు” - అనే పేరుతో ఏర్పడిన ఈ వాఙ్మయ పీఠం కేవలం రెండు సంవత్సరాల కాలపరిమితిలోనే ప్రశంసింపదగ్గ ప్రగతిని సాధించడం ముదావహమైన సంగతి!

ఈ వాఙ్మయ ప్రాజెక్టు భక్త కవయిత్రి 22 రచనలను ప్రచురించి వుండటం, అలాగే ఈ కవయిత్రి భక్తిరస భరిత గేయాలతో కూడిన 12 ఆడియో సి.డి.లను విడుదల చేయటం అభినందనీయం! అదే విధంగా ఈ మహాకవయిత్రి జయంతి, వర్ధంతి - ఉత్సవాలను, ఆంధ్రదేశంలోని తిరుపతి, హైదరాబాదు, విశాఖపట్నం, కాకినాడ, అనంతపురం, విజయవాడలాంటి అనేక ముఖ్య నగరాలలో సాహితీ సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం నిజంగా ఆహ్లాదకరమైన సమాచారం!

అపూర్వమైన ఈ వాఙ్మయ ప్రగతికంతటికి మూల కారణమైన ఏకైక వ్యక్తి తి.తి.దే. శ్వేత సంస్థ సంచాలకులు ఈ వాఙ్మయ ప్రాజెక్టు డైరెక్టరు-అయిన సుగృహీత నామధేయులు శ్రీ భూమన్ గారు. వారి కార్యదీక్షాదక్షతను నేను ఈ సందర్భంగా హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

ఈ ప్రాజెక్టు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 192వ వర్ధంతి ఉత్సవ సందర్భంగా ఈ క్రింది మూడు విశిష్ట గ్రంథాలను వెలువరిస్తున్నది:-

1) శివ నాటకము (యక్షగానము) - మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ
2) భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ (బుఱ్ఱకథ)- విద్వాన్ జి. సుబ్రహ్మణ్యశాస్త్రి
3) వెంగమ్మ (జీవిత సంగ్రహము) - ఆంధ్ర శేషగిరిరావు

తరిగొండ వెంగమాంబ కృతులనన్నింటిని పరిష్కరించటంలో అనుభవం గడించిన ఈ వాఙ్మయ ప్రాజెక్టు పరిష్కర్త ఆచార్య కె.జె.కృష్ణమూర్తిగారు 73 ఏండ్ల మీరిన వయస్సులో అముద్రితమైన, అపూర్వమైన ఈ శివ నాటక యక్షగానాన్ని అనేక వ్రాతప్రతుల సాహాయ్యంతో ప్రశంసనీయమైన రీతిలో పరిష్కరించి, సాహితీ ప్రియులకు, భక్త జనావళికి అందజేస్తున్నందులకు చాలా సంతోషంగా వుంది.

అలభ్యమైన ఈ కవయిత్రి రచనలను కూడా ఇలాగే సేకరించి, ఆచార్య కె.జె.కృష్ణమూర్తిగారు చక్కగా పరిష్కరించి ప్రచురింపగలరని ఆశంసిస్తున్నాను.

మునుపటి పుస్తకాల మాదిరిగానే శివ నాటకం మొదలైన ఈ మూడు ప్రచురణలను సహృదయులైన పాఠకావళి సమాదరిస్తారని నా నమ్మకం.

ఈ రచనలు సహృదయులైన పాఠకుల హృదయాల్లో ఆనందాన్నీ, 'ఆనందనిలయుని' యెడల భక్తి ప్రపత్తులనూ పెంపొందింప గలవని మా ఆశయం.

29.6.09.

**ఐ.వై.ఆర్.కృష్ణారావు, ఐ.ఏ.యస్.,**



# సాహిత్య విభూతి

"భూమన్" 04.07.2009

సంచాలకులు,
మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయప్రాజెక్టు,
"శ్వేత", తి.తి.దేవస్థానములు, తిరుపతి.

'విభూతి' అంటే 'ఐశ్వర్యం' అంటే సంపద కాబట్టి 'సాహిత్య విభూతి' అంటే 'సాహిత్య సంపద' అని సారాంశం. సహజ కవయిత్రీ, మహాకవయిత్రీ అయిన తరిగొండ వెంగమాంబ సృజించిన సాహితీ సంపదలో లభించిన అమూల్య రత్నం ఈ "శివనాటకం".

వెంగమాంబ తాను పుట్టిన ప్రాంతానికీ, జీవించిన కాలానికీ అతీతంగా మనుగడ సాగించిన మహనీయురాలు! ఆ విధంగా అతీతంగా మనుగడ సాగించినా, సామాజిక స్పృహగల ఆ సారస్వతమూర్తి తాను జన్మించిన ప్రాంతాన్ని ఏనాడూ విస్మరింపలేదు. అందువల్లే తరిగొండ గ్రామానికి అనతి దూరంలో గల రాచవీటిలో వెలసివున్న వీరభద్రస్వామి తిరునాళ్లనూ, ఆ ప్రాంతాల్లో జరిగే గంగజాతర ఉత్సవాలనూ బాల్యంలోనే సందర్శించిన ఈ సహజ కవయిత్రి ఆ స్ఫూర్తితో ఈ యక్షగానాన్ని రచించి, ఆ క్షేత్రంలో నెలకొన్న భద్రకాళీ సమేతుడైన వీరభద్రస్వామికి అంకితం కావించింది!

పరమయోగినిగా ప్రసిద్ధిగాంచిన ఈ మహాకవయిత్రి శివ కేశవ సమభావనకు, స్థిరమైన భక్తిభావానికి ఈ దేశీయ రూపకం

చక్కగా అర్థంపడుతున్నది. సజీవమైన శిష్టవ్యావహారిక భాషలో, సరళ సుందరశైలిలో జాల్వారిన అపూర్వమైన ఈ యక్షగాన నాటకాన్ని - ఇంతకాలం అముద్రితంగానే ఉన్న దానిని - తి.తి.దే. శ్వేత తరిగొండ వాఙ్మయ ప్రాజెక్టు పక్షాన ప్రచురిస్తూ వున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

ఈ వాఙ్మయ ప్రాజెక్టు త్వరలోనే తరిగొండ వెంగమాంబ రచించిన ఇతర రచనలను కూడా ప్రచురించగలదని తెలియజేయటానికి సంతోషిస్తూ వున్నాను. ఇలాగే ఆంధ్రావనియందలి ఆయా సాంస్కృతిక కేంద్రాల్లో ఈ కవయిత్రి సారస్వతంపై సాహిత్యోపన్యాసాలు, సంగీత ప్రదర్శనలు, హరికథలు, బుర్రకథలు మొదలయిన సాంస్కృతిక కార్యక్రమాలను ఇతోధికంగా నిర్వహించటం ద్వారా ఈ కవయిత్రీమతల్లి సాహిత్యం యొక్క ప్రాశస్త్యాన్ని ప్రబోధించే ఉద్యమాన్ని తి.తి.దే. విశిష్టంగా కొనసాగిస్తూవుందని తెలియచేయటానికి ఆనందిస్తున్నాను.

'శివనాటకం' పరిష్కరణలో అమోఘమైన ప్రతిభను, ప్రతిపత్తిని కనపరచిన మా పరిష్కర్త ఆచార్య కె.జె. కృష్ణమూర్తి గారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. 'శివనాటకం' ప్రతులన్నిటినీ తెప్పించుకోవటంలో వీరు చాలాశ్రమ కోర్చినారు. కొందరు సహకరించినారు, మరికొందరు సహకరించలేదు. సహకరించిన వారికి ధన్యవాదాలు. సహకరించని వారికి శతకోటి ప్రణామాలు!

**భూమన్**

# పీఠిక

"శివ నాటకం" మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ రచించిన కృతులలో మూడవది. ఈ యక్షగానం కవయిత్రి చిన్ననాటి రచన. తరిగొండలో ఉన్నప్పుడు వ్రాయబడింది. "శివ విలాస"మని దీనికి మరొక పేరు. తరువాతి కాలంలో కొందరు లేఖకులు, పాఠకులు దీనిని - పారిజాతాపహరణ కథతోడి పోలిక కారణంగా - "శివ పారిజాత" మనే నామధేయంతో వ్యవహరించారు.

సంగ్రహంగా ఇందలి కథా స్వరూపం ఇది:-

**కథా స్వరూపం:**

శ్రీమంతమై, సమస్తసంపదలతో విలసిల్లుతున్న కైలాసపట్టణాన్ని పరమేశ్వరుడు ప్రమథాది పరివార గణం సేవిస్తూవుండగా, గంగా పార్వతీ సమేతుడై మహావైభవంతో పరిపాలిస్తూ వున్నాడు. పార్వతీ సౌధంలో ఉన్న ఆ స్వామికి ఒక నాడు, ప్రియపత్నియైన జాహ్నవిని (గంగాదేవిని) చూడాలనిపిస్తుంది. అక్కడినుండి తరలి వెళ్లటానికి ఆలోచిస్తూవున్న తరుణంలో ఆయనకు ఒక నెపం దొరకుతుంది. అదేమంటే పార్వతీదేవి పతితో సరస సల్లాపగోష్ఠి సాగిస్తూ ఇలా అన్నది-

"స్వామీ! మీ దేహంమీద ఈ బలిసిన పాములు నిరంతరం కదలుతూ, నాలుకలు అల్లాడిస్తూ ఉంటున్నందున, మిమ్మల్ని సమీపించటానికి నాకు చాల భయమేస్తూవుంది" - అని.

ఈ సరసోక్తిని పరిహాసంగా పరిగణించి, తీవ్రమైన అలుకతో శివుడు వెంటనే జాహ్నవీ మందిరాన్ని చేరుకుంటాడు.

అలాగ తనపై కోపంతో వెళ్లిపోయిన శివుణ్ణిగూర్చి పార్వతి వినయభక్తులతో వెదకుతూవుంటుంది. ఆ సమయంలో 'తామసి' అనే యువతి ఎదురుపడి, పార్వతిని వివరాలడిగి తెలుసుకుంటుంది. సర్వజ్ఞుడయిన శంకరుడు పార్వతి తనకొఱకై పడుతున్న ఆరాటాన్ని మనోవీథిలో భావిస్తాడు. అందువల్ల, గంగకు తెలియకుండా, వృషభవాహనంపై మరల పార్వతీ భవనాన్ని ప్రవేశిస్తాడు.

శంకరుడు పార్వతీమందిరంలో ఇష్టాగోష్ఠిగా ఉండగా దేవముని నారదుడు వస్తాడు. స్వామిని సంస్తుతించి, సూర్యుడు దివ్యగాన మాధుర్యానికి మెచ్చి తనకు బహూకరించియుండిన రత్నాల హారాన్ని నారదముని శివునకు సమర్పిస్తాడు. పరమేశ్వరుడు ఆ అపూర్వ హారాన్ని పార్వతికి ప్రసాదిస్తాడు. పతిదేవుడు తనకు ప్రసాదించిన ఆ అమూల్య హారాన్ని ధరించి, గిరిజాదేవి అపూర్వంగా వెలుగొందుతుంది!

నిదుర మేల్కొనిన జాహ్నవికి శివుడు కనబడనందువల్ల ఆయనను కలవాలనే మక్కువ అతిశయిస్తుంది. పన్నీటిలో జలకమాడి, చక్కగా ముస్తాబై, తొలకరి మెఱుపులాగా ప్రకాశిస్తూ, ఆమె అంతఃపురంలోనూ, ఇతరత్రా శివుణ్ణిగూర్చి అన్వేషిస్తూ వుంటుంది. ఇంతలో - మునుపు పార్వతికి ఎదురుపడిన - తామసి

తటస్థింపగా, గంగాదేవి ఆమెకు తన విషయం వివరిస్తుంది. తన ఉంగరాన్ని ఆనవాలిచ్చి, ఎలాగైనా శివుణ్ణి తోడ్కొని రావలసిందని తామసిని పంపిస్తుంది.

పార్వతీమందిరంలో గంగాధరుడు ఉన్న సంగతిని తెలిసికొన్న తామసి వెళ్ళి, ముద్దుటుంగరం ఆనవాలును చూపిస్తూంది. జాహ్నవీ మందిరానికి విచ్చేయవలసిందిగా సమయోచితంగా నయ విన యోక్తులతో చంద్రశేఖరుణ్ణి సంప్రార్థిస్తుంది. పార్వతీశుడు గంగ పంపిన ఆనవాలునుసైతం స్వీకరింపడు. 'జాహ్నవి యింటికి రానుపొ'మ్మని నిర్మోహమెోటంగా నిరాకరించి, తామసిని పంపివేస్తాడు.

తామసి మరలి వస్తూ 'శాంభవి ధరించిన రత్నహార వృత్తాంతాన్ని'కూడా సేకరించుకొని వస్తుంది. మొత్తం విషయాన్ని పూసగ్రుచ్చినట్లు జాహ్నవికి విన్నవిస్తుంది.

ఈ శ్వరుడు రాలేదని విచారిస్తూవున్న మందాకినికి 'మదనభూతం' సోకడం కారణంగా, విరహాతిశయంవల్ల చివరకు మూర్ఛాక్రాంత అవుతుంది. చెలులు చేసిన పరిచర్యల వల్ల, భూతవైద్యాలవల్ల జాహ్నవీదేవి మూర్ఛనుండి తేరుకుంటుంది. పరిస్థితిని గమనించిన చెలికత్తె తామసి మళ్లీ శివుని వద్దకు దూతికగా వెళ్లి, శివుణ్ణి ప్రాధేయపడుతుంది. అయినా పశుపతి పట్టిన పట్టు వీడడు.

చెలి (తామసి ) ప్రేరేపణవల్ల, గంగాదేవి చెలికత్తె లందరినీ వెంటబెట్టుకొని పార్వతీనిలయానికి వెళ్లి, శివుణ్ణి రమ్మని స్వయంగా ఆహ్వానిస్తుంది. ఎంత పిలిచినా, ఎంత వాదించినా, చివరకు పార్వతీదేవితో వివాదపడినా ఫలితం లేకపోతుంది. కఱకంఠుని మనస్సు కరుగదు!

నిరాశతో నిజసౌధానికి చేరుకున్న జాహ్నవి మన్మథ, చంద్ర, మలయానిలుల దూషణ కావించిన అనంతరం, ఆమెకు ఒక యుక్తి స్ఫురిస్తుంది. అదేమంటే, వైరాగ్యమనే ఖడ్గంతో మన్మథుణ్ణి సపరివారంగా మనస్సులో నుండి జయించి, తఱిమివేయటం. అయితే , అందుకు పతిదేవుని అనుమతి ఆవశ్యకం కాబట్టి, గంగాదేవి ఒక లేఖను - తన జడలోని మొగలిరేకుపై కొనగోటితో - వ్రాసి, తామసి ద్వారా పరమశివునికి పంపిస్తుంది. అందుకు ప్రత్యుత్తరంగా వెంటనే శివుడు - పార్వతిజడలోని మొగలిరేకుమీద- తన కొనగోటితో వ్రాసి తామసితోనే పంపుతాడు.

తాను వస్తున్నానని వ్రాయక, 'మన్మథుణ్ణి జయించి, నీ మహిమను చూపవలసిం'దని శివుడు పంపినందుచేత జాహ్నవికి పట్టుదల అధికమవుతుంది. అందువల్ల, సిద్ధాసనాసీనయై కూర్చుండి, గంగాదేవి తన యోగ ప్రభావంచేత సకల లోకాలలోని జలాలను ఆకర్షించి తనలో సంలీనం చేసికొంటుంది; మహాయోగినియై, ఆత్మానుభవంలో నిమగ్న అవుతుంది.

ఆ విధంగా ఉదకాలన్నీ మాయమైపోయినందువల్ల లోకాలన్నీ అల్లకల్లోలమై, గగ్గోలుపడతాయి. ఈ ఉపద్రవాన్ని నివారించే నిమిత్తమై తరిగొండలో నెలకొనివున్న మహాలక్ష్మి తన భర్త అనుజ్ఞ గైకొని ఎఱుకత వేషాన్ని ధరించి, కైలాసానికి వెళ్ళి జాహ్నవికి సోదె చెపుతుంది: 'నీ పతి త్వరలో నీ మందిరానికి వస్తాడు. అప్పుడు నీవు బ్రహ్మదేవుడు ధరించిన మాణిక్య హారాన్ని తెప్పించి యిమ్మని అడుగు! అది నారదు డిచ్చిన రత్నహారాన్నికన్నా మహిమ కలది!'. ఎఱుకత సూచించిన ఈ సూచన జాహ్నవి మనస్సుకు నచ్చుతుంది.

ఇంతలో ఎఱుకతను వెదకుతూ సింగడు (తరిగొండ నృసింహుడు) ఆ చాయలకు వస్తాడు. వాళ్లిద్దరూ అన్యోన్యంగా మాట్లాడుకుంటూ, తరిగొండ చేరి, నిజస్వరూపాలను ధరించి, సుఖస్థితితో ఉంటారు.

ఆ తరుణంలో త్రిలోకాధిపతియైన ఇంద్రుడు సపరివారంగా కైలాసానికి వెళ్లి శంకరుణ్ణి సందర్శిస్తాడు. 'దేవదేవా! జాహ్నవీదేవిని ప్రసన్నురాలిని కావించి, లోకాల్లో జలాలను రప్పించి అనుగ్రహించ'ండని సంప్రార్థిస్తాడు - తదనుగుణంగా సదాశివుడు శాంకరి అంగీకారంతో గంగ యింటిలో ప్రవేశిస్తాడు - ఎట్టకేలకు పరమేశ్వరుడు గంగ మనస్సు నందలి అభీష్టాన్ని తెలిసికొంటాడు. నందీశ్వరుని ద్వారా బ్రహ్మదేవుణ్ణి తన వద్దకు రప్పిస్తాడు. బ్రహ్మదేవుడు సదాశివుని అభిమతానుసారం తన మణిహారాన్ని

"శివార్పణం"గా సమర్పిస్తాడు. భర్త అనుమతితో మందాకిని ఆ దివ్య మణిహారాన్ని ధరించి ఆనందపడుతుంది; వెనువెంటనే - అఖిలలోకాలకు ఉదకాలను అనుగ్రహిస్తుంది.

'కార్య సాధనకై గంగ యింటికి వెళ్లివస్తా'నన్న పరమేశ్వరుడు మరలి రాక మసలినందుకు, శాంభవి(పార్వతి) తాళలేకపోతుంది. ప్రాణసఖియైన కుందరదనకు తగిన హితోక్తులను ఉపదేశించి, శివుణ్ణి సత్వరమే తోడ్కొనిరావలసిందిగా చెప్పి, జాహ్నవీ మందిరానికి పంపిస్తుంది.

కుందరదన కొంత దూరం వెళ్లి, 'కాని శకునములు అయ్యా'యని మరలి వస్తుంది. 'తిరిగి వచ్చినందున ఆ అపశకున దోషం పరిహారంఅయింది గనుక, వెంటనే వెళ్లి ఇందుశేఖరుణ్ణి తోడితేవలసిం'దని పార్వతీదేవి మళ్లీ ఆ ప్రాణసఖిని పంపిస్తుంది. కుందరదన తొలుత శివునితోనూ, పిదప మందాకినితోనూ సముచితరీతిని సంభాషిస్తుంది.

తుదకు'ఆ పార్వతి విరహాగ్ని తాపంతో భీతినొందివుండగా, 'నీవు ఈ పరమేశ్వరుణ్ణి పంపకుండా పాపం కట్టుకొంటున్నావు; ఇదేం భాగ్యమమ్మా? గంగాదేవీ!' - అని కుందరదన ప్రశ్నిస్తుంది. ఆ పల్కులకు మందాకిని ఆగ్రహోదగ్ర అవుతుంది. తత్క్షణమే నీలవేణి మున్నుగాగల తన చెలులచేత కుందరదనను కుఱుచబెత్తాలతో కొట్టించి, మెడబట్టి నెట్టివేయిస్తుంది.

తిరిగి వచ్చిన కుందరదనవల్ల జరిగిన విషయం తెలిసికొన్న పరమేశ్వరి అపరిమిత క్రోధ పరవశయై, తన చెలికత్తెలందరిని వెంటబెట్టుకొని జాహ్నవీ సౌధానికి చేరి, శివునితోనూ, జాహ్నవితోనూ సంవాదిస్తుంది. అక్కడ గంగా గౌరులకు సపత్నీ కలహం (సవతుల కయ్యం) సుదీర్ఘంగా సాగుతుంది.

ఆ సందర్భంలో పర్వతరాజ పుత్రి శివుణ్ణి వీక్షించి, ఇలా హెచ్చరిస్తుంది: 'ముక్కంటీ! సృష్టిలోని జలద్రవ్యాన్ని మాయం చేసిన మహిమ గలదని జాహ్నవిని నీవు గొప్పగా చూస్తున్నావు; నే నిప్పుడు పంచభూతాలను సైతం మటుమాయం కావించి, మళ్లీ సృష్టిస్తాను. చూడు నా ప్రభావం!' - అని అక్కడి కక్కడే పద్మాసనాసీనయై, అంబిక కనుబొమల నడుమ చూపు నిలిపి, మహాయోగ దీక్షను అవలంబిస్తుంది.

ఉమాదేవి వైఖరిని పరికించిన గంగాభవాని తానుకూడా వైరాగ్యాన్ని అవలంబించినదై, వీరాసనాసీనయై, నవికల్ప యోగధారణ చేయ నారంభిస్తుంది. అపుడు పరమేశ్వరుడు గంగా గౌరుల విరక్తిని గమనిస్తాడు. 'పత్ను లిద్దఱూ విరక్తలై యోగాన్ని చేపట్టినారు; ఇక ఈ సంసారం ఎవరికి కావాలి?' - అని నిశ్చయించుకొని శంకరుడు సిద్ధాసనంలో కూర్చుండి స్వస్వరూపాన్ని అంతరంగంలో అనుసంధిస్తూ, తపస్సుకు ఉపక్రమిస్తాడు.

ఈ ప్రకారంగా కథానాయకుడయిన శివుడూ, ఆయన నాయిక లిద్దరూ కైలాసంలో పరమ విరక్తి భావనతో యోగాన్ని ఉపాసిస్తూ

వుండగా, వారి నడుమ చోటుచేసికొన్న అరమరను తొలగించి, వాళ్లను సమాధానపఱచటానికి, తద్వారా లోకోపద్రవాన్ని నివారించటానికి తరిగొండ నరహరియైన శేషగిరీశుడు (తాత్పర్యార్థంలో వైకుంఠపతియైన విష్ణుదేవుడు) గరుడ వాహనారూఢుడై కైలాసానికి వేంచేస్తాడు.

అలా వేంచేసిన ఆ తరిగొండ నరసింహుడు భృంగీశుని సాహాయ్యంతో ముందుగా కూతురైన గంగను, పిదప సోదరియైన శైలజను యోగం నుండి మేల్కొనజేస్తాడు. అటు పిమ్మట మన్మథుణ్ణి పిలిపించి, శివునినుండి ప్రమాద నివారణ కొఱకు జాహ్నవిచాటున నిల్చొనజేసి, శివునిపై సుమ బాణాలను ప్రయోగింపజేసి, ఆయనను తపస్సునుండి మేల్కొనేట్టు చేస్తాడు. శివుడు రతీదేవి ప్రార్థనను మన్నించి, మదనునిపై ఏర్పడిన కోపాన్ని విరమించి, శాంతిస్తాడు.

తదుపరి శివ కేశవుల మైత్రీ సమావేశము చుట్టఱికపు సంభాషణలతో ఆహ్లాదకరంగా కొనసాగుతుంది. హరిహరులు ఒకరినొకరు తమ తమ ప్రభావాలను, కల్యాణగుణాలను ఉదాత్తంగా, అభినందన పూర్వకంగా ప్రశంసిస్తారు.

తమోగుణం విజృంభించిన హేతువుచేత గంగా గౌరుల మధ్య ఏర్పడ్డ వైమనస్యం తరిగొండ లక్ష్మీనృసింహుని ఆగమనం కారణంగా పూర్తిగా తొలగిపోయి, శివుని సంసారంలో సయోధ్య నెలకొంటుంది. అందువల్ల, ఆ కైలాసనాథుని మందిరంలో ఆనందోత్సాహాలు విలసిల్లుతాయి.

గంగా, పార్వతుల చెలికత్తెలు ఆ దివ్య దంపతులకు పెండ్లి కావించి, ముత్యాల తలంబ్రాలు పోయించి, జయమంగళ గీతాలను ఆలాపించటంతో ఈ యక్షగాననాటకం జగన్మంగళప్రదంగా, విశ్వశ్రేయోదాయకంగా పరిసమాప్తి నొందుతుంది.

**కథా కల్పన:**

శివునికి సంబంధించిన నాటకం కాబట్టి 'శివనాటక' మనే పేరు సర్వవిధాలా సార్థకమైనది. ఈ యక్షగానమందలి ఇతివృత్తం కవయిత్రిచే కల్పింపబడింది. ఇది కల్పిత కథ అయినా, ఔచిత్యానికీ, ఉదాత్తతకూ ఏమాత్రం లోటు కలుగని రీతిలో ఉత్కృష్టంగా కల్పింపబడింది. ఈ కథారంగం పవిత్రమైన కైలాసగిరి పురం. కథానాయకుఁడైన పరమేశ్వరుడు, నాయిక లయిన గంగా పార్వతులు దివ్య ప్రాతలు.

నైమిశారణ్యంలో శౌనకాది సన్మునీంద్రులకు సూత మహర్షి చెప్పినట్లుగా ఈ కథ ఉపక్రమింపబడింది :

**"శ్రీనుతంబగు నైమి - శారణ్యమునను**
**ఘనులైన శుక, శౌన - కాది సన్మునులు**

**సూతునిఁగాంచి ప్ర-స్తుతిఁజేసి, 'బ్రహ్మ**
**సుతుఁడైన వారదుఁ-డతి కృపతోడఁ**

**బారిజాతంబను - ప్రసవంబుఁ దెచ్చి,**
**వారాయణుని కీయ, - నది రుక్మిణి కిడఁ,**

దా నందు కోర్వక - యా సత్య భామ
చనవునఁ గలహించె' -నని నీవు చెప్పఁ

గా వింటి మే మది - కాలంబునందు;
భావింపఁగాను గం-గా యుమాదేవు

లేల వాగ్వాదించి? - రిత్తఱంగెల్ల
నలలితంబుగ మేము - సద్గుణవర్య!

వినఁ దలంతు మివుడు - వేడ్కతో ననిన"

పై ద్విపద పంక్తులనుబట్టి, సుప్రసిద్ధమైన శ్రీకృష్ణుని 'పారిజాతపహరణ' వృత్తాంతం ఈ కథా కల్పనకు ప్రేరకమైనట్లు స్పష్టమౌతున్నది.

కథను కల్పిచటంలో పారిజాతావహరణ గాథ ప్రేరకమయినట్లే, ఈ కథా వస్తువును యక్షగాన నాటకంగా మలిచి, నిర్వహించటంలో వెంగమాంబకు కూచిపూడి సిద్ధేంద్ర యోగీంద్రుని భామాకలాపం ప్రోత్సాహకమై వెలసింది.

ఇలాగ, సాహితీ ప్రపంచంలో తనకు పూర్వం నెలకొనివున్న రచనలను రేఖామాత్రంగా అనుసరించినప్పటికీ, కథాకల్పనంలోనూ, నాటకీయతా నిర్వహణంలోనూ ఈ సహజ కవయిత్రికి గల ప్రజ్ఞా, ప్రావీణ్యాలు ఈ యక్షగాన కృతిలో అడుగడుగునా సహృదయులకు సాక్షాత్కరిస్తూనే వున్నాయి.

**నాటకీయత :**

తెనుగు దేశీయ రూపక ప్రక్రియ అయిన "యక్షగానం" క్రీ.శ.18వ శతాబ్ది నాటికి పరిపక్వ సమున్నత స్థితిని అందుకొన్నది. ఈ స్థితి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ యక్షగాన రచనల్లో మనకు స్పష్టంగా గోచరిస్తుంది. అందుకు అక్షర నిదర్శనం ఈ "శివనాటకం".

చైతన్యవంతములైన సంభాషణలు, పాత్రల హావ భావ ప్రకటనలు మొదలయినవి నాటకీయతకు ప్రకృష్టమైన చిహ్నాలు. ఈ లక్షణాలు ఈ యక్షగానంలో సమృద్ధిగా నెలకొనివున్నాయి. ఈ నాటకం మొత్తం ఇంచుమించు నలువది రమణీయ రంగాలు (Scenes) గా వింగడించడానికి వీలుగా విస్తరించివుంది. ఆ విధంగా వింగడించడానికి వీలైన ప్రతిరంగమూ తగిన పరిమితి గలిగి, మనోజ్ఞములైన సంభాషణలతో (సంవాదాలతో) రసోల్లసితంగా రాజిల్లుతూ వుంది.

పార్వతి తామసితో సంభాషించడం, పరమేశ్వరుడు భృంగీశ్వరునితో ప్రసంగించడం, ఎఱుకత (కొఱవంజి) జాహ్నవికి సోదె చెప్పే ఘట్టం, వికటభాషణుడు విష్ణుదేవునితో వినోదంగా మాట్లాడటం, పరమశివుడు తరిగొండ నృసింహుడు కలిసికొన్న సన్నివేశమూ - ఇత్యాదులు ఈ కవయిత్రి సంవాద శిల్పంతో దిద్ది తీర్చిన నాటకీయతా లక్షణానికి చక్కని నిదర్శనాలు. ఒక్క మాటలో చెపితే, ఈ యక్షగాన రూపకం ఆద్యంతము

సంవాద కళావిలసితమై దృశ్య, శ్రవ్య ఉభయ ప్రయోజనాత్మకంగా విలసిల్లుతూవుంది!

ఇక, ఈ నాటక ప్రారంభంలోని ఇష్టదేవతా స్తుతి పద్యానికి సంబంధించిన ఒక ముఖ్య విశేషం ఈ సందర్భంలో పేర్కొనదగివుంది. ఆ పద్యమిది :-

"క. శ్రీ గణపతిని మహాత్మునిఁ,
ఆగమ సంవేద్యుఁడైన హరుని, భవానిన్,
భోగి శయానుని, లక్ష్మిని,
బాగుగఁ బద్మజుని, వాణిఁ బ్రస్తుతిచేతున్"

పై పద్యంలో స్తుతింపబడిన దేవతల్లో ప్రథముడు గణపతి. ఇది యీ నాటకారంభంలోని విఘ్నేశ్వర పాత్ర ప్రవేశాన్ని సూచిస్తూ వుంది. ఇలాగే 'హరునిన్' అనటంవల్ల ఈ కథానాయకుడైన సదాశివుడు ప్రస్తుతింపబడినాడు. "భవానిన్" - అనే శబ్దం ఈ కథలోని నాయికలైన పార్వతిని, గంగాభవానిని సూచిస్తూవున్నది.

ఇక 'భోగి శయానుఁడు' - అనే మాట ఈ నాటకం యొక్క ఉత్తరార్ధంలో ప్రధానంగా ప్రసక్తుడయిన తరిగొండ లక్ష్మీ నృసింహుణ్ణి ప్రకటిస్తున్నది. 'పద్మజునిన్' అనేది సదాశివునికి దివ్యమణిహారాన్ని సమర్పించిన సృష్టికర్తను సూచిస్తూ వుంది. అలాగే, 'వాణిన్' అనే చివరిపదం అక్షర సరస్వతీ సాక్షాత్కారాన్ని పొందిన ఈ కవయిత్రికి ఆ వాగ్దేవి యెడల గల భక్తిప్రపత్తులను చాటుతూ వుంది.

ఈ విధంగా తరిగొండ వెంగమాంబ ఈ కృతి ఆరంభంలోని కందపద్యంలో ప్రధాన పాత్రలపేర్లను ఇమిడ్చి, స్తుతించటం ద్వారా ఈ కథా స్వరూపాన్ని సూక్ష్మంగా సూచించివుండటం ఈ నాటక రచనలోని ఒక ముఖ్య విశేషం!

**పాత్రచిత్రణ :**

కావ్యంలో కథను నడపేవి పాత్రలు. అలాంటి పాత్రల స్వరూప, స్వభావాలను సవ్యంగా, సముచితంగా ఆవిష్కరించడంలో ఈ కవయిత్రి సిద్ధహస్తురాలనటానికి ఈ నాటకంలోని పెద్ద, చిన్న పాత్రలు అన్నీ సజీవ దృష్టాంతాలే!

ఇందలి పాత్రలన్నీ దివ్యపాత్రలే అయినప్పటికీ, వాటికి మానవోచితాలైన స్వభావాలను అత్యంత సహజంగా ఆరోపించి, వాటిని మనోజ్ఞంగా, ఆహ్లాదకరంగా వికసింప చేయటంలో వెంగమ కవితా ప్రతిభ వెల్లడౌతూవుంది. ఇందుకు ముఖ్యమైన ఉదాహరణలుగా ఈక్రింది పాత్రల అక్షరాకృతులు ఇందులో పరికించదగివున్నాయి :

i) పార్వతీదేవి (13వ పుట )
ii) నారదుడు ( 55 - 56పుటలు)
iii) జాహ్నవి (60 - 61పుటలు)
iv) ఎఱుకత (128 - 130పుటలు )
v) బ్రహ్మదేవుడు ( 181 - 182పటలు)
vi) విష్ణుదేవుడు ( 227 - 228పుటలు )

ఇలాగే, నటరాజు పరమశివుఁడు పార్వతీదేవి అంతః పురంలో ఆ దేవేరి ఆనందానికి స్వయంగా నృత్యం చేసే వర్ణనగల దరువు ఈ కవయిత్రి యొక్క భరత శాస్త్ర ప్రావీణ్యానికి మచ్చుతునక! (చూ:- "ఆడెనే! శివుఁడాడెనే!" పుటలు 53-54).

ఇందులో ప్రధాన పాత్రలకు సహాయకులుగా నెలకొల్పబడిన తామసి, భృంగీశ్వరుడు వికట(వక్ర)భాషణుడు మొదలైన వారు పరమేశ్వరుడు మొదలైన ప్రధాన పాత్రలతో వినోదంగా సంభాషించే సన్నివేశాల్లో వాళ్ల వాళ్ల పరిధినీ, ఔచిత్యాన్నీ అతిక్రమించకుండానే ఉత్తమమమైన హాస్యాన్ని పండించటంలో కృతకృత్యులయ్యారు. ఇది కవయిత్రి యొక్క లోకజ్ఞతకు, పాత్ర చిత్రణ నైపుణ్యానికి కమనీయమైన నిదర్శనం!

**శైలి :**

ఆ యా సందర్భాలకు అనుగుణమైన నడకలలో సాగిన దరువులు, ద్విపదలు, చంపకోత్పలమాలలు, చూర్ణికలు, సీసమాలికలు, సీసములు, సీసార్ధములు, కందములు, కందార్ధములు, ఏలలు - మొదలుగాగల పలురీతుల ఛందస్సులతో గూడిన విపులమగు వైవిధ్యమూ, తత్సమ, అచ్ఛిక పదాల శ్రావ్యమైన సమ్మేళనమూ, పలుకుబళ్ల పసందుతో ఒప్పారుతున్న శిష్టవ్యావహారిక భాషా మాధుర్యమూ - వీటన్నింటి యొక్క సముచిత సమన్వయంతో ఈ కృతి కమనీయంగా నాటకీయ శైలిలో రస పరిప్లుతంగా, రమ్యంగా శోభిల్లుతూవుంది.

ఈ యక్షగానంలో భక్తి, విప్రలంభము, హాస్యము అంగరసాలై, ప్రధాన(అంగి)రసమైన దివ్య శృంగారాన్ని మనోజ్ఞంగా పరిపోషిస్తూ వున్నందువల్ల, ఈ కృతి రసవత్తరమైన దేశీయ దృశ్యకావ్యంగా రాణిస్తూవుంది.

**కృతి సందేశం :**

తరిగొండ వెంగమాంబ ఈ రచనద్వారా హరి,హర అభేద భావాన్నీ, శివ కేశవుల యెడల సమానమైన భక్తి ప్రపత్తులనూ అపూర్వంగా ప్రబోధించింది. గంగా పార్వతుల మధ్య సయోధ్యను నెలకొల్పే నిమిత్తమై కైలాసానికి విచ్చేసిన తరిగొండ లక్ష్మీనృసింహుడు శివుణ్ణి ప్రశంసిస్తూ ఇలా అంటాడు:-

**"క. ఓ పరమేశ్వర! నీ నా**
**రూపంబులు రెండువైన, రూఢిగ మనమై**
**వ్యాపించు సత్తయొక్కటి;**
**దీపద్వయ మైననేమి? శిఖి యొకటె కదా!"**

**- 378వ పద్యము.**

అందుకు సమాధానంగా పరమేశ్వరుడు ఇలా సమాధాన మిస్తాడు:-

**"క. కావున సంయోగ, వియో,**
**గావిర్భావములు లేవు; హరి! నే నెపుడున్**
**నీవున్న చోట నుండుదు;**
**నీవును నేనున్నచోటనే గల వనఘా!"**

**- 379వ పద్యము**

ఈ శివ కేశవ సమభావన ఈమె రచనలన్నింటిలోనూ మనకు గోచరిస్తూవున్నది. ముఖ్యంగా మఱో కృతి రత్నమైన విష్ణుపారిజాత యక్షగానంలో దేవేంద్రుడు ప్రస్తుతించిన హరిహర స్తుతి ఘట్టంలో ఈ యద్వైత భక్తి సదమలంగా సాక్షాత్కారిస్తూవుంది:-

"జయ రమా హృదయేశ! - జయ చిత్ప్రకాశ!
జయ తరిగొండేశ! - జయ వేంకటేశ!

జయ రజతాద్రీశ! - జయ పార్వతీశ!
జయ సర్వభూతేశ! - చంద్ర సంకాశ!

జయ నిఖిలాధ్యక్ష! - జయ పంకజాక్ష!
జయ దితిసుత శిక్ష! - జయ భక్తరక్ష!

జయ సత్య చారిత్ర! - జయ ఫాలనేత్ర!
జయ పరమ పవిత్ర! - జయ పంచవక్త్ర!

మీ రిద్ద ఱెపుడు నా-మీఁద సత్కరుణ
గౌరవంబుగ నుంచి - కడతేర్చరయ్య!"

## వ్రాతప్రతులు, పరిష్కరణ:

ఈ అముద్రిత గ్రంథాన్ని పరిష్కరించడంలో తరిగొండ వెంగమాంబ మునిమనుమడు గరిడిమిట్ట గంగాధరప్ప క్రీ.శ. 1897లో వ్రాసిన ప్రాచీన i) కాగితపు వ్రాతప్రతి ప్రధానంగా ఉపయోగపడింది. ఈ ప్రతి గురువర్యులు, ప్రాతఃస్మరణీయులు బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి వలన పరిష్కర్తకు

లభించియుండినది. ఇది యీ పరిష్కరణలో "గ"- అనే సంకేతంతో వ్యవహరింపబడింది.

ii) 8630 అనే సంఖ్యగల జిరాక్సు కాగితపు ప్రతి - దీని అక్షర సంకేతం "అ".

iii) 8631 అనే సంఖ్యగల జిరాక్సు కాగితపు ప్రతి - దీని అక్షర సంకేతం "ఆ".

ఈ రెండు జిరాక్సు కాగితపు ప్రతులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్య పరిశోధన సంస్థలో ఉన్నాయి. పరిష్కర్త పై రెండవ, మూడవ జిరాక్సు కాపీలను పరిశోధనకాలంలో చూచే అవకాశం కల్గింది. అప్పుడు కొన్ని పాఠాంతరాలను గుర్తించుకోవడం జరిగింది. ఈ పరిష్కరణ సమయంలో ఎంత ప్రయత్నించినా, ఆ ప్రతులు పరిష్కర్తకు లభ్యంకాలేదు. వీటి మాతృకలైన తాళపత్రప్రతులు చెన్నపురి అడయారు దివ్యజ్ఞాన సమాజం గ్రంథాలయంలో ఉన్నాయి.

iv) "క" ప్రతి - కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తులోని తాళపత్రప్రతి.

v) "కా" ప్రతి - కాకినాడ ఆంధ్రసాహిత్య పరిషత్తులోని కాగితపుప్రతి.

కాకినాడకు వెళ్లిన తరుణంలో పరిష్కర్త పై నాల్గవ ఐదవ ప్రతుల నుండి పాఠభేదాలను గుర్తించుకోవడం జరిగింది.

vi) "ర" ప్రతి బ్రహ్మశ్రీ రావూరి దొరసామిశర్మ గారి వద్ద ఉండిన కాగితపు ప్రతి. గురువర్యులు, ప్రాతఃస్మరణీయులు ఆచార్య

జి.యన్. రెడ్డిగారి సౌహార్దంతో పరిష్కర్తకు లభించియుండినది. ఈ ప్రతిలో చివరి కొంతభాగం లేదు. అయినా ఇందులో కొన్ని మంచి పాఠాలు లభించాయి.

రమణీయ దేశిరచనయైన ఈ యక్షగాన స్వరూపంలో ప్రధానమైనది గేయభాగం. ఇందులో దరువులు, ఏలలు మొదలైన పలురీతుల పాటలు చాలవరకు దీర్ఘాక్షరాలతో తీగెసాగిన తీరున వ్రాయబడివున్నాయి. అటువంటి దీర్ఘాలను అర్థావగతికి అనుకూలంగా - ఆ గేయపు నడకకు అనుగుణంగానే - సవరించటం జరిగింది. మొత్తం మీద ఇలాంటి స్వల్ప సవరణలు ఈ కవయిత్రి ప్రయోగించిన భాషాస్వరూపంయొక్క పరిధిని అతిక్రమించకుండానే కడు మెలకువతో కావింపబడినాయి.

గేయభాగం కాక, తక్కిన దానిలో ఎక్కువగా ద్విపద, అక్కడక్కడ కందం, తేటగీతి, ఆటవెలది, సీసం, ఉత్పలమాల, చంపకమాల, శార్దూల విక్రీడితంలో, కొన్ని శ్లోకాలు రచింపబడిన చూర్ణికలు మొదలైనవి నెలకొల్పబడివున్నాయి. ఒకే లేఖినినుండి వెలువడివున్నా, పద్యాల్లోని భాష గేయాల్లోని భాషకన్నా అధికంగా యతి, గణ, ప్రాసాది ఛందో నియమాలకు, తదితర లక్షణాలకు ఒదిగివుండటంవల్ల, ఆ రెండిటి భాషా స్వరూపంలో ఇంచుక తేడా గోచరించటం స్వాభావికమే. ఈ సత్యాన్ని దృష్టిలో ఉంచుకొనియే ఇందులో పరిష్కరణకార్యం కొనసాగింపబడింది.

ముఖ్యంగా ఇందలి భాష పాత్రోచితమైన పలురకాల వైవిధ్యాలతో విలసిల్లుతూవున్నందువల్ల, దాని స్వరూపంయొక్క అవగాహనకు ఆటంకం కలుగని తీరున, ఈ కృతి పరిష్కరణ జాగరూకతతో నిర్వహింపబడింది.

అడుగడుగునా అనువుగా అమర్చబడిన అనేకరకాల విరామ చిహ్నాలతో, ఆ యా కథాఘట్టాలను నిర్దేశించే ఉపశీర్షికల (Sub head-ings )తో, సంభాషణలు సాగుతూవున్న సన్నివేశాల్లో - స్పష్టతకై - చేర్చిన ఆయా పాత్రల నామ నిర్దేశాలతో, వలసిన చోట్ల అధోజ్ఞాపికల (foot notes) తో ఈ యక్షగాన కృతి మొత్తంమీద ఈ కవయిత్రీమతల్లి కవితా హృదయానికి సన్నిహితమైన సహజ సుందరాకృతిని సంతరించుకొనేట్లుగా దిద్ది తీర్చబడిందని విన్నపము.



# కృతజ్ఞతాంజలి

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టును నెలకొల్పటంలోనూ, దానికి శాశ్వత స్థితిని ప్రసాదించటంలోనూ ఆదినుండీ మూలవిరాట్టుగా విలసిల్లిన సహృదయ వతంసులు, సుగృహీత నామధేయులు, భూత పూర్వ తి.తి.దే. పాలకమండలి అధ్యక్షవర్యులు శ్రీభూమన కరుణాకరరెడ్డి మహోదయులకు, ప్రస్తుత తి.తి.దే. పాలకమండలి అధ్యక్షవర్యులు, సహృదయ వతంసులు, సుగృహీత నామధేయులు,శ్రీ డి.కె.ఆదికేశవులు నాయుడు మహోదయులకు, తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి సభ్యులెల్లరకు నా అనేక ధన్యవాదములు.

శ్రీవారి ప్రతినిధులు, స్మిత పూర్వభాషులు, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టుకు చిరస్థాయి యయిన అభ్యుదయాన్ని, సమగ్రతను ప్రసాదిస్తూవున్న తి.తి.దే. శ్రీకార్యనిర్వహణాధికారివర్యులు, పరిపాలనాదక్షులు, సుగృహీత నామధేయులు ఐ.వై.ఆర్.కృష్ణారావ్, ఐ.ఏ.యస్., మహోదయులకు నా అనేక ధన్యవాదములు.

తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి, సౌజన్య హృదయులు శ్రీఎ.వి.ధర్మారెడ్డి గారికి నా అనేక ధన్యవాదములు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వాఙ్మయ పరిష్కరణ ప్రాజెక్టు యొక్క సర్వతోముఖమైన వికాసానికి తమ వ్యక్తిత్వ లక్షణమైన ఉద్యమ స్ఫూర్తిని సమన్వయించి, ఉత్సాహ, ప్రభు, మంత్ర శక్తి పూరితమైన దక్షతతో ఈ వాఙ్మయ ప్రాజెక్టును ముందుకు నడిపిస్తూ వున్న తి.తి.దే. "శ్వేత" సంచాలకులు, "భూమన్"గా సుగృహీత నామధేయులైన శ్రీ భూమన్

సుబ్రహ్మణ్యంరెడ్డి మహోదయులకు నా అనేక హృదయ పూర్వక ధన్యవాదములు.

తి.తి.దే. పౌరసంబంధాధికారివర్యులు, సరస హృదయులు శ్రీయుతులు కె.రామ్‌పుల్లారెడ్డిగారికి నా అనేక కృతజ్ఞతాభి వాదములు.

"శ్వేత" కేంద్ర గ్రంథాలయం లైబ్రేరియన్ సోదరీమణి శ్రీమతి లీలావతిగారికి, వారి సహోయోద్యోగులయిన మిత్రబృంద మందరికి, "శ్వేత" కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీ వి.దామోదరం గారికి, శ్రీ ఎ. దీనదయాళ్ (యు.డి.సి.) గారికి, వారి సహోద్యోగి బృంద మందరికీ నా అనేక కృతజ్ఞతాభినందనములు.

ఈ పుస్తకమును అనతి కాలములో ముచ్చటగా ముద్రింపజేసిన తిరుమల తిరుపతి దేవస్థాన ముద్రణాలయ మేనేజరు శ్రీయుతులు వి.సాంబశివరావు గారికి, వారి సహోద్యోగులెల్లరకు నా అనేక కృతజ్ఞతాభివాదములు.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబా మహా కవయిత్రి యొక్క ఆరాధ్య దైవమయిన "శ్రీ తరిగొండ శేషకుధరాధ్యక్షు" నకు నాభక్తి పూర్వక ప్రసూనాంజలి.

కె.జె. కృష్ణమూర్తి

కె.జె. కృష్ణమూర్తి

# శివ నాటకము

## యక్షగానము

## విషయ సూచిక


| విషయము. | పుట. |
|---|---|
| ముందుమాట | III |
| సాహిత్య విభూతి | VII |
| పీఠిక | IX |
| కృతజ్ఞతాంజలి | XXIX |
| ఇష్టదేవతా స్తుతి | 1 |
| విఘ్నేశ్వరుని రాక | 3 |
| గణనాయకుని శరణు వేడుట | 5 |
| రచనా సంకల్పము | 8 |
| కథా ప్రారంభము | 9 |
| కైలాసగిరి పురము | 10 |
| పార్వతీదేవి యన్వేషణ | 12 |
| పార్వతి - తామసి | 16 |
| పార్వతి వృత్తాంతము | 17 |

| విషయము. | పుట. |
|---|---|
| పరమేశ్వరుని యలుకకు హేతువు | 21 |
| పరమేశ్వరుఁడు విచ్చేయుట | 23 |
| ప్రమథ గణములు ప్రస్తుతించుట | 25 |
| భృంగీశ్వరుఁడు - పరమేశ్వరుఁడు | 27 |
| పార్వతీదేవి పూర్వజన్మ గాథ | 34 |
| బాలాది కాంతలు - పరమేశ్వరుఁడు | 37 |
| పార్వతీ పరమేశ్వరుల సమాగమము-సంభాషణము | 48 |
| పరమశివుని యానంద నృత్యము | 53 |
| నారదుఁడు కైలాసమున కరుదెంచుట | 55 |
| నారదుఁడు పరమేశ్వరునిఁ బ్రస్తుతించుట | 56 |
| రత్నాల హారమును పార్వతీ పరమేశ్వరులకు సమర్పించుట | 58 |
| తొలకరి మెఱుపువలెఁ బ్రకాశింపుచు వచ్చిన జాహ్నవి | 59 |
| జాహ్నవి యన్వేషణ | 62 |
| తామసి - జాహ్నవి | 64 |
| జాహ్నవి వృత్తాంతము | 67 |
| జాహ్నవి విరహము | 70 |
| తామసి దౌత్యము | 73 |

| విషయము. | పుట. |
|---|---|
| మందాకిని మూర్ఛ | 85 |
| తామసి మరల హరునిఁ బిలుచుట | 87 |
| గంగాదేవి స్వయముగా నేఁగి హరునిఁ బిలుచుట | 91 |
| గంగాభవాని విచారము | 110 |
| మన్మథ దూషణ | 113 |
| చంద్ర దూషణ | 114 |
| మలయానిల దూషణ | 115 |
| జాహ్నవి లేఖ | 120 |
| పరమేశ్వరుని ప్రత్యుత్తరము | 123 |
| ఎఱుకత ఘట్టము | 127 |
| కొఱవంజి (తరిగొండ లక్ష్మి) గంగ కెఱుక చెప్పుట | 141 |
| సింగని రాక | 149 |
| సింగీ, సింగళ్ల సమాగమము, సంభాషణము | 152 |
| దేవేంద్రుని యాగమనము | 156 |
| దేవేంద్రుని వృత్తాంతము | 158 |
| శచీపతి పార్వతీపతిని వినుతించుట | 162 |
| శంకరుఁడు గంగ యింటి కేతెంచుట | 165 |

**విషయము.** **పుట.**


శంకర జాహ్నవీ సంవాదము 168

శివుని యాజ్ఞను శిరసావహించి బ్రహ్మ కైలాసమునకు అరుదెంచుట 181

బ్రహ్మదేవుని వృత్తాంతము 183

బ్రహ్మ పరమశివుని భక్తితోఁ బ్రస్తుతించి మాణిక్యహారమును సమర్పించుట 190

కుందరదన (పార్వతి చెలి) దౌత్యము 196

కుందరదన యిందుమౌళిని స్తుతించి, విన్నవించుట 201

గంగ కుందరదనను చెలుతోఁ గొట్టించుట 206

పార్వతీ పరమేశ్వరుల సంవాదము 212

గంగా గౌరీ సంవాదము (సవతుల కయ్యము) 214

శాంభవి (పార్వతి) యోగనిష్ఠ 225

గంగ యోగధారణ, శివుని తపస్సు 227

విష్ణుదేవుఁడు కైలాసమునకు వేంచేయుట 227

వికట భాషణుఁడు విష్ణుదేవునితో వినోదముగా సంభాషించుట 229

వైకుంఠ పురము 234

| విషయము. | పుట. |
|---|---|
| హరి హరులకు అభేదమును తెలుపుట | 237 |
| భృంగీశ్వరుఁడు - విష్ణుదేవుఁడు | 241 |
| గంగాదేవికిఁ గన్నతండ్రి హితోక్తి | 246 |
| పార్వతీదేవి తరిగొండ శేషగిరీశుని సన్నుతించుట | 249 |
| అక్క చెల్లెండ్ర సయోధ్య | 252 |
| పార్వతి కోరికపై శ్రీహరి మన్మథుని రప్పించుట | 254 |
| మదనుని బాణ ప్రయోగముచే శివుఁడు తపసునుండి మేల్కనుట | 258 |
| హరుని యాగ్రహము - రతీదేవి శరణాగతి | 260 |
| శివ కేశవుల మైత్రీ సమాగమము (చుట్టరికపు సంభాషణలు) | 264 |
| పరమశివుని ప్రభావములు | 267 |
| శ్రీహరి కల్యాణ గుణములు | 269 |
| పరస్పరాభివందనములు | 271 |
| గంగా పార్వతుల స్తుతి, మంగళ గీతములు | 272 |
| వీడ్కోలుపులు | 274 |
| శివుఁడు పత్నులను లాలించుట | 275 |

| విషయము. | పుట. |
| --- | --- |
| గంగా పార్వతుల చెలుల సంబరములు | 276 |
| మంగళ హారతి | 278 |
| సమర్పణము | 279 |
| ఫలశ్రుతి | 281 |

# శివ నాటకము

## యక్షగానము

### ❋ ఇష్టదేవతా స్తుతి ❋

క. శ్రీ గణపతిని మహాత్ముని,
ఆగమ సంవేద్యుఁడైన హరుని, భవానిన్,
భోగిశయానుని, లక్ష్మిని,
బాగుగఁ బద్మజుని, వాణిఁ బ్రస్తుతిచేతున్. 1

**దరువు, నాట రాగము - జంపెతాళము**

జయ చిన్మయాకార! - జయ దేవ పరివార!
జయ ఫల్గుణోద్ధార! - జయ దురితదూరా!
॥జయ జయా॥ పల్లవి॥

[1]జయ మృత్యు సంహార! - జయ భావజ విదార!
జయ [2]జాహ్నవీ దార! జయ [3]సుగుణహారా!
॥జయ జయా॥ ౧

జయ దీనమందార! - జయ సింధు గంభీర!
జయ మేరు సమ ధీర! - జయ భుజగ హారా!
॥జయ జయా॥ ౨

జయ రత్న కేయూర! - జయ సత్కృపాపూర!
జయ నిగమ సంచార! - జగదేక వీరా !
॥జయ జయా॥ 3

జయ సత్య చారిత్ర! - జయ సన్ముని స్తోత్ర!
జయ మురాంతక మిత్ర! - జయ దివ్య గాత్రా!
॥జయ జయా॥ ౪

---

1 జయ కలుష సంహార! - అ, ఆ, క, కా.
2 జాహ్నవీ ధరా! - ర.
3 సుగుణ సారా! - ర.

జయ సంతత పవిత్ర! - జయ శక్రనుతి పాత్ర!
జయ నిటల [4]తటనేత్ర! - జయ పంచవక్త్రా!
॥జయ జయా॥ ౫

**దరువు, ఆది తాళము**

నాగాభరణ! తే - నమో నమో
భవ! నాగమృగేంద్ర! తే - నమో నమో
॥నాగాభరణ! తే నమో నమో ॥పల్లవి॥

పురహర! భవహర! - భూసుర పాలన!
పరమేశ్వర! భవ! - ఫాలాక్షా!
దరధర వందిత - చరణ సరోరుహ!
నర సంరక్ష! తే - నమో నమో ॥నాగాభరణ!॥ ౧

నిగమ పాలనా! - నిత్య! నిరంజన!
అగణిత వైభవ! - [5]అఖిలాత్మా!
జగదీశ్వర! సుర- [6]సన్నుత విగ్రహ!
[7]నగజాధిప! తే - నమో నమో ॥నాగాభరణ!॥ ౨

గరళ కంధరా! - గంగాధర! హర!
స్మర సంహర! [8]ని-ర్మల చరితా!
[9]గురువర! శ్రీతరి-గొండ పురాధిప!
నరహరి సఖ! తే-నమో నమో ॥నాగాభరణ!॥ 3

---

4 తలనేత్ర! - అ, ఆ, క.
5 అఖిలేశా! - అ, ఆ, క, కా.
6 సన్ముని సేవిత! - అ.
7 నగజాత పతే! - అ; నగజావర! తే-కా.
8 శ్రీమహితాత్మా! - అ, ఆ, క, కా.
9 గురుశేఖర! తరిగొండను వెలసిన - అ;
గురుతరముగ తరిగొండను వెలసిన - ఆ, క, కా.

వ. అని యిట్లు సదాశివ మూర్తిని [10]స్తోత్రంబుఁజేసిన తదనంత రంబున *విఘ్నేశ్వరుండు వచ్చే విధం బెటువలెను: 2

## ❀ విఘ్నేశ్వరుని రాక ❀

### ద్విపద

శ్రీకంఠ పుత్రుండు - శిఖరి పౌత్రుండు
పాకారి సన్నుతి - పాత్ర గాత్రుండు

కరివర వక్త్రుండు - కామ జైత్రుండు
పరమ పవిత్రుండు - భక్త మిత్రుండు

ఖ్యాతిగా శివనాట-కంబను కృతిని
భూతలంబున వృద్ధిఁ - బొందింపఁ దలఁచి,

తద్విఘ్నముల వేగఁ - దఱిమెద ననుచుఁ,
జిద్విలాస స్ఫూర్తి - చిత్తమం దలర,

నురగోపవీతంబు - నురుతర మౌంజి
ధరియించి, వటుకావ-తారంబు మెఱయ,

బొజ్జపైఁ దుండ మిం-పుగ నటియింప,
గజ్జె, లందెలు కాళ్ల - ఘల్లు ఘల్లనఁగ

నలరుచు, నగుచు, నా-ట్యంబు సల్పుచును
విలసితుఁడై వచ్చె - విఘ్నేశ్వరుండు.

---

10 స్తోత్రంబు చేసి, గణేశ్వర ప్రార్థనంబుఁ జేసే విధం బెటువలెను - అ, ఆ,కా; స్తోత్రంబు చేసి, గణేశ్వర ప్రార్థన చేసేనట యెటువలెను - క.

*"విఘ్నేశ్వరుఁడు వచ్చేవిధము" - అ, ఆ, క, కా - అనే ప్రతుల్లో లేదు; గ, ర-అనే రెండు ప్రతుల్లో మాత్రమే ఉంది.

వ. ఇవ్విధంబున వచ్చిన విఘ్నేశ్వరునకు దండప్రణామంబుఁ జేసి, మోక్షార్థినై ప్రార్థించెద: 3

**దరువు, ఆదితాళము**

దేహీ దేహీ గణాధిపా! ముక్తిం
దేహీ దేహీ గణాధిపా! ॥దేహీ దేహీ॥ పల్లవి॥

[11]సారవిచారా! గణాధిపా! గిరి
జాత కుమారా! గణాధిపా! ॥దేహీ దేహీ॥ ౧

పరమ పవిత్రా! గణాధిపా! శం
కర వరపుత్రా! గణాధిపా! ॥దేహీ దేహీ॥ ౨

మూషక వాహన! గణాధిపా! స
న్ముని నికరావన! గణాధిపా! ॥దేహీ దేహీ॥ ౩

చామర కర్ణా! గణాధిపా! ప్ర
జ్ఞా పరిపూర్ణా! గణాధిపా! ॥దేహీ దేహీ॥ ౪

[12]ఖండ విదూరా! గణాధిపా! తరి
గొండ విహారా! గణాధిపా! ॥దేహీ దేహీ॥ ౫

వ. అని ప్రార్థింపుచున్న సమయంబున మఱిన్ కొందఱు వచ్చి 'స్వామీ! మీ రెవ్వరు? మీ యభిధానం బెయ్యది? జననీ, జనక, సహోదరు లెవ్వరు?' - అనిన విఘ్నేశ్వరుం డిట్లనుచున్నాఁడు: 4

---

11 సారాచారా! - ర.

12 గండక దూరా! - ర.

సీ. అగణిత శాంతాత్మఁ డైనట్టి గిరిరాజు
కన్యకామణి నన్నుఁ గన్న తల్లి;
తరిగొండ నృహరి పాదంబున నుదయించి
సదమల యగు గంగ సవతి తల్లి;
ఆదిని నిర్గుణుండై, యట మాయచే
సగుణుఁడై తగు శివస్వామి తండ్రి;
ఘన తర శూరాగ్ర గణ్యుఁడై విఖ్యాతి
నొనరు షణ్ముఖుఁడు [13]నా సోదరుండు;

తే.గీ. నన్నుఁ బూజించి, బహు భక్షణంబు లొసఁగి,
కొలిచినటువంటి వారికిఁ గోర్కె లిచ్చి,
సకల విఘ్నములను బాపఁజాలియుందుఁ;
గాన విఘ్నేశుఁడండ్రు నిక్కముగ నన్ను. 5

వ. అనిన విని వారు సంతసించి; రంతఁ గ్రమ్మఱ
గణేశ్వరునకు షోడశోపచార పూజలు సమర్పించి,
దండ ప్రణామంబుఁ జేసి, ప్రార్థించెద: 6

## ❁ గణనాయకుని శరణువేడుట ❁

### దరువు, ఆది తాళము

గణనాయకా! శరణు గణనాయకా! శరణు
గణనాయకా! శరణు గణనాయకా! ॥పల్లవి॥

హేరంబ! శివుని [14]భజన - ఆరంభముననుజేసి,
సారంబుగాను మీకు - శరణంటిరా! ॥గణ॥ ౧

నానా సూనములతో - నే నిన్నుఁ బూజించి
కానుక లిచ్చెద - గణ నాయకా! ॥గణ॥ ౨

13 సహోదరుండు - ర.

14 పూజ - అ.

నిరతాము భక్తితోను-నిన్నూ నే భజియించేను
పరఁగా నా జిహ్వాయందుఁ - [15]ప్రచరించరా!
॥గణ॥ 3

వెలసీన నీ పాద-ముల సేవఁ జేసే నిపుడు
తెలిసి నిర్విఘ్నమైన - తెలివియ్యరా!
॥గణ॥ ౪

అగణీత రక్తి తోను - నిగమాంత యుక్తితోను
వగమీఱ దివ్యమైన - వాక్కియ్యరా!
॥గణ॥ ౫

మునుకొని బహుభక్ష్య - ములను, మీఁగడ, వెన్న
ఘనముగా నిచ్చెదను - గణనాయకా!
॥గణ॥ ౬

పరమా భక్తుల పాలి - కరయా దేవుఁడ వీవు
కరుణించి నన్నుఁ గావు - గణనాయకా!
॥గణ॥ ౭

చిర లీలఁ బ్రోచేటి - పరమా ధన్యుఁడవని
నెఱ నమ్మియున్నాను - కరుణించరా!
॥గణ॥ ౮

అరుదూగఁ దరిగొండ - హరి సోదరైన గిరిజా
వరపుత్రా! నిన్నే వేళ - వర్ణింతురా!
॥గణ॥ ౯

తరిగొండ నరహరి - కరణి నన్నెట్లైనఁ
గరుణింపవయ్యా! శ్రీ-గణనాయకా! ॥గణ॥ ౧౦

---

15 ప్రబలించరా! - క; ప్రసరించరా! - కా.

వ. అని ప్రార్థించి, 'స్వామీ! హేలంబోదరా! యీశ్వరార్పి తంబుగా నా యొనర్పంబూనిన శివనాటకంబును నిర్విఘ్నంబుగా నుద్ధరింపవలయు' ననిన, విఘ్నేశ్వరుండు సకల విఘ్నకారుల నుద్దేశించి యిట్లనుచున్నాఁడు: 7

**దరువు, ఆది తాళము**

చేరరాకుఁ డిందు విఘ్న-కారులారా!
నే, నా ధారమైతిఁ గృతికి విఘ్న-కారులారా!
॥చేరరాకుఁ డిందు॥ పల్లవి॥

మీ రెల్ల నా యాజ్ఞ విఘ్న-కారులారా!
యింక, మీతేరూ హెచ్చరికె విఘ్న-కారులారా!
॥చేర॥ ౧

క్రూరమూలు విడిచి విఘ్న - కారులారా!
వేగ, దూరమూగఁ జనుఁడు! విఘ్న-కారులారా!
॥చేర॥ ౨

గరళ కంఠుఁ డిచట విఘ్న - కారులారా!
నాట, కంబు సల్పు విఘ్న - కారులారా! ॥చేర॥ 3

ఘన తరిగొండాధిపుఁడు విఘ్న - కారులారా!
వింతా,గా నిందె జూచీనె విఘ్న - కారులారా!
॥చేర॥ ౪

వ. అని యిట్లు విఘ్నకారుల నియమించి, 'యీ కృతి రచియింపు' మని [16]గణేశ్వరుం డాజ్ఞాపించిన, మహాప్రసాదంబని, మతీన్ని ప్రార్థించెద: 8

---

16 గణేశ్వరుం డానతిచ్చిన-ర.

తే.గీ. శివుని కర్పితముగ నేను చెప్పినట్టి
నాటకంబును ధరణిలోనన్ బ్రసిద్ధి
చేయు; మెంతని చూడక చిత్తగించు!
వారణానన! పదివేల వందనములు. 9

వ. అని వందనము లొనర్చి, యీ కృతి రచియించెద: 10

## ❁ రచనా సంకల్పము ❁

### ద్విపద

అని [17]విఘ్ననాథుని - కంజలిఁ జేసి,
పనిఁబూని తరిగొండ - పతినిఁ గీర్తించి,

సర్వదేవతలను - [18]సన్నుతిఁ జేసి,
గర్వంబు వర్జించి - కవులఁ బ్రార్థించి,

పరఁగ విద్వాంసుల - పదముల కెఱఁగి,
శరణార్థి నని వారి - సన్నుతిఁ జేసి,

[19]సలలిత శివవిలా-సంబను కథను
నలువొంద యక్షగా-నంబుఁ జేసెదను.

---

17 విఘ్న రాయని - అ, ఆ, క, కా, ర.
18 చాల భజించి - అ, క, కా.
19 కమనీయ శివనాటకంబను పేరఁ
గ్రమముగా నొక యక్షగాన సత్కృతినిఁ

గావింతుఁ; దత్కథా-క్రమమెట్టిదనినఁ
బావన కైలాస పర్వతాగ్రమున.

Note:- ఈ రెండు ద్విపదలు గ,ర-అను ప్రతులలో ఉన్నవి. వీటికంటె అ,క,కా-అను ప్రతులలోని పైరెండు ద్విపదలు సందర్భమునకు చక్కగా అన్వయించుచున్నందున, పైరెండిటిని గ్రంథము (Text) లో చేర్చి, వీటిని (గ,ర-ప్రతులలోని రెండు ద్విపదలను) పాఠాంతరములుగా ఇవ్వడమైనది.

ప్రాకటంబుగను ఆ - పరమాత్ము కరుణ
నే కథాప్రారంభ - మేర్పఱించెదను.

## ❋ కథా ప్రారంభము ❋

### ద్విపద

శ్రీనుతంబగు నైమి - శారణ్యమునను
ఘనులైన శుక, శౌన-కాది సన్మునులు

సూతునిఁ గాంచి ప్ర-స్తుతిఁజేసి, 'బ్రహ్మ
సుతుఁడైన నారదుఁ-డతికృపతోడఁ

పారిజాతంబను - ప్రసవంబుఁ దెచ్చి,
నారాయణుని కీయ, - నది రుక్మిణి కిడఁ,

దా నందు కోర్వక-యా సత్యభామ
చనవునఁ గలహించె-నని నీవు చెప్పఁ

గా వింటి మే మాది-కాలంబునందు;
భావింపఁగాను గం-గా యుమాదేవు

లేల వాగ్వాదించి? - రిత్తెఱంగెల్ల
సలలితంబుగ మేము - సద్గుణవర్య!

వినఁదలంతు మిపుడు - వేడ్కతో' ననిన
మునులకు సాష్టాంగ - మొనరఁ - గావించి

ఘనుఁడైన సూతుండు - కరుణ నిట్టులనె:

క. *'మునులార! వినుఁడు! నారద
ముని పెట్టని వాదు లేదు ముజ్జగములలో;
అనువంద నారదుండతి
ఘనుఁడై కలహంబుఁ బెట్టెఁ గరుణ దలఁపకన్. 11

*ఈ కందపద్యం "భామా కలాపం" వ్రాతప్రతులు కొన్నిట్లోనూ, మఱికొన్ని "పారిజాతాల" ప్రతుల్లోనూ గోచరిస్తూవుంది. దీనిని బట్టి - కథాసందర్భానికి అనుగుణంగా ఉన్నందువల్ల - ఆ యా ప్రతుల లేఖకులు ఈ పద్యాన్ని వెంగమాంబ రచనలో నుండి స్వీకరించారని భావింపదగివుంది.

వ. అది యెట్టులనిన. 12

### జంపె

ఇనుని చెంతను జేరి - ఘనుఁడైన నారదుఁడు
ఘనమైన రత్నాల - హారంబుఁ దెచ్చె. ౧

తెచ్చి పరమేశ్వరున - కిచ్చినను, భర్గుండు
మచ్చికెను పార్వతీ-దేవికి నొసంగె. ౨

నలినాక్షి జాహ్నవియుఁ - జెలుల చేతను దెలిసి
కలహించె; దీని వృత్తాంత మిది' యటన్న 3

వ. శౌనకాదు లా వృత్తాంతంబును 'సవిస్తరంబుగాఁ దెల్పు' మనిన, 'తత్కథాక్రమంబు వినుఁ'డని సూతుం డిట్లనియె: 13

### ❄ కైలాస గిరి పురము ❄

### ద్విపద

వసుధమీఁదను చాల - వన్నెకు నెక్కి
[20]పస మించు కైలాస-పట్టణంబునను

కోటలు, రత్నాల - కొత్తంబులును,
వాటంపు వజ్రాల - వాకిండ్లు, [21]మంచి

తేటైన కడపలు, - [22]దివ్యాలయములు,
కోటి భానుల దీప్తి - గోపురంబులును,

20 పావన కైలాస పర్వతాగ్రమున - గ, ర.
21 మేలు - అ, క, కా.
22 దేవాలయములు- అ, క, కా.

పాటింపఁ బసిఁడి దీ-ప స్తంభములును,
నాటక శాల, లు-న్నత రథావళులు,

ఆటకూటంబులు, - నమరు మేడలును,
సాటి లేనట్టి బా-జారులు నిండి,

కోటి కోటుల మేటి-ఘోటక తతులు,
గాటంపు వీథుల - గణ గణ ధ్వనులఁ

గాటుక కొండల - గతి కుంజరములు,
నీటు మీఱంగ నొప్పు - నిండు కొలంకు,

లూట బావులు, మంచి - యుద్యాన వనము
లేటి కాల్వలతోడ - నింపొందుచుండు;

నట్టి పురంబులో - నమితంబుగాను
[23] పట్టుగా నిరతంబుఁ - బ్రమథులు గొలువ

ఘనత మీఱంగ గం-గా పార్వతులను
చనవుగాఁ జేపట్టి - చంద్ర శేఖరుఁడు

అగజాత కౌఁగిట - నలరార నిలిచి,
పగలు, రేల్ మఱచి ని-ర్భరవృత్తి నుండె.

23 <u>Note</u>:- ఈ అయిదు ద్విపద పంక్తులకు మాఱుగా అ,ఆ,క,కా-అనే ప్రతుల్లో క్రింది యేడు పంక్తులు పాఠాంతరంగా నెలకొనివున్నాయి:-

పట్టుగా నిరతంబు ప్రమథ గణంబు
లనువొందఁ గొల్వఁగా నా పట్టణంబు
ఘనత మీఱఁగను విఖ్యాతంబుగాను
కరమర్థితోను గంగాపార్వతులను
సరవితోఁ గూడియు సంతసంబునను
తెఱఁగొప్ప నత్యంత ధీరాత్ముఁ డగుచు
నిరవుగా సోమేశుఁ డేలుచునుండె.
| అ, ఆ, క, కా.

తే.గీ. మఱియు నంతట నొక నాఁడు [24]మన్మథారి
తరుణి భాగీరథినిఁ జూడఁదలఁచి, శైల
[25]బాల మీఁదనె యల్గి, బల్ పంతమెసఁగ
నపుడు జాహ్నవి యిలుఁ జేరె హర్షమునను. 14

## ❋ పార్వతీదేవి యన్వేషణ ❋

### ద్విపద

అంతట శర్వాణి - యలరు పూఁబోణి
సంతత కల్యాణి - సైకత శ్రోణి

యళికులనిభ వేణి - యరవింద పాణి
[26]ఇల మౌని నుతశీల - హిమగిరి బాల

కంతు పట్టపు దంతి - [27]కల్వపూ బంతి
వంతు కెక్కిన లేమ - వనితా లలామ

[28]కాదంబ వనవాస - ఘన చిదుల్లాస
ఆది పరాశక్తి - [29]యలఘు సద్వ్యక్తి

[30]పొసఁగు ముద్దుల గుమ్మ - పుత్తడి బొమ్మ
[31]యసమాన విఖ్యాత - యఖిలైక మాత

---

24 మరు విదారి - అ, ఆ, క, కా.
25 పట్టితో నల్గి యత్యంత పంత మలర - అ, ఆ, క, కా.
26 ఇల నొప్పు గుణశీల హిమశైల బాల - అ, ఆ, క, కా.
27 ఘన సుమ బంతి - అ, ఆ, క, కా.
28 కాదంబ వనవాసి ఘనసుధా సరసి - అ, ఆ, క, కా.
29 అతి దివ్య యుక్తి - అ, ఆ, క, కా.
30 పొలఁతి ముద్దుల గుమ్మ పుత్తళి బొమ్మ - అ, ఆ, క, కా.
31 సలలిత విఖ్యాత జగదేకమాత - అ, ఆ, క;
సలలిత మృదుగాత్రి జలచర నేత్రి-కా.

యహిరాజ భూషణు - [32]నాత్మఁ జింతించి,
విహితోక్తి [33]నందందు - వెదకుచు వచ్చె.

సీ. [34]ఘలు ఘల్లురని కాళ్ల గజ్జె, లందెలు మ్రోయ,
వర రత్న భూషణావళులు మెఱయ,
ఆణిముత్యంబుల హారముల్ [35]తూలాడఁ,
[36]జీర చుంగులు చాల సిస్తు మీఱ,
బంగారు కుండల భాతినిఁ బాలిండ్లు
గుత్తంపుఁ బైఁటలో గునిసి యాడ,
విలసితముగ జాజి విరి సరుల్ కొప్పుపై
• నందంబుతోఁ జాలఁ జిందుఁ లాడఁ,

తే.గీ. [37]లసిత కుంకుమరేఖ లలాటమందు,
సొరిది భ్రూమధ్యమున భూతి చుక్క, తేట
కనులఁ గాటుక, గంధ లేపనము మేన
వెలయ, సొగసుగ విభునిఁ దా వెదుక వచ్చె. 15

[38]వ. అప్పు డా పార్వతి చెలులతో నిట్లనుచున్నది: 16

32 నందుఁ గానకను - అ, ఆ, క, కా; ఘల్లు ఘల్లుమని-గ,ర.
33 నంతట - అ, ఆ, క, కా.
34 ఘలు ఘల్లురని - అ, ఆ, క, కా.
35 తూఁగాడ - అ, ఆ, క, కా.
36 జీర కుచ్చులు జాఱ, సిస్తు మీఱ - అ.
37 జాతి కస్తూరి తిలకంబు, భూతి నుదుటఁ,
గనులఁ గాటుక, గంధలేపనము మేన
సొగసు మీఱఁగ నా వేళ సుందరాంగి
ప్రాణనాథుని వెదకుచుఁ బలికె నిట్లు. | అ, ఆ, క, కా.
38 ఈ వచనం గ,ర-ప్రతుల్లో ఉంది; అ, ఆ, క, కా - ప్రతుల్లో లేదు.

**దరువు, పంతువరాళి రాగము - అట తాళము**

శివుఁడేఁడే వో చెలులారా? మా
భవునిఁ జూపరే! యో భామలారా! ౧

హరుఁడేఁడే వో యమ్మలారా? వాని
గుఱుతూగఁ జూపరే! యో కొమ్మలారా! ౨

ఈశుఁడేఁడే వో యింతులారా? నన్ను
మోసగించి వచ్చెనమ్మ! మగువలారా! ౩

చింతఁ బెట్టి వచ్చెనమ్మ! చేడెలారా! వాని
రంతులంతా చూడరమ్మ! యింతులారా! ౪

ఎక్కాడ నున్నాఁడే యీశుఁ డింతులారా?వాడు
చిక్కి మగుడి బొంకించెనే చేడెలారా! ౫

[39]తరిగొండా నృహరి మిత్రుఁడు తరుణులారా! నన్ను
మఱచి యిప్పు డెందున్నాఁడో మగువలారా? ౬

ఆ.వె. రామలార! నిన్న రాతిరి నాతోను
అతఁ డొక్కమాట కలిగినాఁడు;
అలిగి వాఁడెచ్చోటి కరిగెనో?నేఁ జెల్ల!
వానిఁ జూపరమ్మ! వనితలార! 17

వ. అనిన విని, చెలు లాతఁ డలిగిన వృత్తాంతంబే
మని యడిగిన, శాంభవి యేమనుచున్నది: 18

39 తరిగొండ నృహరి మిత్రుఁ దరుణు లారా!
మీరు, పరికించి వచ్చి తెలుపరే! భామలారా! | - ర.

## ద్విపద

వినరమ్మ! చెలులార! - వేదవేద్యుండు
ఘనత మీఱిన త్రిజ-గత్కారణుండు

ప్రమథాధినాథుండు - భాగ్యశీలుండు
రమణీయముగ నిన్న - రాతిరి నన్ను

వలనొప్ప లాలించి, - వైఖరి మించి,
లలి మీఱ సరస స-ల్లాపంబుల నుండి,

గరిమ [40]నంతటిలోనఁ - గపటంబుఁ జేసి,
మఱియు నన్నొక మాట-మాటకుఁ దీసి,

తలకొని నామీఁదఁ - [41]దప్పులు మోపి,
యలుక ముఖముఁ జేసి - [42]యచ్చోటుఁ బాసి,

యెచ్చటి కరిగెనో - యెఱుఁగంగ రాదు;
విచ్చలవిడిగాను - వెదుకరే! మీరు.

వ. అనిన విని, పోయి పరమేశ్వరుని ననేక ప్రదేశంబుల వెదకి, కానక మగుడి వచ్చి 'యాతని నెందును గాన'మని విన్నవించిన, వారితోఁ బార్వతి యేమనుచున్నది: 19

## త్రిపుట

చెన్నలర నిరతమును ననుఁ గూడున్న విభుఁడూ
ఇప్పుడు
నన్ను విడనా డెచటి కరిగెనొ ఇప్పుడు కన్నెలారా?౧

---

40 నంతలో యేమొ - అ, క.

41 తప్పు లెన్నుచును - కా.

42 యచ్చోటు వెడలె - అ,క.

వానిఁ జూడని వేళనుండీ వనితలారా!
నాపై
సూనబాణుఁడు ప్రతిఘటించెనె! సుదతులారా!
౨

తనువు మరు విరి శరముచేతను తరుణులారా!
సోలెను
ఎనయ నిఁక నే నేమిసేతునె? యమ్మలారా!
3

నేను ఎవ్వరినైన గెలిచెద నెలఁతలారా!
అరవిరి
బాణునితొ నేఁ గెల్వఁజాలనె! భామలారా! ౪

వ. అని పలుకు సమయంబున రుద్రునియొక్క తామస గుణంబు స్త్రీ రూపధారిణియై వచ్చి, పార్వతితో నిట్లనుచున్నది: 20

## ❀ పార్వతి - తామసి ❀

తే.గీ. ఇంత రాతిరి వేళ నీ విటకు వచ్చి
'శివుఁడు, శివుఁ'డని కలువరించితివి; శివుఁడు
ఏమి కావలె? నీదు పేరేమి? తల్లి
దండ్రు లెవ్వరు? తెల్పు సందర్భముగను. 21

వ. అనిన పార్వతి యిట్లనుచున్నది:

పార్వతి:- ఈ సమయమందు వచ్చి 'నీ వృత్తాంతంబుఁ జెప్పు'మని వితర్కించి నన్నడుగుటకు [43]నీ వెవ్వరవో అమ్మయ్యా?

---

43 నీ వెవతెవే అమ్మయ్యా? - ర.

**తామసి:-** ఈ లోకంబున ననేకులు నన్నెఱుంగుదురు. ఎఱిఁగినవారు నావారు గారు. ఎఱుఁగనివారే నా వారై యుండుదురు. నీవు నన్నెఱుఁగనంటివి. [44]కావున నీదగ్గఱ నిలిచియుండం గోరుచుండెదనే గిమ్మయ్యా!

**పార్వతి:-** [45]నిన్నేఁపేరం బిలుతురే వో అక్కయ్యా?

**తామసి:-** నన్నుఁ దెలిసినవారు 'తామసి' యని పిలుతురే గిక్కయ్యా!

**పార్వతి:-** నాదు వృత్తాంతంబు నీతోఁ జెప్పితే, శివునిఁ జూపఁ గలవఁటే వో తామసీ?

**తామసి:-** గట్టిగాఁ జెప్పితే, అప్పటికి మీ శివుని నీవు చూడఁ గలిగితే చూపేనే వో గీమసీ!

**పార్వతి:-** అయితే చెప్పేను వినవే సుందరీ! -అని పార్వతి యిట్లనుచున్నది: 22

## ❁ పార్వతి వృత్తాంతము ❁

### ద్విపద

**పార్వతి:-** క్రమముగా విను కుత-ర్కంబు లేమిటికి?
అమితుడై మహి-మాఢ్యుఁడై భువిన్ తనదు

సహజ గుణంబుచే - శాంతిఁ బొందించి,
రహి నొప్పు హిమశైల - రాజు మా తండ్రి;

44 కాబట్టి నీ దగ్గఱ నిలువవలెనని కోరుచూవుండే దాననే గిమ్మయ్యా! - ర
45 నీ పేరేమని పిలుతురే వో అక్కయ్యా? - ర.

పరమార్థ సరణిగాఁ - బతి భక్తి యందె
తిరమైన మేనకా - దేవి మా తల్లి;

మొనసి వజ్రాయుధం - బును ధిక్కరించి,
తన పక్షయుగళంబుఁ - దాను నిల్పుకొని

కుధర సంతతి కెన్న - గురుతర శక్తి
నధికుఁడౌ మైనాకుఁ - డతివ మా యన్న;

యోగియై బ్రహ్మచ - ర్యోన్నతి నుండు
నాగేంద్ర వదనుండు - నా పెద్ద కొడుకు;

అనిశంబు శూర వ-రాగ్రణి యనఁగ
నొనరు కుమార దే-వుఁడు చిన్న కొడుకు;

విహితులౌ భైరవ - వీరభద్రులును
మహిమ నొప్పు నిమిత్త - మాత్ర నందనులు;

వడి సుళ్ళుమారియై - వసుధ నందణిని
గడ గడ వణఁకించు - గంగ నా సవతి;

గణనాధికానంద - ఖనియై వెలుంగు
ఫణి భూషణుఁడు నా - ప్రాణనాయకుఁడు;

రసయుక్త విశ్వ కా-రణ రూపమైన
యసమాన పార్వతి - యండ్రు నా పేరు.

తే.గీ. ఇంతి నా పూర్వ వృత్తాంతమెల్ల నీకుఁ
జెప్పితిని, వింటి; విఁక నేమి చెప్పవలెను?
శివునిపై జాలిమాలి మించినది; యతనిఁ
దరుణి! యిఁకఁ జూడకున్నఁ నే దాళలేనె! 23

వ. అనినఁ దామసి యిట్లనుచున్నది:

తామసి:- 'ఏమమ్మా? పార్వతీ! [46]ఎక్కడనంటే అక్కడనే యుండే శివుఁడు నీ కిక్కడ కనిపించకపోయెనే? ఇది మహాశ్చర్యముగా నున్నది! శుద్ధ తామసినైనా నాకే కనిపించినట్టు లున్నాడు. నీవు పరమ సాత్త్వికురాలవై యుండియు, [47]నీకుఁ గానరాక పోయినది విచిత్రంబు! అయితే, సంశయింపక నీవు మఱపనేటి యావరణంబున కీవల వచ్చి, నిదానించి చూచితే, శివుఁడు కానవచ్చీని. ఇదిగో! శివుఁడిందే యున్నాఁడు రావమ్మా! ఓ పార్వతీ!' అనినఁ బార్వతి యంతః పురంబు వెలువడి, [48] యీవల వచ్చి, తామసినిఁ జూచి యిట్లనుచున్నది: 24

## దరువు, ఆది తాళము

పార్వతి:- ప్రాణేశుఁ డేఁడే వో యమ్మా? మా
ఫణిధరుఁ డేఁడే వో యమ్మా? ॥ప్రాణేశుఁ॥పల్లవి॥

కలువల దొర, చిలుకలు, కోవెల, లళి
బలములు, మలయానిలుఁడును వచ్చెను
॥ప్రాణేశుఁ॥ ౧

కందర్పుఁడు నరవిందాంబకము లె
దం దగులఁగ నేయం దమకించెను ॥ప్రాణేశు॥ ౨

తరిగొండాధీశ్వర హితుఁడగు శ్రీ
పరమేశ్వరుఁ జూపవె! సరగున నా ॥ప్రాణేశుఁ॥ ౩

---

46. ఎక్కడఁ బట్టిన నక్కడ నుండెడు శివుఁడు నీ కిక్కడ కనఁబడక పోయెనే?-ర.
47. నీకుఁ గానరాకపోవుట విచిత్రంబు గదా! -ర.
48. వడి వడి నీవలి కేతెంచి - ర.

వ. అని యడిగిన, మఱిన్ని తామసి యిట్లనుచున్నది: 25

తామసి:-

క. అంతర్యామిత్వంబున
సంతత మా విశ్వమందు సంపూర్ణుండై
యంతట వెలిఁగెడి శివుని ని
జాంతర్యమునందుఁ జూడు మద్రితనూజా! 26

వ. అనినఁ, దామసినిఁ జూచి పార్వతి యిట్లనుచున్నది:

పార్వతి:- 'ఇక్కడ శివుఁడున్నాఁడు చూడర' మ్మని పిలిచి, యాతనిం జూపక, 'అంతర్యమందుఁ జూడు' మని శృంగార కాలమందు వైరాగ్యం బుపదేశించి మాటలాడెదవు. ఇది నాకు సమ్మతంబు గాదు.
యథార్థంబుగా శివునిఁ జూపక విడువనే! వో యమ్మయ్యో!

తామసి:- మేలుమేలు! భళా! బాగుగా నంటివి. నీవేమో జ్ఞానవంతురాలగు మహాయోగినివి. కావున అంతర్యంబునందు శివునిఁ జూడ నేర్చియుందువని నిన్ను ఆవరణంబు దాఁటి, యీవలకు రమ్మని పిలిచితి; నంతేగాని, చూపను నాకుఁ జేత కాదు. నీ యాంతర్యమందే చూడవమ్మా! వో గిమ్మయ్యో!

పార్వతి:- అయితే, అంతర్యమందు మొదలుకొని, సర్వ పరిపూర్ణమై యుండే నిరాకారబ్రహ్మంబును జూపుమని నిన్నడుగ వచ్చినదానఁ గాను ఓ యమ్మయ్యో!

తామసి:- అయితే, మఱి యెవ్వరినిఁ జూపమనేవే వో గిమ్మయ్యో?

పార్వతి:- ఆదికాలమందు మాయాబలుండై, సర్వజ్ఞుండై, సగుణుండై, సాకారుండై నన్నేలిన పరమేశ్వరునిఁ జూపుమంటినే! వో అక్కయ్యా!

తామసి:- 'మేలు మేలు! భళా! బాగుగా నంటివి. నీవు పరమయోగినివై యుండిన్ని, ఇంకా సగుణబ్రహ్మంబునే చూడవలెనని యిచ్ఛయించుచున్నావు. "యద్దృశ్యం తన్నశ్యం; యద్యత్ కృతకం తత్తదనిత్యం"- అనే వేదాంత సిద్ధాంతమందు నీకు తాత్పర్యంబు లేక, యింకా సగుణబ్రహ్మమందే వాంఛ గలిగి, శృంగార రసంబునే యనుభవింపవలెనని యున్నావు. ఇందున చాలా సంతోష మాయెను. ఇంక నీతో బ్రహ్మజ్ఞానపు మాటలాడం బనిలేదు. నీవు శివుణ్ణిఁ జూపుమని అడుగవచ్చితివి. ఎల్లప్పుడు నీ శరీరమందు అర్ధశరీరమై యుండే శివుఁడు నిన్ను విడిచి పోవుటకును, నీ వాతని వెదుకవచ్చుటకును హేతువేమి?'- అనినం బార్వతి యిట్లనియె: 27

## ❀ పరమేశ్వరుని యలుకకు హేతువు ❀

### ద్విపద

పార్వతి:- వినుము తెల్పెద సర్వ - వేదవేద్యుండు
ఘనత కెక్కిన త్రిజ - గత్కారణుండు

ప్రమథాధినాథుండు - ఫణిభూషణుండు
రమణీయముగ నిన్న - రాతిరి నన్నె

వలచి లాలింపుచు - వగ మించి, చాల
లలి మీఱ సరస స-ల్లా పోక్తి నుండి,

గరిమ నంతట నేమొ - కపటంబుఁ జేసి,
మఱియు నన్నొక మాట - మాటకుఁ దీసి,

తలకొని నామీఁదఁ - దప్పులు మోపె;
నెలమి నా కౌటిల్య - మెఱుఁగక నేను

బలు గారడంబుగ - ఫాలాక్షుఁ జూచి
'బలిసిన పాము లీ - పగిది నీ మేనఁ

గదిసి నాల్కలు గ్రోయఁ - గా నిన్ను నేను
కదియుట కతిభీతి - గా నుండు' ననుచు

నవ్వల కేనన్న - నాగభూషణుఁడు
అవ్వల జరిగి, న - న్నాదరింపకనె

యలిగి బింకంబుతో - నందుండి లేచి,
చెలి! నాతొ నొక మాట - చెప్పక వచ్చె;

నదె వచ్చు, నిదె వచ్చు - నని యింత తడవు
నెదురుచూచుచు నుంటి; - నీ వేళకైన

రాఁడాయె; నందున -రతిరాజు చెలఁగి,
పోఁడిమిఁ దన బలం - బులతోడఁ గూడి,

శుక తురంగము నెక్కి - శూరుఁడై వచ్చి,
యకలంక పుష్పసా-యక పరంపరలఁ

గప్పి నన్నిపు డేఁచఁ - గాఁ బూనినాఁడు;
తెప్పున శ్రీమహా - దేవుఁడు రాక

వాని గ్రొవ్వణఁగ; దే - వగనైన వెదకి,
నా నాథుఁ దోడ్తేవె! - నారీలలామ!

వ. అనినం దామసి కొన్ని వికటోక్తులం జెప్పి, సెలవు గైకొని పోయి, యందు వెదకినట్లు గారడంబుగా( దిరిగి, మగుడి వచ్చి, పార్వతిని( జూచి నమస్కరించి 'నీవు పరమ సాత్త్వికురాలవు గావున శివు(డు నీకే చిక్కవలెను. నేను తామసిని కా(బట్టి, శివు(డు నాకు చిక్కలే' దనిన, దానిం దిరస్కరించి విడిచి, మఱల( బార్వతి తన చెలులతో నిట్లనుచున్నది: 28

### దరువు

నిండిన విరహము నే నెట్లు దా(తునె నెల(తలారా?
అయ్యో!
ఉండుండి తల(చితే గుండె! ఝల్లుమనె యువిదలారా! ౧

తల(చితే నా మనసు తాళ; దేమి సేతు తరుణులారా?
శివు(
డలర నాపై నెంతొ చలము సాధించెనే! యమ్మలారా! ౨

సూనాస్త్రములచేత నే నోర్వ(జాలనే! సుదతులారా!
అల్లా
ఏణాంకధరు( డింద ఏ వేళ కొచ్చునో
యింతులారా? 3

## ❁ పరమేశ్వరు(డు విచ్చేయుట ❁

### ద్విపద

అని యిట్లు శాంభవి - యాత్మ నాయకుని
వినయ, భక్తులతోడ - వెదకుచునుండె;

నా వేళ సర్వజ్ఞు( - డైన యీశుండు
భావించి పార్వతి - భావంబు( దెలిసి,

యనువొంద జాహ్నవి - నపుడు బొంకించి,
ఘనరత్న సౌధంబుఁ - గ్రక్కున వెడలి,

యంతరాత్ముండు, మ - హానుభావుండు
సంతతానందుండు - సత్య సంధుండు

సుందరాకారుండు - [49]సుప్రసన్నుండు
కందర్ప శుండాల - కంఠీరవుండు

సుమయుక్తమగు జటా - జూటంబుతోడఁ
గమనీయమగు చంద్ర - ఖండంబుతోడ

జడిగొని పలుమాఱు - జారుచునుండు
జడలతో, రుద్రాక్ష - సరములతోడ

శరదభ్ర శుభ్ర ల - సత్కాంతి తోడ
గరళ యుతంబైన - కంఠంబుతోడ

సలలిత నాగ భూ - షణములతోడఁ
బులితోలు తోడ, వి - భూతిమైతోడ

[50]సుమహితంబైన త్రి - శూలంబుతోడ
రమణీయమైన సా - రంగంబుతోడ

సవరణ గల నాగ - చర్మంబుతోడ
బ్రవిమల బ్రహ్మ క - పాలంబుతోడ

నలరారు చన్న ఫా - లాక్షంబుతోడ
నలఘు ప్రకాశాంగుఁ - డై వేడ్కతోడ

49. సుగుణాకరుండు - అ,ఆ,క,కా.
50. సురుచిరంబైన త్రిశూలంబుతోడ
నరుదైన కోమల హరిణంబుతోడ -అ,ఆ,క,కా.

విమలమై చెన్నొందు - వృషభేంద్రు నెక్కి,
ప్రమథగణంబులు - భక్తితోఁ గొల్వ

మనసిజవైరి స - మ్మతమున రాఁగఁ
గని బాల, శ్యామల, - కాళి, దుర్గియును

అహిభూషణునిఁ గాంచి - యంజలిఁ జేసి,
రహి మీఱ దమ మంది-రములకుఁ బిలువ,

వలపు మీఱ శివుండు - వారిఁదోడ్కొనుచుఁ,
జెలరేఁగి యాడుచు - శృంగార మొప్ప

[51]సరగున వచ్చి, యా - శర్వాణి యున్న
వర రత్నసౌధంబు - వాకిట నిలిచె.

[52]ఆ వేళఁ దరిగొండ - హరి చెలికాని
భావించి ప్రమథులు - పలికి రిట్లనుచు:

## ❁ ప్రమథ గణములు ప్రస్తుతించుట ❁

### దరువు, ఆది తాళము

సదా శివా! పాహి సదా శివా! పాహి
సదా శివా! పాహి సదా శివా! ॥సదాశివా!॥ ॥పల్లవి॥

అక్షీణ! కరుణా కటాక్ష వీక్షణ! సర్వ
రక్షణ! [53]నిటల తలాక్షా! శివా! ॥సదాశివా!॥ ౧

---

51. మచ్చికతో సురల్ మాటికిఁ బొగడ
వచ్చి శర్వాణి నివాసంబుఁ జేరె. -అ,ఆ,క,కా.

52. వ. 'ఆ సమయంబునఁ బ్రమథ గణంబులు వినుతించే
మార్గం బెటువలెను' -అ,ఆ,క,కా.

53. నిటలతటాక్షా! -అ,ఆ,కా.

శృంగాటకమునందు శృంగారలలన పొందు
నంగీకరించిన శుభాంగా! శివా! ॥సదాశివా!॥ ౨

ఎన్నాఁగ భక్తుల మన్నించి ప్రోచేటి
కన్నా తండ్రివి నీ వన్నా! శివా! ॥సదాశివా!॥ 3

ఆపద లన్నియుఁ బాపుము! మా మీఁద
కోప మేలర? చిద్రూపా! శివా! ॥సదాశివా!॥ ౪

సారెకు మిము వేసారక వేడిన
కోరిక దీర్చవదేరా? శివా! ॥సదాశివా!॥ ౫

కుండాలి తుద నగ్ర పుండారీకములో తరి
గొండా [54]హరినిఁ గలిసిన యఖండా! శివా
॥సదాశివా!॥ ౬

వ. అని యివ్విధంబునఁ బ్రమథ గణంబులు స్తోత్త్రంబుఁ జేసి, సెలవు గైకొని, వారి వారి నివానంబులు చేరిన తదనంతరంబునఁ బరమేశ్వరుండు పార్వతి మందిరంబుం బ్రవేశించి, భృంగీశ్వరు నుద్దేశించి 'కవాటంబును దీయు' మనిన, భృంగీశ్వరుం డిట్లనుచున్నాఁడు: 29

54. శ్రీహరి సఖా! ఖండా! టశివా! -అ.

## ❁ భృంగీశ్వరుఁడు -పరమేశ్వరుఁడు ❁

భృంగీశ్వరుఁడు:-

తే.గీ. ఈ నిశాకాలమందు నీ వెవ్వ? రద్రి కన్య
మందిరమునకు రాఁ గార్యమేమి? నీదు
పూర్వోత్తర క్రమం బాదరముగఁ
దెలుపకున్నఁ గవాటంబుఁ దీయనయ్య! 30

వ. అని వికటోక్తిగాఁ బలికిన భృంగీశ్వరునిఁ
జూచి,శివుండు భక్త పరాధీనుండు గావున, నవ్వి
యిట్లనియె: 31

### ద్విపద

శివుఁడు:- వినుము! భృంగీశ! నా - వృత్తాంతమెల్ల
ననుపమంబైనట్టి - యాది కాలమున

నరయఁగా వర సచ్చి - దానంద నిత్య
పరిపూర్ణ నిర్గుణ - బ్రహ్మమై యుండి,

రూఢిగాఁ జిదచిత్ స్వ - రూపమై, యధిక
గూఢమై, భేదింపఁ - గూడి కూడకను

అరుదుగా నా యం ద - నాదియై నిలిచి,
తెఱఁగొప్ప శుద్ధ సా - త్త్విక మాయ నెనసి

నది మొదలుగ నీశ్వ - రాఖ్య వహించి,
కదల కచ్చట హేమ - గర్భు సృజించి,

**పొలుపొంద మహదాది - భూతాళి నతని**
వలనఁ గ్రమంబుగా - వర్ధిల్లఁ జేసి,

రమణ మీఱఁ జ - రాచర ప్రపంచంబు
నమరఁ గల్పించి మ - హా ప్రభావమున

నంతట నే నంటి - యంటని కరణి
సంతతానందాబ్ధి - చంద్రుండ నగుచు

నటయైన విశ్వంబు - సాక్షిగాఁ జూతు;
నటుగానఁ బరశివుం - డండ్రు నా పేరు.

వ. అనిన విని భృంగీశ్వరుండు దండప్రణామంబుఁ జేసి, యిట్లనుచున్నాఁడు: 32

**దరువు, ఆదితాళము**

భృంగ:- స్వామీ! నీ మహిమ లింకఁ బరమేశ్వరా!
చక్కాఁగఁ నాతోఁ దెలుపవయ్య! పరమేశ్వరా!
॥స్వామీ!॥ ౧

వర:- అనివార్య మృత్యువును భృంగీశ్వరా!
నవలీల గెల్చినారా! భృంగీశ్వరా! ॥అని॥ ౨

భృంగీ:- సంతోషమాయె నయ్య! పరమేశ్వరా!
వింతాలు దెలుపు మింక పరమేశ్వరా! ॥సంతో॥ 3

వర:- తరిగొండ నరహరితో నేను భృంగీశ్వరా!
సరిగానె మెలఁగుదుర! భృంగీశ్వరా! ॥తరి॥ ౪

వ. అనిన విని భృంగీశ్వరుండు 'స్వామీ! యింకను మీ ప్రభావంబు లానతిం'డనినఁ బరమేశ్వరుం డిట్లను చున్నాడు: 33

వర:-

తే.గీ. అంధకాసురుఁడను వీరుఁ డవనిఁ బుట్టి,
డంబ, దర్పములను బెంచి దండధరుని
గతి విజృంభింపఁ, జూచి యాగ్రహముఁ జేసి,
వానిఁ బట్టి వధించితి నేను భృంగి! 34

క. శుండాల దనుజుఁ డొకఁ డా
ఖండలున కసాధ్యుఁడగుటఁ గనుఁగొని నే ను
ద్దండతను వాని శిరమును
ఖండించితి సురులు పొగడఁగా భృంగీశా! 35

క. చటులతరార్భటుల జగత్
పటలంబుల నిండి, జనుల బాధింపుచు, దుర్
ఘటమై పొంగెడి విషమును
ఘటకుఁడనై మ్రింగి జనులఁ గాచితి భృంగీ! 36

## ద్విపద

వెలయఁగా నిఁకఁ గొన్ని - వినర! భృంగీశ!
పొలుపొంద దనుజులు - పూర్వ కాలమున

నిరుపమ మాయా వి - నిర్మిత పురము
లిరవు చేసికొని య -హీన శౌర్యమునఁ

బనిఁబూని జగముల - బాధింపఁ, జూచి
వనజాసనాదు లా - వక్ర రాక్షసుల

సాధింపలేక, నా - శరణు వేడినను
సాధురక్షణ మతి - సత్కార్యమనుచుఁ

జలపట్టి పురముల - సమయించు కొఱకుఁ
బులి తోలు దట్టిగాఁ - బొసఁగ బంధించి,

ఘనవేదములు తురం - గంబులు గాఁగ,
జననుతుడగు బ్రహ్మ - సారథిగాఁగఁ,

గమల బాంధవుఁడును, - కమలవైరియును
క్రమమొప్పఁగా బండి - కన్నులు గాఁగ

రహి నొప్పుచున్న భూ - రథముపై నెక్కి,
బహువేగ మేరు చా - పం బెక్కు పెట్టి,

ఘనఫణీంద్రుని నారి - గా నొనరించి,
తనర నారాయణా - స్త్రముఁ బ్రయోగించి,

త్రిపురంబులను గూల్చి - ధీరత మెఱయ
నపుడు బ్రహ్మాదుల - నాదరించితిని.

కపటియై జముఁడు మా - ర్కండేయుఁ బట్టి,
కుపితుఁడై గర్జించి - కొనిపోవు తఱిని

తలఁగక యా దండ - ధరుని సాధించి,
చెలఁగి బాలునిఁ జిరం - జీవిఁ జేసితిని.

ఘన దారుకారణ్య - కన్యకామణులఁ
గనుఁగొని మాన భం - గంబుఁ జేసితిని.

కలకంఠ, శుక, నీల - కంఠ, మరాళ
ములు సేనలగుచుఁ గ్ర - మ్మచును గొల్వఁగను,

తలఁగక యుదురాజు - దళవాయి గాఁగ,
మలయానిలుండు న - మ్మిత మంత్రిగాఁగ,

సరసుఁడైనట్టి వ - సంత మాధవుఁడు
గురు సంగర ప్రేర - కుఁడు గాఁగ, మరుఁడు

బటువైన శుకదంతి - పై నెక్కి, నిక్కి,
పటిమతో విరహుల - పై దాడి వెడలి,

కోవెల కాహళిఁ - గూచి సేయించి,
వావిరి నిజబలా -వళిఁ బురికొల్పి,

లలినిఁ గేదఁగి కత్తు - లన్ ఝళిపించి,
బలిమిఁ జిగురుటాకు - బాకులఁ గ్రుమ్మి

వెలసిన తన యించు - విల్లెక్కు పెట్టి,
యళి బంభరంబుల -నారి సారించి,

క్రమ్మి సూటిగ పుష్ప - కాండంబు లేసి,
ముమ్మరంబుగ మర్మ - ములను భేదించి,

కినిసి బ్రహ్మాదుల - గెలిచి, జయంబుఁ
గొనిన మన్మథుఁడు ని - క్కుచుఁ బొంచి వచ్చి,

యచట నే స్వస్వరూ - పాను సంధాన
ముచితంబుగాఁ జేయు - చుండఁగా మించి,

యకలంక కుసుమ సా - యక పరంపరలఁ
బ్రకటంబుగాను నా - పైఁ గప్పఁ దొడంగె;

ఆలోన నేను ఫా - లాక్షంబుఁ దెఱచి,
కాలానల జ్వాల - గతి నుండు కంటి

మంటచే వాని భ - స్మంబుఁ జేసితిని.
గెంటక యటమీఁద - గిరిరాజ సుతను

కనుఁగొని మోహించి - కరుణ నేలితిని;
కనుక దానినిఁ జూడ-కను తాళలేను.

వాకిలిఁ దీర! యీ - వార్త లింకేల?
నా కథల్ - తరిగొండ నరసింహుఁ డెఱుఁగు.

వ. అనిన విని భృంగీశ్వరుండు పరమేశ్వరునిఁ జూచి యిట్లనుచున్నాడు:

భృంగీ:- ఓ స్వామీ! నీవు మన్మథుని సాధించి, యటావల బార్వతీదేవి నేలితి నంటివి. మన్మథుఁడు లేకనే గిరికన్య నేలుట యసాధ్యంబు గదా? కాఁగా తిరుగా మదనుం డెక్కడఁ బుట్టెనో తెలియదు. ఆ వృత్తాంతంబు దయచేసి యానతియ్యవలెను- అని నమస్కరించిన నవ్వి, శివుం డిట్లనుచున్నాఁడు: 37

పర:- తే.గీ.ప్రియముతోఁ బార్వతిని నేను పెండ్లియాడు
తఱిని నా మోముఁ జూచె నా తరళనయన;
దాని కడగంటి చూపులో దర్పకుండు
పుట్టి నన్నేఁపుచుండు నెప్పుడును భృంగి! 38

వ. అనిన భృంగీశ్వరుం డిట్లనుచున్నాడు:

భృంగీ:- స్వామీ! నీవు మదనాంతకుండవై యుండియు, మదనుం డేఁచుచున్నాఁడనిన నవ్వుగా నున్నది! మొదట వాఁడు దేహధారిగా నున్నప్పుడు సంహరించితివి. ఇప్పు డనంగుఁ డైనాఁడు. వాని సాధింప నీకు దుర్లభంబేమి? 39

వ. అనిన శంకరుం డిట్లనుచున్నాడు: 40

వర:- సీ. మును నేను ఫాలాక్షమునఁ జూడ మదనుని
సౌందర్యదేహంబు సమసిపోయె;
మగుడి యనంగుఁడై నగజాత కడగంటి
చూపులం దుదయించి శూరుఁడగుచు,
మొదటి మత్సరము నా ముందఱ సాఁగక
లోఁగి నా మదిలోనె డాఁగినాఁడు;
మఱుఁగుఁ జేరినవాని మర్దింపఁదగదని
పార్వతి నను వానిఁ బట్టనీదు;

తే.గీ. ఇంత యభిమాన మా సతి కేల? యనినఁ
దనదు కడగంటి చూపులో జననమొందె
ననెడి మోహము తరిగొండ హరి గిరిజకుఁ
గలుగఁజేయుచు మరుఁ బ్రోచుఁ గదర! భృంగి! 41

తే.గీ. హరికి గిరిజకు బాధ్యుఁడైనందువలన
మరుఁడు బలవంతుఁడై పుష్ప మార్గణములు
దురుసుగా నేయ సాఁగె; నా తరుణి మఱుఁగుఁ
జేరి బ్రదికెద; నీ తల్పుఁ దీర! భృంగి! 42

వ. అనిన విని భృంగీశ్వరుం గిట్లనుచున్నాఁడు:

భృంగి:- స్వామీ! నీ వృత్తాంతంబు వినినందున చాలా సంతోషమాయెను. ఇఁకఁ బార్వతీదేవి వృత్తాంతంబును దెల్పుము. 43

వ. అనిన ‹బరమేశ్వరుండిట్లనుచున్నాఁడు: 44

## ❋ పార్వతీదేవి పూర్వ జన్మగాథ ❋

### ద్విపద

వర:- వలనొప్ప నేను పా - ర్వతి చందమెల్ల
వెలయఁ జెప్పెదఁ గాని - వినర! భృంగీశ!

సాక్షాత్ పరాశక్తి - సాత్త్విక కళయె
దక్ష ప్రజాపతి - తనుజయై పుట్టి,

ననుఁ బెండ్లియాడి యా - నంద మింపొంద
ఘన పతివ్రత యనఁ - గా వన్నె కెక్కె;

నా గుణవతి తండ్రి-యైన దక్షుండు
యాగంబు గావించు - నట్టి కాలమున

భయ భక్తు లుడిగి, దౌ-ర్భాగ్యుఁడై వాఁడు
ప్రియము మీఱఁగ నన్నుఁ-బిలువక యుండె;

నంత దాక్షాయణి-యట కేఁగి, తండ్రి
చెంత నా మహిమ లం-చితముగాఁ బొగడి,

యందున సరకుసే-యక యున్న జనకు
ముందఱఁ దనదేహ-మును రోషవహ్ని

యందు లీనముఁ జేసె;-నప్పు డా యింతి
చందంబు భావించి - చటులోగ్రమూర్తి

యగు వీరభద్రుని-నంపఁగా నరిగి,
యగణిత శౌర్య - ధై-ర్యాటోపములను

బ్రకటించి, లయకాల - భైరవు కరణి
సకలదేవతలను - చలియింపఁ జేసి,

యా క్షణంబున యాగ-మంతయుఁ జెఱచి,
దక్ష ప్రజాపతి - తల నుత్తరించి,

యంతటఁ బరితృప్తుఁ-డై యుండె నతఁడు;
పంత మీడేఱిన - ప్పటి నుండి నేను

శాంత మానసుఁడనై - సకల దేవతల
కెంతయుఁ బ్రీతితో - హిత మాచరించి,

యక్షీణ తపము నే-నపుడు గైకొంటి;
దాక్షాయణియు నద్రి - తనయయై నన్నె

పతిగాఁ దలంచి త-పం బాచరించె;
నతిరయంబున మెచ్చి - యా గుణవతిని

నియమక్రమంబున నేఁ-బెండ్లియాడి
దయ నేలితిని; ముందు - దక్షునియందు

జనియించెఁ గనుక దా-క్షాయణి యయ్యె;
ననువొందఁ బర్వత-మందుద్భవించెఁ

గానఁ బార్వతి యనఁ-గా ఖ్యాతి కెక్కె.
నా నళినాక్షి వృ-త్తాంత మిట్టిదిర!

వ. అనిన విని భృంగీశ్వరుండు ప్రథమావరణ కవాటంబుఁ దీసి, యిట్లనుచున్నాఁడు:

భృంగి:- ఇంకాఁ బార్వతీ దేవి విశేషంబులు
దెలుపుచూ నీవల రావయ్యా! 45

వ. అనిన శివుం డిట్లనుచున్నాఁడు: 46

## దరువు, ఆది తాళము

వర:- భామా, అది నా వయ్యారి భామా; ॥పల్లవి॥

ఆ మానిని ఘన-మేమని చెప్పుదు?
రామలకెల్ల శి-రోమణి యైనది
॥భామా, అది నా॥ఉపపల్లవి॥

మునుకొని నా మన-మునఁ బెనఁగొని
తన, కనుఁగవలో మదనునిఁ - గలిగించిన
॥భామా,॥౧

హితవలరఁగ నన్నుపుడెడఁ బాయక
యతుల పతివ్రతలం - దతిశయ యగు
॥భామా,॥౨

తరిగొండాధీ-శ్వరు సోదరియై
కరుణను జగములఁ - బరిపాలించెడి
॥భామా,॥ 3

వ. అని వలుకుచు శివుండు ప్రథమా
వరణంబులోఁ బ్రవేశించి, తన వెంట వచ్చిన బాల
మొదలైన భామామణులఁ గానక, 'వారేరీ?' యని
భృంగీశ్వరు నడుగుచున్న నమయంబునఁ
బ్రథమావరణంబున కీవల బాలాది కాంతలు
పరమేశ్వరుని గానక వెదకుచుఁ దమ చెలులతో
నిట్లనుచున్నారు: 47

## ❀ బాలాది కాంతలు - పరమేశ్వరుఁడు ❀

### దరువు, ఆది తాళము

**బాలాది కాంతలు**:శంభుఁడేఁడె యో చెలులారా?
శివ, శంభుఁడేఁడె యో చెలులారా? ॥పల్లవి॥

శంభుఁడేఁడె? సుమశర సం
రంభుఁడగుచు ననురాగముఁ జూపిన॥శంభుఁ॥ ౧

**వర:-** బాల యేదిరా! భృంగీశా? మా
బాల యేదిరా! భృంగీశా?

బాల యేది బలు బాళి వెలయ ననుఁ
దేలింపుచు వినుతింపుచు వచ్చిన ॥బాల॥ ౨

**బాలాది:-** సుందర విగ్రహుఁ డిందు కళాధరుఁ
డిందుండిప్పుడు మఱెందరిగెనొ? మా ॥శంభుఁ॥ 3

**వర:-** జిలిబిలి పలుకులు పలుకుచుఁ గనులలొ
వలపుల సొలపులు నిలుపుచుఁ గులికే

శ్యామలేదిరా! భృంగీశా? మా
శ్యామలేదిరా! భృంగీశా? ॥శ్యామ॥ ౪

**బాలాది:-** బిరబిర మరుఁ డరవిరి ములుకుల
నురమున నేయను తఱి యైనది; మా॥శంభుఁ॥ ౫

**వర:-** కేళికి రమ్మని కేడింపక, యీ
వేళ దనుక నా వెంటనె వచ్చిన
కాళి యేదిరా! భృంగీశా? మా
కాళి యేదిరా! భృంగీశా? ॥కాళి॥ ౬

బాలాది:- వ్యాళాభరణు నీ వేళను జూడక
తాళఁజాల, బలు బాళి మించె; మా ॥శంభుఁ॥ ౭

వర:- దంటతనంబున నింటికి రమ్మని
గెంటక నా వెనువెంటనె వచ్చిన
దుర్గి యేదిరా! భృంగీశా? మా
దుర్గి యేదిరా! భృంగీశా? ॥దుర్గి॥ ౮

బాలాది:- కుతుక మలరఁ దరిగొండ నృకేసరి
హితు నెనయక యిపు డెటు తాళుదు? మా
॥శంభుఁ॥ ౯

వర:- శ్రీ తరిగొండ నృసింహుని సఖుఁడని
ఖ్యాతి వెలయ నను ఘనముగఁ బొగడే
కాంత లేరిరా! భృంగీశా? మా
కాంత లేరిరా! భృంగీశా? ౧౦

తే.గీ. అనుచు వెదకుచు శివుఁడు బాలాది సతుల
నొక్కదిక్కునఁ గని, చాల మక్కువలరఁ
జెక్కు లమరంగ నిమురుచుఁ జిక్కఁబట్టి,
యిందుముఖులను లాలించి యిట్టు లనియె: 48

వర:-క. అల గిరిజ మందిరమునకుఁ
దలకొని నే నరుగుచున్న తఱి ముద మెసఁగన్
చెలువంబుగ నా వెంటను
బొలుపలరఁగ మీరు రాకపోవుదురఁటరే? 49

బాలాది:-

క. మా యిండ్లకు రమ్మని మే
మాయెడఁ బ్రార్థించి పిలిచినప్పుడు రా, కీ

మాయల పార్వతి నగరికిఁ
బోయెదు నీవెంట రాము పోర! మహేశా! 50

వర:-తే.గీ. అకట! మిము వీడిపోవఁ గాల్లాడ విపుడు,
దానిఁ జూడక క్షణమైనఁ దాళలేను;
కానఁ జిక్కులఁ బెట్టక కరుణతోడ
వేడ్కమీఱఁగ మీరు నావెంట రారె! 51

బాలాది:-
తే.గీ. సవతి యింటికి రామురా! చంద్రమౌళి!
నీ విపుడు రార! మా నిలయములకు;
రా మనసు రాక యున్న మీ రమణికడకుఁ
బోర! పోయెద, మడియాస పొందలేము. 52

## సంవాద దరువు

వర:- ఏల రావే! కలికి బాలా!
ఇప్పు డింతా చలమేలా?
నాలో నేర మే మీ వేళా?
నమ్మినానే! నిన్ను చాలా ॥ఏల॥ ౧

బాల:- చాలు, చాలు చాలు లేరా!
జాణతనమూ మానరా!
శైలజా యింటీకే పోరా!
స్వామీ! నే నందూ రానురా! ॥చాలు॥ ౨

వర:- శ్యామలా! నీ సవతీ యిందూ
నామాట విన దేమందూ?
కామినీ! నీకు నా పొందూ
కావలసితే రమ్మందూ ॥శ్యామలా!॥ 3

శ్యామల:- పోర! పోర! పురసంహారా!
బొంకింపు మాటాడకురా!
సారె కిట్లు పిలువకురా!
సవతి యింటికి రానురా! ॥పోర! పోర!॥ ౪

వర:- కాళీ! నా వెంటాను రావే!
కన్నెత్తి నన్నుఁ జూడవే!
బాళిమీఱ ముద్దియ్యావే!
పట్టుగా నన్నేలుకోవే! ॥కాళీ!॥ ౫

కాళి:- కాని కాని కాని లేరా!
కరుణ గలా వాఁడవేరా!
పూని నన్నుఁ బిలువకూరా!
ప్రొద్దుబోయే; నందే పోరా! ॥కాని॥ ౬

వర:- రావే! నీవైనాను దుర్గి!
రట్టేలా చేసేవే దుర్గి?
మోవితేనె నీవే దుర్గి!
మూర్ఖత మానావే దుర్గి! ॥రావే!॥ ౭

దుర్గి:- తరిగొండా హరిమిత్రా! నీ
ధర్మమూ దెలిసెఁ గానీ
మఱి మఱీ పిల్చితివేనీ
మాకు కోపాము వచ్చీని ॥తరిగొండా॥ ౮

వర:-

చ. మఱి మఱి నేను మిమ్ము బ్రతిమాలిన, నించుక
సడ్డసేయ కీ
విరసపుమాట లాడుచును వేమఱు రామని
పల్క నేటికే?

వర గిరిజాత చెంగటికి వచ్చితిరేని ముదంబుమీఱఁగా
వరుసగ రేపు మాపటికి వచ్చెద నిచ్చటి; కల్కి వీడరే!
53

బాలాది:-

చ. గుఱుతుగ మా నివాసములకున్ నినుఁ బిల్చిన
నీవు రాక, మ
మ్మరమరచేసి వచ్చి, యిపు డద్రిజయింటికి
మమ్ముఁ బిల్తువే?
యిరవగు సాటిదానికడ కెన్నటికైనను మేము
వత్తుమే?
సరి! సరి! యేటి మాట? లిఁకఁ జాలును; నిల్వర!
చంద్రశేఖరా! 54

వ. అనిన విని, క్రమ్మఱి బాలను జూచి శంకరుం
డిట్లనుచున్నాడు: 55

## సంవాద దరువు

వర:- చెలియా! నేనెంతో నిన్ను వేఁడితిఁ గదవే బాలా?
నే వేఁడితిఁ గదవే బాలా? ॥చెలియా!॥

బాల:- వేఁడితివో? వీడితివో?
విడనాడితివో? పోపోరా! ॥వేడితివో?॥ ౧

వర:- మక్కువలర నీ వలలో నేఁ జిక్కితిఁగదవే బాలా?
నేఁ జిక్కితిఁ గదవే బాలా? ॥మక్కువలర॥

బాల:- చిక్కితివో? దక్కితివో? యటు
సొక్కితివో? పోపోరా! ॥చిక్కితివో?॥ ౨

వర:- కులుకులాఁడి వనుచు నిన్నే వలచితిఁగదవే బాలా?
నే వలచితిఁగదవే! బాలా? ॥కులుకులాఁడి॥

బాల:- వలచితివో? కొలిచితివో? దానిఁ
దలఁచితివో? పోపోరా! ॥వలచితివో?॥ 3

వర:- మారు కేళి కిప్పుడు నిన్నే కోరితిఁ గదవే బాలా?
నేఁ గోరితిఁ గదవే బాలా? ॥మారుకేళి॥

బాల:- కోరితివో? మీఱితివో? హా! వే
సారితివో? పోపోరా! ॥కోరితివో?॥ ౪

వర:- తరిగొండా హరితోడే! నిన్నూ మరిగితిఁ గదవే?
బాలా?
నే మరిగితిఁ గదవే బాలా? ॥తరిగొండా॥

బాల:- మరిగితివో? పెరిగితివో? ఏడ
తిరిగితివో? పోపోరా! ॥మరిగితివో?॥ ౫

వర:-క. పోపొమ్మని పలుమాఱును
నా పట్లను నెనరులేక నను విడనాడే;
రీ పాపమేమి వచ్చెను?
కోపమునకు హేతువేమె కోమలు లారా? 56

బాలాది:-
క. నెమ్మదితో మా యిండ్లకు
రమ్మని పిల్చినను నీవు రా, కిచ్చటికే
సమ్మతి వచ్చితి; వందున
నిమ్మెయిఁ గోపంబు వచ్చు టెఱుఁగవ రుద్రా? 57

## సంవాద దరువు

వర:- ఇంత కోపంబేల చేసేరే? మీ
చెంతఁ జేరితి; దయఁ జూడరే! ॥ఇంత॥ ౧

బాలాది:- సంతోష మాయెనుర! శంకరా! శైల
జాత యింటికే పోరా! శంకరా! ॥సంతోష॥ ౨

వర:- పొమ్ము పొమ్మని యేల రొప్పేరే? యిట్లు
దొమ్మి మాట లేల చెప్పేరే? ॥పొమ్ము॥ 3

బాలాది:- రమ్మంటేనే మమ్ము మెత్తువా? గిరిజ
సమ్మతింపక నీవు వత్తువా? ॥రమ్మంటేనే॥ ౪

వర:- చనువిచ్చి పలికితే మెచ్చేనే! దాని
సమ్మతపఱచి నే వచ్చేనే! ॥చనువిచ్చి॥ ౫

బాలాది:- తరిగొండ నృహరి సోదరికే రా! నీవు
దక్కితి; విఁక మా జోలి యేలరా? ॥తరిగొండ॥ ౬

## ద్విపద

అని పల్క విని, శివుఁ - డా యిందుముఖుల
మనములలో నుండు - మాత్సర్యములకుఁ

దనలోన నగుచు, నీ - తరుణుల నచటి
కనువందఁ బిలువరా -దనుచు నిట్లనియె:

'కువలయేక్షణలార! - కొంకుచు మీరు
సవతి యింటికి రాక-చలము చేసెదరు;

ఐన మంచిది యిప్పు - డందు కేమాయె?
పూని యీ పున్నాగ - భూజంబు చెంత

నే వచ్చునంతకు - నిలువుఁ; దచ్చటికి
వేవేగఁ బోయి యా - వెలఁదితో నొక్క

మాటాడి యిటకుఁ గ్ర-మ్మఱ వత్తుఁ; జింత
యేటికి మీ?' కన్న - నింతు లందఱును

పనిఁబూని తరిగొండ - పతి చెలికానిఁ
గని యిట్టు లనిరి బల్ కనికరంబునను.

తే.గీ. 'వెలఁత పార్వతి వలలోన నీవు చిక్కి,
రాక నిల్తువొ? వత్తువో? రమణ! మగుడి
వత్తువనుటకు సాక్షు లెవ్వా?' రటంచు
నింతు లడుగఁగ నగి శివుం డిట్టు లనియె: 58

**ద్విపద**

'వెలఁతలారా! యిందు - నేను వచ్చుటకు
వలనొప్ప సాక్షు లె-వ్వా రంటిరేని

అమర మీ మధురాధ-రాబ్ధులు సాక్షి;
కొమరొప్పు మీ కుచ-కుల గిరుల్ సాక్షి;

ఎదను నూఁగారు ఫ-ణీంద్రులు సాక్షి;
కదియ మీ నాభిపు-ష్కరిణులు సాక్షి;

పరఁగ మీ మధ్య న-భంబులు సాక్షి;
సరవి నితంబ భూ-చక్రముల్ సాక్షి;

తుదకు మీ మోముచం-దురులును సాక్షి;
అదిగొ! మా తరిగొండ - హరి సర్వసాక్షి;

నమ్మరే! నా మాట - నళినాక్షులార!
పొమ్మని సెలవీరె! - పోయి వచ్చెదను'.

సీ. అని పల్కి లాలించి యాలింగనము లిచ్చి,
యగజ మందిరమున కరిగె శివుఁడు;
బాలాది కాంత లా పరమేశ్వరుని రాక
కెదురుచూచుచును సమ్మదము మీఱ
శృంగార వనములోఁ జెలరేగి పుష్పముల్
గోసి, శంకరుఁ బూజ చేసినటుల
మదిలోన భావించి, మదనారి రాకడ
గోరుచునుండి రా కొమ్మ లచట,

తే.గీ. అచటఁ దరిగొండ హరి మిత్రుఁ డద్రిసుతను
జూడవలెనని మదిలోన వేడుకలరఁ
బొసఁగ నంతఃపురమునకుఁ బోవుచుండి,
చెలఁగి భృంగీశ్వరునిఁ జూచి పలికె నిట్లు. 59

వర:-క. ఎక్కడఁ బోయితినో యని
యిక్కడ నా కెదురు చూచు హిమగిరి తనుజన్
గ్రక్కునఁ జూడక యుండినఁ
గక్కసమున నలుకఁ బూను గదరా? భృంగీ! 60

వ. అనిన విని, వినోదంబుగా భృంగీశ్వరుం
డిట్లనుచున్నాఁడు: 61

## సంవాద దరువు, ఆదితాళము

భృంగీ:- ఇందుండక నీ వింత తడవు మఱి
యెందుంటివి పరమేశా? నీ వెందుంటివి పరమేశా?
౧

వర:- మందాకిని బలు మచ్చిక సేయఁగ నే
నందుంటిర! భృంగీశా! నే నందుంటిర! భృంగీశా! ౨

భృంగీ:- అల పార్వతి కిది దెలిసిన నీతోఁ
బలుకదిపుడు పరమేశా! నీతోఁ బలుకదిపుడు పరమేశా!౩

వర:- చెలువలరఁగ నిది శ్రీపార్వతితోఁ
జెప్పవలదు భృంగీశా! నీవు చెప్పవలదు భృంగీశా!౪

భృంగీ:- అరిగిన దెందని యా పార్వతి ని
న్నడుగు నిపుడు పరమేశా! నిన్నడుగు నిపుడు
పరమేశా! ౫

వర:- అఱసేయక సతి యడిగినఁ
జెప్పెద నందుకేమి భృంగీశా? యిపు డందుకేమి
భృంగీశా? ౬

భృంగీ:- ఈ త ప్పించుక యెఱిఁగిన
గిరిజ సహింపదయ్య! పరమేశా! యిపుడు
సహింపదయ్య! పరమేశా! ౭

వర:- శ్రీతరి గొండ నృసింహుల సోదరి
చిత్తము రా! భృంగీశా! దాని చిత్తమురా! భృంగీశా!౮

వ. అనిన విని భృంగీశ్వరుం డిట్లను చున్నాఁడు:

భృంగీ:- స్వామీ! యిటువంటి పార్వతిని విడిచి పోవుటకును,
మగుడి వచ్చుటకును నిమిత్తంబేమి? అని యడిగినఁ
బరమేశ్వరుం డిట్లనుచున్నాఁడు: 62

## ద్విపద

వర:- వినర! భృంగీశ! యా-వెలఁదియు నేను
నెనరు రెట్టింపఁగా - నిన్నటి రాత్రి

సరసోక్తు లెసఁగ ము-చ్చట లాడు తఱిని
అరమరలేని యా - యరవింద నయన

నామేను భావించి, - నగుమోముఁ జూచి,
'పాముల సొమ్ము లీ-పగిదిఁ దాల్చినను

ఘనుఁడవౌ నిన్నింకఁ - గవగూడ వెఱతు'
నని పల్కి, యల్కతో-నటు ముఖంబయ్యె.

అంతలో జాహ్నవి - యాత్మలో నన్నుఁ
జింతింప, దాని వాం-ఛితముఁ దీర్చుటకు

సమయం బిదే యని - శైలజమీఁద
నమితంబుగా నేను - నలిగిన రీతిఁ

గొదుక కందుండి ది-గ్గున లేచి వచ్చి,
సదయాత్మయై యున్న - జాహ్నవిఁ గూడి,

నిన్న రాతిరి నుండి, - నేఁటి రాతిరికిఁ
బన్నుగా వచ్చితిఁ - బార్వతి కడకు,

వేడుకగా దాని - వీక్షింపకున్న
నేఁ డింక నిమిషంబు - నేఁ దాళలేర!

తే.గీ. గద్దె సుద్దులచేతనే ప్రొద్దు వోయెఁ
గాన, సేనలతో వచ్చె సూనశరుఁడు;
వాని గెల్చుట కిపుడు పార్వతి సహాయ
మేను గోరెద; నన్నుఁ బోనీర! భృంగి! 63

వ. అని పలికి భృంగీశ్వరుని వీడ్కొని, యంతః పురంబులోఁ బ్రవేశించి, యందున్న చెలులతో నిట్లనుచున్నాడు: 64

వర:-తే.గీ. శైలజాతను గానరే! సఖియలార?
మందయానను గానరే! మగువలార?
కుందరదనను గానరే! కొమ్మలార?
పార్వతిని ఇందుఁ గానరే! భామలార? 65

## ❀ పార్వతీ పరమేశ్వరుల సమాగమము - సంభాషణము ❀

వ. అనిన విని చెలులు దండప్రణామంబులు చేసి, 'స్వామీ! యీ వేళ దనుక మీ రాక కెదురు చూచి, నీవు రాక తడవు చేసినందునఁ, గేళికా వన ప్రాంతంబున నిన్ను వెదకుచున్నది'. అనినఁ బరమేశ్వరుండు తద్వనంబున కరిగి పార్వతిని వెదకుచుండఁ, బార్వతి పరమేశ్వరుని వెదకుచుండ, నా రాత్రి క్రీడార్థంబుగా దేవలోకంబున నుండి వచ్చి, యవ్వనంబులో నందందు గుంపులు గూడి విహరించు నప్సరో గణంబులం జూచి యిట్లను చున్నారు: 66

### సంవాద దరువు, ఆదితాళం

పార్వతి:- దేవునిఁ గానరుగా? ఇక్కడ మహా
దేవునిఁ గానరుగా? ॥దేవునిఁ॥ పల్లవి॥

దేవునిఁ గానరే దివిజ కామినులార?
పావనాచారుఁడు భక్తమందారుఁడు
॥దేవునిఁ ॥ఉప పల్లవి॥

తెల్లాని మైవాఁడూ పల్లా జడల వాడూ
ఎల్లా లోకము లెప్పూ డేలువాడూ;
చల్లాని దయమీఱ మొల్లాము గల జింక
పిల్లాను చేపట్టి, ప్రియమూన పోషించే॥దేవూని॥ ౧

పరమేశ్వరుఁడు:-

శాంభవిఁ గానరుగా? నా వయ్యారి
శర్వాణిఁ గానరుగా? ॥శాంభవి॥పల్లవి॥

శాంభవిఁ గానరే? సద్గుణావతి యని
కుంభిని నందాఱు కొనియాడఁదగిన శ్రీ
॥శాంభవి॥ ఉపపల్లవి॥

అలుకు బెలుకులాది, తళుకు పల్వరుసాది
పలుకు పలుకుకు తేనె లొలికేటిదీ;
మొలక నవ్వులాది, బల్ వలపు సొలపులాది
కులుకూ ముద్దుల గుమ్మ కలికీ చక్కెరబొమ్మ శ్రీ
॥శాంభవి॥౧

పార్వతి:- దేవూనిఁ గానరుగా? ఇక్కడ మహా
దేవూనిఁ గానరుగా? ॥దేవూని॥

ఫాలతలాక్షుఁడూ ఫణిరాజాభరణుఁడూ
బాలేందు ధరుఁడూ అంబర కేశుఁడూ
నీలకంధరుఁడూ త్రిశూల హస్తుఁడూ, విశ్వ
మూల కారణుఁడూ నన్నేలిన శ్రీమహా॥దేవూని॥౨

పరమేశ్వరుఁడు:-

శాంభవిఁ గానరుగా? నా వయ్యారి
శర్వాణినిఁ గానరుగా? శ్రీ ॥శాంభవి॥

నిద్దంపు మోమూది, నిడువాలు కన్నులాది
ముద్దులు గులికేటి ముంగురులాది
కద్దో లేదో యనఁగావచ్చు నడుముదీ
అద్దంపు చెక్కిళు లమరి నన్ వలపించే శ్రీ
॥శాంభవిఁ॥3

**పార్వతి:-** దేవునిఁ గానరుగా? ఇక్కడ మహా
దేవునిఁ గానరుగా? ॥దేవునిఁ॥

గురుతార తరిగొండ నరహరి మిత్రుఁడు
పరమ పవిత్రుఁడు భవదూరుఁడూ
సురుచిర దృష్టిచే మరుని గెల్చినవాఁడు
స్థిరముగా నా కర్ధ దేహ మిచ్చిన మహా ॥దేవునిఁ॥౪

**పరమేశ్వరుఁడు:-**
శాంభవిఁ గానరుగా? నా వయ్యారి
శర్వాణిఁ గానరుగా? శ్రీ ॥శాంభవిఁ॥

ధరణిలో తరిగొండ నరహరి కెప్పుడు
సోదరీ యను ఖ్యాతి దనరినాది
శరణాని మ్రొక్కిన పరమ భక్తుల నెల్లా
కరుణించి మితి లేని వరములా నిచ్చే శ్రీ ॥శాంభవి॥ ౫

వ. అని యిట్లు పార్వతీ పరమేశ్వరులు ఒకరి నొకరు గానక వెదకుచుండి, యందొక్క దిక్కున పుష్పభరితంబైన పున్నాగ వృక్ష సమీపంబున నెదుర్కొని; రంతఁ బరమేశ్వరుండు పెన్నిధానంబు చిక్కిన పేద చందంబున సంతసించి, పార్వతి కరకమలంబులు పట్టి, యిట్లను చున్నాఁడు: 67

క. చక్కెర బొమ్మరో! నిను నే
నెక్కడఁ గాననకను వెదకి తింత తడవు, నీ
విక్కడనైనను చేతికిఁ
జిక్కితివఁటె ముద్దుగుమ్మ! చిక్కితి వఁటవే! 68

వ. అని బుజ్జగించి పలికినఁ, దన పతి చిహ్నాంబులు భావించి పార్వతి యిట్లనుచున్నది: 69

## సంవాద దరువు, శంకరాభరణ రాగము - రూపక తాళము

**పార్వతి:-** ఏర! నాతో బొంకవలదు; ఎందుఁ బోతివో శివా?
నారదాది మౌని వంద్య! నాకుఁ దెల్పరా! ॥ఏర!॥పల్లవి॥

వర:- సొంపుగాను భక్తజనులఁ జూడఁ బోతినే! [55]సఖీ!
ఇంపుమీఱఁగాను వరము-లియ్యఁ బోతినే! ౧

**పార్వతి:-** ఒనర వరము భక్తకోటి కొసఁగఁ బోయితే శివా!
ఘనతమీఱఁగాను మోవిఁ గాటిదేమి రా? ౨

వర:- నెలఁతరో! ఫలించు తరువు నీడ నుండితే సఖీ!
ఫలమటంచుఁ జిలుక మోవిపైనఁ గఱచెనే! ౩

**పార్వతి:-** గాటముగను మేన జడా వ్రేటు లేమిరా! శివా?
నీటుకాఁడ! నీవు నాతోఁ దేటపఱచరా! ౪

వర:- మెఱయు నురగ హారములు మెడను వేసితే సఖీ!
తఱచుగాను ఒత్తుకోని దద్దులాయెనే! ౫

---

55 ఈ దరువులో పరమేశ్వరుడు (పార్వతి నుద్దేశించి) పలికిన “సఖీ” - అనే సంబోధ్య వాచకము ర-ప్రతిలో అంతట “సతీ!” - అని యున్నది.

**పార్వతి:-** మురిపె మలరఁ గనుల నిదుర మొబ్బదేమిరా! శివా?
పరమ పురుష! నీకు ఇంత బడలికేమిరా? ౬

**వర:-** పొలఁతి! భక్తపూజచేతఁ బ్రొద్దు పోయెనే! సఖీ!
అలర నిదుర లేక దేహ మలసెఁ జూడవే! ౭

**పార్వతి:-** టెక్కు గల్గు హారముల చిక్కు లేమిరా! శివా?
చక్కఁదనపుఁ జెక్కులందు నొక్కు లేమిరా! శివా?౮

**వర:-** ఈ విధాన అడిగితేను ఏమనందునే సఖీ?
దేవి! యిన్ని ఆనవాళ్లు నీవి కావటే? ౯

**పార్వతి:-** తెలిసెఁ, దెలిసెఁ గాని, నీవు కులుకవలదురా! శివా!
ఎలమితోడ గంగ జోడు నెనసియుండరా! ౧౦

**వర:-** వెలఁదిఁ నిన్నుఁ బాయలేను విద్రుమాధరీ! సఖీ!
చెలఁగి తారిగొండ నారసింహ సోదరీ! ౧౧

**వ.** అనినఁ బార్వతి యిట్లనుచున్నది: 70

**పార్వతి:-**

**తే.గీ.** ఇన్ని మాయలఁ బన్న నీకేల నోయి?
గంగఁ గవగూడియుండు సుఖంబుగాను,
నీవు నన్నొల్ల వటుగాన నేను తపముఁ
జేయుచుండెద నీయందుఁ జెందుకొఱకు. 71

**వ.** అని పలికి యలిగిపోవుచున్నఁ, బోనియ్యక త్రోవ కడ్డంబు వచ్చి, పరమేశ్వరుం డేమనుచున్నాఁడు:72

### దరువు, ఆది తాళము

వర:- రావే! రావే! రావే! శర్వాణీ! రావే! ॥పల్లవి॥

రావే! వరములు కోవే! యిచ్చెద
నీవే యిఁక ముద్దియ్యవె! వేఁడెద ॥రావే!॥ ౧

మఱి మఱి మరుఁ డరవిరి ములుకులు గొని
దురుసుగ నురములోఁ దూఱఁగ నేసెను॥రావే!॥ ౨

కమ్ముకొనుచుఁ గీరమ్ములు పలుకఁగ
ముమ్మరముగ విరహమ్ము మించె నిఁక॥రావే!॥ 3

వర తరిగొండ నృహరి సహోదరి ననుఁ
గరుణింపవె! నీ కఱ యేమిటి? కిటు ॥రావే!॥ ౪

వ. అని యిట్లు బుజ్జగించి, యంతఃపురంబునకుఁ దోడ్కొనిపోయి, హంసతూలికా తల్పంబునం దుంచి, పార్వతికి సంతోషంబుగా నృత్యంబుఁ జేసేవిధం బెటువలెను: 73

## ❀ పరమ శివుని యానంద నృత్యము ❀

### దరువు, ఆది తాళము

ఆడెనే! శివుఁ డాడెనే! ॥పల్లవి॥

ఆడెనే! పరశివుఁ డద్రిజ ముందఱ
చేడెలు గుములై వేడుక చూడఁగ ॥నాడెనే!॥ ౧

విలసిత మృదు పదములఁ జిఱు గజ్జెలు
ఘలు ఘలు ఘలు ఘల్లని మ్రోయఁగ ॥నాడెనే!॥ ౨

తతకిట తకఝుం తధిమి ధిమిత యని
గతులు, చొల్లు లతులితముగ మొరయఁగ॥నాడెనే!॥3

ఫణి భూషణములు పలుమఱు గదలఁగ
గణ గణ మని మొల గజ్జెలు, ఘంటలు మ్రోయఁగ
॥నాడెనే!॥౪

ధాణు ధణుం ధణు ధణిత యనుచు గీ
ర్వాణులు నభమున వరుసగఁ జూడఁగ
॥నాడెనే!॥ ౫

తారి తకిట ఝుం తక కిణ తకఝుం
తారి తకిట తా తై యనుచును ॥అడెనే!॥ ౬

ధర తరిగొండ నృహరి వరమిత్రుఁడు
భరత శాస్త్ర విస్ఫురిత సరణులను ॥అడెనే!॥ ౭

చ. చనువలరంగ శంభుఁడిటు సల్పిన నృత్యము మెచ్చి, శైల నం
దన ముదమొంది, నాథునికిఁ దా నుపచారము లొప్పఁ జేయుచున్
మనసిజకేళిఁ దేల్చె మణిమంటపమధ్యమునందుఁ, బిమ్మటన్
ఘనముగఁ గామినుల్ గొలువఁగా సుఖలీలల నుండి రిద్ధఱున్. 74

వ. అప్పుడు పార్వతీదేవి పరమేశ్వరు ప్రేరణంబునఁ జెలి నంపించి, బాలాది కాంతల రప్పించుకొని, [56]వారితో నిష్టాగోష్ఠిఁ బరమేశ్వరునిఁ గొలిచి యుండి రందఱును. 75

56 వారలుం దానును పరమేశ్వరునిఁ గొలుచుచు, నిష్టాగోష్ఠి నుండిరి-ర.

## ❀ నారదుఁడు కైలాసమున కరుదెంచుట ❀

### ద్విపద

అంతట నారదుఁ - డా ప్రభాకరుని
చెంతఁ జేరి నుతించి - చేతులు మొగిచి,

వింతగా గానంబు - వినిపింప మెచ్చి,
సంతసంబొదవ భా-స్కరుఁడు సద్రత్న

హారంబు బహుమాన-మని వేడ్క మీఱ
నారద మౌని కు-న్నత లీలతోడ

నిచ్చినఁ, గైకొని - యింపొందఁగాను
మచ్చిక మించి స-మ్మతముగా వెడలి,

ఘనముగా గగనమా-ర్గమునఁ బోవుచును
తన మదిలోఁ దాను - తలఁచె నీరీతి:

'ఇనుఁడు ధరించిన - దీ రత్నహార
మనువంద నెవ్వరి - కఱుగ దీ సొమ్ము;

పరమ పతివ్రత - పార్వతీ దేవి
ధరియింపఁదగుఁ గాని, - తపసుల కేల?'

నని నిశ్చయముఁ జేసి, - యా క్షణమందె
జను లెన్నఁ బరమేశు - సౌధంబునకును.

### దరువు, [57]ఆట తాళము

వచ్చె నారద మౌని ముచ్చటగానూ
తెచ్చె రత్న హారము మెచ్చుగానూ
॥వచ్చె నారద మౌని॥ ॥పల్లవి॥

---

57 అట తాళము - ర.

సరస రుద్రాక్ష సరములు గదలఁగ
దొరకొని జడలును తూలఁగనూ
మఱువక ఘన జప మాలిక నెన్నుచు
హర! హర! హర! యని యాడుచునూ ॥వచ్చె॥౧

పలుమఱు సరిగమ పధనిస యనుచును
మెళఁకువగా వీణె మీటుచును
తలకొని ద్రుత మధ్య విలంబములను
బలు వగ మీఱఁగఁ బాడుచునూ ॥వచ్చె॥౨

ఆగమవేద్యుని నఖిలాధీశుని
భోగి భూషణునిఁ బురహరునీ
యోగవందితుని భోగశరీరుని
బాగుగఁ బొగడుచు భక్తిగనూ ॥వచ్చె॥3

సలలిత లీలల శైలకుమారికిఁ
జెలువుగ ముచ్చటఁ జెప్పుచునూ
కొలువున శ్రీతరిగొండ నృకేసరి
చెలికాఁ డుండఁగఁ జెచ్చెరనూ ॥వచ్చె॥౪

వ. ఇవ్విధంబున వచ్చిన మౌనీంద్రుండు చంద్రశేఖరుని వినుతించే విధం బెటువలెను: 76

## ❀ నారదుఁడు పరమేశ్వరునిఁ బ్రస్తుతించుట ❀

### చూర్ణిక

శ్రీమత్ ప్రాలేయ క్షోణీధరేంద్ర వర కన్యకారత్న విశాల నయన చకోర పరిపూర్ణ సుధాకరా! సకల భక్తజన వశీకరా! ౧

నిఖిల జగత్పావన భానువంశసంభవ భగీరథ ప్రయత్న లబ్ధ పరమ పవిత్ర గగన గంగాధరా! ఘోరతర విష కలిత కంధరా! ౨

ప్రకృతిజన్య గుణత్రయ వికారహేతుభూత భావ సంభవ సకలావయవ గహన దావానలా! భవ జలద పటల మహానిలా! 3

చటులతర కుటిల నిశాట పటల సట మాయా వినిర్మిత త్రిపుర వసుధాధరేంద్ర పురుహూతా! నిఖిల భువనైక విఖ్యాతా! ४

నిర్గుణ నిరాలంబ నిరాకార నిర్వికార సత్య జ్ఞానానంత పరబ్రహ్మప్రకాశాంశ సంజాత కృశాను, భాను, శశి నేత్రా! తరిగొండ నరసింహ మిత్రా! పాహిమాం పాహిమాం పాహి మామ్. ౫

శ్లో॥ వందే యోగిమనోంబుజాత నిలయం వందే సదా శంకరం,
వందే భావజ గర్వశైల కులిశం వందే ముకుందాశుగమ్।
వందే పావక లోచనం పశుపతిం వందే మహాసుందరం,
వందే చంద్రకళాధరం శితిగళం వందే శివా వల్లభమ్॥
77

వ. అని వినుతించిన [58]మౌనీంద్రునిఁ జంద్రశేఖరుం డుచితాసనంబునకు రావించి, యిట్లనుచున్నాఁడు:
78

### దరువు, జంపె తాళము

వర:- ఈ వేళ మౌనీంద్ర! యిందెందు వచ్చితివి?
వే వేగమున మాకు [59]వినిపింపవోయీ! ౧

---

58 మౌనీంద్రున కుచిత సత్కారం బొనరించి, చంద్రశేఖరుం డిట్లనియె - ర
59 వినిపింపు మోయీ - ర.

వార:- హర! నేను మీ దర్శనార్థమై వచ్చితిని
కరుణఁ జూడుము నన్ను గంగోత్తమాంగా! ౨

వర:- సామోదముగఁ బల్కు సకల లోకములందు
సేమమే యందఱికి నో మునివరేణ్యా? ౩

నార:- వినుము సకలాత్మ! నీ ఘన కటాక్షముచేతఁ
దనరి యందఱుఁ గుశలమున వెలసినారూ. ౪

## ❀ రత్నాల హారమును పార్వతీ పరమేశ్వరులకు సమర్పించుట ❀

### ద్విపద

అన్ని విన్నవించుచు - నానందమంది,
ముని నాథుఁ డప్పు డా-ముక్కంటి కనియె:

పరమేశ! మీ పాద - పద్మ యుగ్మంబుఁ
జిరభక్తితోఁ జూడఁ - జిత్తంబునందుఁ

దలఁచి నే రిక్త హ-స్తముల రాలేక
యలఘు రత్నంబుల - హార మీవేళ

సచ్చరిత్రుండైన - జలజాప్తు కడను
దెచ్చితిఁ బార్వతీ-దేవి కీ వలసి,

యరుదైన యీ రత్న-హార వృత్తాంత
మెఱిఁగింతు శ్రీపార్వతీశ్వర! వినుము!

పొలుపొందఁగా విరాట్-పురుషుండు తొల్లి
సలలిత లీల వి-శ్వస్థితి కెపుడు

నవిరళుండగు విష్ణు - నధిపతిఁ జేసి,
ప్రవిమల రత్నహా-రంబుఁ-గల్పించి,

మారు తండ్రికి బహు-మానంబుఁ జేసె;
నా రత్నహార మా-హరి దాల్చి యుండి,

పనిఁబూని పిమ్మటఁ - బంకజాప్తునకుఁ
దన కళలోఁ గొంత-దయమీఱ నిచ్చి,

'యొనరఁ బ్రకాశింపు - చుండు మీ'వనుచుఁ
దన రత్న హారంబుఁ - దడయక యొసఁగె;

నిదివఱ దనుక న-య్యినుఁడు ధరించె;
సదయుఁడై నా గాన - సరణికి మెచ్చి,

హెచ్చుగా నీ రత్న-హారంబుఁ బ్రీతి
నిచ్చినఁ, 'దపసుల - కిది యేల? యనుచుఁ

దెలిసి, పార్వతికి నేఁ - దెచ్చితి' ననుచుఁ
గలహభోజనుఁ డిచ్చె - గంగాధరునకుఁ,

బరమేశుఁ డొసఁగె నా-పార్వతీసతికి,
నరుదుగాఁ దాల్చె నా-హారంబు గిరిజ;

యంతట సెలవంది - యచ్చోటు వెడలి,
సంతసంబున దేవ-సంయమి చనియె.

## ❋ తొలకరి మెఱుపువలెఁ బ్రకాశింపుచు వచ్చిన జాహ్నవి (గంగాదేవి) ❋

క. అక్కడ జాహ్నవి మేల్కని,
గ్రక్కున నందున్న శివునిఁ గానక మదిలో
మక్కువఁ బెనఁగొనఁ గూడుట
కక్కఱగా వెదుకఁ దలఁచి, యతి శ్రీఘ్రముగాన్.79

**ద్విపద**

సరగునఁ బన్నీటఁ - జలకంబు లాడి,
సరిగ కొంగుల చీర-సొరుగాఁ గట్టి,

రాణింపఁ బైరాణి - అవి కొప్పుఁ దొడిగి,
యాణి ముత్యంబుల - హారావళులును,

నిగనిగ లీనెడి - నీలాల సరులు,
జిగి మీఱి తగు రామ-చిలుకల తాళి,

[60]నాను, మెఱ్ఱాలును, - నవరత్న యుతము
లైన కంకణములు, - నందంబులైన

[61]జొత్తుల చేకట్లు, - జోడగు గాజు,
లుత్తమమైనట్టి - [62]యుదుటి ముక్కఱయు,

నలఘు కెంపులు దాపి-నట్టి యడ్డిగలు,
గొళుసుల కమ్మలు, - కుచ్చుల తోడఁ

బరఁగిన కెంపుల - పల్లేరు పూలు,
మెఱుఁగొప్పు బుగడలు, - మిహిరాబ్జ కళలఁ

బొలుపొందు పాపట-బొట్టును దాల్చి,
నిలువు టద్దముఁ జూచి-నెఱు లొప్ప దువ్వి,

[63]కాంతమౌ కుప్పె రే-కణి సవరించి,
వింతగా జడ వేసి - విరిసరుల్ చుట్టి,

60 నాను, నుత్తండాలు, నవరత్నయుతము-ర.
61 జొత్తిల్లు చేకట్లు, - ర.
62 యొఱఁగు ముక్కఱయు-ర.
63 కాంతు లీనంగ రాకడి కుప్పె దాల్చి - ర.

పని(బూని కటిసీమ - పైని నటించు
కొనజడన్ ముత్యాల - కుచ్చులు గట్టి,

పన్నుగా( గుంకుమ - ఫాలమందుంచి,
కన్నుల( దళుకుగా( - గాటుక దీర్చి,

ముద్దుగా భ్రూమధ్య-మున భూతి రేఖ
దిద్ది, వాసన లుప్ప-తిల్లు చందనము

సలలితంబుగ మేన( - జల్లగా నల(ది,
చెలులతో వీడెంబు( - జేయుచు వెడలి,

మందయానంబున - మాటి మాటికిని
నందెల మ్రో(త మి-న్నంది మ్రోయ(గను

[64]ఓర చూపులతోడ - నొయ్యారముగను
మారుని బాణంబు - మాడ్కిని, సొగసు

మీఱిన క్రొక్కాఱు - మెఱుపు చందమున
నారీలలామ జా-హ్నవి చనుదెంచె.

వ. అప్పు డా జాహ్నవి సఖీసమూహంబు నీక్షించి
[65]యిట్లనుచున్నది: 80

64. వార చూపులతోను వైఖరితోను-అ,ఆ,క,కా;
వార చూపులలోను వగలు గుల్క(గను-గ;
నోర చూపులతోడ నొయ్యారముగను-ర.
65. యేమనుచున్నది - అ,ఆ,క.

## ❀ జాహ్నవి యన్వేషణ ❀

### దరువు. జంపెతాళము

శ్రీ కంఠుఁడు లేచి వచ్చె; మీ కన్నులఁ
జూడ లేదఁటరే కొమ్మలారా? నను ని
రాకరించి చెప్పక వాఁడే కరణి నరిగినాఁడే!
కొమ్మలారా? ॥శ్రీ కంఠుఁడు॥ ౧

ఉప్పొరిగలోనూ చలువా చప్పరములోనూ
చూడరే కొమ్మలారా! నడిచే
చప్పు డాలకించి, వానీ తెప్పునా
తోడ్కొనిరారే! కొమ్మలారా! ॥శ్రీ కంఠుఁడు॥ ౨

మెఱయు తారిగొండా నృహరి
మిత్రునిఁ గూడినఁగాని కొమ్మలారా!
మరుఁడు తరియింప నియ్యఁడు; హరుని
సరగునఁ దెచ్చి చూపరే కొమ్మలారా!
॥శ్రీ కంఠుఁడు॥ 3

### దరువు

వింటిరే! నిన్న రాత్రి మా
యింటినుండి బొంకించి, ము
క్కంటి నన్నుఁ బాసి వచ్చె;
కానరేమే వో చెలులారా? ౧

శూలపాణిని చూడని వేళనుండి
నా మదిని
చాల భీతి, భయమాయె
తాళలేనే వో చెలులారా! ౨

నిన్నటి వేళ నుండి పన్నగేంద్రాభరణుని
కన్నులను గట్టినట్లు
వున్నదీ; నే నేమి సేతు?
ఉన్నదీ; నే నేమి సేతు? 3

ఉండి వుండీ తలఁచుకొంటే
గుండె ఝల్లు ఝల్లుమనె
ఉండిన చోటా నైనాను
ఉండసైఁచ దేమి సేతు? ४

వాసి మీఱ తరిగొండా
వానునీ మిత్రుఁడైన
మహేశుఁడూ నన్ను బొంకించె
ఏమి సేతు నో చెలులారా? ౫

అనిన విని చెలు 'లతని రూపరేఖా సౌందర్యంబు లెటువంటి?' వనినఁ జెలులతో జాహ్నవి యేమనుచున్నది: 81

## దరువు

ఈశునిఁ గాన రేమమ్మా? చెలులారా!
నా ప్రాణేశునిఁ గాన రే మమ్మా? ॥పల్లవి॥

ఉరగాహారముల వాఁడమ్మా! అజుని కపాల
మఱచేతఁ బట్టినాఁడమ్మా! ॥ఈశునిఁ॥౧

కరి చర్మధారుఁ డో యమ్మా! కంధరామందు
గరళాముఁ బూనినాఁడమ్మా! ॥ఈశునిఁ॥౨

మోహనా తేజుఁ డో యమ్మా! నా ప్రాణేశుఁడు
మూఁడూ కన్నుల వాఁ డమ్మా! ॥ఈశూనిఁ॥3

సంగీతలోలుఁ డో యమ్మా! ఒక చేత
సారంగాముఁ బూనివాఁడమ్మా ॥ఈశూనిఁ॥౪

పరమ పవిత్రూఁ డో యమ్మా! తరిగొండ
నరహరికి సన్మిత్రుఁడో యమ్మా! ॥ఈశూనిఁ॥ ౫

## ❃ తామసి - జాహ్నవి ❃

వ. అనిన విని 'యాతని వెందునుం గాన'మని విన్నవించు సమయంబునఁ దొలుతఁ బార్వతితో సంభాషణం బొనర్చిపోయిన తామసి వచ్చి, మందిర ద్వారంబున కవల నిలిచి, యా మందాకినితో మాటలాడుటకు హేతువుగా నిట్లనియె: 82

### దరువు

వెదకరేమే శివుని - విరిబోణులారా!
వీఁడుగోనె శివుఁడు - చేడియలారా! ౧

చిక్కినాఁడే శివుఁడు - చెలికత్తెలారా!
గ్రక్కున నిటు రారే! - కల కంతులారా! ౨

తక్కక పట్టరే! - తరళాక్షులారా!
మ్రొక్కి ప్రార్థించరే! - ముద్దియలారా! 3

తిరుగా వాఁడరిగినఁ - ద్రిమ్మరులారా!
మఱి పట్టఁగూడదే - మానినులారా! ౪

పరువెత్తె నప్పుడే - భామినులారా!
త్వరగా రార్రైతి - రందఱు దంటలారా! ॥

వ. అని వికటభాషిణియైన తామసి ప్రత్యక్షంబుగాఁ బట్టి విడిచినట్లు భ్రాంతి గల్పించుచుఁ బలికిన పలుకులు విని, యంతఃపురంబులో నుండి మందాకిని తామసి నుద్దేశించి యిట్లనుచున్నది:

గంగాదేవి:- అవునే! అమ్మయ్యా?

తామసి:- ఏమే! గిమ్మయ్యా?

గంగా:- నీ వెవరే వో అక్కయ్యా?

తామ:- నన్ను తామసియందురే? వో గిక్కయ్యా!

గంగా:- ఈ వేళప్పుడు ఇక్కడికి నీ వేల వచ్చితివే? అమ్మా! వోయమ్మా!

తామ:- నీతో ఆప్తమగు మాటలాడ వచ్చితినే! గిమ్మా! వో గిమ్మా!

గంగా:- 'అమ్మా!' యని నే నెంతో మర్యాదగా నిన్ను పిలిచితే, వికటోక్తిగా నన్ను 'గిమ్మా'! యనే వదేమే? తల్లీ! వో తల్లీ!

తామ:- నేను పుట్టింది మొదలుకొని నా మాట లిట్ల వికటములయ్యే వుండును. నీ వీ మాటల నెగ్గు పట్టక వుంటే నీకు హితము చేసెదనే! బల్లీ! వో బల్లీ!

గంగా:- అయితే, నీవు నాకు హితవైన మాటలాడే నంటివి. ఆలాగే మాటలాడవే తామసీ! వో తామసీ!

తామ:- నే నడిగిన మాటలకు వేసటపడక పుత్తరములు చెప్పితే, నాకు తోచిన మాట లాడేనే! గీమసీ! వో గీమసీ!

గంగా:- అయితే, నీ వడిగే మాటలను అడుగవే! యని, పరమేశ్వరుని జాడ విచారించు తలంపున దాని వికటోక్తులకు కోపము లేక చనవిచ్చిన, నది జాహ్నవితో నిట్లనుచున్నది: 83

## సంవాద దరువు

తామ:- వెలఁదిరో! నీ విన్ని విధములను వెదకిన దెవరినే భామా? నీవు వెదకిన దెవరినే భామా? ౧

గంగా:- అతివరో! విను ఫణిహారునిఁ గానక వెదకితినే! నే వెదకితినే పూఁబోణీ! ౨

తామ:- ఓ కమలానన! యురగాభరణుఁడు నీకు నేమి కావలెనే? వాఁడు నీకు నేమి కావలెనే? ౩

గంగా:- శుభముగ నను దయఁ జూచి వరించిన విభుఁడు కావలెనే! భామా! నాకు విభుఁడు కావలెనే! ౪

తామ:- నెలఁత! మహేశుఁడు నీ విభుడంటివి; నీ వెవరవో యమ్మా? మఱి నీ వెవరవో యమ్మా?౫

వ. అని మఱిన్ని 'శివుండు నిన్ను వరించిన చందంబు, నీ పూర్వవృత్తాంతంబు, నీ పేరు వరుసగాఁ జెప్పుమమ్మా'! అనిన జాహ్నవి యిట్లను చున్నది: 84

## ❁ జాహ్నవి వృత్తాంతము ❁

### ద్విపద

విమలాంగి! వినవె నా-వృత్తాంతమెల్లఁ
గ్రమమొప్పఁ దొల్త నా-కాశంబునందు

జనియించి, జలజాత-సంభవు కృపను
ఘనముగా సత్య లో-కమున నే నుంటి;

నపుడు భగీరథుఁ-డను మహారాజు
తప మాచరించి, య-త్తఱి బ్రహ్మచేతఁ

దొలుత నన్నొక్క బిం-దువుగా గ్రహించి,
బలమొప్పఁ దే నదే-బహు భారమైన,

ధరణి నా భారంబుఁ - దాల్ప లేదనుచు
శిరమందు ధరియించె - శ్రీ సదాశివుఁడు;

అదియె బాల్య స్నేహ-మాయె నిద్దఱికి,
ముదమునఁ గూడితి - ముక్కంటి తోడ.

నటమీఁద భృత్యుఁడై - యా భగీరథుఁడు
నిటలాక్షుఁ బ్రార్థింప - నిటలాక్షుఁ డొసఁగె;

నందుండి వచ్చి నే-నమరఁగాఁ జొచ్చి,
బిందు సరస్సులోఁ బిమ్మట నేడు

భాగంబులై మూఁడు - పరఁగఁ దూర్పునకు,
భాగంబు లొక మూఁడు - పశ్చిమంబునకు

విమలంబులై చనె - విశ్వాస మొదవ,
రమణిరో! నే భగీ-రథు వెంట నంటి,

విపులమై పెల్లుబ్బి - వేవేగ వచ్చి,
యపుడు జహ్ను మునీశ్వ-రాశ్రమంబునకుఁ

బోయి, యచ్చటి యాగ-భూమిఁ జొచ్చుటకుఁ
బాయని కిన్కతోఁ - బ్రబలి యా ఘనుఁడు

నాఁతి! నన్నాపోశ-నంబుగాఁ గొనివ,
భూతలాధీశుఁ డ-ప్పుడు సంయమీంద్రు

వినుతింప, నమ్మౌని - విభుఁడంతఁ గర్ణ
మున నన్ను విడిచిన, - మొనసి యేతెంచి,

సుర లద్భుతంబంది - చూచుచుండఁగను
ధరణి భేదించి, పా-తాళంబు సొచ్చి,

సగరుల కెల్లను - సద్గతి నిచ్చి,
తగ భగీరథు మన-స్తాపంబుఁ దీర్చి,

యంత మాయాశక్తి-నై హరుఁ గూడి,
సంతసంబున నుందు - జలజాక్షి! నేను.

అల భగీరథు వెంట - నరిగితిఁ గనుక
నలర భాగీరథి - యందురు; జహ్ను

వర కర్ణమున నుండి - వచ్చిన కతన
నరులెల్ల నన్ను జా-హ్నవి యందు రెపుడు;

తలకొని మఱియుఁ బా-తాళ లోకమున
వల నొప్పఁగా భోగ-వతి యంద్రు నన్ను;

మొనసి యా స్వర్లోక-మున సంతతంబుఁ
దనరార నన్ను మం-దాకిని యంద్రు;

చేడెరో! యిపు డిన్ని-చెప్ప నేమిటికిఁ?
బాఁడిగా గంగాభ-వాని నా పేరు.

వ. అనిన విని తామసి 'నిన్ను శిరమందుఁ దొలుత ధరియించి, అటావల నీకుఁ బతియైన పరమశివుని రూపరేఖా విలాసంబు లెటువంటి?' వనిన జాహ్నవి యిట్లనుచున్నది: 85

## సంవాద దరువు

గంగా:- శివుని నీ వెఱుఁగ వేమమ్మా? - ఎన్నఁడును
మా శివుని నీ వెఱుఁగవే మమ్మా? ౧

తామ:- శివుని నే నెఱుఁగనో యమ్మా! - ఎన్నఁడును
మీ శివుని నే నెఱుఁగనోయమ్మా! ౨

గంగా:- ఉరగహారముల వాఁడమ్మా! - బ్రహ్మకపాల
మఱచేతఁ బట్టినాఁడమ్మా! 3

తామ:- సంతోషమాయె నమ్మా! - యింక మీ శివుని
చందాముఁ దెలుప వో యమ్మా! ౪

గంగా:- కరిచర్మధారుఁ డో యమ్మా! కంధరమందు
గరళాము నుంచినాఁ డమ్మా! ౫

తామ:- విన వేడుకయ్యా నో యమ్మా! - మీ శివుని చక్కఁ
దన మింకఁ దెలుపు మో యమ్మా! ౬

గంగా:- మోహనాకారుఁ డో యమ్మా! - నా ప్రాణేశ్వరుఁడు
మూఁడు కన్నుల వాఁడమ్మా! ౭

తామ:- ఆనందమాయె నో యమ్మా! - యింకా
మీ శివుని చిన్నెలన్నీ దెలుపు మో యమ్మా! ౮

గంగా:- సంగీతలోలుఁ డో యమ్మా! - ఒక చేతను
సారంగమును బూనినాఁడమ్మా! ౯

తామ:- అయితే మేలాయె నో యమ్మా! - మీ శివుఁడెవ్వరి
కాప్తుడై యుండునమ్మా? ౧౦

గంగా:- పరమ పవిత్రుఁ డో యమ్మా! - తరిగొండ
హరికి సన్మిత్రుఁ డో యమ్మా! ౧౧

వ. అనిన విని తామసి జాహ్నవిం జూచి, 'యిన్ని గుణతులు గలిగిన మహాపురుషుం డొక్కరుండు నీ మందిరంబు వెడలిరాఁ జూచి, నేఁ బట్టుకొని, చెలుల నందఱినిఁ జూడరమ్మని నేనెంత పిలిచినా రాక పోయిరి. కాఁగా బలాత్కారంబున నా పట్టు విడిపించుకొని పార్వతి నగరికిఁ బోయె' ననిన భాగీరథి భయమంది, యిట్లనుచున్నది: 86

తే.గీ. నన్ను బొంకించి, చెప్పక నా విభుండు
చెనటి పార్వతి యిలు సేరె ననిన మాట
తొమ్ము లోపల వజ్రాయుధమ్ము రీతి
నాఁటి భేదింపుచున్నది నా మనంబు. 87

## ❀ జాహ్నవి విరహము ❀

### దరువు, ఆది తాళము

నేఁ దాళలేనే భామా! ॥పల్లవి॥
వేగ, నానాథుఁ దేవే రామా! ॥నేఁదాళ లేనే భామా!॥
॥ఉప పల్లవి॥
వగ మీఱఁగ జిగి బిగి కుచముల
నగసుతఁ గూడియుఁ బగవాఁడాయెను ॥నేఁ దాళ॥౧

కటకట నేఁడా నిటలతలాక్షుఁడు
విటకాఁడై బలు కుటిల మొనర్చెను ॥నేఁ దాళ॥ ౨

అళి బలములు, చిలుకలు రొద చేయుచు
నలరఁగ, నా వల పతిశయమైనది ॥నేఁ దాళ॥ 3

గరిమను మరుఁ డరవిరి ములుకులు గొని
దురుసుగ నురమున దూరఁగ నేసెను॥నేఁ దాళ॥ ౪

కోరికలరఁ దరిగొండను వెలసిన
సారసనాభుని సఖుతో నెనయక ॥నేఁ దాళ॥ ౫

ఉ. వాని కటాక్ష వీక్షణము, వాని ముదంబును, వాని మోహమున్
వాని వినోద భాషలును, వాని మహత్త్వము, వాని లాలనల్
వాని రతిప్రకారమును వర్ణన చేయ నశక్యమౌఁ గదే!
వానెడఁబాసి నే గడియ వారిజలోచన! తాళఁజాలనే! 88

## దరువు

నా మనోహరుఁడని నమ్మితి మదిలోన భామలారా! నేఁడు
సోమశేఖరుఁడెంతో చులుకగాఁ జూచెనే సుదతులారా! ౧

ఏమందు? నా విధి నేమని దూఱుదు? నింతులారా! నా
సామిని తొలుత నే నేమాఱియుంటినే సఖియలారా! ౨

తరిగొండ హరిమిత్రుఁ డఱమరఁ జేపెనే
తరుణులారా! ఇంత
విరసముఁ గలిగించు టెఱుఁగక పోతినే
వెలఁదులారా!

వ. అని యిట్లు జాహ్నవి యత్యంత విరహతాపంబున నిజమందిర ద్వారంబుఁ గడచి, యీవల వచ్చినఁ జూచి తామసి 'యేమమ్మా జాహ్నవీ! పార్వతి యింటికిఁ బరమేశ్వరుండు పోయెననఁగా నీ వింత వేదనఁ బొందెదవు. నీతో నవ్వులకు గిరిజకడకు శివుఁ డరిగె నంటి; నంతియెగాని, నేను నిజముగాఁ జూడ లేదు. నామాట నమ్మవద్దు. ఇంకను అడుగఁ దగ్గవారి నడిగి, నిజంబుఁ దెలిసికొ'మ్మనిన జాహ్నవి యిట్లనుచున్నది: 89

సీ. ఆకాశవాణి! మా హరు నెందుఁ గానవే?
భూదేవి! కానవే భూతపతిని?
గిరులార! కానరే గిరిచాపధరుని? యో
తరులార! కానరే ధర్మహితుని?
సురలార! కానరే సుందరాకారుని?
నరులార! కానరే నాగధరుని?
మునులార! కానరే మోహనతేజుని?
ఫణులార! కానరే ఫాలనయను?

తే.గీ. ననుచు నిన్ని విధంబుల నాత్మవిభునిఁ
గానరే మీరలనుచు నుత్కంఠ మీఱ
వారి వారిని నడిగి, యెవ్వారు శివునిఁ
జూపకుండినఁ, దామసిన్ జూచి పలికె: 90

## దరువు, మధ్యమావతి రాగము

ఇందుఖండ మకుటుఁడూ నేఁడిందు నన్ను విడనాడి
యెందుఁ బోయెనో జెల్ల యేమి సేతునే? ౧

చిలుకల తాళీ లిచ్చేనే! వెలలేని సొమ్ము లిచ్చేనే!
కలకంఠీ! నా ప్రాణేశ్వరునిఁ బిలిచి రాఁగదే? ౨

చాలా తరిగొండా నృహరి సఖునిపై జాలి మించెనే!
తాళలేను తోడితేవే! నీలకంఠునీ. 3

## ❋ తామసి దౌత్యము ❋

వ. అనిన విని తామసి యిట్లనుచున్నది: 91

### సంవాద దరువు

తామ:- చంచలాక్షి! యిపుడు నే నా పంచబాణాంతకు నిచటికి
మంచిదైతే తెచ్చే; నేమి లంచ మిచ్చేవే? ౧

గంగా:- కర కంఙము లిత్తూనో? చేకట్ల కడెము లిత్తూనో?
తఱచుగఁ బచ్చలు తాపిన సందిటి తాయెతు
లిత్తూనో? ౨

తామ:- కర కంఙమూ లొల్లానే! చేకట్లూ, కడెమూ లొల్లానే!
తఱచుగఁ బచ్చలు తాపిన సందిటి తాయెతు లొల్లానే!
3

గంగా:- కెంపుల బుగడా లిత్తూనో? పగడపు మురుగూ
లిత్తూనో?
జంపుల బవిరే లిత్తూనో? బఙ్గసరమూ లిత్తూనో?
౪

తామ:- కెంపుల బుగడా లొల్లావే! పగడపు మురుగూ లొల్లానే!
జంపుల బవిరే లొల్లానే! బణ్ణసరమూ లొల్లానే! ౫

## కుఱుచ జంపె

గంగా:- చిఱుగజ్జె లిచ్చేను కోవే! అల్ల-పురసంహరునిఁ
దోడితేవే! ౧

తామ:- చిఱుగజ్జె లే నొల్లఁ బోవే! మీ-పురసంహరునిఁ
దేనుపోవే! ౨

గంగా:- కంఠసరు లిచ్చేను కోవే!-మా-గరళకంఠునిఁ
దోడితేవే! ౩

తామ:- కంఠ సరు లేనొల్లఁ బోవే! మీ-గరళ కంఠునిఁ
దేనుపోవే! ౪

గంగా:- ఇంక నేమిత్తునో చెలియా?-నాతో బొంక కది
దెలుపవే చెలియా! ౫

వ. అనిన విని తామసి యిట్లనుచున్నది: 92

## దరువు

లంచాము నాకేల నమ్మా?-నన్నూ-లాలించి
నిరతాము రక్షించవమ్మా!
॥లంచాము నాకేల నమ్మా? ॥పల్లవి॥

అపుడు నే నొక యుక్తి చేసీ లంచ మడిగితి
నీగుణమరయంగ వలసీ ॥లంచాము॥౧

అంతనాఁడే యిచ్చినావూ-నన్నూ-సంతరించుచు
నుండు జననివే నీవూ ॥లంచాము॥ ౨

నీదయ యొకటే నా సొమ్మూ-తల్లి!-యే దారి నైనా
నా కిఁక నెవ్వ రిమ్మూ? ॥లంచాము॥౩

వ. అని తామసి 'శివుడు నీ కడకు వచ్చిపోయిన వృత్తాంతంబుఁ జెప్పు'మనిన, జాహ్నవి యిట్లనుచున్నది: 93

## ద్విపద

వెలఁదిరో! వినవె తద్-వృత్తాంత మిపుడు
సలలితాత్మకుఁడైన-చంద్రశేఖరుఁడు

ఇన్నాళ్లు నగజాత-యింటనే యుండి,
నిన్న నా యిలుఁ జేరి - నీటుతో నన్ను

లాలించి లాలించి - లలిత భాషణల,
బేలించి బేలించి - ప్రియములు చెప్పి,

ననుఁ గవగూడి యా-నందింపుచుండి,
ననఁబోణి! పిమ్మట - నన్ను బొంకించి,

చెప్పక వచ్చి నన్ - జిక్కులఁ బెట్టి,
యిప్పు డెందున్నాఁడొ? - యెఱుఁగ నా విధము,

ఇది పూర్వ వృత్తాంత; - మిఁక నీవు పోయి,
వెదకి, చూచిన చోట - విశ్వాస మొదవఁ

గా మాటలాడి, యుం-గరము సంప్రీతి
నా మహాదేవున - కానవా లిచ్చి,

యా యెడ వృత్తాంత - మంతయుఁ దెలిపి,
తోయజేక్షణ! వానిఁ - దోడ్కొని రావె!

వ. అనిన విని తామసి 'యతని నేమని పిలుతు?' ననిన భాగీరథి యిట్లనుచున్నది: 94

శివా! రమ్మని పిలువఁగదే!
పర, శివా! రమ్మని పిలువఁగదే! ॥పల్లవి॥

రవి నిభ తేజునిఁ బ్రవిమల చరితుని
కువలయాక్షి! బలు కూరిమితోఁ బర ॥శివా!॥ ౧

సుందరమూర్తిని నెందును గానక
మందాకిని భయమందిన దిప్పుడు ॥శివా!॥ ౨

నిన్ను మనంబున నెన్నుచుఁ గరఁగుచు
కన్నుల నిద్దుర గానదు జాహ్నవి ॥శివా!॥ 3

కుటిలతచేఁ దరిగొండ నృహరి సఖుఁ
డిటువలెఁ జేసిన నెటువలెఁ దాళుదు ॥శివా!॥ ౪

క. అని తన ముద్రిక యిచ్చిన,
విని కైకొని మ్రొక్కిపోయి, వేడుకతోడన్
మనసిజవైరిని వెదకుచుఁ,
జని చని గిరిజాత యున్న సదనముఁ జేరెన్. 95

వ. అప్పుడా చెలి పరమేశ్వరునిఁ జూచి యిట్లనుచున్నది: 96

సీ. దండంబు దండంబు ఖండేందుధర! నీకు
దండంబు దండం బఖండ రూప!
జాహ్నవీదేవి నీ సన్నిధానమునకు
నన్నిప్పు డంపె నో నాగభూష!
ఘనమైన ముద్దుటుంగరము నీ
కానవా లిచ్చెనో యనఘ చరిత!

ఇదె చూడు మూనవా లిచ్చెదఁ బ్రీతితోఁ
గైకొను వేవేగ గరళకంఠ!

తే.గీ. ఇపుడు నీ రాకకై గంగ యెదురుచూచు
కొనుచుఁ, ద్రోవలు చూచు న క్కోమలాంగి
మనసు రమ్యముగాను సమ్మతముఁజేసి,
మగుడి వత్తువు రావయ్య! నిగమవేద్య! 97

వ. ఇవ్విధముబునఁ బిలిచిన చెలినిఁ జూచి, చూడని చందంబున హరుం డూరకుండినఁ, జెలి యిట్లనుచున్నది: 98

## దరువు

చెలి (తామ):- ప్రమథనాథా! నేఁ బిల్చితె పలుకవేమయ్యా?
స్వామీ! పలుకవేమయ్యా?
వర:- విమలనేత్రీ! నీవు పిలిచెడి వివర మది యేమే? ౧

చెలి:- పొలఁతి మందాకిని నిన్నూ పిలువానంపెనూ
స్వామీ! పిలువానంపెనూ.
వర:- పిలువానంపే దేల? దాని ప్రియము చాలూనే! ౨

చెలి:- కలికి చేతి యానవాలూ గైకొనావయ్యా!
స్వామీ! గైకొనావయ్యా!
వర:- నెలఁతా! దాని యానవాలూ నే నొల్లా పోవే! 3

చెలి:- ఇంతాలోనా నింత కోపా మేలా వచ్చెనూ?
స్వామీ! యేలా వచ్చెనూ?

వర:- ఇంతి! నీ కదేల? నేఁ దానింటికి రానే! ౪

చెలి:- నమ్మినా యింతి నేఁచేది న్యాయమా?
స్వామీ! నీకు న్యాయమా?
వర:- కొమ్మా! నీతో ముచ్చట కూడదు పోవే! ౫

చెలి:- మంచి, దైతే రావా? రావా? మదన సంహారా!
రావా? మదన సంహారా!
వర:- చంచలాక్షి! నే రాలేదూ, సరగూన పోవే! ౬

చెలి:- తరిగొండా హరిమిత్రా! అరుగా సెలవేనా?
అచటికి నరుగా సెలవేనా?
వర:- తరుణి! సెలవిచ్చినానను, తర్లావే! వేగ. ౭

వ. అనిన విని చెలి చిన్నవోయి, దిగ్గున లేచి, వచ్చు మార్గంబులో శాంభవి ధరియించిన రత్నహార వృత్తాంతంబు విచారించుకొని, జాహ్నవినిఁ జేరరాఁగా, జాహ్నవి యిట్లనుచున్నది: 99

## దరువు

గంగా:- ఎలనాఁగ! నీ వింతా తడవూ
ఎక్కడఁ బోయితివే?

చెలి:- ఓ యలివేణిరో! నీ వంపాఁగా నేనూ పోతినే!
హరుని వెదకూకొనుచూ నేనూ పోతినే! ౧

గంగా:- వెదకితివే? మతి విమలాత్ముని
నీ వెక్కడఁ జూచితివే?

చెలి:- అ,ల్లదిగో! ప్రాలేయాద్రిజ కడ
సకలాత్ముని( జూచితివే! ౨

గంగా:- చూచినపుడు మా సోమశేఖరుఁడు
చూచెనఁటే నిన్నూ?

చెలి:- నను( జూచి తొలుత, మఱి
చూడని విధమున చూడలేదె! భామా! 3

గంగా:- చూడకయుండిన సుదతి! పిలిచి
మాట్లాడితివో, లేదో?

చెలి:- విను పోఁడిమిగా నో పురహర!
రమ్మని పొందుగఁ బిలిచితివే! ౪

గంగా:- పిలిచితె నీతో ప్రియ వాక్యములను
పలికెనటే యతఁడూ?

చెలి:- ఓ కలికిరో! శివుఁడెటు పలుకును? నీ పై
నలుకఁ జేసినాఁడే! ౫

గంగా:- తరిగొండ నృకేసరి సఖుఁడిప్పుడు
అలుగను తగునటవే? చెలియా!

చెలి:- ఓ తరుణీమణి! యిది తగు, తగ
దనుటకు తరమటవే? తల్లీ! ౬

వ. అనిన విని జాహ్నవి శివుం డలుగుటకు హేతువేమని మనంబున విచారింపుచు, తామసినిఁ జూచి యిట్లనుచున్నది: 100

## దరువు

అలుక యేల చేసెనే? ॥పల్లవి॥

అలుక యేల చేసెనే?-నే-నందు కేమి సేతునే?
ఎలమి తరిగొండా నృహరి హితుని నే నే మంటినే?
అలుక యేల చేసెనే? ॥ఉప పల్లవి॥

పదము లొత్తనంటినా? -నే-భక్తి సేయనంటినా?
ముదము మీఱ కెమ్మోవిని ముద్దుఁబెట్ట నంటినా?
॥అలుక॥ ౧

సురటి విసరనంటినా?-నే-సుమములు ముడువ
నంటినా?
అరుదైనా చందనము మేన నలఁదనోప నంటినా?
॥అలుక॥ ౨

పుప్పొడి చల్లానంటినా? విభూతి యలఁదా
నంటినా?
అప్పటప్పటికి బడలిక దీఱా నధరామృత
మీయనంటినా? ॥అలుక॥ 3

విడెము లియ్యానంటినా?-నే-వేడుకఁ జేయా
నంటినా?
కదలేని మోహమున -నే -బిగి కౌఁగిలియ్యా నంటినా?
॥అలుక॥ ౪

నీవే నా మేల్ చెలియవే! - మఱి - నీ వందేమి
వింటివే?
ఆ విధమెల్లా దెలుపావే! హరునీ నన్నూఁ గూర్పావే!
॥అలుక॥ ౫

**కుఱుచ జంపె**

చెలి:- ఏమి చెప్పుదునే? వో యమ్మా! యింకా
ఇందుశేఖరుఁడు నీ సొమ్మా? ౧

'రాను పొ'మ్మని పలికె నమ్మా! నిన్ను
రవ్వ చేసెనే! ముద్దుగుమ్మా! ౨

సవతివలలోఁ జిక్కెనమ్మా! నిన్ను
సరకు సేయకపోయె నమ్మా! 3

ఆ.వె. అదియుఁగాక రత్నహారంబు శివునకుఁ
దెచ్చి నారదముని యిచ్చినాఁడు;
హరుఁడు నిన్ను నెంచ కా రత్నహారంబు
నగజ కిచ్చినాఁడె నళిననేత్రి! 101

వ. అనిన విని జాహ్నవి చింతాక్రాంతయై, చెలుల
నందఱినిఁ జూచి యిట్లనుచున్నది: 102

**దరువు, ఎఱుకల కాంభోజిరాగము**

భామలారా! వో భామలారా! ॥పల్లవి॥

భామలార! వినరె! భావజాంతకుఁ డిపుడె
యా మగువ యిలుఁ జేరెనఁట! యేమి వింతే?
॥భామ॥ ౧

నవరత్నహారమును దానికే యిచ్చినను
విడనాడుటేమి కారణమో? ॥భామ॥ ౨

జంట యేమఱలేని సరసుఁ డీ వేళ, నా
యింటికే రానని హేతు వది యోమో?॥భామ॥ 3

అమర శ్రీ తరిగొండ - హరి సఖునిఁ జూడకను
నిమిష మిఁక మీఁదటను నే తాళలేనే ॥భామ॥ ४

క. చెప్పక తా నరిగిన పని
తప్పని నే నలుగు తఱినిఁ, దానే వాపైఁ
దప్పించి రాక నిలిచెను
తప్పక విరహాగ్ని యిపుడె దట్టంబయ్యెన్. 103

## ద్విపద

అనుచు జాహ్నవి పల్కె - నా క్షణంబునను
మనసిజుఁ డా యింతి - మర్మంబుఁ దెలిసి,

తలకొని యిది మంచి - తఱి యని లేచి,
యలఘు చంద్రుని సహా-యంబుఁ జేసికొని,

వెలయు కీరములఁ, గో-వెలలఁ, దుమ్మెదల
బలముగాఁ గొని, మంద - పవనుని తోడ,
జంటఁబాయక రతీ-సహితుఁడై చెలఁగి,
తుంట విల్ చేపట్టి, - తుద మీఱినట్టి

విరుల బాణంబులు - వేడ్కతోఁ బూని,
తెఱఁగొప్పఁగాఁ జిల్క-తేజిపై నెక్కి,

దుండగీఁడై దాడి - దుమికించుకొనుచు,
దండెత్తి వచ్చి మం-దాకిని మీఁద

వెఱవక బాణముల్ - వేయ, నయ్యింతి
తరళత్వమును బొంది - తాపంబుఁ జెంది,

సొక్కుచుఁ బలుమాఱు - సోలుచుఁ బిలిచి,
గ్రక్కున నందున్న - కాంతల కనియె:

తే.గీ:- ఏమి సేయుదు వే వింక భామలార?
ఇదిగొ! మారుఁడు వచ్చి నా యెదుట నిలిచి,
శరము లేయఁగ నవి నాదు నురమునందు
నాటి వీఁపునఁ దేలెనే! సూటిగాను. 104

## దరువు

ఓ యమ్మలారా! ఓ యమ్మా! అమ్మా!
ఓ యమ్మలారా! ॥ఓ యమ్మ॥పల్లవి॥ ౧

పూనిన యీ విరహానల మిప్పుడు
వానిఁ జూడకను మానదు గదరే! వోయమ్మ!
॥ఓ యమ్మ॥ ౨

అలఁదిన చందన మతి విరహాగ్నికి
ఫెళఫెళమని బలు పెట్లెను గదరే! ॥ఓ యమ్మ॥3

పొందగు జడపై మందారపు సరు
లందము లే కిటు కందెను గదరే! ॥ఓ యమ్మ॥ ౪

సరసపు ముత్యపు సరు లా వేఁడికి
హరినీలా కృతు లాయెను గదరే! ॥ఓ యమ్మ॥ ౫

కుటిలమునను తరిగొండ నృహరి సఖుఁ
డిటువలెఁ జేసే దెఱుఁగను గదరే! ॥ఓ యమ్మ॥౬

క. హరుఁడైతే రాఁడాయెను,
మరుఁడైతే బలముతోడ మార్కొనవచ్చెన్;
విరహానల కీలావళి
యురమున కెగఁబ్రాకె; మోహ ముబ్బర మయ్యెన్.
105

## దరువు, మధ్యమావతి రాగము

భామా! నే నేమి సేతునే? అమ్మలెల్ల! నే
నీ మోహ మెట్లు దాతునే? ॥పల్లవి॥

రామ! రామ! విధి నేమనవచ్చును?
వేమఱు మరునికి వెఱవఁగ వలసెను
॥భామా!॥ ఉపపల్లవి॥

విరహాగ్ని చాల మించెనే! మించినది పవనుఁ
డరసి నాపై రెట్టించేనే! మఱి మఱి విసరసాఁగెనే!
విసరఁగా నా మేను మదనాగ్నితోఁగ్రాఁగెనే!
ఉరువడిగా నిపు డరవిరి ములుకులు మెఱయుచు
కుచముల మీఁదనె నాటెను ॥భామా!॥ ౧

కలలైతే చాల హెచ్చెనే! హెచ్చినది చూచి
కలువల హితుఁడు వచ్చెనే! కళ లెల్ల విస్తరించెనే!
తా నుష్ణకరుని కన్నా వేఁడిమై మించెనే!
బలమున సాగెను ॥భామా!॥ ౨

నను చాలా విడనాడెనే! నవరత్న హార మొనరఁగ
దాని కిచ్చెనే! తన నీతి తానే మఱచెనే!
నిష్కారణముగా నాపై నేఁదలిగెనే!
గొనకొని మన తరిగొండ నృకేసరి ఘన సఖుఁడగు
శంకరు మది తెలిసెనే! ॥భామా!॥ 3

## ❀ మందాకిని మూర్ఛ ❀

### ద్విపద

ఇఁక నేమి సేతునో - యెలనాఁగలార?
సకలాత్ముఁ డీ రీతి - చలముఁ జేసికొని,

యగడు సేయఁ దలంచె; - నది మదిఁ గాంచి,
పగవారిఁ గూడి నన్ - పంచబాణుండు

బాధఁజేయుచు, సూన - బాణాగ్ని శిఖల
వేధింపుచున్నాఁడు - వెఱపింత లేక,

కటకటా! నను హేమ - గర్భుఁ డిద్ధాత్రి
నిటువలెఁ బుట్టించె - నేమి కారణమొ?

తనరారు నా చక్కఁ-దనమెల్ల నేఁడు
వన దుర్గ చంద్రికా - వైభవంబయ్యె;

నీ చక్కఁదన మేల? - యీ సొమ్ము లేల?
ఈ చీర లేల? నా - కీ భాగ్య మేల?

వానికిఁ గాని యౌ-వన మది యేల?
వానిఁ గూడని మహా - వైభవం బేల?'

అని యీ విధంబున-నాత్మ నాయకుని
మనమునఁ జింతించి, - మన్మథాస్త్రముల

ఘాతకు నొచ్చి, య-క్కడఁ దాళలేక
'భూతేశ్వరా!' యని - పుడమిపై వ్రాలఁ,

దలఁపులు మఱచి, యం-తటఁ - దన్ను మఱచి,
జలజాతనేత్రి మూ-ర్ఛాక్రాంత యయ్యె.

వ. ఆ సమయంబునఁ జెలులు తమలోఁ దాము
ఇట్లనుచున్నారు: 106

సీ. 'తరుణికి మదన భూతము సోఁకె; నిఁక శివ
పంచాక్షరినిఁ బఠియించరమ్మ!
పాలుపొందఁగా మంచి పుష్పాడి మంత్రించి
సరసీరుహాక్షిపైఁ జల్లరమ్మ!
ఘనమైన కస్తూరిఁ గావుబొట్టుగఁ జేసి,
తీరుగా నుదుటిపై దిద్దరమ్మ!
మణుల తాయెతులకు మంచి ధూపము వేసి,
కలకంఠి సందిటఁ గట్టరమ్మ!'

తే.గీ. అనుచు నింతులు భూతవైద్యములు సేయఁ,
దరుణి జాహ్నవి మఱికొంత తడవునకును
తెలివిఁ దెచ్చుక కన్నులు తెఱచి, శివునిఁ
కలువరింపుచుఁ బలికె నుత్కంఠమీఱ. 107

## జంపె

హెచ్చైన మోహమున నిందుశేఖరుఁ డిపుడు
మచ్చికను ననుఁ గూడ వచ్చె నతఁ డేఁడే? ౧

హరిణాక్షులారా! యిప్పు డలనాఁటి కూరిమిని
ఉరగభూషణుఁ డిచట నుండు నతఁడేఁడే? ౨

ఎలమితో శివుని మగుడేల పోనిచ్చితిరి?
వెలఁతలారా! యిందె నిలుపరాదఁటరే? 3

## ❋ తామసి మరల హరునిఁ బిలుచుట ❋

క. అన విని తామసి యిట్లనె:
ననువొందఁగ మాయదారి యగు హరుఁ బిలువన్
ననుఁ బంపుము శీఘ్రంబుగ
వనితామణి! మగుడిఁ బిల్చి వచ్చెదఁ బ్రీతిన్. 108

వ. అని సెలవు గైకొని కాత్యాయనీ మందిరంబు
నకుఁ బోయి,పరమేశ్వరునిఁ జూచి యిట్లనుచున్నది:
109

శా. ఏరా? శ్రీపరమేశ! వేడ్కలరఁగా నీ శాంభవిం గూడి, నీ
వా రామన్ మది నెంచకున్న వదె రా! యా యింతి తప్పేమిరా?
నారీరత్నము నిన్ను నమ్మినదిరా! న్యాయంబుగాఁ జూడరా!
రారా! జహ్నుతనూజ నేలుకొనరా! రక్షింపరా! శంకరా!
110

వ. అనిన విని యంధకాసుర భంజనుం డా చెలితో
నిట్లనుచున్నాఁడు: 111

తే.గీ. చెలియ! జాహ్నవి యిటు నన్నుఁ బిలువమనిన
సారెసారెకుఁ బిలుతురా? చనువుగాను,
కొమ్మ పర్వతపుత్రి బల్ కోపగత్తె
ఇందు రాకువె! నీవు; నే నందు రాను. 112

ద్విపద

అన విని యా చెలి - హరున కిట్లనియె:
పని(బూని దేవ! మా - పద్మలోచనను

పలుమాఱు విడనాడ( - బాటిగా దిపుడు,
కలకంఠి సౌందర్య - ఖని యదెట్లనిన:

సరసీరుహంబులు - సఖియ పాదములు
మరుని కాహళిక ల-మ్మగువ జంఘలును,

ఉరుదంతి కరములౌ-నువిద పెందొడలు,
ధరణిని హసియింప(-దగు నితంబంబు,

అర(టిసుడిని నవ్వు-నటువంటి నాభి,
కరివైరి నదలింప( - గలది మధ్యంబు,

వరుస చీమలబారు- వనిత నూ(గారు,
మెఱు(గు బంగరు గిండ్లు - మెల(త పాలిండ్లు,

కిసలయముల కాంతి( - గేలించు కరము,
లసమాన శంఖంబు - నదలించు గళము,

తలుకు లీనెడు వజ్ర-తతి దంతపంక్తి,
వెలయ( దేనియ బావి - వెల(ది కెమ్మోవి,

పండు సంపె(గ మొగ్గ - భామ నాసికము,
గండుమీనుల మీఱు - కనుదోయి తీరు,

విరివింటి కోపులు - వింత కన్బొమలు,
మురువొప్పు శ్రీకార - ముల( బోలు చెవులు,

చంద్రబింబము నోము - జాహ్నవి మోము,
సాంద్ర మిళిందముల్ - సతి శిరోజములు,

అటువంటి రామ నా-తారడిఁ జేసి,
విటలాక్షి! యిందుండ - నీకు న్యాయంబు

గాదు; వేగమె లెమ్ము! - కనికరం బొదవఁ
బోదాము రావయ్య! - భువనైక వంద్య!

వ. అనిన విని పరమేశ్వరుం డిట్లనుచున్నాఁడు: 113

చ. చెలియరో! నీవు నన్నిటులఁ జీటికి మాటికిఁ
బిల్వనేల? నీ
తులు దగఁ జెప్పనేల? విను తొల్లి యెఱుంగనె?
దాని రూప మిం
దలరఁగ నేఁడు నూతన మహత్త్వముఁ గల్పన చేసి
తెల్పఁగా
వలసినదేమి? చాలు నిఁక వారిజలోచన! వేగఁ బోఁ
గదే! 114

వ. అనిన విని చెలి దిగ్గున లేచి, జాహ్నవినిఁ
జేరరాఁగా, జాహ్నవి యిట్లనుచున్నది: 115

## దరువు

ఏమనెనే? శివుఁ డేమనెనే? ॥పల్లవి॥

ఏమనె నీతో సోమ కిరీటుఁడు?
వామాక్షి! యిటు వచ్చెద ననెనో?
ఏమనెనే? శివుఁడేమనెనే? ॥ఉప పల్లవి॥

జలజనయన! నా సామిని రమ్మని
పిలిచిన నీతో పలికెనా? లేదో? ॥ఏమనెనే?॥ ౧

కుందరదన! వాని ముందఱ నిలిచిన
సుందరి! నీ దెసఁ జూచెనా? లేదో? ॥ఏమనెనే?॥ ౨

అతులిత తరిగొండాధిపు వర పక్షుఁ
డతివ! నాదు కుశలం బడిగెనా? లేదో?
॥ఏమనెనే?॥3

**జంపె**

చెలి:- మానినీమణి! శివుని నేనెంత పిలిచినను
'రాను పొ'మ్మను మాట మానఁ డో యమ్మా! ౧

ఇందీవరాక్షి! నన్నందు రావద్దనియె;
నిందుశేఖరుఁడు తా నిందు రాననియెన్. ౨

నా మాటలకు రాఁడు నళినాక్షి! నీ విభుఁడు
ప్రేమ మీఱఁగ నీవె పిలువవలె నమ్మా! 3

వ. అనిన విని మందాకిని రోషావేశంబునఁ జెలుల
నందఱినిం జూచి, యిట్లనుచున్నది: 116

**దరువు, ఆహిరి రాగము, అట తాళము**

దానింటికి లోఁగి యిపుడూ
నేనే పోయి పిలువావలెనే? భామలారా!
॥దానింటికి॥ ౧

ఇంతదాన నైతీఁ గాని, వే నీ దీనత్వ
మెన్నఁ డెఱుఁగనే! భామలారా! ॥దానింటికి॥౨

వే వానిఁ బిల్వక నిలిచి సాధించేనంటే, అయ్యో!
భావజుఁడు పాపాత్ముఁడు నా పద్దు చెల్లనియ్యఁడు
గదరే! భామలారా! ॥దానింటికి॥ 3

మంచిదైతే కాని, దీన కొంచెము గాదే మన పద్దు;
రోష,
మెంచక తరిగొండ నృహరి హితుఁ బిల్చి వత్తాము
పదరే! భామలారా॥దానింటికి॥

వ. అని గుణగ్రహించుకొని, చెలుల నందఱినిఁ దోడ్కొని, కాత్యాయనీ మందిరంబునకుఁ బోయి, మందాకిని యిందుశేఖరునిఁ జూచి యిట్లనుచున్నది: 117

## ❀గంగాదేవి స్వయముగా నేఁగి హరునిఁ బిల్చుట❀

### చూర్ణిక

గంగా:- శ్రీమదఖిల చరాచర ప్రపంచ సర్గ స్థితి సంహార హేతుభూత మూల ప్రధాన తత్త్వాతీత పరిపూర్ణ స్వయంప్రకాశం, శుభ్ర శరదభ్ర సంకాశం. ౧

సకలాగమోక్త మంత్ర లయ హఠామనస్కాభ్యాస యోగీశ్వర బృంద హృదయారవింద రోలంబం, విమల భక్తజనావలంబం. ౨

చతుర్దళ, షడ్దళ, దశార, ద్వాదశార, షోడశార, ద్విపత్రాది షడ్వనజోపరి సహస్రార కమల కర్ణికాంతర విహారం, సచ్చిదానంద సారం. 3

అఖండల ప్రముఖ సుధాశన సమూహ వర మస్తకాలంకృత కనక రత్న స్థగిత కిరీట సంఘట్టితాంఘ్రి సరోజ యుగళం, ఫణిరాజ హారావృత గళం. ४

పటు భయంకర రజ స్తమోగుణ ప్రేరితాహంకార దంభ దర్పాద్యనేక దుర్వికార కలిత హృదయాంధకాసుర

శుండాల దైత్యముఖ్య లోకకంటక నిశాట జైత్రం,
తరిగొండ నరసింహ మిత్రం భజేఽహం, భజేఽహం,
భజేఽహమ్. ౫

క. వందన మిందుకళాధర!
వందన మహిరాజ భరణ! వర సుగుణ గణా!
వందన మసుర విదారణ!
వందన మనిమిష మునీంద్ర వందిత చరణా! 118

వర:-క. ఆశీర్వాదమె జాహ్నవి!
యాశీర్వాదంబె సుందరాంగి! సదా నీ
కాశీర్వాదమె గుణవతి!
యాశీర్వాదంబె గంగ! యఘచయ భంగా! 119

గంగా:-క. ఇంతగ నాశీర్వాదం
బంతఃకరణమునఁ జేసినందున మదిలో
సంతోష మొదవియున్నది;
వింతాయెను లేచి రార! విశ్వేశ! హరా! 120

వర:-క. వందనము నీవు చేసిన
చందముఁ గనినపుడె నాకు సంతసమొవెన్;
సుందరి! నీ వగమాటల
పొందెఱుఁగుదుఁ గాని, రాను పో! జహ్నుసుతా! 121

## దరువు, ఆది తాళము

గంగా:- రారా! భుజగరాజ హారా!
రారా! సర్వభూతాధారా!
రారా! భావజ విదార!
రారా! శంకరా! ॥రారా!॥ ౧

రారా! నేనూ నీకూ మ్రొక్కేరా!
రంతు లేలా చేసేవు రా?
సారె కెవరైనా నవ్వరా?
రారా! చంద్రశేఖరా! ॥రారా!॥ ౨

అక్కడ నన్నూ బొంకించీ
ఇక్కడికి వచ్చినావూ;
చక్కనీ తగువాయె లేరా!
రారా! చంద్రశేఖరా! ॥రారా!॥ 3

పలుమాఱు నా చెలియవచ్చి,
ప్రార్థించి పిలిచినా రాక
చలము సాధించే వేలరా?
రారా! చంద్రశేఖరా! ॥రారా!॥ ౪

అనఘ తరిగొండ హరికీ
ఆప్తుఁడవై యుండి, నన్ను
చనువున నేలని దేరా?
రారా! చంద్రశేఖరా! ॥రారా!॥ ౫

గంగా:-ఉ. చక్కని సామి! మారు శరజాలము మించెను; రార! శంకరా!

వర:- చక్కెరబొమ్మ! యీ వగలు చాలును; నీ విఁకఁ బోవె జాహ్నవీ!

గంగా:- ఎక్కడ వచ్చె నీ గుణము? లెవ్వతె నేర్పెర? చంద్రశేఖరా!

వర:- మక్కువ మించె; నీ కులుకు మాటలు చాలిఁకఁ బోవె జాహ్నవీ!122

## సంవాద దరువు

గంగా:- ఇంతగా నీ ద్వేషాము నీకేల పుట్టెరా? నీ కీ ద్వేషా
మేల పుట్టేరా?

వర:- హొంతకారి! ద్వేషములే; దూరక పోవే! ౧

గంగా:- అయ్యయ్యో! నన్నిట్లా విడనాడే దేలరా?
ఇట్లా విడనాడే దేలరా?

వర:- కుయ్యో! మొఱ్ఱో! యని నీ విందు కుయ్యక పోవే!
౨

గంగా:- నిన్నూ నే నేమన్నారా? నా నేరమేమిరా?
స్వామీ! నాలో నేరమేమి రా?

వర:- చిన్నెలాఁడి! నీ నేరాముఁ జెప్పాను పోవే! 3

గంగా:- తరిగొండా హరితోడే! నా తప్పుఁ జెప్పరా!
స్వామీ! నా తప్పుఁ జెప్పరా!

వర:- పెరిమ నా మిత్రుని యానఁ బెట్టక పోవే! ४

## సంవాద దరువు

గంగా:- రారా! శివ! నీకూ మ్రొక్కే రారా! ॥పల్లవి॥

ఎమ్మెమీఱ కీరమ్ముల రొద లధి
కమ్మాయెను, విరహమ్ము మించె; నిఁక॥రారా!॥ ౧

వర:- రానే! మందాకిని! నే రానే! ॥పల్లవి॥

పలుకుల చిలుకల కళుకుచు బెళుకుచు
కులుకుచు నెంతగ తళుకులు చూపిన॥రానే!॥ ౨

గంగా:- నెమ్మది నిది సమయమ్మని చుట్టును
క్రమ్మి కోవెలలు గుమ్మనఁ గూసెను ॥రారా!॥ 3

వర:- ప్రకటములగు పటు పికములు గూయఁగ
కకవికలై తకముక పడి పిలిచిన ॥రానే!॥ ౪

గంగా:- ఝుమ్ము ఝుమ్మమని తుమ్మెదల్ మొఱయ ము
దమ్మున మరుఁడు శరమ్ముల ఱిమ్మెను॥రారా!॥ ౫

వర:- సారె కళుల ఝుంకారంబులు, నల
మారుని శరములు క్రూరములైనను ॥రానే!॥ ౬

గంగా:- కలువల దొరయును, మలయానిలుఁ డిపు
డల మదనునికి సహాయముఁ జేసిరి ॥రారా!॥ ౭

వర:- తరిగొండాధీశ్వరుఁడగు వేంకట
గిరివర సుత! నను మఱి మఱి పిలువకు!॥రానే!॥ ౮

గంగా:-
ఉ. ఏలర! యీ చలంబు? మన యింటికి రమ్మిఁకఁ
జంద్రశేఖరా!
వర:- ఓ లలనాలలామ! యిపు డూరక పిల్వక పోవె
జాహ్నవీ!

గంగా:- పాలనసేయు నన్ను మరు బారినిఁ ద్రోయకు!
చంద్రశేఖరా!
వర:- చాలునె! నీదు పొం, దిచట శాంభవి యున్నది పోవె!
జాహ్నవీ! 123

## సంవాద దరువు

గంగా:- రమ్మని పిలిచితే రావదేరా? నీవు రావదేరా?
ఎమ్మెల నా సవతే యెక్కువంటరా? నీకు ఎక్కువం
టరా? ౧

వర:- ఇరవొంద గిరిజాత యెక్కువేనే! నా కెక్కువేనే!
తరళలోచన! నీవు తక్కువేనే! నాకు తక్కువేనే! ౨

గంగా:- జగదీశ! నామీఁద చలమేలా? నీకు చలమేలా?
పగదానవా? నేను భవ్యశీలా? నీకు పగదానవా? ౩

వర:- మానినీమణి! నీవు పగదానవేనే! నాకు పగదానవేనే!
కాన నీ యింటికీ నేను రానే! నేను రానే! ౪

గంగా:- వేమాఱు రమ్మంటె వినవేరా? నీవు వినవేరా?
కోమలాంగా! నీకు కోపమేరా? నాపై కోపమేరా?౫

వర:- కొమ్మ! నీపై నాకు కోపమేనే! నాకు కోపమేనే!
నెమ్మదితో నందు నేను రానే! ఇంక నేను రానే! ౬

గంగా:- జటధారి! నేనంటె సైఁపవేరా? నీవు సైఁపవేరా? కట
కటా! ఎఁజేయు కర్మమేరా? ౭

వర:- తెఱవా! నీ కర్మము తెలియవలదే! నాకుఁ
దెలియవలదే! సరవీ నీతో పొందు సైఁపలేదే! నాకు
సైఁపలేదే! ౮

గంగా:- మనసిజాంతక! పరమ పవిత్రా! చనువీరా! తరిగొండా
చక్రిమిత్రా! నాకు చనువీరా! తరిగొండా చక్రిమిత్రా!
౯

గంగా:-ఉ. నిన్నను పూలపానుపున నిద్దురఁజెందుచు నర్ధరాత్రి నేఁ
గన్న కలందు నీవు ననుఁ గౌఁగిటఁ జేర్చిన రీతి నుండెరా!
కన్నుల విప్పి నిన్నచటఁ గానక వేదన చాలఁ బొందితిన్;
చెన్నలరంగ నీవపుడు చెప్పక వచ్చితి చంద్రశేఖరా!
124

వర:-చ. కలికి మిటారి! నీవు కలఁగంటి నటంటివి; నీవు గన్నయా
కలకు ఫలంబుఁ జెప్పెదను కామిని! నన్ గవగూడినట్లుగా
కలఁగను రీతి మేలుకొను కాలమునందు ఘటింపనేరవే?
నెలవుగ నాదు కౌఁగిటికి నీ కడియాస లిఁకేల జాహ్నవీ?
125

## సంవాద దరువు

గంగా:- రారా! సామీ! నేరమేమీ?
ఏరా! ధీరా! మారుశర ధారల కే నోరువలేనురా!
॥రారా!॥ ౧

వర:- రాను పోవే! రాను పోవే!
నారీమణి! మారుఁడు నిన్నారూఢినిఁ బోరాడుఁగాని
॥రాను॥ ౨

గంగా:- తమిమీఱెరా! తాళలేనురా!
సమయమురా! చలమేల రా? ॥రారా!॥ 3

వర:- తమకము నీ కమితమని
భ్రమసెదనని భావించినావు ॥రాను॥ ౪

గంగా:- గంటిరి మాటంటివి; ము
క్కంటి! నిన్నేమంటిర? నేను ॥రారా!॥ ౫

వర:- దంటవు, నీ వంటిదాని
నంటను, నీ వెంట రానిఁక ॥రాను॥ ౬

గంగా:- కరుణించరా! శ్రీ తరిగొండ
నరహరి మిత్రా! నమ్మితి నిన్ను ॥రారా!॥ ౭

## * సీస దరువులు (సీసార్ధములు)

వర:-

సీసము. వినవె! భాగీరథి! వేమాఱు నాతోడ
నెనసిన మాట లింకేల నీకు?
వనజాక్షి! నీ వెన్ని వగలు చేసినఁ గాని
మనసు నీపై లేదు మచ్చెకంటి!
గొనకొని గిరిజాత కోపముఁ జేసీని

దరువు. నను నీవు పిలువరాకువే! మందాకిని!
నను నీవు పిలువరాకువే! సుందరీమణి! ॥నను॥

నాతోను చనవు మాటాడఁబోకువే!
నాతోను నేఁడు చనవు మాటాడఁబోకువే! ॥నను॥ ౧

---

* సీస దరువులో మొదట రెండున్నర సీస పాదములుండును. మూడవ పాదము యొక్క పూర్వార్ధమును అనుసంధించి దరువు ప్రారంభమగును. 'సీసదరువు'కు 'సీసార్ధ'మని మఱియొక పేరు. గేయ ప్రధానములైన యక్షగానములలో రచయితలు వైవిధ్యము నిమిత్తము ఆయా సన్నివేశములకు అనుగుణముగా-ముఖ్యముగా సంవాద ఘట్టములయందు - ఇటువంటి 'గేయార్ధముల'ను నెలకొల్పుదురు. వెంగమాంబా కవయిత్రి అటువంటి అనుభవజ్ఞులైన రచయితలలో అగ్రగణ్యురాలని సమృద్ధమయిన ఇందలి గేయ సంపద చక్కగా చాటుతున్నది.

గంగా:-

సీసము.. ఏమి సేయుదుర? నిన్నెడఁ బాసినది మొదల్
నిదుర కంటికి రాదు నీలకంఠ!
విడెము నోటికి మహావిషముగాఁ గనిపించు,
విరుల పానుపు బలువేఁడి తోఁచు;
నను రవ్వసేయక నగుచు నా యింటికి

దరువు. రారా! యీ చలమేలనూ? సద్గుణ హారా!
రారా! యీ చలమేలనూ? జగదేకవీరా! ॥రారా!॥
నాతోను లేని పోరాట మిఁక నేలనూ?
జలధి గంభీరా! నాతోను పోరాట మిఁక
నేలనూ? ॥రారా!॥ ౨

వర:-

సీసము. నాచెంత నిల్వకే! నటనంబు సల్పకే!
కనులఁ దేలించకే! కంబుకంఠి!
చిన్నెలు సేయకే! చేతులు ద్రిప్పకే!
పలుమాఱు గుల్కకే! పద్మగంధి!
మాటలు పన్నకే! మదిఁ గరఁగించకే!

దరువు. నీ యింటి కేను రాలేదే! రాకేందువదనా!
రాజీవనయనా! నీ యింటి కేను రాలేదే!
॥నీయింటి॥

రామాలలామా! నీ యింటి కేను రాలేదే!
నీ మీఁది ప్రేమ నెలఁత! లేశమ్మైన లేదే!
॥నీయింటి॥ 3

గంగా:-

సీసము. అయ్యయో! తేమాన మాస మూలమునకే
మోసమన్నట్లుల( జేసినావు;
చెల(గి బూరుగు మ్రాన( జిలుక పొంచిన చంద
మాయె నా విధమెల్ల నాత్మనాథ!
మ్రొక్క(బోయిన గుడి మొనసి పై(బడినంత

దరువు. సంతోష మాయె( గదరా! మితిమీఱినట్టి
సంతోషమాయె( గదరా! ॥సంతోష॥
తరిగొండా హరిహిత!
చింతా పరిహార మాయె( గదరా! ॥సంతోష॥ ౪

వర:-ఆ.వె. ఆటకత్తె కరణి నళుకింతయును లేక
శిరము, కనులు, కరము లరుదుగాను
ద్రిప్పి యభినయించి మెప్పుగా( బిలిచెద;
వేను రాను పోవె! మీననయన! 126

గంగా:-క. పోపొమ్మని పలుమాటికి
నీ పార్వతి( జూడ, నన్ను నెంచక మదిలో(
గోపించి మాటలాడిన(
బాపము రాద(టర! నీకు ఫణిరాజధరా? 127

వర:-క. నా పేరు నొడివినప్పుడె
పాపము చెడునంచు వేద పంక్తులు పలుకున్;
పాపము నన్నెటు పొందును?
నీ పుణ్యము చాలు( బోవె! నీరజనేత్రీ! 128

గంగా:-క. నను( బొమ్మని మొగమోటం
బనఘా! లేశంబు లేక, యద్రి తనూజన్
ఘనముగ( గూడిన, నీ కం
దున వచ్చును పక్షపాత దోషంబు శివా! 129

వర:-క. అనలము సాక్షిగ( బార్వతి
నెనసితి నటుగాన దాని నెడ(బాసిన, నీ
వనినట్టి దోష మొదవును;
నిను విడిచిన దోష మంటనేరదు పోవే! 130

గంగా:-సీ. హర! నీవు మును బ్రహ్మహత్య తామసు(డవై
చేసియుండిన గుట్టు( జెప్పవలెనా?
చిఱుతొండభక్తుని( జేరి శిశువు హత్య(
జేసి యుండిన గుట్టు జెప్పవలెనా?
వాదించి నిమ్మవ్వచే దెబ్బపడి, దాని
చేత( జిక్కిన గుట్టు( జెప్పవలెనా?
బలు బోయ వాని యెంగిలి నీళ్లతో( దృప్తి(
జెందియుండిన గుట్టు( జెప్పవలెనా?

తే.గీ. నన్ను నేలెదవో? లేక నిన్ను నింద
సేతునో? తెల్పరా! యిది సిద్ధముగను
నిఖిల ముని గణ నుతిపాత్ర! నిటలనేత్ర!
ప్రకట తరిగొండ హరిమిత్ర! పంచవక్త్ర! 131

వర:-సీ. పంచాననుండైన బ్రహ్మదేవుని( జతుర్
ముఖుని( జేసిన దాన ముప్పు గలదె?
జను లెన్న సిరియాళు( జంపించి బ్రతికించి,
భక్తుని( బ్రోచుట పాపమటవె?

నిమ్మవ్వ భక్తికి నేఁజిక్కి, దానిచేఁ
గొట్టఁబడిన, శక్తి కొంచె మఁటవె?
కన్నప్ప భక్తికిఁ గడుమెచ్చి వానిచే
తను పూజఁ గొన్నది తక్కువఁటవె?

తే.గీ. నిన్ను నే నేలకుండిన నన్ను నింద
చేతునన్నను వెఱతునా చిన్నెలాఁడి?
కలికి! తరిగొండ హరిపుత్రి! కమలనేత్రి!
కచ్చె లిఁక మాని పోవె! గంగా భవాని! 132

గంగా:-సీ. భల్లాళ రాయని భామాలలామను
జెనకఁబోయిన గుట్టుఁ జెప్పవలెనా?
ఈడిగచెలిఁ గూడ నేఁగి, కల్ కడవలోఁ
జెఱియున్న నీ గుట్టుఁ జెప్పవలెనా?
మొదట సన్న్యాసివై తుద గృహస్థుఁడవైన
సిగ్గుపా టిపుడు నేఁ జెప్పవలెనా?
కోఁతినిఁ గవగూడి కొడుకును గన్న నీ
చిన్నతనంబు నేఁ జెప్పవలెనా?

తే.గీ. నీవు నన్నేలెదవొ? లేదొ? నిజముఁ దెలుపు!
మొనసి రానన్న నీ సిగ్గుఁగొనక పోను;
నిఖిల మునిగణ నుతిపాత్ర! నిటలనేత్ర!
ప్రకట తరిగొండ హరిమిత్ర! పంచవక్త్ర! 133

వర:-సీ. భల్లాళరాయని భామ పాతివ్రత్య
గుణము మెచ్చుట నాకుఁ గుఱుచఁదనమె?
ఉరుసుధాభాండమం దుదయించి మహిమ నేఁ
జూపితి నది నాకుఁ జులుకఁదనమె?

సంన్యాసి వేషంబు జగతి నొక్కెడ నుంచి,
నే గృహస్థుఁడనైన నీచ మగునె?
కడు వేడ్కఁ గపులమై కవగూడి కపికులో
త్తమునిఁ గాంచిన పని తగని దేమె?

తే.గీ. నన్ను నిందించితివి గదా! నిన్ను నేను
మగుడి నిందింప లేనఁటే మాయలాఁడి?
కలికి! తరిగొండ హరిపుత్రి! కమలనేత్రి!
కచ్చె లిఁక మాని పోవె! గంగాభవాని! 134

గంగా:-
సీ. తేరకు నన్ను నిందింతు నంటివి నీవు
చెప్పరా! నా మీఁది తప్పు లిపుడు;
మది నెంచి నన్నెంతో బెదరింప వచ్చేవు
చెప్పరా! నామీఁది తప్పు లిపుడు;
దంభంబుతో నీవు గుంభంబుఁ జేసేవు
చెప్పరా! నామీఁది తప్పు లిపుడు;
స్వంతంపు టిల్లాలు సంతోషపడుఁ గాని
చెప్పరా! నామీఁది తప్పు లిపుడు;

తే.గీ. నీవు నిందకుఁ బ్రతి నింద నేఁడు వెదకి,
చెప్పినను జాలుఁ! గలి మాట కొప్పు గలదె?
నిఖిల మునిగణ నుతిపాత్ర! నిటలనేత్ర!
ప్రకట తరిగొండ హరిమిత్ర! పంచవక్త్ర! 135

వర:-సీ. నీ మీఁది తప్పులు నే నేమి యెఱుఁగుదు?
రమణి! శంతన మహారాజు కెఱుక;
నిరుపమానములైన నీ విహారంబులు
ఘనుఁడైన యా సముద్రునకు నెఱుక;

నాతి! నీ ప్రియములు నడివీథులందు ని
న్నారూఢిగాఁ బాడువారి కెఱుక;
సొంపుతో నెత్తెక్కి సొడ్ల వేయుచునుండు
నడవ డిప్పుడు కొంత నాకు నెఱుక;

తే.గీ. కాన మనసుకు మనసు తార్కాణ గాదె?
విప్పి పార్వతి వినఁగ నేఁ జెప్పవలెనె?
కలికి! తరిగొండ హరిపుత్రి! కమల నేత్రి!
కచ్చె లాడక పోవె! గంగాభవాని! 136

## దరువు

గంగా:- ఎంతమాట యంటివి రా?
ఇంత నిర్దయూఁడా వేరా? ॥పల్లవి॥

శంతనూఁడూ నీ యంశేరా!
జారమాత్రూఁడూ గాఁడూరా! ॥ఉపపల్లవి॥

నీకూ సాగరూఁ డన్యూఁడా?
నీ యంశాభూతూఁడూ గాఁడా?
నాకూ నేరమేమీ చూడా?
నగ సుతా నవ్వా నిక్కాడా ॥ఎంత॥ ౧

సరవీ పామరూలూ వినీ
సంతసింతూరు గాకానీ
పరఁగా తోఁచినట్లూ
పూని పాడితే నా కిష్టామానీ ॥ఎంత॥ ౨

తారిగొండా నారహరీ
తనయానై సౌఖ్యముఁ గోరీ
ఇరవుగా నీ శిరముఁ జేరీ
యే నుండుటకూ వేసారీ ॥ఎంత॥ 3

## ద్విపద

'మంచిది నాథ! యి-మ్మాడ్కి నన్నిప్పు
డెంచవైతివి గదా! - యే మందు నిన్ను?

కుల గోత్రములు లేని - కుటిలుండ వీవు;
తలిదండ్రులే లేని - తపసివి నీవు;

కూడు లేక విషంబుఁ - గొని మ్రింగినావు;
కోడె పాములఁ దాల్చి - కులుకుచున్నావు;

బట్ట లేకనె తోలు - పైఁ గప్పినావు;
గుట్టుగా నిగమాద్రి - గుహఁ జేరినావు;

దొరకొని బిచ్చమె-త్తుచు నుంటి వీవు;
పరఁగ దిక్కే లేని - పరదేశి వీవు;

కటకట! నిన్ననఁ - గారణం బేమి?
నిటలాక్ష! యిఁక నాకు - నీ సఖ్య మేమి?

పొమ్మంటి విఁక నేను - పోయెదఁ గాని,
నెమ్మదితో నుండు - నీ వింకమీఁద;

నే లేక యుండిన - నిఖిల లోకంబు
లే లాగు ప్రోచెద? - విది విచారించు!'

మనుచు జాహ్నవి పల్క,- నా మాటలన్ని
విని నీలకంఠుఁ డా-వెలఁది కిట్లనియె:

## ద్విపద

వర:- హరిణాక్షి! పరమాత్మ-నైన నా కిలను
మురువుగాఁ గుల గోత్ర-ములు రెండు గలవె?

పొలుపొందఁగా స్వయం-భువునైన నాకుఁ
దలఁచి చూచినఁ దల్లి-దండ్రులు గలరె?

చెలఁగి లోకములు ర-క్షింప విషంబు
గళమందు నిల్పు టాఁ-కలిచేత నఁటవె?

మురిసి శిరో రత్న-ముల వెల్గు ఫణుల
ధరియింతు; నవి స్వల్ప - దందశూకములె?

వలనొప్ప వారణ, - వ్యాఘ్ర చర్మముల
గెలిచి తాల్చితిఁ గాని, - సిరి నాకు కొదవె?

గురుఁడనై నిగమాద్రి - గుహ నన్నిటికినిఁ
బరుఁడనై నే నుండు - పని తక్కువఁటవె?

వరుసగా జనులఁ బా-వనులఁ జేయుటకు
దిరిపమెత్తుట నాకు - దీనత్వ మటవె?

అరగు సఁ కేశకి ది-క్కై సంతతంబుఁ
బరమాంబరము నుస్నఁ - బరదేశి నఁటవె?

నీవు లేకుండిన - నేను నాయూయి
జీవకోటులను ర-క్షింపలేనఁటవె?

ఈ తీరుగా నన-నేల? మా మహిమ
నీ తండ్రి తరిగొండ - నిలయుఁడే యెఱుఁగు;

వెలయఁగా మా రీతి-నీ కేమి దెలియు?
గలహింప కటు పోవె! - గంగాభవాని!

గంగా:-సీ. సలలిత లావణ్య సరసిలో ముంచక
నీ మీఁది క్రోధంబు నిలువదోరి!
బాహువల్లుల చేత బంధించిననుగాని
నీ మీఁది క్రోధంబు నిలువదోరి!
బటువు బంగరు గిండ్లఁ బడఁ గ్రుమ్మిననుగాని
నీ మీఁది క్రోధంబు నిలువదోరి!
రహిమిఱ నీ కళారసముఁ గ్రోలినఁగాని
నీ మీఁది క్రోధంబు నిలువదోరి!

తే.గీ. ఇదిగొ! నా మోహ కాలాహి యేపు రేగి,
బహుమదోన్మత్తతను మించి, ప్రతిఘటించి,
నాలుకలు గ్రోయుచున్న; దెన్నఁటికి నైన
నిన్నుఁ బట్టక విడుచునా నీలకంఠ? 137

వర:-తే.గీ. ఇట్టి నీ మోహకాలాహి పట్టినపుడు
నళికి పోవను; నినుఁ బరాగ్రాగ్రహమునఁ
బట్టుగాఁ జిక్కఁబట్టి, నా బాహులతలఁ
గట్టివేయక పోను గంగాభవాని! 138

వ. అనిన విని జాహ్నవి కోపాటోపంబున
శాంభవినిఁ జూచి యిట్లనుచున్నది: 139

గంగా:- అక్క! నీ వెంత హొంతకారివే?
బల్ మిటారివే! నా
చక్కని విభునికి ఎక్కడ దాపురమైతివే?
ఏడ సవతివే? నా
మక్కువ లన్నీ యిక్కడ నీశుఁడు మఱచెనూ,
నిన్నే వలచెనూ; వాఁడిచ్చిన మాట

వక్కటి నిజము కాదాయె, నిజము లేదాయె.
॥నీ మహిమ లెంతెంత? కామినీమణి! జగన్మోహినీ!
గజగామినీ!॥ ౧

పార్వతి:- ఏమే జాహ్నవి! తప్పు లెంచేవు? బెదరించేవూ?
నీవు బెదరించితేమైన నే సడ్డసేతునా?
మోముఁ జూతునా?
నీ వొక్క మాటంటె నే మించి పది మాట
లందునే? యేల విందునే?
నీవు పతి నన్నమాట లీ మీఁద నే మఱచే నఁటే?
రా నిచ్చేనఁటే? ఇంక
॥శివునిఁ బిలువక సిగ్గుతో మెల్లఁగా జరుగవే!
యింటి కరుగవే!॥ ౨

గంగా:- గడియకే నీ కింత గర్వమా? ఇంత శౌర్యమా?
ఓ నగజాత! నీవూ
కడచితివా? శివుఁడు సతమటే? యిదే మతమఁటే?
నన్ను ప్రాణేశుఁ డింకా
ఎడలేని ప్రేమను కూడఁడా? నిన్నూ వీడఁడా?
నీ కింతలో యింతా
మెడ బిగు వతిశయ మాయెనా? తబ్బిబ్బాయెనా?
॥మంచిదైతే కానీవే! కామినీమణి! జగన్మోహినీ!
గజగామినీ!॥ 3

పార్వతి:- కలికి పలుకులు గంగ పలుకకే! యిట్లు కులుకకే!
నా స్వామిని నీవు
కలహించి పిలుచుట వింటినే? పదరకుంటినే!
నేను పదరితే లేచి

చలమున నీ కొంగు పట్టనా? నలియఁగొట్టనా?
పోని మన కేల వట్టి
కలహమనుచు తెలుసుకొంటినే? తాళియుంటినే!
ఇంక
॥శివుని బిలువక సిగ్గుతో మెల్లఁగా జరుగవే!
యింటి కరుగవే! ॥ ౪

గంగా:- పాటించి తరిగొండ వాసునీ జగదీశునీ ప్రాణ సఖుఁ
డైన
జటాజూటునీ సొక్కించే చందమూ నీ యందమూ
ఈ ఫణిధరు చెంత నీవు చేసే మాయాలూ చూపే
హొయలు నేఁడు చూచీ మదిని
బోఁటి! నేనే మనుకొందునే? యెట్ల వుందునే?
నీ వెంత బిత్తరివే? కామినీ మణి! జగన్మోహినీ!
గజగామినీ! ॥ ౫

పార్వతి:- నను౯ చూడఁజాలని సుద్దులు, పల్కే పద్దులు
విన్న నా ప్రాణ విభుఁడు
వనిత! నీ యింటికి వచ్చునా? తరిగొండ నృహరికి
తనయ ననుచు చిందు ద్రొక్కకే!
నీవు నిక్కకే! అట్ల నిక్కితివేని
నినుఁ దిట్టి మెడఁబట్టి నెట్టేనే! వెళ్లఁగొట్టేనే?
ఇంక
॥శివునిఁ బిలువక సిగ్గుతో మెల్లఁగా జరుగవే!
యింటి కరుగవే!॥ ౬

క. అని గిరిజ యనిన మాటలు
విని జాహ్నవి చింతతోడ విభు నెమ్మోమున్

కనుఁగొని వెలవెలఁ బోవుచు
మనమున లజ్జించుకొనుచు మఱి యిట్లనియెన్: 140

గంగా:-క. అలుకను నీవను మాటలు,
కులుకుచు నా సవతి గూయు కూఁతలు మదిలో
ములుకులవలె నాటెను; మేల్!
సెలవఁటరా! నాకుఁ జంద్రశేఖర! యింకన్? 141

వర:-క. సమ్మతమున నినుఁ దొల్తను
రమ్మనుచును నేను కమ్మ వ్రాసితి నఁటవే?
ఇమ్మాడ్కిని సెలవడిగిన,
ముమ్మాటికి సెలవు విశ్వ మోహిని! పోవే! 142

వ. అనిన విని గంగాభవాని విన్ననై, తన చెలులతో నిట్లనుచున్నది: 143

## ❁ గంగాభవాని విచారము ❁

### జంపె

హరుఁడు రాననుచు మచ్చరపట్టినాఁ; డిచట
పురుషార్థ మేమింక పోదాము రారే! ౧

నా సాటి సవతి యిఁక నా యుసురుఁ బంచుకొని
బోసేసి బ్రతుకనీ! పోదాము రారే! ౨

నేను తరిగొండ పుర నిలయునకు సుతనైన
పూని పతిఁ గెలువఁగలఁ, బోదాము రారే! 3

వ. అని వలికి చెలులఁ దోడ్కొని తన మందిరంబునకుం బోయి, చింతాక్రాంతయై ప్రాణసఖితో నిట్లనుచున్నది: 144

**దరువు, మధ్యమావతి రాగము**

ఇఁక నేమి సేతు నో యమ్మా? ॥పల్లవి॥

నేఁడు, సకలాత్మ్కుఁ డీ రీతి చలపట్టె నమ్మా!
॥ఇఁక నేమి సేతు నో యమ్మా? ॥ఉపపల్లవి॥

నేను పిల్చిన, వాఁడు రాకా యున్న
సూనబాణుఁడు చేయు ధాకా వలన
మాన కీ విరహాగ్ని కాఁకా మించె
నేణాక్షి! యీ తాప మింక నెందాఁకా? ॥ఇఁక॥ ౧

నారదుం డపుడేల వచ్చె? నవరత్న
హార మక్కడి కేల తెచ్చె? సవతి
నా రీతి మెచ్చి, యేల యిచ్చె? ఇచ్చి,
తెరతేరకే వాఁడు తెచ్చె నీ కచ్చె ॥ఇఁక॥ ౨

ఇంతి! యేమందు నా గోడూ? కటకటా
ఎంతటి పాపపు దినము నేఁడూ? తగని
చింత కే లోనైతి చూడూ! రంతు
లెంతైన తరిగొండ హరి సఖుఁడు రాఁడూ ॥ఇఁక॥ 3

సీ. నెఱి కురుల్ కొనగోటనే చిక్కు దీసి బల్
వింతవింతగ జడ వేయు నమ్మ!
వేసి, మలెల్ల జాజి విరుల సరంబులు
సొగసుగా జడనిండఁ జుట్టునమ్మ!

చుట్టి, పయ్యెదఁ దీసి, పొంపైన కుచములఁ
జూచి,తాఁ దనలోనె చొక్కునమ్మ!
చొక్కి వేడుక మీఱఁ జిక్కితివవి నన్నుఁ
జెలఁగుచుఁ గౌఁగిటఁ జేర్చునమ్మ!

తే.గీ. మక్కువలరఁగఁ గెమ్మోవి నొక్కునమ్మ!
సంతసంబున రతికేళి నలుపునమ్మ!
మెచ్చి తన మోవి కాన్కగా నిచ్చునమ్మ!
శివుఁడు వేఁటికి నీ రవ్వఁ జేసెనమ్మ! 145

## దరువు

ఓ యమ్మ! నే నేమి సేతువే? ॥పల్లవి॥

ఓ యమ్మ! యేమి సేతు? కాయజు నెటు గెల్తు?
పాయని వలపాయె; భవుఁడింది రాఁడాయె
॥ఓ యమ్మ!॥ ౧

సుందరి! నే వాని పొందుఁ గోరిన చంద
మందని మ్రాని పండ్ల కాశించినట్లాయె
॥ఓ యమ్మ!॥ ౨

దూరపు నేస్తము కారాదనుచు నేను
భారక బుద్ధి విచారింప నైతినే! ॥ఓ యమ్మ!॥ 3

అనాఁటి వలపెల్ల - నీ నాఁటి కల నూన
బాణ జాలంబుల పాలాయె నయ్యయ్యో!
॥ఓ యమ్మ!॥ ౪

ధైర్యముతోను చిత్తము నిల్పఁబోతేను
కార్యకర్తై మరుఁడు గర్జింపసాఁగెనే!
॥ఓ యమ్మ!॥ ౫

కుటిల కుంతలి! తరిగొండ నృహరి మిత్రుఁ
డిటువంటి వాఁడని యెఱుఁగక పోతిని
॥ఓ యమ్మ!॥ ౬

వ. అని పలికి, మన్మథ, చంద్ర, మలయానిలుల
దూషించే విధం బెటువలెను: 146

## ❀ మన్మథ దూషణ ❀

### దరువు

పాపకర్మి వైతివయ్యో! సూన బాణా! నీ
రూపు భస్మమై పోను సూనబాణా! ౧

రాపుఁ జేసితివి నన్ను సూనబాణా!నీ
రూపు లణఁగిపోనాని సూనబాణా! ౨

నాపతి యల్గినవేళ సూనబాణా! నీకు
న్యాయమౌన నన్నేఁచేది సూనబాణా? 3

పి. మాటికి నామీఁద మచ్చరించెద వింకఁ
జూడరా! నా త్రాణ సూనబాణ!
తెల్లవారఁగనె నీ యుల్లాస మణఁగింతుఁ
జూడరా! నా త్రాణ సూనబాణ!
అంతట నీ బలం బడవి పాలుగఁ జేతుఁ
జూడరా! నా త్రాణ సూనబాణ!
నీ విల్లు ద్రుంచి గానుగలోనఁ ద్రిప్పింతుఁ
జూడరా! నా త్రాణ సూనబాణ!

తే.గీ. ఇంక మీఁదట నిన్ను సహింపరాదు,
నాయకుఁడు లేని తఱిఁ గవి నన్నుఁ జాల
నుసురుమనిపించితివి; మంచి, దోరి! నేఁడు
చూడు! నిన్నె జయించెద సూనబాణ! 147

## ❀ చంద్ర దూషణ ❀

### దరువు

హెచ్చైన రాజధర్మము లోరి! చంద్రా!
మాని, ముచ్చువలె రాత్రిఁ దిరిగేవేర! చంద్రా? ౧

మచ్చికింతైన లేదాయె నోరి! చంద్రా!
నీ, మలిన మింక వీడదాయె నోరి! చంద్రా! ౨

పచ్చవిల్తుఁడు నన్నేఁచ నోరి! చంద్రా!
నీకు, ముచ్చటాయె నఁటర! వోరి చంద్రా? 3

సీ. నీ యల్లునికిఁ దోడునీడగా నీవేళ
చనుదెంచితో నీవు చందమామ?
నిండుపున్నమనాఁడు నినుఁ బాము గఱువనీ!
సంతోష మేమిరా! చందమామ?
నెలనెల కొకసారి నీ నిజ రూపంబు
సన్నమై పోవనీ! చందమామ!
పతులు చెంగట లేని భామల నేఁచేది
సాహసమా నీకుఁ జందమామ?

తే.గీ. భాసురంబుగ క్షీరాబ్ధి పట్టి వనఁగ
ధరను వెలసితి; వా కీర్తిఁ దలఁపలేక
నీచవృత్తులకు లోనై, నిశాచరులకు
సఖుఁడవైతివి కటకటా! చందమామ! 148

## ❋ మలయానిల దూషణ ❋

### దరువు

పట్టి బంధించినఁ గానీ మందమారుతా!
నీ, పద్దు లింక నుడుగవాయె మందమారుతా! ౧

కట్టిఁడివాఁడవైతివి మందమారుతా!
నిన్ను, పట్టి పాములు మ్రింగిపోను!
మందమారుతా! ౨

నెట్టన నా పాలిటికీ మందమారుతా!
నీవు, నిర్దయుఁడవైతి వయ్యో! మందమారుతా! ౩

తే.గీ. సోఽహమను భావ మెఱిఁగి నీ చోటుఁ దెలిసి,
పూని రేచక, కుంభక, పూరకముల
వేగ దేహంబులోఁ జేరవేతు నిన్ను;
నేఁడు నా సాహసంబైనఁ జూడు పవన! 149

వ. అని పలికి, తన ప్రాణసఖులఁ జూచి,
మఱియు నిట్లనుచున్నది: 150

### దరువు

ఏమి సేతూ నమ్మలారా?
ఎట్లా తాళుదునూ? ॥పల్లవి॥

సోమశేఖరుఁడు నేఁడు చులుకగాఁ జూచిన పనికి
॥ఏమీ సేతూ నమ్మలారా? ॥ఉపపల్లవి॥

నేను పోయీ పిలిచినపుడు
రాను పొమ్మంటేను వాఁడు,
జాణ సవతీ మనసూ కెంతో
చల్లనాయె నో జెల్లా! ॥ఏమీ సేతూ?॥ ౧

పడఁతిరో! నా యౌవనాము
ప్రాణవిభునిపై మోహాము
అడవీకిఁ గాచిన వెన్నె
లాయె! నయ్యయ్యో! జెల్లా! ॥ఏమి సేతూ?॥ ౨

వాసి మీఱు తారిగొండా
వాసునికి హితుఁడైన మ
హేశుడూ నేఁడు నన్నెంతో
గాసిఁ జేసె నెనరూ లేక ॥ఏమి సేతూ?॥ 3

క. ఫాలాక్షుఁడు రానందుకు,
నాళీకశరుండు లేచి నన్నేఁచుటకున్,
జాలికి వెన్నెల కాఁకకుఁ
దాలిమితో నిలిచియుండఁ దరమఁటె చెలియా? 151

## జంపె

తాళఁజాలనే! నాదు తను వీ క్షణములోనే
ఫాలలోచనూన కర్పణముఁ జేసెదనూ ౧

కలకంఠి! నా నగరఁ గల పదార్థములెల్ల
చెలఁగి శాంభవి పాలు సేయ వద్దమ్మా! ౨

సలలితముగా నన్నుఁ జూచుకొన్నటువలెనె
వెలయ నా సిరి ననుభవించ రో! యమ్మా! 3

మఱి యెందుఁ బోక నా మాట మీఱక, ధర్మ
మరసి మందాకిని ల్లవిపించరమ్మా! ४

అల మయూరముల, కోవెలలఁ గీరముల నిఁకఁ
బొలుపొంద ననుదినము పోషించరమ్మా! ౫

వ. అనిన విని చెలులు చిన్నఁబోయి, జాహ్నవినిఁ
జూచి యిట్లనుచున్నారు: 152

### కుఱుచ జంపె

జలజాక్షి! శివుఁ డిందు రాఁడా?
నిన్ను, సంతసంబున నేలుకోఁడా? ౧

చింత యేలనె! చంద్ర వదనా?
ఇంత రంతు లేలనె! మంద గమనా? ౨

తరుణి! విరహం బోముకోవే?
గడియ, తరళలోచన! తాలుకోవే! 3

### ద్విపద

అని యిట్లు దూతిక - లాడిన మాట
విని సహింపఁగ రాక, - విరహాగ్నిఁ గ్రాఁగి,

యత్యంతమైన రో-షావేశముతను
సత్యాత్మురాలైన - జాహ్నవీదేవి

తలుకుఁగన్నుల నీరు - తన కొనగోటఁ
బలుమాఱు చిమ్ముచుఁ, - 'ప్రాణేశ!' యనుచుఁ,

గ్రమ్మి, బయల్ సూచి - కౌగిలింపుచును,
కమ్మవిల్తుని ధాకఁ - గల్వరింపుచును,

వెయ్యాఱు భంగుల - విభుని దూఱుచును,
శయ్యపై శయనించి, జాలిఁ గుందుచును

నుండి, యంతటిలోన - నొక యుక్తిఁ జేసి,
ఖండేందుధరునితోఁ - గార్యంబుఁ బూని,

యా మీఁద చలపట్టి - 'నన్నేఁచినట్టి
కామునితోఁ గెల్చి-గాని శంకరుని

ధీరత మీఱ సా-ధింపరా' దనుచు
వైరాగ్యమను కర-వాలంబుఁ బూని,

ఝళిపింపఁ, జంద్రుఁ డా-శౌర్యంబుఁ జూచి,
చలితుఁడై పశ్చిమా-చలమందు డాగె;

నది యెల్లఁ జూచి ది-గంతరంబులకు
మదమెల్లఁ జెడి, పోయె - మలయానిలుండు;

శుక పిక బంభర-స్తోమంబు లపుడె
కకవికలై పోయెఁ - గాననంబులకు;

నలఘు జలంబు మా-యంబుగాఁ జేయఁ
దలఁచియున్నట్టి మం-దాకిని కిపుడు

చెలఁగి సహాయంబుఁ - జేతు నేఁడనుచు
బలమొప్పఁ బూర్వాద్రి-పై నెక్కె నినుఁడు.

గంగాభవాని తత్-క్రమమెల్లఁ దెలిసి,
యంగజుం డే?దని - యాత్మలో వెదకి,

మదిలోన డాఁగిన - మన్మథుఁ బట్టి,
పదరక సుజ్ఞాన - పాశంబుచేతఁ

గదలవియ్యక గట్టి-గాఁ గట్టివేసి,
మదిరాక్షి నగుచుఁ దా-మసి కిట్టు లనియె:

తే.గీ. ఏను వైరాగ్య మను ఖడ్గ మెత్తకున్నఁ
జూచి బేలని ననుఁ గెల్వఁజూచె మరుఁడు;
నేను వైరాగ్యఖడ్గంబుఁ బూనినపుడె
సేనలను బాసి నాచేతఁ జిక్కె నిపుడు. 153

క. హరు సెలవు గాక తొలుతనె
మరు వెడలఁగ నడువరాదు; మహి నట్టినవ్
వర పాతివ్రత్యమునకు
సరియన రెండైన ధర్మశాస్త్ర విధిజ్ఞుల్. 154

వ. 'కావున శివుని యాజ్ఞలేక కాముని విడువరాదు. ఈ వృత్తాంతంబు నొక్క పత్రికయందు లిఖించి యిచ్చెద. కొనిపోయి శివుని కిచ్చి, ప్రతిపత్రిక నీవు గైకొని రమ్ము. అటావల శివుఁడు వ్రాసి పంపించిన లిఖితమందు విహితంబుగా వ్రాసియుండ, నాకు సమ్మతంబె; వచ్చెనా, అంతకన్న సంతోషంబె. ఈ రెండు తెఱంగులు గాక, యెవ్వటివలెనే రానని గడుసుమాటలుగా నుత్తరంబు వ్రాసెనా, అవల నే నేమి చేసెదవో నా త్రాణ నీకే తెలిసివచ్చీని.' అని, జడ మీఁది మొగలి రేకుఁ దీసి, తన యభిప్రాయంబుఁ గొనగోట లిఖించి, తామసి చేతికిచ్చి పోయి ర మ్మనినఁ గైకొనిపోయి, పరమేశ్వరునకు దండప్రణామంబుఁ జేసి, లిఖితంబు చేతి కిచ్చిన, శివుండు చిఱునవ్వు నవ్వుచు, నా లిఖితంబుఁ జదివే విధం బెటువలెను: 155

## ❋ జాహ్నవి లేఖ ❋
### ద్విపద

శ్రీమదఖండ సు-శ్రీయుక్తులైన
కామితార్థదులైన - ఘన యశులైన

విశ్వకారణులైన - విశ్వాత్ములైన
శాశ్వతులై, మేరు - సమధీరులైన

సహజషడ్గుణులైన - సర్వజ్ఞులైన
మహిఁ బదవాక్య ప్ర-మాణజ్ఞులైన

రహి నీతి కార్య ధు-రంధరులైన
బహుచరాచర భూత-భరితులైనట్టి

శ్రీసాంబ శివునివా-రి పదాబ్జములకు
వాసిగా గంగా భ-వాని వందనముఁ

జేసి చేయంగల చెలి విన్నపంబు;
లీ సోమవాసర - మీ శుద్ధ దశమి

వరకు నే క్షేమ, మ-వ్వలఁ దమ కుశల
మఱి లేక వ్రాయించి - యంపించవలయుఁ;

దరువాత నేను మీ-దగ్గఱ నుండి
చుఱుకుగా సెలవుఁ దీ-సికొని నా నగరుఁ

జేరి, వైరాగ్య సు-స్థిరతర ఖడ్గ
ధారచే మదనాస్త్ర - తతులఁ జెండాడి,

సోముని, శుక, పిక-స్తోమాళి తతుల,
నా మందపవనుని - నవలీల గెలిచి,

ధతిమనోహరుని వి-రథునిఁగాఁ జేసి,
ప్రతిలేని సుజ్ఞాన - పాశంబుచేత

దిట్టంబుగాను బం-ధించి యున్నాను;
నెట్టన నెట్టైన నీ యాజ్ఞ లేక,

మనసిజు మర్దింప - మర్యాద గాదు;
కనుకఁ బత్రికను దత్ - క్రమమిట్లు వ్రాసి,

యంపినా; నిదిచూచి - యా క్షణమందె
తెంపునఁ బార్వతీ-దేవిని విడిచి,

రమ్ము! మా యింటికి, - రాక నిల్చినను,
క్రమ్మఱఁ బ్రతిపత్రి-కను వ్రాసి పంపు!

మటమీఁద మీ భావ-మంతయు నేను
దిటముగాఁ దెలిసి, సం-దేహంబు మాని,

మారుని మొదలంట - మర్దించి విడిచి,
ధీరతతో విరక్తి భ-రించి, మించి

పట్టినై శ్రీరమా-పతియందు నేను
పుట్టి యుండితినైన - భూరి సాహసము

సేయక మాన నీ - శ్రీపాద మాన!
మాయల కెల్లఁ దా-మాత నటంచు

గర్వించి యిప్పు డా-కన మంటియున్న
పార్వతి కీ వ్రాయు - పత్రికఁ జూపు!

నా సాహసంబెల్ల - నా తండ్రియైన
వాసుదేవుఁడు మెచ్చ, - వాణీశుఁ డెన్నఁ

జేసెద నేమో వి-చిత్ర మిద్ధరను,
శ్రీసద్గిరిజ తాను-శ్రేష్ఠ రాలయినఁ

దన సాహసంబెల్లఁ - దాఁ జూపు మనుము!
పెనుపొంద సొంతపుఁ - బెండ్లాము గనుక

దాని కెక్కువ చేయఁ - దలఁచితివేనిఁ
బూను! నీవైన న-ద్భుత సాహసంబు;

నే లేక జగములు, - నీవు, నీ యాలు
పాలించితేఁ జాలు - బడలి పోనీక,

సర్వజ్ఞులకు విశే-షము వ్రాయనేల?
పూర్వోత్తర క్రమం-బులు విచారించి,

ప్రత్యుత్తరముఁ ద-ప్పక వ్రాసి పంపు!
ప్రత్యక్షముగ విశ్వ - పాలనమందు

మీ యత్నములలోను - మీరుండు డిపుడు;
నా యత్నమున నేను - నాఁటుగా నుందు.

ఈ వివరంబులు - హృదయమం దుంచి,
యీ వేళ నాకు వ్రా-యించు సంగతులు

పొందుగా వ్రాసి పం-పుఁడు! పదివేల
వందనావళు లివె - వర శిఖినేత్ర!

తరిగొండ హరిమిత్ర! - దర్పక జైత్ర!
సుర నుతిపాత్ర! భా-సుర పంచవక్త్ర!

వ. అని యివ్విధంబున గంగాభవాని వ్రాసిన పత్రికఁ జదివి, పరమేశ్వరుండు పార్వతితో నిట్లనుచున్నాఁడు: 156

తే.గీ. లీలతో గంగ వ్రాసిన లిఖిత సరణిఁ
దెలియ వింటివె? పార్వతీ దేవి! యటకుఁ
బోయి వత్తునా? లేక తెంపునను 'రాను
నే'ననుచు మఱల వ్రాతునో? నీవు చెపుమ! 157

తే.గీ. గంగ మాటల కిపు డింత కళవళంబు
పొంది యచటికిఁ బోనేల? భూతనాథ!
'రాను నే' నని ప్రత్యుత్తరంబు వ్రాసి,
యంపు! చూతము దాని మహత్త్వమెల్ల! 158

వ. అని పార్వతి తన కొప్పుమీఁది మొగలిరేకుఁ దీసి చేతి కిచ్చిన, హరుండు నవ్వుకొనుచు, నా మొగలి రేకు మీఁదఁ గొనగోటితోఁ దన యభిప్రాయంబు లిఖియించి, తామసి చేతి కిచ్చి, 'పొ'మ్మనినఁ గైకొనిపోయి, జాహ్నవిచెంతఁ జేరి లిఖితంబుఁ జేతికిచ్చినఁ గన్నుల నొత్తుకొని, గంగా భవాని చదివే విధం బెటువలెను: 159

## ❁ పరమేశ్వరుని ప్రత్యుత్తరము ❁

### సీసమాలిక

శ్రీమదఖండ సచ్చిత్ స్వరూపకులైన
సర్వజ్ఞులగు శివ స్వామివారు
శ్రీరస్తు సుస్థిరంజీవి యైనటువంటి
విశ్వపావని యన వెలయునట్టి
శ్రీగంగ కిప్పు డాశీర్వచనంబులు
రూఢిసేసితి; మీ నిరుద్ధమునకుఁ
గుశలంబు మాకు; నీ కుశలాతిశయమెల్ల
వ్రాయించి పంపించవలెను తెలియఁ,

దరువాత నీ నిమిత్తమున వ్రాసిన వర్త
మానముల్ దెలిపె; సామర్థ్య మెసఁగ
వైరాగ్యమను ఖడ్గధారచే మదనాస్త్ర
తతులఁ జెండాడు నీ ధైర్యగుణము,
సేనలఁ బోఁద్రోలి జ్ఞానపాశముచేతఁ
బట్టి మారునిఁ గట్టి, దిట్టతనముఁ,
బూని నా సెలవైనఁ గాని శిక్షింపరా
దని తాళఁబట్టిన యట్టి శాంతి,
నేను పార్వతి వీడి నీ నగరికి రాక
నిలిచిన మముఁ జేయు నిగ్రహంబు,
వింత వింతగఁ జూడ సంతోషమాయెను;
మంచిది నీ కింత మహిమ యుంటె
మారుని శిక్షింపు! మమ్మేమి సాధింపఁ
గలవా? సాధింపు! నీ బలము కొలఁది,
మా యత్నమున మేము మఱువకుండెద మింక,
నీ యత్న మది యేమొ నీవు చేయు;
నన్ను రమ్మని వ్రాసియున్నావు; పార్వతి
నెడఁబాసి యచ్చటి కేను రాను;
నిగ్రహానుగ్రహ నిపుణతల్ నీ యందుఁ
గలిగె; నాతో నీకుఁ గార్యమేమి?
యబల పార్వతి నిగ్రహానుగ్రహంబులు
తెలిసి మన్మథుని సాధింపలేదు;
కావున దానికి భావజ శరవేధఁ
దగుల నీయక ప్రోవఁదగును నాకు,
నీ కేమి యెట్లైన నీరజాస్త్రుని గెల్తు;
విపుడు నా సాహాయ్య మేల నీకు?

శిఖరిజచే నేమ సెలవంది యెట్టిన
నీ నగరికి రాను నిశ్చయించి
యున్నట్టి తఱి నిట్టి యుత్తమోత్తమమైన
పత్రిక వ్రాయించి పంపినావు
గాన నిల్చితి; మించి నేను వచ్చిన నీకు,
శ్రీపార్వతికిఁ గాక చింతగుంట
జోగిచందమున నెచ్చోట నిల్చుట లేక,
తిరుగ వలసియుండు దేశమెల్ల;
నీ లోన పత్రిక నిటు వ్రాసి పంపించి
మేలు సేసితి; వింత చాలు నాకు,
ఇంత విరక్తి నీ స్వాంతమందుండగా
నేను వచ్చిన ఫలమేమి గలదు?
వైరాగ్యభాగ్య మెవ్వరికిఁ గల్గదు; కల్గె
నేని వీడఁగ రాదు; మానసమునఁ
బుట్టియున్నట్టి విరక్తిఁ బోనీయక
నిలుపు! మదే నీకు నిత్య సుఖము;
నీ యంత వైరాగ్య నిష్ఠ నా కిప్పటి
కుదయింపలేదు గావునను, నేను
తగను నీ కిపు డేవిధమున నైనను గాన,
నీ దగ్గఱకు రాక నిలిచినాఁడ;
నా మీఁద దయ యుంచి నా కింక వ్రాయించి
పంపించు సంగతుల్ పంపుచుండు!

**తే.గీ.** మదిని బలమున్న సాధింపు! మమ్ము నిపుడు,
చింత నేఁ జేయ; నింతె యాశీర్వచనము!
వెలయు తరిగొండ హరిపుత్రి! జలజనేత్రి!
ఘనతర జ్ఞాని! విమల గంగాభవాని! 160

వ. అని యిట్లు హరుఁడు వ్రాసిన లిఖితంబుఁ జూచి, కను లెఱ్ఱఁ జేసి, కనుబొమలు ముడిఁబెట్టిఁ కోపాటోపంబునఁ దామసితో భాగీరథి యిట్లనుచున్నది: 161

తే.గీ. నేను వ్రాసిన లిఖితంబుఁ దాను జూచి
రావలసియుండె; మంచిది, రాక నిల్చె
నేని, వచ్చెదనని వ్రాయ నేరఁడయ్యెఁ;
గానఁ బూనెద శివుతోడఁ గార్య మిపుడు. 162

తే.గీ. మరుని శిక్షింపుమన్నాఁడు, మహిమ దెలియఁ
జూపుమన్నాఁడు; నన్నేమొ చులుకఁ జేసి,
మరుని శిక్షించు పని యెంత? మహిమ తనకుఁ
జూపు పని యెంత? చూపెదఁ జూడనిమ్ము! 163

వ. అని ప్రతాపించి, యాత్మానాత్మ వివేకంబు విచారించి, మాయారూపుఁడైన కాముని శిక్షించి విడిచి, సిద్ధా సనాసీనయై కూర్చుండి, నిజయోగ ప్రభావంబున సకల లోకంబులలోని యుదక తత్త్వంబు నాకర్షించి, తన యందు లీనంబుఁ జేసికొని, మహాయోగినియై, యాత్మానుభవంబుఁ జేయుచుండె; నంత. 164

### దరువు, త్రిపుట తాళము

ఈవిధంబున జాహ్నవీసతి
ఠీవి మీఱఁగ మహిమఁ జూపిన
భావజాంతకునకు మనంబున భయము దోఁచెన్.౧

సురలు, మునులును వెఱఁగు నొందిరి;
ఉరగపతి తన శిరము లొంచెన్;
ధరణి చెదరెను; సోమ సూర్యులు దారి దప్పెన్.౨

అష్ట దిక్పాలకులు వణఁకిరి;
అజుఁడు తాఁ దన యహము లెన్నెను;
సృష్టి చీఁకటి యైన విధమునఁ జిన్నవోయెన్. 3

## ❁ ఎఱుకత ఘట్టము ❁

### ద్విపద

అంతటఁ దరిగొండ - యను పురమందు
సంతసంబున నుండి - సకలేశ్వరుండు

మందరోద్ధారుండు - మధుసూదనుండు
కందర్ప జనకుండు - కలుష హరుండు

సుందరాకారుండు - సుగుణాకరుండు
వందారు వరదుండు - వాసుదేవుండు

మందాకినీ దేవి - మహిమ భావించి,
యిందిరాదేవితో - నిట్లని పలికె:

'వినవె! రమామణి! - విశదంబుగాను
మన చిన్ని జాహ్నవి - మనముద్దు బాల

పతిమీఁదఁ గోపించి - పంతంబుఁ బెంచి,
ప్రతిఘటించి జలంబుఁ - బటు తీవ్ర గతిని

మాయంబుగాఁ జేసి, - మదనారి మీఁదఁ
బాయని కిన్కతోఁ - బదరి మించినది.

ఇంక మీఁదటఁ గ్రోధ - మినుమడించినను
కొంకక యది నిల్పఁ - గూడ దెవ్వరికి.

ఇప్పుడే నీ వొక్క - యెఱుకల సాని
చొప్పున నటఁ బోయి - సొంపుతో నిపుడు

నడచు విధం బింక - నడుపు! క్రమంబుఁ
దడయక నీవు మం-దాకినీ సతికిఁ

జెన్నొంద నెఱుకగాఁ - జెప్పుచునుండు;
మన్నియు పమతూర్తు - నంతలో నేను;

పద'మని పల్కినఁ - బద్మాయతాక్షి
ముద మొప్పఁగాఁ జాల - ముద్దులు గుల్కు

కొఱవంజి వేషంబుఁ - గోర్కెతోఁ దాల్చి,
మరుని బల్ చిన్ని కు-మారుఁగాఁ జేసి,

పాటించి తన వామ - భాగంబునందుఁ
బైఁటతో బిగఁగట్టి, - బంగరు బుట్టి

శిరమందు ధరియించి, - చెల్వంబు మించి,
చిఱునవ్వు మోమున - శృంగార మొప్ప,

వర రత్న భూషణా - వళులు శోభిల్ల,
హరిచేత సెలవంది - యచ్చోటు వెడలి,

పనిఁబూని కైలాస - పర్వతంబునకుఁ
జనుదెంచె యెఱుకల - జాతి భాషణల.

**దరువు**

వచ్చె 'నెఱుఖో! యెఱుఖ!' యనుచును
వాడ వాడల వెంటనూ ॥పల్లవి॥

హెచ్చుగా మందాకినికి తా
నెఱుక చెప్పెద ననుచునూ
॥వచ్చె 'నెఱుఖో'!॥ ॥ఉపపల్లవి॥

ఘలు ఘలున పాదంబులను చిఱు
గజ్జె, లందెలు మ్రోయఁగా,
చెలువు మీఱఁగ పసిఁడి చెఱఁగుల
చీరకుచ్చులు జాఱఁగా,
అలరు చందురుకావి అవికయు
నందముగ రాణించఁగా,
వెలయు ధళధళ వెలుఁగు భూషణ
ములను వగవగ మించఁగా ॥వచ్చె॥ ౧

కలికి వాల్గన్నులను కాటుక
కమ్మి, సొగలు మీఱఁగా,
సులలితముగా బొమల సందున
సొగసు నామము వెలుఁగఁగా,
పొలుపు మీఱుచు నుదుట పచ్చని
బొట్టు నిగనిగ మెఱయఁగా,
విలసితముగా గొప్ప కొప్పున
విరుల సరములు గదలఁగా ॥వచ్చె॥ ౨

ప్రమద మలరఁగ విడెము సేయుచు,
బాలకుని ముద్దాడుచూ,
సుమహితముగా బుట్టి నెత్తిన
సూటి దప్పక నిలుపుచూ,
క్రమముగా తన కెదురు వచ్చిన
కమల నేత్రలఁ జూచుచూ,
'రమణులారా! యెఱుకఁ జెప్పెద,
రండు! రం'డని పిలుచుచూ ॥వచ్చె॥ 3

కరకమలమునఁ దనరి బంగరు
గిలక వాయింపుచూ
సురుచిరముగా కొడుకు నూఁచుచు
జోలపాటలు పాడుచూ
నరవిఁ బోరటు మాన్పుచును, నిజ
జాతి సుద్దులు చెప్పుచూ
మురిపెమునఁ దరిగొండపుర నర
హరికి శరణని మ్రొక్కుచూ ॥వచ్చె॥ ౪

వ. ఇవ్విధంబున వచ్చిన యెఱుకల సాని
పొడగన్న భామామణులతో నిట్లనుచున్నది: 165

## దరువు

ఎఱుఖా శేప్పనే! యవ్వ! యెఱుఖా శేప్పనే!
ఎఱుఖా శేప్పనే! దుండి! యెఱుఖా శేప్పనే!
॥పల్లవి॥

ప్రాణేశ్వరుని యెదఁ బాయవనుచు బ్రహ్మ
వాణికి చెప్పినావే! వనితా! నా యెఱుకా
॥ఎఱుఖా॥ ౧

భూతేశుఁగూడి లోకమాతయ్యే వనుచు శైల
జాతాకు శెప్పినావే! ఖ్యాతైన యెఱుకా॥ఎఱుఖా॥ ౨

తరిగొండ నరహరి యురమున నుందువని
గుఱిగాను శెప్పినావే! సిరికీ నా యెఱుకా
॥ఎఱుఖా॥ 3

వ. అవ్వో! యవ్వ! యెఱుఖా శేప్పనే! యవ్వ!
యెఱుఖా శేప్పనే! యవ్వ! యెఱుఖా శేప్పనే! యవ్వ!

యెఱుఖా శెప్పేనే! అవ్వో! యవ్వ! గద్దెదుగరే! దుండి! గద్దెదుగరే! దుండి! గద్దెదుగరే! అవ్వో! యవ్వ! మీరు తలంచిన తలంపులు తార్ఖాణిగా శెప్పతుండానే! దుండి! సెప్పతుండానే! అవ్వో ! యవ్వ! 166

వ. అనిన విని, జాహ్నవి చెలులు వచ్చి 'నీయెఱుక యెటువంటిది? తెలుపు' మనిన వారితో కొఱవంజి యిట్లనుచున్నది: 167

## దరువు

యెఱుఖా యెఱుఖో యవ్వ! యెరుఖా యెఱుఖో!
యెఱుఖా యెఱుఖో దుండి! యెరుఖా యెరుఖో!
॥పల్లవి॥

పంచభూతములఁ బుట్టించు నా యెఱుకా
మించి వాటిని నిరసించు నా యెఱుకా
॥యెఱుఖా॥ ౧

కుండలి తుద నంటి యుండు నా యెఱుకా
దండిగా నంతట నిండు నా యెఱుకా
॥యెఱుఖా॥ ౨

మాయ విద్యల మాయఁ జేయు నా యెఱుకా
వేయు రేకుల నడుమ వెలుఁగు నా యెఱుకా
॥యెఱుఖా॥ 3

చిత్తవృత్తులను వీక్షించు నా యెఱుకా
సత్తా మాత్రంబైన చల్లాని యెఱుకా ॥యెఱుఖా॥ ౪

ఆది మధ్యాంతములయం దుండే యెఱుకా
నాద బిందు కళల కాది నా యెఱుకా॥యెఱుఖా॥ ౫

దేహ భావముల శోధించు నా యెఱుకా
సోఽహం భావమునందు చొక్కు నా యెఱుకా
॥యెఱుఖా॥ ౬

చెదరాక నిదురాకు మొదలవు నా యెఱుకా
వదలాక తెలివీకి తుదయౌ నా యెఱుకా
॥యెఱుఖా॥ ౭

మింటీకి మంటీకి నంటాదు నా యెఱుకా
కంటి చూపుల నంటి కంటి నా యెఱుకా
॥యెఱుఖా॥ ౮

తరిగొండ నరహరి నెఱుఁగు నా యెఱుకా
ఉరగాద్రిపతి యొద్ద నుండు నా యెఱుకా
॥యెఱుఖా॥ ౯

వ. 'అవ్వో! యవ్వ! అవ్వో! యవ్వ! అవ్వో! యవ్వ! అవ్వో! యవ్వ! అవ్వో! యవ్వ! యిటువంటి నా యెఱుక అనేక కోటి బ్రహ్మాండ భాండంబులందు అఖండమై నిండి వుండాదే దుండెమ్మా! అవ్వో! యవ్వ! ఆ యెఱుక మీకుఁ జెప్పుతుండానే! దుండి!' - అనిన వారు 'యీ వఱకు నీవు ఎవ్వరికిఁ జెప్పినా?' వనిన కొఱవంజి యిట్లనుచున్నది: 168

**దరువు**

యెఱుఖా చెప్పుదునే! యవ్వా! అందఱికి
నే, నెఱుఖా చెప్పుదునే! యవ్వా! ॥పల్లవి॥

గుఱిఖట్టుగా సర్వ సుర భామినుల కెల్ల
ధరకాట భరకాట తబ్బిబ్బు గాకుండ
॥ యెఱుఖా చెప్పుదునే!॥ ఉపపల్లవి॥

వాణికిఁ జెప్పుదునే! నా యెఱుఖా శ
ర్వాణికిఁ జెప్పుదునే!
నాణెమౌ నెఱుఖా పూఁ
బోఁడిది యనుచును గీర్వాణులు మెచ్చఁగ
॥నెఱుఖా॥ ౧

యతులాకుఁ జెప్పుదునే! సంయమి, యోగి
పతులాకుఁ జెప్పుదునే!
అతులిత వైరాగ్యమతులైన వరభాగ
వతులు, దిక్పతులు, భూ పతులెల్ల మెచ్చాఁగ
॥నెఱుఖా॥ ౨

గరుడ గంధర్వేంద్రులూ, కిన్నర, కిం
పురుష చారణ సిద్ధులూ
సరియాని మెచ్చాఁగ తరిగొండాధిపుఁడైన
యురగాద్రి నిలయూని కరుణచే నందాతి
॥కెఱుఖా॥ 3

క. ఎఱుకే జనులకు జీవన;
మెఱుకే పురుషార్థ సౌఖ్య హేతువు; పర మీ
యెఱుకే నకలము; శుభకర
మెఱుకే నిఖిల ప్రపంచ మెఱుఖో! యెఱుఖో! 169

## దరువు

కోరికలకు మూల కారణమౌ నా
యెఱుఖడుగరే! దుండి! మీ రడుగరే! ౧

పున్నమ వెన్నెల్లో మిన్నంది యున్న యెఱుకా
నన్నడుగరే! దుండి! నన్నడుగరే! ౨

ఉరగా గిరీంద్రుఁడైనా తరిగొండ
హరినిఁ దలఁచి గుతి యదుగరే!
॥నన్ను గుతి యదుగరే!॥ 3

వ. అనిన విని వారు గంగ కడకుఁ బోయి యిట్లనుచున్నారు: 170

## ద్విపద

'ఓ జగదీశ్వరి! - యో సుధాలహరి!
ఓ జాహ్నవీ దేవి! యో లోకమాత!

తల్లి! నీ విట్లేల తపముఁ - జేసెదవు?
చల్లని యెలుకల - సాని వచ్చినది.

కొమ్మ! నీమదిలోని - కోరికలన్ని
సమ్మతిగాఁ జెప్పి - సమకూర్చు నదియె;

నీ విట్టి వైరాగ్య - నిష్ఠతో నిలిచి,
యీ విశ్వమెల్ల నేఁ-డేల ముంచెదవు?

జల మీవు దీర్చగా - సకల మానవులు
పొలుపాతి వెలవెలఁ - బోవుచున్నారు;

కావున దయచేసి - కనువిచ్చి చూడు!
భావజాంతకునిపైఁ - బగ యేల? వీడు!

ఎలుకల సాని నిం-కిటకు రప్పించు!
తరిగొండ హరినిఁ జి-త్తంబునందుంచు!

శ్రీసద్గిరీశ్వరున్ - జింతించి, యెలుక
వాసిగా గంగాభ-వాని! నీ వడుగు!

తే.గీ. అనుచుఁ జెలులెల్లఁ బ్రార్థించు నార్తరవము
నాలకించి మహాద్భుత మంది లేచి,
కన్నుగవ విచ్చి చూచి గంగా భవాని
చెలుల నెల్లను దయను వీక్షించి పలికె: 171

తే.గీ. 'ఇంతగా మీరు నను( బిల్చుటేల? భువిని
ఏమి యుత్పాతములు పుట్టె నింతులార?
అనిన వారిటు లనిరి: 'తోయంబు లేక
భూమిలో నద్భుతము చాలఁ బుట్టె నమ్మ!' 172

వ. అనిన విని గంగాభవాని 'భూమియం దేమి యద్భుతంబులు పుట్టె?' ననినఁ జెలు లిట్లనుచున్నారు: 173

### ద్విపద

'తల్లి! నీ వీ రీతిఁ - దపముఁ జేయుటను
తల్లడమంది వి-ధాత చింతించె;

ఆది వరాహంబు, - నాది కూర్మంబు
నాది శేషుఁడు, దిగ్గ - జావళుల్ వణఁకె;

దారులు దప్పిరి తపన - రాత్రిపులు;
నీరంబు గానక - నిఖిల దేవతలు,

మునులు, మానవులును - మూర్ఛిల్లినారు;
గమక నీ వందఱిన్ - గడ తేర్చు కొఱకు

హెచ్చు తపముఁ జేయ, - కిచటి కా శివుఁడు
వచ్చునంతకు శేష-వసుధాధరేంద్ర

పతియైన తరిగొండ - పట్టణాధిపుని
హితవుగా నమ్మ! నేఁ-డెఱుకల సాని

వచ్చిన దిచటి, క-వ్వనిత నీ కోర్కిఁ
జెచ్చెర సఫలంబుఁ - జేయు నో యమ్మ!'

వ. అనిన విని జాహ్నవి సంతసించి, 'యాలాగే యెఱుకల సానినిఁ దోడితె' మ్మనినఁ, జెలులు పోయి తోడ్కొని వచ్చినఁ, గొఱవంజినిఁ జూచి యా గంగా భవాని యిట్లనుచున్నది: 174

క. 'రావే! యెఱుకల సానీ!
నీవే నా చింతఁ దీర్పనేర్తువు; సొమ్ముల్
కోవే! నా మది కోర్కెలు
భావించి నిజంబుఁ దెల్పు పద్మదళాక్షీ! 175

తే.గీ. అతివ! కొఱవంజి! నినుఁ జూచినపుడె మనము
చల్లనైయున్న; దిది యేమి సఖ్య మహిమొ?
ధరను చరియించుచున్న మీ యెఱుకవార
లెప్ప డెందుండు? రది తెల్పు మిందువదన!' 176

వ. అనిన విని నవ్వి కొఱవంజి యిట్లనుచున్నది: 177

**దరువు, ఆది తాళము**

వింధ్యాద్రిపై చరించే యెఱుక వార మో యవ్వా!
వేదాద్రిపై నటించే యెఱుకవార మో యవ్వా! ౧

గరుడాద్రిపై చరించే యెఱుకవార మో యవ్వా!
కనకాద్రిపై నటించే యెఱుకవార మో యవ్వా! ౨

నీలాద్రిపై చరించే యెఱుకవార మో యవ్వా!
నిషధాద్రిపై పటించే యెఱుకవార మో యవ్వా! ౩

సింహాద్రిపై చరించే యెఱుక వార మో యవ్వా!
శేషాద్రిపై నటించే యెఱుకవార మో యవ్వా! ౪

ధర నెల్లా సంచరించే యెఱుకవార మో యవ్వా!
తరిగొండధిపునిఁ గొలిచే యెఱుకవార మో యవ్వా!
౫

## ద్విపద

అని యిట్లు కొఱవంజి యనిన వాక్యములు
విని గంగ యా సతిన్ - వీక్షించి పలికె:

'ఇందుబింబాస్య! యో - యెఱుకల సాని!
యిందు రావే! వేడ్క - నీ పీఠమందుఁ

గూర్చుండవే! ముద్దు-గుమ్మ! నా కలఁకఁ
దీర్చవే! మనము సం-దేహ మొందినది;

తరిగొండ వాసుఁడౌ - దందశూకాద్రి
వరవాసుఁడగు శ్రీని-వాసుఁ బ్రార్థించి,

నిక్కంబుగాఁ దెల్పు - నేఁడు నా కోర్కె,
మిక్కుటంబైన నీ - మేల్ మఱువ నమ్మ!'

వ. అని పలికి, కొఱవంజిని మణిపీఠమందుఁ గూర్చుండ నియమించి, తాను కనకాసనాసీనయై యెదురుగాఁ గూర్చుండి యిట్లనుచున్నది: 178

## దరువు, జంపె తాళము

గంగా:- నిరుపమ బ్రహ్మకళ నీ ముఖంబున నిండి
మెఱయుచున్నది చూడ మీ కులం బేమే? ౧

కొఱవంజి:- ధర వెలయు నద్వైత పరమై ప్రకాశించి,
గురుతరంబైన మా కులము గురుకులమే! ౨

గంగా:- కొమ్మ! నీ యటువంటి కూతురిఁ గన్నవాఁ
డిమ్మహిని ధన్యాత్ముఁ డెంచ నతఁ డెవరే? ౩

కొఱ:- మేటి సింగఁడు రతన కూటములు గలవాఁడు
నీటి చేరువకాఁడు బోటి! మా తండ్రి. ౪

గంగా:- చెన్నలర గర్భమున పన్నుగా భరియించి
నిన్ను జను లెన్నఁగాఁ గన్నతల్లెవరే? ౫

కొఱ:- ఏఱులై యందందుఁ జేరు నవతుల నెల్లఁ
జీరి, పతిఁ గూర్చు పెద సింగి మా తల్లి. ౬

గంగా:- లలి మీఱఁగా మహాలక్ష్మివలె వెలిఁగేవు,
వెలఁది! నీ పేరేమి? వివరించి చెపుమ! ౭

కొఱ:- నిరత మా లక్ష్మినే నే నాశ్రయింపఁగా
సిరిసింగి యందురే తరుణి! నన్నెపుడు. ౮

గంగా:- నగు మోహనాంగి! విన వాకు వేడ్కయ్యీని
జగము లెన్నఁగ నీకుఁ దగిన మగఁ డెవరే? ౯

కొఱ:- ఇలను గారుడ విద్య లలరఁ జూపుచు నెపుడు
చెలఁగు తరిగొండ నరసింగఁడే మగఁడు. ౧౦

గంగా:-

తే.గీ.

సవతు లెందఱు నీకు నో సరసిజాక్షి?
కాంత! సంతాన మెందఱు గలిగినారె?
ఎపుడు కాపుర మెందుండు రింతి! మీరు?
తెలుపు మన్నను కొఱవంజి పలికె నిట్లు: 179

కొఱ:-వ. అవ్వో! యవ్వ! వినవే! నాకు బలుమంది సవతిసింగులు గలిగియుదారు. అవ్వో! యవ్వ! వారిలోపల కాచియైన వొక్క డొంకుల సింగి నాకన్నా పెద్దదియై, సింగనికి ఆధారమై యుండునే! దైధమ్మా! అవ్వో! యవ్వ! నా సంతానంబు లెక్కపెట్ట శక్యంబు గాదే! అవ్వో! యవ్వ! అందులో నలువ యను వాఁడు, తులువ యనువాఁడు - ఇద్దఱు కొడుకులు లోకమందు ప్రసిద్ధులై వుండారే యవ్వో! యవ్వ! ఇదిగాక, వడి సుళ్ళుమారి యనేది వక్క కూఁతురు లోకమందు పరమ పావనియై యుండాదే! దుండమ్మ! అవ్వో! యవ్వ! ఆ కూఁతురు మిత్తిగొంగ సింగని నెత్తి కెక్కి, నింగి ముట్టి, పొంగుచుండదే! అవ్వో! యవ్వ! అది నీ పోలికెగా వుండాది కాబట్టి, నిన్నుఁ జూచితే నా కడువులో జాలివాలి అవుతుండాదే! నా కొడకమ్మా! అవ్వో! యవ్వ! మా వంటి యెఱుక వారికి ఇల్లెక్కడ? వాకిలెక్కడ? మాయాభిధాన మహదరణ్యంబునకు అపర భాగంబున నుండే యెరుఖ వారమో వో దైధమ్మా! అవ్వో! యవ్వ! మే మెప్పుడు అయిదు కొండలపైన, రెండు నల్ల కొండల నడుమ నుండే త్రికూట పర్వతాగ్ర మందు వేయు సొపల గుడిసె వేసుకొని ప్రధాన జన్య విక్షేప ఆవరణాది భూతంబులను,

తజ్జన్య కామక్రోధాద్యనేక సింహ వ్యాఘ్ర భల్లూక ముఖ్య ఘోరమృగంబులను తత్త్వమస్యాది వాక్యంబులనే మంత్రంబులచేత వాకట్టు గట్టి, భయము లేక కాపురంబులు చేయుచుండుదుమే! దుండీ! 180

వ. అనిన విని జాహ్నవి యిట్లనుచున్నది: 181

## జంపె

గంగా:- వెలఁది! కొఱవంజి! డొంకుల సింగియును నీవు
పొలఁతి! యొక యింట కాఁపుర ముందు రఁటవే? ౧

కొఱ:- శీమాటి మా డొంకుసింగి వచ్చిన మొదలు
భామ! నే వేఱు కాఁపురము నుండుదునే! ౨

గంగా:- ఘనుఁడైన మీ సింగఁ డనుదినము మోహమున
వనజాక్షి! నీ కడకు వచ్చునో? రాఁడో? 3

కొఱ:- మూఁ డేకమై యున్న నాఁడు డొంకుల సింగి జోడు
విడనాడి ననుఁ జూడవచ్చినే! ౪

గంగా:- మదిరాక్షి! నీ విట్లు మహినిఁ దిరుగుచునుండి
యిది గాక దేశంబు లెన్ని చూచితివే? ౫

కొఱ:- చెలఁగి తరిగొండ నరసింగని సహాయమున
తెలివి గల దేశముల తిరుగుచుండుదునే! ౬

వ. అదిగాక, మఱి వినవే! దుండి! 182

## ద్విపద

పంకజేక్షణ! విను - పాంచాల భోట
కొంకణ కాంభోజ - కుంత లాభీర

శూరసేన సుధేష్ణ - చోళ నేపాళ
కేరళ మాళవ - కేక యావంతి

ద్రవిడ కుళింగ వి-దర్భ కళింగ
యవన టెంకణ మల-యాళ కరూశ

బంగాళ కోసల-బర్బర లాట
వంగాంగ కుకుర సా-ళ్వ కిరాత హూణ

గాంధార సింహ త్రి-గర్త కర్ణాట
సింధు పుళింద కా-శ్మీరాదులైన

విలసిత దేశముల్ - వింతగాఁ దిరిగి
యెలమి నందఱికి-నే-నెఱుక చెప్పుదును.

## ❁కొఱవంజి (తురిగొండ లక్ష్మి) గంగ కెఱుక చెప్పుట❁

### దరువు

కుందనంపు మొరిట తేవే! వో యవ్వ!॥పల్లవి॥

గొప్పైన ముత్యాలు పోయవే! యవ్వ!॥ఉపపల్లవి॥

ముందుగా సరిగాను నెఱపవే! యవ్వ!
మూఁడు పిడికిళ్లందుఁ బెట్టవే! యవ్వ ! ॥కుంద॥ ౧

ముమ్మాఱు చెయ్యెత్తి మ్రొక్కవే! యవ్వ!
మొనసిన బుద్ధికి చిక్కవే! యవ్వ! ॥కుంద॥ ౨

వెమ్మదితో నన్నుఁ జూడవే యవ్వ?
నీ మదిలో చింత వీడవే! యవ్వ! ॥కుంద॥ ౩

నిలిచి బెత్తము చేతఁ బూనవే! యవ్వ!
నీ వింక నరమర మానవే! యవ్వ! ॥కుంద॥ ౪

చెలఁగి నీ కోర్కె నేఁ జెప్పెనే! యవ్వ!
చిక్కులు గిక్కులు విప్పెనే! యవ్వ! ॥కుంద॥ ౫

వ. అని పలికి యెఱుకల సాని తన యిష్టదేవతా ప్రార్థనంబుఁజేసే విధం బేటువలెను: 183

## దరువు

గణపతీ! రారా! గట్టి వాక్కియ్యరా! ౧

నళినభవా! రారా! నగుచూ వాక్కియ్యరా! ౨

మాధవా! రారా! మంచి వాక్కియ్యరా! ౩

శంకరా! రారా! చల్లని వాక్కియ్యరా! ౪

మిత్రుఁడా! రారా! మేలి వాక్కియ్యరా! ౫

వ. అని పలికి, యెఱుకల సాని మఱి న్నిట్లనుచున్నది: 184

## దరువు

సలలిత యేకాంబ్ర సామీ! వాఖియరా!
వో సామీ! వాఖియరా!
నలువొంద శ్రీ జంబునాథా! వాఖియరా!
వో నాథా! వాఖియరా! ౧

అరుణాచలేశా! మేలైన వాళియరా!
మేలైన వాళియరా!
ఇరవొంద కాళహస్తీశా! వాళియరా!
ఇరవొంద వాళియరా! ౨

ఆలోన చిదంబరయ్యా! వాళియరా!
ఓరయ్యా! వాళియరా!
సాలా శెళఫెళ రాయా! నక్కనీ వాళియరా!
శెళఫెళ రాయా! నక్కనీ వాళియరా! ౩

మన్నారు కృష్ణా! నీవు మంచి వాళియరా!
మన్నారు కృష్ణా! మంచి వాళియరా!
పన్నగ గిరి రాయా! బాగా వాళియరా!
పన్నగ గిరిరాయా! వాళియరా! ౪

ధరణీశ! శ్రీ రంగధామా! వాళియరా!
శ్రీరంగధామా! వాళియరా!
వరము లిచ్చే కంచివరదా! వాళియరా!
కంచి వరదా! వాళియరా! ౫

హరిణాయతాక్షి! కామాక్షి! వాళియ్యవే!
కామాక్షి! వాళియ్యవే!
అరమర లేక చౌడాంబా వాళియ్యవే!
చౌడాంబా! వాళియ్యవే! ౬

దొరకొని బెజవాడ దుర్గీ! వాళియ్యవే!
ఓ దుర్గీ! వాళియ్యవే!

అరసి మా కొల్లాపురెమ్మా! వాళియ్యవే!
మా కొల్లాపురెమ్మా! వాళియ్యవే! ౭

సీతాధిపతీ! నీవు సెలఁగీ వాళియ్యవే!
నీవు సెలఁగీ వాళియ్యవే!
శ్రీ తరిగొండ నరసింహా! వాళియ్యవే!
శ్రీ తరిగొండ నరసింహా! వాళియ్యవే! ౮

వ. అని యిట్లు ఇష్టదేవతా ప్రార్థన చేసి, జాహ్నవినిఁ జూచి యిట్లనుచున్నది : 185

**యెఱుకల జాతి వచనము**

'వినవే! దుండి! నీవు తలంచిన తలంపులు శేఖరమవుతుండాదంట. దేవళ్లు వచ్చి పలుకుతుండారు. ఆ దేవళ్ళు యెవ్వరు? యెక్కడ? యే వూర నుందు? రంటడుగవే! యవ్వ! ఆ దేవళ్లు బ్రహ్మానంద నగరంబులో నుండారు. ఆ నగరంబు యే యందాన వుండును? యే చందాన వుండును? - అని యెఱుఁగఁ చెప్పమంటుండావు. ఆ నగరంబు చుట్టూ యేడు కోటలుండావి. ఆ యేడు కోటలకు నడుమ రెండు ప్రవాహంబు లుండావి. ఆ రెండు ప్రవాహంబుల మధ్యంబున నొక్క ఫణి వుండాది. ఆ ఫణి తుదను నిత్య నిర్మల నిరామయ నిష్కళంక నిష్ప్రపంచ నిరాలంబ నిరంజన నిర్వికారాఖండ స్వయం జ్యోతి స్వరూపమై, మా యెఱుఖ కులంబున కలసి మెలసి, భేదాభేదంబులు లేక, తాను తానై ప్రకాశించిన సచ్చిదానంద నిత్య పరిపూర్ణుండగు సద్గురుండు ఫణి తుదను నీల తోయద

మధ్యంబున నిలిచి, సర్వదేవతలు గొలువ బ్రహ్మానందపురంబు పాలన సేయుచుండాఁడు. ఆ సద్గురుండు నేఁదలంచిన తలంపులు దెలిసి, నేఁ బిలిచిన పిలుపులు విని, తా నిలింపులు గూడి వచ్చి, యిక్కడ నిలిచి, నీ కోర్కెలు మంచిదౌతుండాదంట చెప్పుతుండాఁడు. యిది ఖల్ల గాదు; ఖైలాటము గాదు; దబ్బఱ గాదు; బబ్బఱ గాదు; తబ్బిబ్బు గాదు; తాటోట్లు గాదు; లోడంభరము గాదు; నిజమవుతుంధాది.'- అని పలికి, యెఱుకసాని యిట్లనుచున్నది : 186

## ద్విపద

ఇపు డొక్క కోరికె-యిందీవరాక్షి!
నిపుణత మీఱను - నీ మనంబందుఁ

దలఁచియున్నా; వది - తాటోట్లు గాదు;
తెలియఁజెప్పెద నీకుఁ-దెల్లంబుగాను,

ఆఁడదంటే సెవి-యమర సూపుదును;
పోఁడిమి మీఱఁగాఁ - బురుషుఁడైతేను

సుదతిరో! గడ్డంబు - సూపుదుఁ దెలియ,
నదె మొగవారికై - యడిగితి వనుచు

మొనసి దేవళ్లు నా-ముందఱ నిలిచి
పనిఁబూని వరుసగాఁ-పల్కుసుంధారు.

దబ్బఱో, నిజమొ నీ-తలఁచిన తలఁపు
తబ్బిబ్బులయ్యాని - దాఁచక చెపుము!

కలికిరో! బిడ్డంటె - కడుపు సూపుదును;
పొలఁతి! పైదోడంటె - భుజము మూపుదును;

పొందుగా విభుఁడంటె బొడ్డు సూపుదును;
ఇందుబింబాస్య! నీ విందులోఁ దెలియ

నతివ! గర్ధము పులి-కడిగితి వీవు;
అతఁ డెవ్వఁడంటె వి-శ్వాతీతమూర్తి,

యేణాంకధరుఁడు, వి-న్నేలినవాఁడు.
జాణ! యీ మాట ని-శ్చయమె వో దుండి!

వ. అనిన విని జాహ్నవి మనంబున హర్షించి శిరః
కంపంబుఁ జేసి యిట్లనుచున్నది: 187

## దరువు.

గంగా:- హితవు మీఱఁగను నీ విన్ని చెప్పితివి
అతఁ డిప్పఁ డెందున్నాఁ? డరవింద నయనా! ౧

కొఱ:- హరిణాక్షి! చూడు మల్లదిగొ! అల్లదిగొ!ఈశాన్య
మూలా
పరఁగ నీశానుఁడై ప్రబలుచున్నాఁడే! ౨

గంగా:- ఇందేల రాఁడె? వో యిభరాజయానా?
వోయిభరాజయానా?
కుందాక తెలుపావె! కువలయ నయనా! 3

కొఱ:- చెలియ! నీ సవతిచేఁ జిక్కియున్నాఁడే!
సవతిచేఁ జిక్కి యున్నాఁడే!
అలివేణి! నీ మీఁద యలిగిందు రాఁడే! ౪

గంగా:- ఎందు కలిగెనె కాంతుఁ? డిది యేమె భామా?
కాంతుఁ డిది యేమె భామా?

ముందుగా నది తెల్పు ముగ్ధలలామా! ౫

వ. అనిన విని యెఱుకల సాని క్రమ్మఱ
నిష్టదేవతా ప్రార్థనంబుఁ జేసి యిట్లనుచున్నది:188

ద్విపద

కొఱ:- చేడెరో! నా మాట-చెప్పెద వినుము!
పోఁడిమిగా ముని-పుంగవుఁ డిటకు

అతులితంబగు రత్న-హారంబుఁ దెచ్చి,
హితవుగా నీ పతి-కిచ్చిన, దాని

నీ సవతికి నిచ్చి - నిన్నుఁ దలంచి
భాసురాత్ముఁడు లోన - భయమంది, బయటఁ

గలహించు చందంబు-గా మాటలాడి,
యలికించె, నీ మీఁద - నరమర లేదు;

శివుఁడల్ల గిరిజ కి-చ్చిన హార విధము
భువి నెన్నఁగా విరాట్-పురుష నిర్మితము

గావున నది హెచ్చు-గాదు; లోకముల
కావల వెలిఁగే ప-రాత్ముండు బ్రహ్మ

దేవున కిచ్చిన-దివ్య హారంబు
నీవు కావలెనని - నీ పతి నడుగు!

నెళవుగా నది తెచ్చి - నీ కిచ్చు నతఁడు;
జలజలోచన! నీవు - జగములు మెచ్చఁ

గేవల మొక చమత్ - కృతిఁ జూపినావు;
దేవత లందుకై - దేవి! నీ పతినిఁ

బనిఁబూని యీవేళఁ - బ్రార్థించి యిచటి
కనిపెద; రిదె నమ్ము - మబల! నిక్కముగఁ

బంకజేక్షణుతోడె! - పద్మజుతోడె!
బొంకుగాదే దుండి! - బుడుతని తోడె!

వ. అని యిట్లు జాహ్నవికి మనోరంజనంబుఁ జేసి,
మఱియు నిట్లనుచున్నది: 189

### దరువు, ఆది తాళము

ఇన్ని విధములుగా నే నెఱుక నీకుఁ జెప్పినానే!
చిన్ని నా బుడుతని కేమిచ్చేవు చెప్పవే? ॥పల్లవి॥

అందెలు, మువ్వ లిచ్చేవా? మఱి
సందిటి దండ లిచ్చేవా? నా
కందనికి కెంపుల మద్దికాయ లిచ్చేవా?॥ఇన్ని॥ ౧

పులిగోరు సరిపెణ లిచ్చేవా? మఱి
పొందగు అవిక లిచ్చేవా? నా
పట్టికి కొండెకు ముత్యపు కుచ్చు లిచ్చేవా? ॥ఇన్ని॥ ౨

పచ్చల కడియము లిచ్చేవా? మఱి
బంగరు మొలత్రా డిచ్చేవా? నా
బుజ్జిపాపనికిఁ బాలుబువ్వ పెట్టేవా? ॥ఇన్ని॥ 3

## ❀ సింగని రాక ❀

### ద్విపద

అని పల్కుచుండఁగా - నంతలోఁ జక్రి
ఘనత మీఱఁగ సిం-గని రూపుఁ దాల్చె;

నది యెట్టులనిన మ-హాద్భుతంబుగను
గుదెబడు కాళ్ళును - కుంటైన వ్రేళ్లు,

నుంట పొక్కిలి బుఢ్ఢ, - యూసు పిఱ్ఱలును,
తుంట చేతులు, మహా - స్థూలమౌ కడుపు,

బొక్కి ఱొమ్మును, సొట్ట-బోయిన మెడయుఁ,
గొక్కి బిక్కిరిపండ్లు, - కోర మీసములు,

బాకి నోరును, పెద్ద - బవిరి గడ్డంబు,
భీకరంబుగ మేన - బిరుసు రోమములు,

బుఱ్ఱముక్కును, పెద్ద-పులివంటి మోము,
ఎఱ్ఱటి కన్నులు, - నేనుఁగు చెవులు,

బఱ్ఱె నొసల్, తెల్లఁ-బాఱిన బొమలు,
చిఱ్ఱ వెండ్రుకలును - చిందులాడంగఁ

గక్కెర్లఁ, గొఁజులఁ, - గార్కోళ్ళఁ, బంది
కొక్కులఁ, గుందేళ్ళఁ, - గొంగపిల్లలను

చక్కగాఁ బిగఁబట్టి - చంకను బెట్టి,
పిక్కిలి గువ్వలన్ - పిడికిటఁ బట్టి,

చెలcగుచు, ముమ్మాఱు - 'సింగి'! యటంచుc
బిలుచుచు, కన్నులు - బిక్కరింపుచును,

మడియతనంబుగా - మాట లాడుచును,
విడివడి నవ్వుచు - వెక్కిరింపుచును,

బలమైన కైలాస - పర్వతంబునకుc
జెలువంబుతో నార - సింగc డేతెంచె.

## దరువు, అట తాళము

'సింగి! సింగి!' యనుకుంట శికిలి నవ్వు నవ్వుకుంట
సింగన గంతులు వేసుకుంటా సింగcడు వచ్చెనూ
॥పల్లవి॥

తెల్ల మీసముc దీడుకుంటా
తిరిగి తిరిగి చూచుకుంటా
అల్లి బిల్లి లొల్లి మాటలు
ఆడుకుంటానూ ॥'సింగి!సింగి'!॥ ౧

గొంగడొకటి మొలను జుట్టి
కోడి పుంజుల్ చంకా బెట్టి
కొంగా యీకెల్ తలను గట్టి
కులుకూ కుంటానూ ॥'సింగి!సింగి'!॥ ౨

గొప్ప విల్లమ్ములు బట్టి
కొడవలి పెండెలు వీపునc గట్టి
తిప్పాటనక వీథి వీథి
తిరుగుకుంటానూ ॥'సింగి!సింగి'!॥ 3

నా పేరూ శ్రీ తరిగొండా
వారసింగఁ డనుకుంటా
చూపుద్రిప్పి తన్ను తాను
చూచుకుంటానూ ॥'సింగి!సింగి'!॥ ౪

వ. ఇవ్విధంబున వచ్చిన సింగఁడు సింగిసానిని
వెదికే విధం బెటువలెను: 190

**దరువు**

సింగినిఁ గానరుగా? యిందెందు
లచ్చి, సింగినిఁ గానరుగా? ॥పల్లవి॥

గలగలమంటా కూసేవేమో
కాళ్లనిండా గట్టుక వచ్చె ॥సింగినిఁ॥ ౧

మినమినమనీ మెఱసేవేమో
మెడనిండాను వేసుక వచ్చె ॥సింగినిఁ॥ ౨

సుట్టాకుదుళ్లా వంటివి
పట్టుగ సేతులఁ బెట్టుక వచ్చె ॥సింగినిఁ॥ 3

బల్లివలె వుండేదేమో
పాపటలోఁ దగిలించుక వచ్చె ॥సింగినిఁ॥ ౪

బుట్టీ నెత్తిన బెట్టుక వచ్చె
బుడుతని సంకనఁ గట్టుక వచ్చె ॥సింగినిఁ॥ ౫

'శ్రీ తరిగొండా నార
సింగా!' యనుకుంట వచ్చె ॥సింగినిఁ॥ ౬

వ. ఇవ్విధంబున సింగఁడు వెదకుచున్న సమయంబున సింగిసాని జాహ్నవి చేత దివ్యాభరణంబులు గైకొని వచ్చి, పొడగన్న వారితో నిట్లనుచున్నది: 191

### దరువు, అట తాళము

సింగనిఁ గానరుగా! నక్కాని నార
సింగనిఁ గానరుగా! ॥ పల్లవి ॥

మిడిగ్రుడ్ల వాఁడు, బల్ మిట్ట నొసటివాఁడు
జడుపు లేకను పుణ్యజనులఁ గొట్టిన నార
॥ సింగనిఁ ॥౧

బాన కడుపువాఁడు, బాకి నోటివాఁడు
నా నా వింతలుగాను నటియించే యెఱుకల
॥ సింగనిఁ ॥౨

కోఱ మీసము వాఁడు, గోళ్లు పెంచిన వాఁడు
గారడీ విద్య నిక్కముగాఁ జూపిన నార

॥ సింగనిఁ॥ 3

## ❁ సింగీ, సింగళ్ల సమాగమము, సంభాషణము ❁

వ. అని యివ్విధంబున వెదకే సింగిసాని సింగనిం జూచి యిట్లనుచున్నది: 192

### దరువు, ఆది తాళము

సింగి:- అడా! యెన్నడా? యింగె వాడా సింగా! నీ
గుడిసై విట్టు యింగె వంద దేండా సింగా? ౧

సింగ:- గుడిసై కుక్కళ్లె ఎళిగల్ వందదు కలికి సింగీ!
ఎన్నై, కడిక్కుమెన్న భయందు వందేన్ కలికి సింగీ! ౨

సింగి:- ఉన్నై పార్క శూరన్ బోలే యిరుక్కుదు సింగా!
యిప్పో, మెన్నుడనె భయందు శొల్లువ దేండా సింగా? ౩

సింగ:- పోయ్ గళెల్లాం వున్నైవిట్టు పోగేన్ సింగీ!
యిప్పో, పోలాం తరిగొండైక్కి వాడీ సింగీ! ౪

వ. అని సింగఁడు సింగి కొంగుఁబట్టి తీసిన,సింగిసాని చూచి,నవ్వి యిట్లనుచున్నది:193

## దరువు, ఆది తాళము

సింగి:- ఇల్లు విడిసి యిట్లా వత్తు దేర? సింగా! నేఁ
జెల్లా! నిన్నేమందు నోయి? చికిలి సింగా! ౧

సింగ:- ఇంటి జోలేలానే? వాలుఁగంటి! సింగీ! నీ
వెంట నంటియుంటే చాలు వెలఁది! సింగీ! ౨

సింగి:- గాడిద లాఱెందుఁ బోయెనో గదర? సింగా!
అయిదు, దూడ లెందు మేయఁ జనెనో? దుడుకు సింగా! ౩

సింగ:- గాడి మొదట తాడు గట్టి కలికి! సింగీ! వాటిని
కూడఁ గట్టి వచ్చినానే! చేడె! సింగీ! ౪

సింగి:- ఎగసెక్కము నేరిచితి వెట్ల సింగా? బ్రతుకు
నగుఁబాటాయె తరిగొండ సింగా! ౫

## దరువు

పింగ:- కడు గ్రొవ్వి యెలుకాలు కఱచునో యని భీతి
పడి నేను వచ్చితి బైకారి సింగీ! ౧

పింగ:- గుడిసె నీ వెందుకై విడిచి వచ్చిన, పెద్ద
కొడుకెందుఁ బోయెరా? కోఱంగి సింగా! ౨

పింగ:- గండెలుక గమికిఁ జిక్కక పోయి, మన పెద్ద
కొండపైఁ జేరుకొని యుండాఁడె సింగీ! ౩

పింగ:- ఆ వేయి సాపల నల్లిన గుడిసెలో
కావ లెవ్వరురా? పోరా! గారడపు సింగా! ౪

పింగ:- ఆ గుడిసెకే కావలై తల కిందుగ
నాగుబామున్నదే నా ముద్దు సింగీ! ౫

పింగ:- ఆ నాగుబాము నల్ల; దిందుండె పాముతో
పూని కూరుచు పోరా! బూటకపు సింగా! ౬

పింగ:- అది గూర్చి, తరిగొండ హరినైన నాతోను
కదిసి యుండవె! నీవు గారడపు సింగీ! ౭

## దరువు

పింగ:- జల్లి పుటికె లల్లుకుంట యిల్లు గాచుకుండమంటె
యిల్లు పాల్లుఁజేసి వచ్చి కల్ల లాడేవా?
సింగా! కల్లలాడేవా? ౧

పింగ:- ఇక్కడక్కడాను తిరిగి కక్కెరాలఁ దెచ్చి పెడితె
మెక్కి, క్రొవ్వి నీవు నన్ను కొక్కరించేవా?
సింగీ! కొక్కరించేవా? ౨

పింగి:- త్రిప్పటనక తిరిగి యెఱుకఁ జెప్పి, కూడు దెచ్చి పెడితె
మొప్పెవలెఁ దింటావుండి కొప్పరించేవా?
సింగా! నీవు కొప్పరించేవా? 3

పింగ:- జంగ చాఁచి పొంచివేసి, కొంగలాను దెచ్చిపెడితే
నంగనాచి వలె మ్రింగి, దొంగ మూల్గులా?
సింగీ! దొంగ మూల్గులా? ౪

పింగి:- అక్కలమ్మ లెల్ల నిన్ను వెక్కిరించి నవ్వఁగాను
పిక్కు దెలియలేక కండ్లు బిక్కరించేవా?
సింగా! బిక్కరించేవా? ౫

పింగ:- ధరను వెలయు తరిగొండ పురములో నన్ను విడిచి,
తిరిగి వచ్చి నన్ను నీవు సరకు సేయవా?
సింగీ! నన్ను సరకు సేయవా? ౬

## దరువు

పింగి:- తిరిగి తిరిగి నేను తెచ్చితి సొమ్ములు
పరఁగ నీవేమి సంపాదించ; వటుగాన
సింగా! నిన్నొల్లరా! చక్కని నారసింగా! నిన్నొల్లరా! ౧

పింగ:- కక్కెర్ల గిక్కెర్ల, కార్కోళ్ల గీర్కోళ్ల, కంజూల గింజూల
గ్రక్కునఁ దెచ్చితి; సింగీ! యివి వండవే!
చక్కని లచ్చి సింగీ! యివి వండవే! ౨

పింగి:- పరికరములూ దేవు, గిరికరములూ దేవు;
ధరకాట భరకాట తప్పలు బట్టేవు;
సింగా! నే నొండరా! చక్కని నారసింగా! నే నొండరా! 3

సింగ:- అసమానమైనట్టి పసుపు, తెల్లగెడ్లు
పసమీఱఁ దెచ్చేను, బాగైన రుచిగాను
సింగీ! యివి వండవే! సక్కని లచ్చి సింగీ!
యివి వండవే! ౪

సింగి:- పుడమీలో నీవింక నడియాస వీడాక
లొడుగు కాఁపుర మిట్లు మెడఁగట్టుకుండావు;
సింగా! నిన్నొల్లరా! చక్కని నారసింగా! నిన్నొల్లరా! ౫

సింగ:- కాఁపూర మందిట్ల కలసినట్టే యుండి
యా పరంజ్యోతిక నైయుందు నెప్పుడు
సింగీ! నన్నేలవే! చక్కని లచ్చి సింగీ! నన్నేలవే! ౬

సింగి:- అందు నీ వుంట కానందింప నేర్చితే
పొందుగా తరిగొండ పురములో నుందాము;
సింగా! యిఁక పదరా! సక్కని నారసింగా! యిఁక
పదరా! ౭

వ. అని యిట్లు సింగ్గీ, సింగడున్ను అన్యోన్యంబుగా తరిగొండ పురంబుఁ జేరి, నిజ స్వరూపంబులు ధరియించి, సుఖస్థితి నుండి; రంత. 194

## ❁ దేవేంద్రుని యాగమనము ❁

### ద్విపద

ఆ వేళ దేవేంద్రుఁ - డఖిల లోకముల
జీవనంబులు లేని - చిత్రంబుఁ జూచి,

తడఁబడి యైరావ - తంబుపై నెక్కి,
తడయక వజ్రాయు-ధమును చేపట్టి,

దివ్యభూషణములు - దివ్యాంబరములు
దివ్య పుష్పంబులు - తెఱఁగొప్ప మెఱయ,

సకల దేవతలును - సకల దిక్పతులు
సకల మునీశ్వరుల్ - సకల సేవకులు

కొలువ నా కైలాస - కుధరంబుఁ జేరి,
నలలితుఁడై శైల-జాత మందిరము

వాకిట నిలిచె; స-వ్యాసవు రాక
జోకగాఁ బ్రమథులు - చూచి యిట్లనిరి:

**దరువు**

ఇంద్రుఁడు వచ్చెనూ; నిర్జ
రేంద్రుఁడు వచ్చెనూ ॥పల్లవి॥

వేగఁ, జంద్ర శేఖరుని వేఁడి,
జలమూలు దెప్పించే నని
యింద్రుఁడు వచ్చెనూ ॥ఉప పల్లవి॥

ధావళ్యకాంతుల నొప్పు
దంతిరాజు మీఁద నెక్కి
దేవ సంఘములు గొలువ
భావజారి సన్నిధికి ॥ఇంద్రుఁడు॥ ౧

మునుల నెల్లాఁ దోడుకొని
మొనసి మదిలో ముదమునూని
తన వేయు కన్నూల
తనివిదీఱఁ జూచేనని ॥ఇంద్రుఁడు॥ ౨

తరిగొండా నారసింహుని
తనుజయైన మందాకినీ
స్ఫురణమెల్ల పరమా శివుని
కెఱుకా సేయవలేనని ॥ఇంద్రుఁడు॥ 3

వ. అని యిట్లు ప్రమథులు పలుకుచున్న సమయంబున భృంగీశ్వరుండు దేవపతినిఁ జూచి 'నీ వెవ్వరయ్యా? ప్రమథులెల్లఁ దగ్గన నుండఁగా నీవు దంభంబుగాఁ గుంభిమీఁదఁ గూర్చుండి వచ్చినావు. ఆ వృత్తాంతంబు సవిస్తరంబుగాఁ దెల్పు'మనిన దేవేంద్రుం డిట్లనుచున్నాఁడు: 195

## ❋ దేవేంద్రుని వృత్తాంతము ❋

### ద్విపద

వినవయ్య! భృంగీశ! - విశదంబుగాఁగ
ననఘవర్తనయైన - యదితి మాతల్లి;

జననుతుఁడైన క-శ్యపుఁడు మా తండ్రి;
పెనుపొంద వామనో-పేంద్రు లిద్దఱును

నా కూర్మితమ్ము లె-న్నఁగ శచీదేవి
ప్రాకటంబుగ నాకుఁ-బట్టపు రాణి;

యలరారు ముద్దు జ-యంతుండు కొడుకు;
ఫలితార్థదుఁడు బృహ-స్పతి పురోహితుఁడు;

సప్త దిక్పాలకుల్ - సామంత దొరలు;
సప్త తురంగుండు - జనియించు దిశను

తెఱఁగొప్పు నమరావ-తీ నగరంబుఁ
బరిపాలనము సేయు - ప్రభువును నేను;

ఇంద్రుండు నాదు పే,-రీ వేళ నిటకుఁ
జంద్రశేఖరుఁ జూడఁ - జనుదెంచినాఁడ;

నటుగానఁ దరిగొండ - హరిమిత్రుఁడైన
నిటలాక్షుఁ జూడక - వేఁబోవ నవల,

నా రాకఁ దెలుపుమా! - నాగ కంకణున,
కే రీతినైన భృంగీశ! యీ వేళ.

వ. అనిన విని భృంగీశ్వరుండు 'హోయి! దేవేంద్రుఁడా! నీవు యేలే అమరావతీ పురంబులో నేమేమి వింత వస్తువులు గల?' వనిన నింద్రుం డిట్లను చున్నాఁడు: 196

## దరువు, జంపె తాళము

వినుము! భృంగీశ! నే విహరించు మా పురినిఁ
దనర ఘనమైన నందనవనము గలదూ ౧

తలఁచిన పదార్థములు గలుగఁజేసెదననుచు
విలసితంబగు కల్పవృక్షంబు గలదూ. ౨

నేను నా మదిలోనఁ బూని కోరిన రుచుల
నీని యొసఁగెడి కామ-ధేనువయుఁ గలదూ౩

నిరతంబు సుస్వాదు నెఱపు పుష్పములతో
సరసమై తగు పారిజాతంబు గలదూ ౪

మృతిఁ బొందనియక సమ్మతముగా మముఁబ్రోచి,
యతిశయంబైనట్టి యమృతంబు గలదూ ౫

అమిత పుణ్యాత్ములకు వానంద మొసఁగుటకు
రమణీయులగు నప్సరస్త్రీలు గలరూ ౬

కరుణతో నివి మొదలుగా సకల భాగ్యములు
తరిగొండ హరి మాకు దయ నిచ్చినాఁడూ? ౭

వ. అనిన విని భృంగీశ్వరుండు 'అహో! దేవేంద్రుఁ
డా! నీ బాహు పరాక్రమంబున నెవరిని శిక్షించితివి?
ఎవరిని రక్షించితివి? ఆ వృత్తాంతంబుఁ దెలుపు'
మనిన విని, జంభారి యిట్లనుచున్నాఁడు: 197

ద్విపద

భృంగీశ! వినుము నే-భీకరంబుగను
సంగరోన్ముఖుఁడనై - శతధారఁ బూని

కొండల తెక్కలు - గూలంగ నడిచి,
దండిగా సాధు యూ-థములఁ బ్రోచితిని;

దంభోళిచేత ను-ద్దండ శౌర్యమున
జంభాసురునిఁ గొట్టి-జగతి వైచితిని;

పాకాసురునిఁ బట్టి - భండనమందుఁ
జీకాకుచేసి కూ-ల్చితి సురల్ పొగడ;

వీరాగ్రగణ్యుఁడై - వృత్రాసురుండు
పోరవచ్చిన, వాని-పొంగణంచితిని;

మహిమ నొప్పు సముద్ర - మథన కాలమున
బహుదైత్య వీరులఁ - బట్టి చంపితిని;

అమరఁగా నపుడు దు-రాగ్రహంబువను
నముచి యనెడువాఁడు-నానా విధముల

దేవ సంఘములను - తెరలించి మించి,
కావరంబునఁ గన్ను-గానక హెచ్చి,

పటు సాధనంబు నా-పైఁ బ్రయోగింప
నటు వాని సాధనం - బవలీలగాను

నడుమఁ జెచ్చెరఁ బట్టి నలినలి చేసి,
వడిఁ బేర్చి వానిపై - వజ్ర మేసితిని;

ఆ కులిశము వాని - నణఁపలేదయ్యె;
భీకరంబుగ వాఁడు-బెదరింపసాగెఁ;

జపలాత్ముఁడగు వానిఁ-జంపు నుపాయ
మపుడు నా కెఱిఁగించె నాకాశవాణి;

మెండగు నా యుక్తి - మెచ్చి డిండీర
ఖండ ప్రయోగంబు - గావించి, వాని

ఖండించి విజయంబుఁ - గైకొంటి నేను;
ఖండేందుధరుని శీ-ఘ్రమె చూడవలెను.

వ. అనిన విని భృంగీశ్వరుండు సంతసించి శచీపతిని, సుర సంఘములను బార్వతీ పతి సాన్నిధ్యమునకుఁ దోడ్కొని పోయె; నంత నింద్రుండు చంద్రశేఖరునిం గని వినుతించే విధం బెటువలెను:

## * శచీపతి పార్వతీపతిని వినుతించుట *

### చూర్ణిక

శ్రీమత్పరమేశ్వర పరాత్పర పరమ చిదంబర పరిపూర్ణ స్వయంజ్యోతి స్వరూపా! విమల విజ్ఞాన ప్రదీపా! ౧

వసుంధరా నీర హుతాశన పవన గగనాహంకార మహత్తత్త్వావృత బ్రహ్మాండ సర్జన పాలన సంహార కారణా! జన మనోద్ధారణా! ౨

విమలతర శాంతరస పూరితోన్నత ప్రాలేయ ధరణీధరేంద్రవర కన్యకార్ధశరీరా! మదనాచల శతధారా! 3

అపరిమిత ప్రభావాతిశయ గగన గంగా తరంగ సంగీత జటామకుటాభిరామా! సకల యోగీశ్వర స్తోమా! ౪

ప్రకృతిజన్య సత్త్వ రజ స్తమోగుణ కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాద్యనేక దుర్విచారాశ్రయ మూలావిద్యాంధకార విరహితా! తరిగొండ నరకేసరి హితా! పాహి మాం పాహి మాం పాహిమాం. ౫

శ్లో॥ సచ్చిదానంద రూపాయ సర్వాత్మన్ సర్వసాక్షిణే।
శాశ్వతాయ విశాలాయ శివాయ గురవే నమః॥199

వ. అని నమస్కరించి, సురపతి దేవ సంఘముల తోఁ గూడి పరమేశ్వరునకు మఱి న్నిట్లు విన్నవించు చున్నారు: 200

## ద్విపద

'శ్రీ పార్వతీలోల! - శృంగారలీల!
పాపాహి విహగేంద్ర! - పటు కృపాసాంద్ర!

నిత్య నిరాకార! - నిగమాంత సార!
సత్యాత్మ!' యని చాల - సన్నుతిఁ జేసి,

వినుమని పల్కి ర-వ్విమల మానసులు:
జననుత! నీ మీఁద - జాహ్నవి యల్గి

మహిమచే సలిలంబు-మాయంబుఁ జేసి,
బహుళ విరక్తి ని-శ్చయముగాఁ బూని,

మదిలోనె క్రోధించి - మరు ధిక్కరించి,
పదరినంత నజాండ - భాండంబు వణఁకె;

మౌనీంద్రులకు, మాకు, - మఱియు జీవులకు
స్నాన సంధ్యాదిగా - సత్క్రియల్ నిలిచె;

కావున మేము మీ - కడకు వచ్చితిమి;
నీ వికఁ మందాకి-నీ మనంబునకు

సమ్మతిగాఁ జేసి - జలము రప్పించి,
మమ్ము రక్షింపుమో - మహితాత్మ!' యనుచు

సారెకు వినుతింపఁ, - జంద్రశేఖరుఁడు
వారల నీక్షించి - వాసిగా ననియె:

తే.గీ. విబుధవరులార! మీ మాట వింటిఁ దెలియ,
మగువ జాహ్నవి మనసు రమ్యంబుఁ జేసి,
సంతసంబుగ జలముఁ దెప్పింతు నిఁకను
పొండు! నెమ్మదిగానె మీ పురములకును. 201

వ. అని పలికి, శక్రాదుల నిజ నివాసంబుల కనిచి, పరమేశ్వరుండు పార్వతిని౯ జూచి యిట్లనుచున్నాఁడు: 202

వర:-చ. సురవరు లన్నమాట లిటు సుందరి! చక్కఁగ నీవు వింటివే!
ధర బలవద్విరోధమునఁ దప్పను కార్యమటంచుఁ జూడకన్
విరసపు మాట లాడుటకు విశ్వమె ముంపఁదలంచె; దాని నే
కరణిని గారవింతు? నుదకం బిఁక నేగతిఁ దెత్తునే సతీ? 203

పార్వతి:-
చ. పరమ దయార్ద్రలోక పరిపాలుఁడవంచు నిరంతరంబు నిన్
ఇరవున వేదముల్ పొగడ, నేమి యెఱుంగని వాని చందమై
వెఱచుచు నందుఁ బోయి తగవేఁడిన, సఖ్యము గల్గనేర్చునే?
సొరిదిగ దాని సాహసముఁ జూతము తాళుము! ప్రాణవల్లభా! 204

వర:-చ. ముదమున నిట్లు పల్కుచును మూర్ఖత సేయఁగ వేళగాదు; చూ
డదిగో! సమస్త లోకముల కాశ్రయమైన జలంబు లేమిచే

బెదరి సురేంద్రముఖ్యు లిటు పేర్కొని నన్ను
భజించినప్పు, డే
నుదకముఁ దేక, యిచ్చటనె యూరక యుండిన
మెత్తురే సతీ? 205

**పార్వతి:-**
**తే.గీ.** దాని యిలుఁ జేర మదిలోనఁ దలఁచినావు;
మంచితనముగఁ జూచి నా మాట వినవు;
నీలకంధర! యింక నీ వేళనుండి
నిన్నుఁ జూడక నే నెట్లు నిర్వహింతు? 206

వర:-తే.గీ. చింత యేలనె?నాముద్దు చిగురుఁబోణి!
నిన్ను నెడఁబాసి నేనందు నిలుతునఁటవె?
కార్య నిర్వాహమునకునై గంగకడకుఁ
బోయివచ్చెద సెలవిమ్ము! తోయజాక్షి! 207

## ❀ శంకరుఁడు గంగ యింటి కేతెంచుట ❀

**ద్విపద** అని యివ్విధంబున - నయ్యింతిచేతఁ
పనిఁ బూని సెలవంది - ఫణి భూషణుండు

వేవేగమున జాహ్న-వీ సౌధమునకుఁ
బోవుచునుండి య-ప్పుడు తనలోన

'నే విధంబునఁ బోదు - నెలనాఁగ యింటి?
కే విధంబునఁ దీర్తు - నింతి కోపంబు?

నేమి సేయుదు? నింక - నేమి యుపాయ?
మీ మానినీమణి - నెట్లు లాలింతు?

వెఱపింతునని పోయి - వెఱఁగంది తానె
వెఱచినట్లాయె నీ - విధము భావింప'

నని యివ్విధంబున నఖిలేశ్వరుండు
తన మది నొక్కింత - తడవు చింతించి,

మరలఁ ధైర్యముఁ జేసి - మదనాంతకుండు
వర జహ్నుసుత యింటి - వాకిట నిలిచి

నంతట, జాహ్నవి - యతికోప మెసఁగఁ
బంతంబుతో వచ్చి, - ప్రబలు చున్నట్టి

ఢాకతో మణి కవా-టమును బంధింప,
శ్రీకంఠుఁ డట మోముఁ - జిన్న చేసికొని,

యచ్చటఁ దన కాప్తుఁ - డైన భృంగీశు
నచ్చుగాఁ జూచి యి-ట్లని చెప్పఁదొడఁగె:

## దరువు

వర:- ఏమి సేతురా? భృంగీశా!
ఏమి సేతు నే నిచటికి రాఁగని
వామేక్షణ యా వాకిలి వేసిన
॥దేమి సేతురా? భృంగీశా!॥పల్లవి॥

వలపుల సొలపులఁ దలుపులు దియుమని
పిలిచిన నిపు డది పలుకునొ? పలుకదొ?
॥ఏమి॥ ౧

పట్టెడు ముద్దులఁ బట్టెడి మాటలు
గట్టిగ నంటిని కరుణఁ దలంపక ॥యేమి॥ ౨

తరిగొండ నృకేసరి తూఁతురి మదిఁ
గరఁగించుట కే వెరవు దోఁచలే ॥దేమి॥ 3

## ద్విపద

భృంగీశ! నామీఁదఁ - బ్రియమెల్ల మఱచి,
గంగ కవాట మీ-కరణి బంధించె;

బంధువులై నాకు - భాగీరథికిని
సంధిఁ జేసెడు పాటి - జాణ లిందెవరు?

అప్పుడు నే గంగ - ననిన వాక్యంబు
లిప్పుడు దలఁచిన - నేమొ నా జాలి

చెప్ప శక్యము గాదు; - శీతాద్రి సుతకు
మెప్పుగా, నే దీని - మీఁదఁ గోపించి,

సమ్మతంబుగ నిది - చాల వేఁడుకొని
రమ్మన్న తఱి మది - ఱాయి సేసికొని,

యా మాడ్కి రాను పొ-మ్మని యంటిఁ గాని,
రామ! రామా! మచ్చ-రము నాకుఁ గలదె?

సదయాత్మురాలైన - శైలజ మొదలు
సుదతుల బహుమందిఁ - జూచితిఁ గాని,

ఈ భామ సౌందర్య, - మీ భామ ధైర్య,
మీ భామ చాతుర్య - మెవరికి లేదు;

కాన నే నిపుడె గం-గను గూడవలయు;
మానిని కుచగిరుల్ - మఱుఁగు గాకున్నఁ

గాయజు పుష్పమా-ర్గణ పరంపరలు
నా యురంబున నేఁడు - నాటక పోవు;

తరళాక్షి యధరామృ - తంబుచేఁ గాని
యురుతర స్మర విషం - బూరకె దిగదు;

అటుగాన నా కిప్పు - డా గంగ పొందు
ఘటనఁ జేసెడి పాటి - గరిత లిందెవరు?

ఏమి సేయుదుర! భృం-గీశ! యీ వేళ?
నా మేలు తరిగొండ - నారసింహుండు

తాను విచారించి - తన తనూభవకుఁ
బూని నా యెడఁ బ్రేమఁ - బుట్టింపవలెను.

వ. అని పలికి, జాహ్నవినిఁ బిలిచి పరమేశ్వరుఁ
డిట్లనుచున్నాఁడు: 208

## ❃ శంకర జాహ్నవీ సంవాదము ❃

### తలుపులు దీయు పాట

వర:- వాకిలి దీయవె! వనితామణి! నీ
కే కాంతముఁ జెప్పేనే! నీ కేకాంతముఁ జెప్పేనే! ౧

గంగా:- ఏకాంతము నా కెఱిఁగింపను నీ
వెవఁడవురా? నెఱజాణా! నీ
వెవఁడవురా? నెఱజాణా! ౨

వర:- అతివరో! నీ విట్లడిగితె, విను
పశుపతి యందురె! నా పేరూ
పశుపతి యందురె! నా పేరూ. ౩

గంగా:- పశుపతి నని తగఁ బల్కితి; వయితే
పశువు కడకుఁ బోవోయీ! నీవు
పశువు కడకుఁ బోవోయీ! ౪

వర:- తమకము మించెను, తాళఁగఁ జాలను
తరుణిరో! వాకిలి దియవే! ఓ
తరుణిరో! వాకిలి దియవే! ౫

గంగా:- తమకము మించినఁ దడవిటు సేతుర?
దానింటికె పోవోయీ! శివ!
దానింటికె పోవోయీ! ౬

వర:- కాముని శరములు వేమఱు నాటెను
ఏమి సేతునే భామా? నే
నేమి సేతునే భామా? ౭

గంగా:- కాముని శరముల ఘాతఁ దెలిసి ననుఁ
గరుణించితివఁట వోయీ? ననుఁ
గరుణించితివఁట వోయీ? ౮

వర:- అపరాధిని నే నైతినె! జాహ్నవి!
కృపఁజూడవె! నీవైనా? ననుఁ
గృపఁ జూడవె! నీవైనా? ౯

గంగా:- చపలుఁడ! నీతో సావాసం బిఁకఁ
జాలును పోరా! ఓరీ! యిఁకఁ
జాలును పోరా! యోరీ! ౧౦

వర:- మఱి మఱి శరణని పలికినఁ
గరుణఁ జూడరాదఁటవే? ననుఁ
గరుణఁ జూడరాదఁటవే? ౧౧

గంగా:- హర! నినుఁ దరిగొండాధిపు సోదరి
కరుణించును పోవోయీ! నినుఁ
గరుణించును పోవోయీ! ౧౨

## ఏలలు

వర:- ఇందీవరాక్షి! నా నేరామెంతా గల్గినానూ
పొందూగా రక్షించెదావాని వోవో మందాకినీ!
ముందూగా నే శరాణంటినే! ౧

గంగా:- వోరీ! నీవూ శరాణావా
కారాణా మేమీ లే; దల్లా
సారాసాక్షి నగరికే పోరా! వోవో విశ్వేశా! ౨

వర:- కలకంఠీ! రాతిరి నీవూ కలలో వచ్చి, నా
కౌఁగిట కులుకుచూ నుండీన ట్లుండేనే!
వో వో మందాకినీ! కలనూ విన్ను మరువాఁజాలనే! 3

గంగా:- ముచ్చూ తంటాలామారీ! నీ విచ్చాటీకి వచ్చి నాతో
నిచ్చాకా మేలారా? వో వో విశ్వేశా! నీ
గచ్చూ లింకా చాలు లే వోయీ! ౪

వర:- కులుకూ గుబ్బాలా నా యెద
గ్రుమ్మీ కౌఁగిలించితేనూ
చెలఁగీ నేనూ నీకు మ్రొక్కేనే! వో మందాకిని!
చిరముగా నీ వలలోఁ జిక్కేనే! ౫

గంగా:- తరిగొండా శ్రీహరి మిత్రా! గురుతార నిటాలనేత్రా!
స్థిరమూగా వర్ధిల్లూచుండారా! వో వో విశ్వేశా!
నీ దేవీ వలలోనే చిక్కారా! ౬

వ. అని దీవించి, యొక చెలినిఁ జూచి చిఱునవ్వు నవ్వి, 'కవాటంబుఁ దియ్యు'మని కనుసన్నఁ జేసిన, నది వచ్చి కవాటంబుఁ దీయఁగా, శివుండు కేళికా మందిరంబునకుఁ బోయి జాహ్నవినిఁ జూచి యిట్లనుచున్నాఁడు: 209

## కుఱుచ జంపె

వర:- అలివేణి! నీ విందు రావే! నీ
యధరామృతముఁ గ్రోలనీవే! ౧

సుందరీమణి! యిందు రావే! న
న్నంది కౌఁగిటఁ జేర్చు కోవే! ౨

అలుక యేలనే? కలికి చిలుకా! నాతో
పలుకవే! సుధారసము లొలుకా 3

నిన్ను నే నేమంటి నింతీ? నాలో
నేరమేమే పూలబంతీ? ౪

కాంత! నిన్ విడనాడినానా? కన్న
కలనైన నే నిన్ను మఱచేనా? ౫

వ. అని ప్రార్థించి పిలిచిన మాఱుమాటాడని జాహ్నవినిఁ జూచి పరమేశ్వరుం డిట్లనుచున్నాఁడు: 210

సీ. ఓ భామ! నెనరుతో నొక్క మాటడవే!
రమణి! నీ ముత్తెముల్ రాలిపోవు;
ముదిత! నీ కుచకుంభములఁ గాను కియ్యవే!
యువిద! నీ కులగిరు లుర్లిపోవు;

చక్కెర కెమ్మోవి నొక్కనియ్యవె! ముద్దు
కలికి! నీ తేనెలు కాఱిపోవు;
సొంపుతోఁ జల్లని చూపులఁ జూడవే!
చేడె! నీ నీలాలు చిందిపోవు

తే.గీ. గాని, మో మిటు చూపవే! కమల పాణి!
నెనరుతో మాటలాడవె! నీలవేణి!
చెలఁగి బిగికౌఁగి లియ్యవే! చిగురుఁబోణి!
మదనకేళినిఁ దేల్పవె! మధురవాణి! 211

వ. అని పలికి కదియంబోయిన, దిగ్గన లేచి యటు ముఖంబైన భాగీరథినిఁ జూచి ఫాల లోచనుం డిట్లను చున్నాఁడు: 212

## దరువు

వర:- కటకటా! నీ మనసేలా కరఁగదే?
యో మందాకినీ! ॥పల్లవి॥
ఇటు ముఖ మిచ్చి మాట్లాడ వేమి సేతూ?
మందాకినీ? ॥కటకటా!॥ ఉపపల్లవి॥

ఇన్ని విధములాను నేను నిన్ను బ్రతిమాలితేను
కన్నులా జూడవూ, కలికిరో! నేనేమి సేతూ?
॥కటకటా!॥ ౧

మురిపమూనా మాటాడావూ; గురుకుచామూ లంటా
నీవూ;
సరగూన కవుఁగిలియ్యావూ; సఖియ నేనేమి సేతూ?
॥కటకటా॥ ౨

పొంచి పొంచి పంచాశరుఁడూ మంచిమంచి
బాణములను
ముంచివేసె గదవే! నన్నూ ముదితా! నేనేమి సేతూ?
॥కటకటా॥ ౩

తారిగొండా నృహరి పుత్రీ! తరుణీ! నీరజనేత్రీ!
పరమా పవిత్రీ! నన్నూ పాలింపావే! మందాకినీ!
॥కటకటా॥ ౪

క. ఇంతగ నిను వేఁడిన
స్వాంతంబున నెనరు లేక చపలాత్మకుఁడౌ
కంతుని బారినిఁ ద్రోసెద;
వింత చలం బేల వచ్చె నిందునిభాస్యా? 213

వ. అనిన విని జాహ్నవి కోపించి యిట్లనుచున్నది: 214

గంగా:- కానీ కా,నైనంతా కానీ లేరా! కాని కానీ లేరా!
జాణా! నీ వగలింకా చాలు పోరా! ౧

వర:- కులుకూ ముద్దూల గుమ్మా! కోపమేమే?
నీకూ కోపమేమే?
నెలఁతా! నేఁజేసినా నేరమేమే? ౨

గంగా:- ధీరా! నీ నేరాము తెలియ లేదా?
నీకూ తెలియ లేదా?
ఓరీ! నేఁ జేసేదీ యుత్త వాదా? ౩

వర:- ఇరవూగ నల చలామేలా? వీడూ!
చలామేలా? వీడూ!
తరిగొండా హరిపుత్రీ! దయఁ జూడూ! ౪

గంగా:-క. కూరిమితో నేఁ బిలిచినఁ
గ్రూరుఁడవై రానటంచుఁ గొంకక నను నీ
వా రీతిని విడనాడితి;
వీ రీతిని నిపుడు వేఁడనేల మహేశా? 215

## దరువు

వర:- ఎన్ని నేరాము లుండిన మన్నించా రాదా?
భామా! నన్ను మన్నించారాదా?

గంగా:- నిన్నల్లా చిన్నెలాఁడి మన్నించీని పోరా! ౧

వర:- మాటి మాటి కిట్లా మచ్చరమేలే?
భామా! నీకీ మచ్చరమేలే?

గంగా:- నీటుకాఁడా! మచ్చారాము నీకే చెల్లును రా! ౨

వర:- ఈ విధాన నిర్మోహత్వ మేలా వచ్చెనే?
భామా! నిర్మోహత్వమేలా వచ్చెనే?

గంగా:- నీవు నిర్మోహుఁడవుగాఁగా నే నిట్టైతిని రా! 3

వర:- తారిగొండా హరి సుతా! నే తాళఁజాలనే!
భామా! నే తాళఁ జాలనే!
కారుణించి వేగ నీదూ కౌఁగి లియ్యావే! ౪

గంగా:-క. నా కౌఁగిటి సుఖ మింకను
నీ కేలర? శైలజాత నెనరలరఁగ నీ
రాకడఁ గోరుచునుండును
నా కడఁ బనులేమి? పోర! నాగేంద్ర ధరా! 216

వర:-చ. మఱి మఱి యేఁచరాకు నను, మన్ననసేయవె!
జాహ్నవీ సతీ!

గంగా:- మఱి మఱి నన్ను నీ విపుడు మాటకుఁ దీయక పోర!
శంకరా!

వర:- తఱచుగ మించె నా విరహ తాపముఁ దీర్పవె!
జాహ్నవీ సతీ!

గంగా:- తఱచులు ప్రేలవేమిటికి? దానిలుఁ జేరఁగఁబోర!
శంకరా! 217

వర:-క. దీనుఁడనై గతి నీవని
నానా రీతులను వేఁడినన్ దయలేకన్,
దానింటికిఁ బోపొమ్మని
మానిని! విడనాడ నీకు మర్యాదగునే? 218

గంగా:-క. నారదుఁ డిచ్చిన వరమణి
హారము ధరియించి మించి యలరెడు గిరిజన్
కూరిమి మీఱఁగఁ జేరినఁ
గోరిక లీడేర్చు; నటకు గొబ్బునఁ బోరా! 219

## దరువు

వర:- కీరవాణి! నీవు నన్నుఁ జేరఁబిలిచి మాటాడితె
కోరినట్ల నవరత్నాల హార మిచ్చేనే! ౧

గంగా:- చాలు చాలు పోరా! నీ యింద్రజాలమూలు దెలుసు
హార మా లలాన కొసఁగు వాఁడ, వందె యుండరా! ౨

వర:- మొలక నవ్వు నవ్వి పలికి, మోవి తేనె లిచ్చి కులికి,
కలికి! నీ కరుణరసము చిలికి, కౌఁగిలియ్యవే! 3

గంగా:- ఘలుకు వలపు సొలపులాను పలుకరాకు రా!
నాతోను
బెళుకులాఁడి నా సవతికి తళుకుఁ జూపరా! ౪

వర:- కుటిలత మానవే! మరుఁడు పటుతర బాణము లేసె;
కట కటా నే నోర్వలేను కరుణఁ జూడవే! ౫

గంగా:- ఎమ్మెలాఁడి వినఁగ నన్నుఁ బోపొమ్మని
పల్కితివి గనుక
సమ్మతముగ నీ మాటలు నమ్మరాదురా! ౬

వర:- నమ్మవే! శ్రీ తరిగొండ నరహరి నందాన! నే, నీ
సొమ్మైనాను; శైలజాత జోలింకేలనే? ౭

## *కంద దరువులు

గంగా:-

కందము. ఎగ సక్కెపు మాటలకును,
వగలకు, నళికించి మించి వలపించుటకున్
సొగసగు వయారి పార్వతి
తగియుండును; నీకు నేను తగ; నటు పోరా!

దరువు. తగ; నటూ పోరా! నాకు నీకూ తగులేమి లేరా?
పగదాని విడనాడు పగిదీని విడనాడి
మగుడి నన్నిటు బ్రతిమాలే; విప్పుడు నీకూ
తగ; నటూ పోరా! నాకు నీకూ తగులేమీ లేరా? ౧

---

*కంద దరు వనగా కందపద్యముతో సంధింపబడిన దరువని యర్థము. దీనినే కందార్థదరువని, కందార్థమని యందురు. ఇందు కంద పద్యముయొక్క నాల్గవ పాదమందలి నాల్గవ గణముతో దరువు ప్రారంభమగును. అనగా కందము నాల్గవ పాదము యొక్క చివరి రెండు గణములు దరువులో విలీనములై యుండునని భావింపవలెను. ఆ రెండు గణములు అటు కందమునకు పూరకములుగను, ఇటు దరువునకు ప్రారంభకములుగను ఉండి, ఆ రెంటిని ఒకటిగా సంధింపజేయుచుండును..

వర:-

కందము. తగులేమి నీకు నాకని
తెగువగ నీ వనుట కిపుడు దిగులగు నాకున్;
తగు నగజ, నీవు మాత్రము
తగనంటివి; యేల తగవు? తగుదువు లేవే!

దరువు. తగుదూవు లేవే! యెందుకు నన్నిట్లగుడూ జేసేవే?
జగతీలో జనపాప సంఘాము హరియింప
నగణిత మహిమ నీయందుండఁగా నాకు
తగుదూవు లేవే! యెందుకు నన్నిట్లగుడూ జేసేవే! ౨

గంగా:-

కందము. మ్రొక్కిన రానని యంటివి;
చిక్కులఁ బెట్టితివి నన్ను 'ఛీ పొ'మ్మనుచున్,
గ్రక్కున నంటివి యిప్పుడు
తక్కులు కార్యార్థి వగుచుఁ, దక్కక పోరా!

దరువు. తక్కాక పోరా! నీ వగలాకుఁ జిక్కాను లేరా!
ముక్కంటి! నే మున్ను మోసపోయితిఁ జాలా
ఇక్కువ దెలిసితీ; నింకా నీ జోలేలా?
తక్కాక పోరా! నీ వగలాకుఁ జిక్కాను లేరా! 3

వర:-

కందము. 'చిక్కను పొ'మ్మను నీవే
దిక్కని నెఱనమ్మియున్న దీనుఁడనగు నన్
తక్కక విడనాడెద, విటు
గ్రక్కున దయఁ జూడ; వింత కక్కస మేలే?

దరువు. కక్కాస మేలే? నా కౌఁగిటఁ జిక్కితె మేలే!
మక్కువ నా తప్పు మన్నించుమని నీకూ
మ్రొక్కినఁగాని నా దిక్కైనఁ జూడవే!
కక్కాస మేలే? నా కౌఁగిటఁ జిక్కితె మేలే! ౪

గంగా:-

కందము. రమ్మన్నప్పుడు రాకను,
పొమ్మన్నను పోక యిపుడు బూటకమున నన్
సమ్మత పఱచెద; విందున
నమ్మందగు నంచు నిన్ను నమ్మదు నఁట రా?

దరువు. నమ్మాదు నఁటరా? నీ మరులు నిజమ్మాగ సటరా!
రమ్మాని నే లిఖితమ్ము వ్రాసిన, రానూ
పొమ్మాని ప్రతి లిఖితమ్మూ వ్రాసిన నిన్నూ
నమ్మాదు నఁటరా? నీ మరులు నిజమ్ముగ సటరా!
౫

వర:-

కందము. ముమ్మరముగ శుకపికములు
తుమ్మెదలును రొదలు సేయ, దురుసుగ మదనా
స్త్రమ్ములు ఱొమ్మున నాటెను;
ఝుమ్మునఁ దలకెక్క వలపు సొమ్మసిలితినే!

దరువు. సొమ్మాసిలితినే! నే నీ సాహాయమ్మూఁ గోరితినే!
కొమ్మా! నే నీ విరహమ్ము సైఁచఁగజాలఁ;
గొమ్మా! నీ నవ్వు ముద్దిమ్మా! తామస మేలే?
సొమ్మాసిలితినే! నే నీ సాహాయమ్మూఁ గోరితినే! ౬

గంగా:-

కందము. వైరాగ్యాకర లిఖితం
బారూఢిగ నీవు వ్రాసినప్పుడు మరునిన్
మీఱి జయించితి; నిప్పుడు
చీరిన, నా చెంత వాఁడు చేరఁడు పోరా!

దరువు. చేరాఁడు పోరా! వానితో నీవే పోరాడు కోరా!
సారాముఁ దెలిసి, సంసారాము వర్జించి
ధీరత్వమున నుండ, మారూఁడు నా చెంతఁ
జేరాఁడు పోరా! వానితో నీవే పోరాడుకోరా! ౭

వర:-

కందము. తరిగొండాధిపుఁడగు శ్రీ
నరహరి పద కమలములను నా శీర్షముపై
నిరవుగ నిల్పితివఁట! సుమ
శరు గెల్చుట సాధ్యమెపుడు సరసిజ నయనా!

దరువు. సరసీజ నయనా! నీ మహిమా నే నెఱుఁగకున్నానా?
సరసాముగా నిన్ను సరకుసేయని మాట
లరమార లేక నే ననుట, కీ చలమేలే?
సరసీజా నయనా! నీ మహిమా నే నెఱుఁగకున్నానా? ౮

గంగా:-

తే.గీ. అందినప్పుడు సిగఁ బట్టి, యందనపుడు
కాళ్లు పట్టిన రీతి నుత్కంఠ కామ
లీల గల వేళ రానని, లేని తఱిని
నన్ను వేఁడిన, నిన్నెట్లు నమ్మఁదగుర? 220

## ఏలలు

వర:- నమ్మారాదానూచూ బాలా! నన్నూ వీడానాడేదేలా?
కెమ్మోవి ముచ్చాటా లాడావే! వో ముద్దూగుమ్మా!
నీకూ మ్రొక్కే; నన్నూఁ గూడావే! ౧

గంగా:- నా రాదుఁ డిచ్చినా రత్నా హారామూఁ గైకొన్నా దానీఁ
జేరీ శారాణాని మ్రొక్కారా! వో నాగాభరణా!
చిన్నె లిందూ సేయవద్దూ రా! ౨

వర:- రా రమ్మానీ నన్నూఁ బిలిచీ రత్నాహారామునకు బదులూ
కోరావే! యేమైనానూ వో ముద్దూగుమ్మా!
గొబ్బూనా తెచ్చి నీ కిచ్చేనూ 3

గంగా:- తారిగొండా శ్రీహరి మిత్రా! సురుచిరా సుందారా గాత్రా!
గుఱుతుగా నా కోర్కెఁ దీర్చారా! వో నాగాభరణా!
కూరిమీతో కౌఁగిలిచ్చేరా! ౪

వర:-క. అరమర లేకను నను నీ
కరుణామృతవార్ధిఁ దేల్చి కడతేర్చిన, నీ
విరవుగఁ గోరిన కోరిక
మురియుచు నేఁ దీర్పఁగలనె ముద్దుల గుమ్మా!221

## ద్విపద

అన విని జాహ్నవి - హరున కిట్లనియె:
'విను దేవ! నా కోర్కె - విశదంబుగాను

రాజీవ భవుఁడు సర-స్వతీ ధవుఁడు
రాజితంబుగఁ దాల్చి - రమణీయ రుచుల

మానితంబగుచున్న - మాణిక్య హార
మేను గొరితిఁ; దెచ్చి - యిపుడు నా కొసఁగు'

మనవుడుఁ దరిగొంద - హరిమిత్రుఁ డపుడు
పెనుపొంద బసవేంద్రుఁ - బిలిచి యిట్లనియె:

తే.గీ. 'రమ్ము బసవేంద్ర! గిరిజ కా రత్నహార
మిచ్చి నందుకు గంగ నన్నిపుడు దాని
కతిశయంబైన మాణిక్యహార మఖుని
చేత నిప్పింపు మన్నది శీఘ్రముగను.

## ❋ శివుని యాజ్ఞను శిరసావహించి బ్రహ్మ కైలాసమున కరుదెంచుట ❋

వ. కావున నీవు మాకుఁ బరమాప్తుండవు గనుక, నీ మహిమచేత సత్యలోకమునకుఁ బెరిగిపోయి, బ్రహ్మదేవునిఁ బిలుచుకొని రావోయీ!' అనిన విని మ్రొక్కి, బసవేంద్రుఁడు పెరిగి సత్య లోకంబునకుఁ బోయి, బ్రహ్మదేవుణ్ణి కైలాసంబునకు రమ్మని పిలిచినఁ, దత్క్షణంబ. 222

### ద్విపద

ఆ వేళఁ దరిగొంద - హరిపుత్రుఁడైన
పావనాచారుండు - బ్రహ్మదేవుండు

నిఖిల ప్రజాపతుల్ - నిఖిల సంయములు
నిఖిల యోగీంద్రులు - నిఖిల నిర్జరులు

వేదముల్ చదువుచు - వెనువెంట రాఁగఁ,
బాదుగా జిహ్వాపై - భారతి వెలుఁగ,

అనుపమ హంస వా-హనముపై నెక్కి,
గొనకొని కైలాస - కుధరంబుఁ జేర,

వచ్చిన బ్రహ్మను - వలనొప్పఁ జూచి,
యచ్చటి కామిను - లంద ఱిట్లనిరి:

**దరువు**

బ్రహ్మ దేవుఁడు వచ్చె నమ్మా! ॥పల్లవి॥

చూచితే, పరమబ్రహ్మానందాము హెచ్చెనమ్మా!
॥బ్రహ్మ దేవుఁడు వచ్చె నమ్మా॥ ॥ఉప పల్లవి॥

బ్రహ్మ ఋషులు వెంబడి నడువఁ, బర
బ్రహ్మంబగు మన ఫణిధరుఁ జూడను ॥బ్రహ్మ॥ ౧

ఒకచేత వీణె పట్టుకొని మీటుచు, మఱి
యొకచేతఁ బుస్తకమును బూని
శుకమటు భారతి చదివే
సకల వేదార్థ శ్లాఘన చేయుచు ॥బ్రహ్మ॥ ౨

వెలయూ నవ బ్రహ్మలు దాను
నిగమాంత శాస్త్ర విద్యా ప్రసంగాములతోను
పలుమఱు మురియుచుఁ, బరతత్త్వమునకు
నిలుకడ లరయుచు, నిజ మేర్పఱచుచు
॥బ్రహ్మ॥ 3

తరిగొండా హరి తనుజ యైనా మందాకినీకి
తా నన్నా యైనా బాధ్యమూనా
నరుదుగఁ బరమ శివార్పణమని సు
స్థిర మణిహారము చెల్లెలి కొసఁగను ॥బ్రహ్మ॥ ౪

వ. ఇట్లు వచ్చిన బ్రహ్మదేవునిఁ జూచి యందొక్క వికట భాషణుండు 'అయ్యా! నీ తల్లి, దండ్రి మొదలయినవా రెవ్వరు? నీ పేరేమి! యూరేమి?' యని యడిగిన, బ్రహ్మదేవుం డిట్లనుచున్నాఁడు:223

## ❋ బ్రహ్మదేవుని వృత్తాంతము ❋

### ద్విపద

బ్రహ్మ:- వెరవుగా వినర! నా-వృత్తాంతమెల్లఁ
దెఱఁగొప్ప శ్రీరమా - దేవి మాతల్లి;

క్షీరాబ్ధి శయనుఁడై - స్థితికర్త యైన
నారాయణ స్వామి - ననుఁ గన్నతండ్రి;

కేళీ విలాస సం-కీర్ణుఁడై మెలఁగు
నాళీక బాణుండు - నా సహోదరుఁడు;

బలముగాఁ ద్రై లోక్య - పావనియగుచుఁ
జెలఁగెడి శ్రీ గంగ - చెల్లెలు నాకు;

అరూఢి వేద శా-స్త్రాదులం దమరు
భారతీ దేవి నా - పట్టంపు రాణి;

మొనయ మరీచి ప్ర-ముఖులైన మునులు
గొనకొని నేఁ గన్న - కొడుకు లందఱును;

తరిగొండ హరి సహో-దరి యనన్ ధాత్రి
వర కీర్తిఁ బొందు శ-ర్వాణి మేనత్త;

ఘనమైన సత్యలో - కంబు మా యూరు;
నను బ్రహ్మ యందు రె-న్నఁగ నెల్ల వారు.

వ. అనిన విని వికట భాషణుండు 'ఓ స్వామీ! బ్రహ్మదేవుఁడా! నీకుఁ బార్వతి మేనత్తయై, గంగ చెల్లెలైనప్పుడు శివుఁ డేమి కావలె?' ననిన విధాత యిట్లనుచున్నాఁడు: 224

తే.గీ. చెలఁగి శర్వాణి మా తండ్రి చెల్లెలయిన
కతన మేనత్తయయ్యెఁ; నా కమల ముఖిని
వేడు కలరఁగఁ దగఁ బెండ్లి యాడెఁ గనుక
వామదేవుఁడు మామ గావలెను నాకు. 225

తే.గీ. చెలువు మీఱఁగ నా ముద్దు చెల్లెలైన
గంగ నిచ్చట వరియించి ఘనతఁ గాంచెఁ
గనుక, నానాఁటినుండి లోకము లెఱుంగ
బావ మఱఁది యనందగున్ భవుఁడు నాకు. 226

వ. అనిన విని నగుచు వికట భాషణుండు 'ఓహోయీ! బ్రహ్మదేవుఁడా! నీకు బావమఱఁదియైన శివునకు నీ తండ్రియైన శ్రీమహావిష్ణుండు యేమి కావలెను? నీకు మామయైన శంకరునకు నీ తండ్రియైన నారాయణుండు యేమి గావలెను? తెలుపు' మనినఁ గమలాసనుం డిట్లనుచున్నాఁడు: 227

### దరువు, జంపె తాళము

ఖ్యాతిగాఁ గూఁతురగు గంగ నిచ్చిన కతన
మా తండ్రి శంభునకు మామ గావలెరా! ౧

పదిలముగ శర్వాణి బాధ్యమున మా తండ్రి
మదన వైరికి బావమఱఁది గావలెరా! ౨

ఆ మహాదేవుఁ డిట్లగు బాధ్యముల వాకు
మామ గావలె; బావమఱఁది గావలెరా! 3

ఆమాడ్కి తరిగొండహరి ఫాలనయనునకు
మామ గావలె; బావమఱఁది గావలెరా! ౪

వ. అనిన విని వికట భాషణుండు 'అహో! బ్రహ్మదేవుడా! నీకు శివుఁడు మామ; మీ తండ్రి శివునకు మామ; శివుండు నీకు బావమఱఁది; మీ తండ్రికి బావమఱఁది. తండ్రి కొడుకులకు నొక్క విధంబుగా వరుస లేర్పడినందున చాలా సంతోషమాయెను. నీవు పుట్టిన విధంబు, నీ ప్రభావంబులు దెలుపు'మనిన విరించి యిట్లనుచున్నాఁడు: 228

### ద్విపద

బ్రహ్మ:- వికట భాషణుఁడ! నా - వృత్తాంత మెల్లఁ
బ్రకటించి చెప్పెదఁ - బట్టుగా వినుము!

హరి జలరాశియం - దహి తల్పమందు
నిరుపమంబగు యోగ - నిద్రచే నున్న

వాఁడు నే నా స్వామి - నాభి కంజమునఁ
బోఁడిమి మెఱయఁగాఁ - బుట్టిన వాఁడ;

అనుపమ ప్రణవార్థ - మంతయుఁ దెలిసి,
ఘన పద క్రమ జటా - కలిత స్వరముల

నకలంక వస్తుత-త్త్వార్థ మేర్పఱచి,
సకల వేదంబులు - చదివిన వాఁడ;

అల ప్రజాపతుల, మ-హా మునీశ్వరులఁ,
బొలుపొంద మనువులఁ - బుట్టించినాఁడ;

ఆ కాలమున నుండి - యా మూలములను
డీ కొని జనులఁ బు-ట్టింపుచున్నాఁడ.

ఇరవుగా నే జని-యింపక మున్ను
వరునగా ధాత్రి నె-వ్వాఁడు పుట్ట లేదు;

ఏను పుట్టిన మీఁద - నింపు సొంపెనఁగ
నానా ప్రపంచంబు - నాయందుఁ బుట్టె;

వలవొప్పఁ దరిగొంత - వామఁడై ధరను
వెలయు చున్నటువంటి - వేంకటేశ్వరుఁడు

నన్ను ముందుగఁ గని,-నా యందు జగము
లన్ని పుట్టించె మ-హాద్భుతంబుగను.

వ. అనిన విని నవ్వి వికట భాషణుండు 'సకల ప్రపంచంబు నీ యందుఁ బుట్టెనంటివి గదా! భారతి యెందుఁబుట్టె?' ననినఁ జిఱునవ్వు నవ్వుచు సృష్టికర్త యిట్లనుచున్నాఁడు: 229

బ్రహ్మ:-క. నా యాస్యములను ఘన ముని
నాయకు లుదయించు తతిని నారీమణియై
తోయజనేత్రి సరస్వతి
పాయక నా జిహ్వాయందుఁ బ్రభవించెను రా! 230

వ. అనిన విని వక్ర భాషణుండు వికావిక నవ్వి, 'నీయందుఁ బుట్టిన సరస్వతి నీకేమి కావలె?' ననిన వికసిత వదనారవిందుండై విరించి యిట్లనుచున్నాఁడు: 231

**దరువు, జంపె తాళము**

బ్రహ్మ:- ఖ్యాతిగా నా యందుఁ గలుగు భారతి మొదటఁ
గూఁతురై, తుదఁ బెండ్లికూఁతురైనదిరా! ౧

కనుక కూఁతురి వరున నొనర నెవ్వరికైన
నను వొంద దాంపత్య మనుకూల మవురా! ౨

తరిగొండ హరి యిదియు ధర్మమని భారతిని
పెరిమె మీఱఁగ నాకుఁ బెండ్లి చేసెను రా! 3

వ. అనిన విని హాస్యంబుఁ జేసి వక్రభాషణుండు 'ఓహో! బ్రహ్మదేవుఁడా! యిటువంటి నావివర్తనలు మీకుఁగాఁగఁ జెల్లినవి; మాకుఁ జెల్ల'వనినఁ గమల గర్భుం డిట్లనుచున్నాఁడు: 232

బ్రహ్మ:-క. వర ఋషి, నది మూలంబులు
మురువలరెడు దేవ, రాజ మూలంబులు నీ
వరసి, హసించితి; వైనను
తరిగొండాధిపుఁడు నిన్ను దండించు సుమీ! 233

వ. అనిన విని వక్ర భాషణుండు భయాక్రాంతుండై నమస్కరించి, 'యో స్వామీ! యీ గజదంత పరీక్ష సేయను నెంతవాఁడను? నా మీఁద దయచేసి సత్యలోక ప్రభావంబు దెలుపు'మనిన మన్నించి, బ్రహ్మ యిట్లనుచున్నాఁడు: 234

**దరువు, జంపె తాళము**

బ్రహ్మ:- శోక మోహంబులును, క్షుత్ పిపాసలు, జరా
వ్యాకుల మృతంబు లా లోకమున లేవు ౧

అలఘు సిద్ధ విమానములు దివ్య దీధితుల
జలజాప్త నిభములై చరియించు నచటా 2

తరిగొండ హరికృపను ధన్యులై చనుదెంచి,
తఱచుగాఁ దాపసోత్తము లుందు రచటా. 3

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! యిటువంటి సత్యలోకంబునకు నీ వధిపతి వైనప్పుడు నీవు మహాక్షాత్రవంతుండవై యుందుదువు గదా! నీవు క్షాత్రంబున నెవరిని జయించినాఁడ?' వనిన, బ్రహ్మ యిట్లనుచున్నాడు: 235

ద్విపద

బ్రహ్మ:- అలరఁ బూర్వంబు నా-యందుద్భవించి,
తలఁగక నా జ్ఞాన-ధనము హరింప

మొనసిన కామాది - మూర్ఖశత్రువుల
నలియఁ దుత్తుమురుగా - నఱికి, లోకముల

విలసిత జయ భేరి-వేయించినాఁడ;
నలరంగ సత్కీర్తి - నందితి మును;

అదియుఁగాక - యవిద్య యనెడు భూతంబు
పదపడి నన్నుఁ బొంచి - పట్ట వచ్చినను

విడివడి నే రెండు - వింద్లెక్కు వెట్టి,
నడి వింట రెండు బా-ణములు సంధించి,

సూటిగా వేసి, యా-క్షుద్ర భూతమును
పాటించి తెంపునఁ - బడఁగూల్చినాఁడ;

కొంటెలై సురలపైఁ - గ్రోధించు లోక
కంటకులను ముందు - గాను హెచ్చించి,

వారికి వరము ల-వ్వారిగా నిచ్చి,
యా రుద్రుచేత, మ-హాశూరుఁడైన

తరిగొండ హరి చేతఁ - దఱిమి కొట్టించి,
చిరముగా సురల ర-క్షింపుచున్నాఁడ.

'అల హరి హరులట్ల - నసురులఁ ద్రుంచు
బలము లేదా? నీకు - బ్రహ్మ!' యటన్న

మహిని మా వంటి బ్రా-హ్మణుల కహింస
విహిత ధర్మంబను - వేదపూరుషుఁడు;

కాన విప్రుల పోటు - కప్పల కాటు
పూని లేదందురు; - భువి యజ్ఞములను

'అల పశుహింస చే-యఁగలేదె?' యనినఁ
బొలుపొంద ఘన-మంత్ర పూతమైనట్టి

పశుహింసచే మాకుఁ - బాపంబు రాదు;
పసిబిడ్డవలె నీవు - పలుమాఱు నన్ను

వరుస నాక్షేపింప - వల దింక మీఁదఁ;
దరిగొండ హరి మిత్రు - దగ్గఱ కరిగి,

యాదరంబుగ మాట - లాడి రావలెను;
వాదింప కటు పోర! - వక్ర భాషణుఁడ!

వ. అని బ్రహ్మదేవుండు వానిని విడిచి, శివుని సాన్నిధ్యంబునకుఁ బోయి యిట్లనుచున్నాఁడు: 236

## ❀ బ్రహ్మ పరమశివుని భక్తితోఁ బ్రస్తుతించి మాణిక్యహారమును సమర్పించుట ❀

### చూర్ణిక

శ్రీమదనంత తేజో విరాజమాన సత్య శుద్ధ బుద్ధ సచ్చిదానంద సత్య జ్ఞానాఖండ స్వయంజ్యోతి స్వరూపా! మాయా ప్రపంచ నిర్లేపా! ౧

స్థూల సూక్ష్మ కారణ సత్త్వ రజ స్తమో గుణ విక్షేపావరణాద్యనేక ప్రకృతివికారావృత జీవ సముదయోద్ధారణా! పరమ శత్రువిదారణా! ౨

నిఖిల విశ్వ ప్రకాశ ప్రభావాతిశయ మార్తాండ సుధాకిరణ హుతాశన నేత్రా! తరిగొండ నరసింహ మిత్రా! నమస్తే నమస్తే నమస్తే నమః. 3

వ. అని నమస్కరించిన బ్రహ్మదేవుని నుచితాసనంబునకు రావించి, శివుం డిట్లనుచున్నాఁడు: 237

### దరువు, జంపె తాళము

బ్రహ్మ:- చెన్నలర నీసేయు సృష్టియను నుద్యోగ
మున్నతంబుగ సాఁగుచున్న దఁటవోయీ? ౧

పరమ ముని నిర్జర ప్రముఖులగు వారెల్ల
గురుతరంబుగ నిన్నుఁ గొలుతు రఁటవోయీ? ౨

పాదుకొను తఱిగొండ పతికృపను
వేద శాస్త్రాదులకు ఖలవేధ లేదు గద వోయీ? 3

వ. అని [illegible] పద్మాసనుం డిట్లను చున్నాఁడు: 238

బ్రహ్మ:-క. తరిగొండాధిపుఁడగు హరి
కరుణను, నీ కృపను సృష్టి ఘనముగ సాఁగున్;
వర ముని సుర ముఖ్యులు నన్
అఱ లేకను కొలిచియుందురయ్య! మహేశా!239

వర:-క. నీ కుశలమె మా కుశలము;
నీ కలిమే మా కలిమి యనిందిత చరితా!
నా కోర్కె యొకటి గలదది
చేకూర్చుము; నీకు మేలు చేసెద నజుఁడా! 240

## ఏలలు

బ్రహ్మ:- ఆ విధా మేమో? రమ్మన్నాదేమో?
తెలియా లేదూ; నీ వాదీ నాతో
తెల్పుమయ్యా! ఓ పార్వతీశా!
నేఁ దోఁచినాదీ చేసేనయ్యా! ౧

వర:- వారిజాసానూడ! నీ కుమారూఁడైనా
నారదూఁడు హారమొకటీ గిరిజా కిచ్చెనూ;
ఓ భారతీశా! అందుకై గంగా కోపించెనూ. ౨

బ్రహ్మ:- అందూకూ కోపింపా గంగా కెందూకూ?
నా కంఠహారా మిందూ మందాకినీ కిచ్చేనూ:
ఓ పార్వతీశా! పొందుగా ధరియించుకొమ్మానూ౩

వర:- నీ కొడుకూ గిరిజా కిచ్చె; నీవూ శ్రీగంగా
కిచ్చి, నా లోక నిందా తప్పింపావోయీ!
ఓ భారతీశా! నీకూ నే మేలూ చేసే నోయీ! ౪

బ్రహ్మ:- తరిగొండా నారసింహూనీ తనయాయైనా మందాకినీ
పరమా పావనీ, నిరుపమ బ్రహ్మజ్ఞానీ
ఓ పార్వతీశా! నింద నీకేల రానిచ్చినీ! ౫

## ద్విపద

అని తన మాణిక్య - హారంబుఁ దీసి,
వనఁబోణి యైన జా-హ్నవిఁ జేరఁబిలిచి,

'అమ్మ! నీ వీ రత్న - హారంబుఁ దాల్చి,
సమ్మతిగా నుండు - శంకరుఁ గూడి;

మఱి విను మీ హార - మహిమచే నేను
చిరతరంబుగ సృష్టి - సేయ నేర్చితిని;

ఇట్టి సన్మణిహార - మెబ్బంగినైనఁ
బట్టుగా నియ్యను - పరుల కెవ్వరికిఁ;

జెల్లెలవనుచు ని-చ్చితి; నీవు దాల్చి
చల్లగా నుండు మీ - జగతీతలమున.'

నని యిట్లు తరిగొండ - హరి మిత్రుఁడైన
యనలాక్షు నీక్షించి - యజుఁ డిట్టు లనియె:

## దరువు, ఆది తాళము

బ్రహ్మ:- కోరిన కోర్కుల సారె కొనఁగు మణి
హారము పరమ శివార్పణమూ ౧

సౌరద్యుతులను మీఱి వెలుఁగు మణి
హారము పరమ శివార్పణమూ ౨

అరుదుగఁ దరిగొండాధిపుఁ డిచ్చిన
హారము పరమ శివార్పణమూ 3

వ. అని పలికి బ్రహ్మదేవుండు సంతోషంబుగా మణిహారంబుఁ బరమేశ్వరునకు ధారాగృహీతంబుగా

నిచ్చి, సెలవు గైకొని, గంగ వాదరించి, వీడ్కొని
సత్యలోకంబునకుఁ బోయె; నంతఁ బరమశివుండు
భాగీరథినిఁ జూచి నగి, యిట్లనుచున్నాఁడు: 241

## ద్విపద

'వినవె మందాకిని! - విబుధ మునీంద్రుఁ
డనువొందఁగా మణి - హార మద్రిజకు

నిచ్చినందుకు నీవు - హెచ్చు పంతమునఁ
దెచ్చుకొంటివి గాదా! - దివ్య హారంబు;

ఈ మణిహార మీ - విపుడు ధరించి,
ప్రేమతో జలము ర-ప్పించు మిద్ధరకు'

నని హార మొసఁగఁగా - నయ్యిందు వదన
మొనసి ధరించి, సన్-ముదము దీపింప,

నరుదుగాఁ దరిగొండ - హరి నాత్మ నుంచి,
మరల జలంబులన్ - మహికి రప్పించి,

మనము రంజిల్ల స-మ్మతముగా శివుని
నొనరంగఁ గవ గూడి - యుప్పొంగుచుండె;

నంతట శాంభవి - యాత్మనాయకునిఁ
జింతించి యపు డొక్క - చెలియ కిట్లనియె:

## దరువు, నీలాంబరి రాగము

**పార్వతీ:-** చేడెరో! నే నేమి సేతూ? శివుఁడు
నేఁ డీ వేళకైనా రాఁ డాయే; హా! మరుని దాడాయే!౧

కుసుమ బాణుఁ డళి బలములతో నా చుట్టూ
కమ్మెనే! హా! శరముల తిమ్మెనే! ౨

వాసిమీఱఁగాను కీర వారము లన్నీ
రభసాముఁ జేసెనే! హా! కోవెల గూసెనే! ౩

ఏఁచఁదలఁచీ నన్నూ చాలా యీ విధమునా
వెన్నెలా కాఁచెనే! హా! పవనుఁడు వీచెనే! ౪

కొమ్మా! యీ వేళానే తారిగొండా
నరహరి సఖునీ రమ్మానే! హా! కౌఁగి లిమ్మానే! ౫

వ. అని పలికి, తన ప్రాణసఖియైన కుందరదనతోఁ బార్వతి మఱి న్నిట్లనుచున్నది: 242

### ద్విపద

పార్వతీ:-

ఒక మాట వినఁగదె! - యో కుందరదన!
సకలాత్ముఁడైన మా - చంద్రశేఖరుని

ఎడఁబాసినది మొద - లేమొకో మేను
గడ గడ వణఁకును, - కనుల బాష్పములు

మఱి మఱి వెడలును, - మానసం బిపుడు
పురపురఁ బొక్కును, - పొలఁతి! యీ జాలి

పుట్టి, యన్నంబైన - భుజియింపనీదు;
గుట్టుగా నొక దిక్కు - కూర్చుండ నీదు;

నిలిచియుండిన చోట - నిలువంగ నీదు;
బలు పూల పాన్పుపైఁ - బవళింపనీదు;

ఇది యేమి యుత్పాత? - మిటువంటి వింత
నిదివఱ కెన్నఁడే - నెఱుఁగ; నెట్లనినఁ

జల్లగా నుండఁడే - చంద్రుఁ డందఱికిఁ?
జెల్లఁబో నా కేల - శిఖి రూపమయ్యె?

మనుజ హితుండైన - మలయానిలుండు
తనర నా కెందు కిం-తటి కష్ట మిచ్చె?

అందఱికిని శాంత-మైన పుష్పాళి
యెందుకు నా పాలి - కింత వేఁడయ్యె?

శుక పికాళి ధ్వనుల్ - సొరిది నందఱికి
నకలంక సుఖ మిచ్చు - నటువంటి విపుడు

నా కర్ణముల కేల - నారసాలయ్యె?
కేకి బృందములు, మి-క్కిలి మరాళములు

నటియించి జనుల కా-నందంబు నిచ్చు,
నటువంటి వేళ నా-కతి చింత నిచ్చె;

అందుకు సందియం - బగుచున్న దిపుడు
మందుల మారి యా-మానిని గంగ

నా మనోహరునకు - నాకుఁ గాకుండ
నే మందుఁ బెట్టునో - యింక మీఁదటను?

కావున నందుండఁ - గా నియ్యరాదు;
నీవు మా తరిగొండ - నిలయుని సఖుని

నే విధంబున నైన - నిపుడె ప్రార్థించి,
వే వేగఁ దోడితే-వే! కుందరదన!

## ❃ కుందరదన (పార్వతిచెలి) దౌత్యము ❃

**కుందరదన:-**

**క.** అంగజవైరిని రమ్మని
సంగతిగా నేను పిలుచు సమయమ్మున నన్
పొంగుచుఁ దిట్టునొ? కొట్టునొ?
గంగమ్మకు నేను వెఱతుఁ గదె గిరిజాతా? 243

**పార్వతీ:-**

**తే.గీ.** నే మహద్భూతమై యిందు నిలిచి యుండ,
హరుఁడు నన్నింటి కాథ్యుఁడై యచట నుండ,
నిన్నుఁ బ్రోవఁగఁ బలుచనై యున్న గంగ
కింత వెఱవంగ నేఁటికే - యిందువదన? 244

**కుంద:-**

**తే.గీ.** ఆ రమణి గంగ వడి నుల్లమారి యనుచు,
మించి పర్వతములనైన ముంచు ననుచు,
వెఱచి చొరవఁగ లోని కెవ్వరును పోరు
గాన, వెఱతును గంగమ్మ కేను తల్లి! 245

### ద్విపద

**పార్వతీ:-** ఓ కుందరదన! యి-ట్లుల్కి పల్కెదవు;
నీకు భయంబేమి - నే నుండఁగాను,

ఇలలోన నెదురు త-న్నెఱుఁగ కా గంగ
పొలుపు మీఱుచు నెంత - పొంగినఁ గాని,

నేను దృష్టించిన - నీఱు గాఁబోదె?
దాని నా చెంత నిం-తగఁ జెప్పనేల?

తన పల్చఁదనమును - దా నెఱుంగకను
ఘన వార్ధి నదలించు - కాల్వ చందమున,

నెండతో మంచు దా-నెదురించు పగిదిఁ,
గొండతోఁ దగరు ఢీ-కొన వచ్చు కరణి,

మదకరితో దోమ - మార్కొన్న రీతి
వదరి నాతోఁ బోర-వచ్చు నా సవతి;

నలువొప్పఁ దరిగొండ - నారసింహుండు
తలకొని నా సహోదరుఁ - డైన కతన,

నతని కూఁతురటంచు - నభిమాన ముంచి,
హితముతోఁ జూతు నే-నేమన లేక,

యందున నది దుర-హంకారి యయ్యె;
నెందున నాకన్న - నెక్కువౌ తాను?

వెలఁది దానికి నింత - వెఱవ నేమిటికిఁ?
గలకంఠి! యటకు శీ-ఘ్రమ పోయి రావె!

వ. అనిన విని కుందరదన నవ్వి, యిట్లనుచున్నది: 246

కుంద:-
తే.గీ. అత్తకోడండ్రు సవతులైనట్టి వరుస
లమర వింటిని, సంతోషమాయె; దంతి
దంత పరిశీలనముసేయఁ దగదు నాకు;
మంచి, దచటికి నంపింపు! చంచలాక్షి! 247

## దరువు, జంపె తాళము

పార్వతీ:-

ఈ మర్మ మరయ నీ కేల? నచటికిఁ బోయి
లేమ! శివునకు మ్రొక్కి, లేచి రమ్మనవే! ౧

పరమేశ! నీ విట్లఁ బాసి వచ్చిన మొదల్
గిరి సుతను మరుఁ డర్దగించినాఁ డనవే! ౨

తరిగొండ హరి మిత్ర! తరుణి జాహ్నవి నింత
మరగు టద్రిజకు సమ్మతముగా దనవే! 3

కుంద:-

క. పంకజ లోచన! నా కా
శంకరు మదిఁ దెలిసి పిలుచు చాతుర్యము లే;
దిం కా యుక్తులు చక్కగఁ
బొంకముగాఁ దెలియఁ జెప్పు! పోయెద గిరిజా!248

## ద్విపద

పార్వతీ:-

విను! కుంద రదన! నే-వెరవు చెప్పెదను
మనసి జాంతకుఁ జేరి - మర్యాదగాను

ముందఱ నిలిచి, బల్-ముదముతో మ్రొక్కి,
యందుండి మెల్లగా - నంచుకుఁ బోయి,

'పంచశరారి! నిన్ - బాసి మా నగజ
యించు కన్నము భుజి-యింపలే' దనుము!

'భుజగేంద్ర భరణ! నీ-పొత్తులఁ గాని
భుజియింప'నని 'యొక్క-ప్రొద్దున్న' దనుము!

'అలివేణి! యిప్పు డా-హారంబు లేక
పొలుపు లేకను జిక్కి-పోయిన' దనుము!

'నీ వింక రాకను - నిమిష మిందున్న -
నా వెలఁది చరించు - టనుమాన' మనుము!

చెలియ! నీ వీ మాటఁ - జెప్పిన, శివుఁడు
నిలువఁ డచ్చట, లేచి - నీ వెంట వచ్చు;

నయముగాఁ దరిగొండ - నరహరి సఖునిఁ
బ్రియము మీఱఁగ నీవు - పిలిచి రా పోవె!

కుంద:-క. ఒక మాట నీవు చెప్పినఁ
బ్రకటముగా నచట నేను పదివేలుగ నా
సకలజ్ఞున కెఱిఁగించెద;
నిఁక సెలవీవమ్మ! నాకు హిమగిరి తనయా! 249

వ. అని పలికి, సెలవు గైకొని పోయి, మార్గంబులోఁ
గాని శకునంబులైనం జూచి, యనుమానింపుచు,
మగుడి వచ్చి, పార్వతితో నిట్లనుచున్నది: 250

## దరువు, సౌరాష్ట్ర రాగము

కుంద:- కానీ శకునాము లాయె నమ్మా! శంకరునీ
యిట కా, మానీని యంపాదేమోనమ్మా! ॥పల్లవి॥

మానాసమూన కనుమానాము బుట్టెనమ్మా!
॥కానీ॥ ॥ఉపపల్లవి॥

తల్లీ! నే నరుగూచుంటి నమ్మా! వాకిటి లోకి
పిల్లీ! యడ్డాము వచ్చె నమ్మా! చందురునీ మీఁద

బల్లీ పకు పకునా బలికె నమ్మా! యిల్లూ
వెళ్లితె కుందేటి పిల్లాను గంటి నమ్మా! ॥కానీ॥ ౧

ఒంటి తుమ్ముఁ దుమ్మిరో యమ్మా! నక్కాలు కుడి
నుండి యెడమాకుఁ బోయెనమ్మా! గరుడూఁడు గట్టీ
గుంటీపై వెంటుఁ జూపెనమ్మా!
కంటకమూన పైఁడి కంటె లులిచే నమ్మా! ॥కానీ॥ ౨

దినమూ బాగా లేదేమో నమ్మా? లేకుంటే నిటు దం
దనమూగ శకునా లౌనేమమ్మా! శ్రీ గంగ దంటా
తనమూ నా కిపుడే తెలిసే నమ్మా!
ఘన తరిగొండా నృహరీ తనయాకు నే వెఱతునమ్మా!
॥కానీ॥ 3

వ. అనినఁ గుందరదనను జూచి పార్వతి యిట్లనుచున్నది: 251

పార్వతీ:-

తే.గీ. తప్పుగానైన శకునముల్ ద్రిప్పఁదలఁచి,
మరల వచ్చితి; వందుచేఁ బరిసిపోయెఁ
గానఁ, దడవిందు సేయ కక్కడికిఁ బోయి,
యిందు శేఖరుఁ దేఁగదే! కుందరదన! 252

వ. అనిన విని క్రమ్మఱ సమ్మతించి కుందరదన యిందుమౌళి సాన్నిధ్యమునకుఁ బోయి, కర కమలంబులు ముకుళించి యిట్లనుచున్నది: 253

## ❋ కుందరదన యిందుమౌళిని స్తుతించి, విన్నవించుట ❋

### చూర్ణిక

కుంద:- అహో! పరమేశ్వరా! పరమ కారణ పరిహసిత శుభ్ర శరదభ్ర కాంతి పుంజ తుహినగిరి కన్యకా కమనీయ నయన కమల ప్రభాకరా! సకల లోక వశీకరా! ౧

అనేక కోటి మార్తాండ కిరణ గణ సమాన ఫణా మణి విరాజమాన భుజగేంద్రహార కంకణ కేయూర కుండలాలంకృత శరీరా! సకల నిగమాంతార్థసారా! ౨

సురాసుర గరుడోరగ గంధర్వ యక్ష కిన్నర కింపురుష సిద్ధ చారణ విద్యాధర మౌనీంద్ర ప్రముఖ నిఖిల జన సేవిత పదాంభోరుహా! యోగీంద్ర దేవమహీరుహా! 3

శ్రీమద్వేగవతీ తీరస్థ రంగ దుత్తుంగ కనక రత్న స్థగిత సౌధాట్టాలక గోపురప్రాకార ద్వార కవాట శోభిత కాంచీ పురవరాధీశ్వరా! శ్రీమదేకామ్రేశ్వరా! ౪

సమస్త నిగమాగమోక్త మంత్ర తంత్ర యంత్ర ప్రభావాతిశయ కామకోటి పీఠోపరి విలసత్ కామాక్షీ కళత్రా! తరిగొండ నరసింహ మిత్రా! పాహి మాం; పాహి మాం; పాహి మాం; పాహి! పాహి! ౫

క. దండమయా! భూతేశ్వర!
దండమయా! సుగుణ భరణ! ధర్మ వితరణా!
దండము త్రిపుర విదారణ!
దండమయా! నీకు దండధర మదహరణా! 254

వర:-తే.గీ. అతివ, నీకును బుత్ర పౌత్రాభివృద్ధి
గలిగి, ముత్తైదువై చిరకాల మీవు
బ్రతుకు చుండుము! హిమశైలబాల చెంత,
నిందు వచ్చిన పనిఁ దెల్పు కుందరదన! 255

## ద్విపద

కుంద:- వినవయ్య! పరమేశ! - విశదంబుగాను
పనిఁబూని శ్రీశైల - బాలను నీవు

విడిచి వచ్చిన నాఁడె - వీరుఁడై మరుఁడు
దుడిబడిఁ జేసి ముం-దుగ బలంబులను

పురికొల్పుచును వచ్చి - భూరి శౌర్యమున
గిరిజ నచ్చట నడ్డ - గించుచున్నాఁడు;

బహు విచిత్రముగ నా-భామిని చుట్టు
రహిఁ బుష్పశర పంజ-రముఁ గట్టినాఁడు;

వాఁడు నీపై నుండు - వైర మంతయును
నేఁడు పార్వతిమీఁద - నిలిపి, రెట్టించి,

కుటిల కుంతలి గబ్బి-గుబ్బల నడుమ
బటువు చిగురుటాకు - బాకులఁ బొడిచె;

నా వేళనుండియు - నా యిందు వదన
లేవనెత్తినఁ గాని - లేవలే దకట!

ఒకవేళ లేపి కూ-ర్చుండఁ బెట్టినను
ప్రకటంబులగు పుష్ప-బాణ జాలములు

భామపైఁ గప్పినఁ - బడి మూర్ఛ వోవు;
నా మూర్ఛఁ దేర్చిన, - నంతలో నెనసి

మదనానల జ్వాల - మాటి మాటికినిఁ
బొదివిన భీతిల్లి - 'పురహరా!' యనును;

తప్పక దర్పకాం-తకుఁడ వీవైనఁ
దెప్పునఁ బార్వతీ-దేవి చెంగటికిఁ

దక్కక వచ్చి, యా-తరళాక్షితోడ
గ్రక్కున మదన సం-గర మొనరించి,

వాని సాధించి, పా-ర్వతికి జయంబుఁ
బూని యిచ్చిన నీకుఁ - బుణ్యంబు వచ్చు;

నదిగాక తరిగొండ - హరి నిన్ను మెచ్చు;
విదితంబుగా లేచి - వేగ రావయ్య!

వ. అనిన విని శివుం డిట్లనుచున్నాఁడు: 256

వర:-క. నే నీ జాహ్నవికిఁ బరా
ధీనుఁడనై యున్నవాఁడ; దీని సెలవు లే
కే నచటికి రాఁగూడదు;
దానికి నీ మాటఁ జెప్పు! తడయక తరుణీ! 257

వ. అనిన విని చెలి యిట్లనుచున్నది: 258

కుంద:-
తే.గీ. దర్పకుని బాణశిఖలచేఁ దాళలేక
శైలసుత పొందుచుండెడి సంకటంబుఁ

జూచి వచ్చియు నిన్నుఁ బిల్చుకొని పోక
నెట్లు పోవుదు? సతి బాధ లేమి? యనిన: 259

**దరువు, జంపె తాళము**

మరుఁడు బెదరించి సుమశరము లేసినను 'హా!
పరమేశ! పరమేశ! పరమేశ!' యనునూ ౧

నాఁతి తన యెదుట నున్నావు నీ వనుచు హా!
'భూతేశ! భూతేశ! భూతేశ!' యనునూ ౨

నీదు కౌఁగిలిఁ దలఁచి యాకసముఁ బ్రాకి హా!
'శ్రీకంఠ! శ్రీకంఠ! శ్రీకంఠ!' యనునూ ౩

పదును గేదఁగి కత్తు లెదను నాటినను హా!
'మదనారి! మదనారి! మదనారి!' యనునూ ౪

తరిగొండ హరిమిత్ర! తడయ కిటు రారా! హా!
'పరమశివ! పరమశివ! పరమ శివ!' యనునూ ౫

క. విరహా నలంబు కాఁకకు
మురువుగ సతి దాల్చు పుష్పములు నీఱయ్యెన్;
వర మౌక్తిక హారంబులు
వెరవెర సున్నంబు పగిది విరిసెఁగదయ్యా! 260

క. అలఁదిన చందనమంతయు
ఫెళఫెళఁ బేలాల పగిదిఁ బెట్లఁ దొఱంగెన్;
కలకంఠి బాధ యెంతని
వెలయఁగ నే నెన్ని విన్నవింతు మహాత్మా? 261

క. మరుఁడు కటారినిఁ బొడిచిన
తఱి హిమగిరి తనయ తనువు ధర నిల్చుట నా

కరుదయ్యెను; పతి బ్రతుకుట
పురసంహర! నీవు సేయు పుణ్యము గాదే? 262

## ఏలలు

కుంద:- యెన్ని యానీ నీకూ నేనూ
విన్నావింతూ నిచ్చేటాను
పన్నూగా నీ వందూ రావయ్యా!
వో వో చంద్రామౌళీ!
పార్వతీరీతిఁ జూడావయ్యా! ౧

వర:- శైలాజా విరహాగ్నిని
శైత్యోపచారములాను నీ
వే లీలా నైనా చల్లార్పవే!
వో వో కుందారదనా!
యిపుడు నేనందూ రానూ పోవే! ౨

కుంద:- ఆ రమణికీ శైత్యోప
చారాము లన్నియు తాపా
కారణామూలాయేఁ గదవయ్యా!
చేరీ నీవే చూతువు రావయ్యా! 3

వర:- తరిగొండా శ్రీనారాహరి
తనయా సెలవూ లేక మీఱి
కరుణా నటకూ నే రానూ పోవే! వో వో
కుందా రదనా! గంగా సెలవూ దీసికోవే! ౪

కుంద:-క. మందాకిని! మా గిరి సుత
కందర్ప జ్వరము చేత గాసిలు; నట కీ
యిందు కళాధరు నంపుము
వందన మఘభంగ గంగ! వందన మమ్మా! 263

గంగా:-క. వందనము నీవు చేసితి;
వందున వర్ధిల్లుచుండు; మద్రిజకడ కే
నెందుకు నా పతి నంపెద?
నిందేటికి వచ్చితివి? మృగేక్షణ! పోవే! 264

కుంద:-క. ఆ పార్వతి విరహానల
తాపమునకు వెఱచుతఱిని ధైర్యముగా నీ
వీ పరమేశ్వరు నంపక,
పాపముఁ గట్టుకొనుటేమి భాగ్యము? గంగా! 265

వ. అని కుంద రదన పలికిన పలుకులకు గంగ
కోపించి, తన చెలితో నిట్లనుచున్నది: 266

## ❀ గంగ కుందరదనను చెలులతోఁ గొట్టించుట ❀

### ద్విపద

విను సఖి! మదిలోన వెఱపింత లేక
ననుఁ దూలనాడుచు-న్నది కుందరదన,

మదన జ్వరంబఁట! - మాయ పార్వతికి,
నది మాన్ప వలసి నే - నతి తీవ్రముగను

నంపింప వలెనఁట! - యల దాని కడకుఁ,
బంపింపకున్నఁ బా-పంబు వచ్చునఁట!

నా పేరుఁ దలఁచిన - నరుల కందఱికిఁ
బాపంబు చెడునంచుఁ - బలుకు వేదములు;

నాకుఁ బాపంబంటు-నా? యింత మాట
వాకొనుటకు దీని - వడి సుళ్లఁ బెట్టి,

తిట్టుఁడు! మొట్టుఁడు! - తెప్పున దానిఁ
బట్టి చెంపలు రెండు - పగుల మీరెల్లఁ

గొట్టుఁడు! కొట్టుఁడీ! - కొప్పుఁ బట్టీడ్చి,
నెట్టన మెడఁ బట్టి - నెట్టుఁ; డచ్చటికి

నా నాఁడు మదనాగ్ని - కళికి నేఁ బోయి,
నానా విధంబుల - నాథుఁ బ్రార్థించి

పిలిచిన, రానీక - బింకంబుఁ జూపి
కలహించు గిరిసుతన్ - గాదన రాదె?

మడియమై యల దాని - మంచంబు క్రిందఁ
బడియుండె నేమొ యీ - బానిస యచట?

అప్పుడు గిరిజ న-న్ననిన మాటలకుఁ
దప్పులు పట్టక - తా నూరకుండి,

తలకొని యిపుడిందు - ధర్మ శ్రవణము
లులుకక తాఁ జెప్ప-చున్నది నాకు;

నటుగానఁ దరిగొండ - హరి సహోదరికిఁ
జటులోగ్రమైన రో-షము వచ్చుఁ గాని,

వెఱవను కలనైన, - వేవేగ దీనిఁ
గుఱుచ బెత్తములతోఁ - గొట్టి పొమ్మనరె!

వ. అనిన విని నీలవేణి గంగతో విహితంబుగా
నిట్లనుచున్నది: 267

తే.గీ. అచ్చటికి నేను పోయినయపుడు గిరిజ
తెంపుగాఁ బట్టి కొట్టించి యంప లేదు;
నీ విపుడు దీనిఁ గొట్టింప నీతి గాదు;
దూతికను గొట్టు టిది నీకు దౌర్జతనమె? 268

క. పగ నీ మనమున నుండిన
నగజను సాధించి కీర్తి నార్జింపవలెన్;
తెగి యీ దూతిక నడిచిన
నగరే వినినట్టివారు? నళిన దళాక్షీ! 269

## ద్విపద

గంగా:- అన విని గంగ యి-ట్లనె సఖితోడ
'విను నీలవేణి! యీ - విశ్వేశుఁ బిలువ

డీకొని దాని యిం-టికిఁ బోయినపుడు
శ్రీకంఠు నంపక - చిక్కులు పెట్టె;

నట్టి తంటలమారి - యంపిన చెలినిఁ
బట్టి కొట్టిన నాకు - భయమింకఁ గలదె?

కడఁగి తన్ బొడిచిన - గంగెద్దునైనఁ
బొడువఁగా వలె నండ్రు - భువి నెవ్వరైనఁ,

జెట్టుఁ ద్రిప్పినవారిఁ - జెలరేఁగి మరల
గుట్టుఁ ద్రిప్పినఁగాని - కోపంబు పోదు;

దీనిఁ గొట్టించినఁ - దెగువగా సవతి
నూని కొట్టిన రీతి - నొదవుఁ బంతంబు;

అటుగాన మాఋ మా-టాడక మీరు
కుటిలాత్మురాలైన - కుధరజ చెలిని

కొట్టు(డు! కొట్టు(డు! - కొట్టు( దండఱును
పట్టుగా( దరిగొండ - పతి మెచ్చు(గాని'.

వ. అనిన విని గంగ చెలు లందఱు కుందరదనను నొడిసి పట్టి, కొట్టి, తిట్టి, 'దిక్కు గల చోట మొఱ పెట్టుకొ'మ్మని మెడ( బట్టి నెట్టిన, నా కుందరదన వచ్చి, పార్వతి పాద పద్మంబులపై( బడి, కన్నీరు సోనలై కురియ(గా గద్గద కంఠంబున నిట్లనుచున్నది: 270

### దరువు, ఆహిరి రాగము, ఝంపె తాళము

కుంద:- అయ్యయ్యో! దుశ్శకునమునా హరునీ(
బిలువా(బోతీ గదవే! శైలజాతా! గంగా
గయ్యాళియై గచ్చాపాదకరణి నన్నూ(
బట్టూకొనెనే! శైలజాతా! ॥అయ్యయ్యో!॥ ౧

చెలులా నాపైన( బురికొల్పి చిత్ర హింస
చేయించేనే! శైల జాతా! నన్ను
పులుకూ పులుకూన( జూచూచు( బురహరు(
డూరాకుండెనే! శైలజాతా! ॥అయ్యయ్యో!॥ ౨

బలియూ పిల్లూలాకు( జిక్కూ
చిలుకావాలె నేనుంటినే! శైలజాతా! నాకు(
జెల(గి తారిగొండా నారసింహు(
డడ్డాము రా(డాయె శైలజాతా!
॥అయ్యయ్యో!॥3

వ. అనిన విని పార్వతి నెనరుతో( గుందరదన కిట్లనుచున్నది: 271

పార్వతీ:-

తే.గీ. ఎందు కఱచెద వీ రీతిఁ గుంద రదన?
గంగ నిన్నేమి చేసె? నా క్రమములన్ని
చెప్పవే! దానిఁబట్టి శిక్షించు దనుక
సుదతి! విను నేను హిమశైలసుతను గాను. 272

వ. అని బుజ్జగించి యడిగినఁ, గుందరదన
కొదుకుచు నిట్లనుచున్నది: 273

## ద్విపద

కుంద:- అక్కరో! వినవె! నా-యలమట లెల్లఁ
గ్రక్కున నేఁ బోయి - గరళ కంధరునిఁ

బిలిచితి నత్యంత-ప్రియము రెట్టింపఁ,
బలుకుచునుండె నా-ఫాలలోచనుఁడు;

అంతలో జాహ్నవి - యధిక కోపమునఁ
బంతంబుతో వచ్చి - పఱఁతుల చేత

నక్కడఁ బరమేశుఁ - డటు చూడఁగానె
మక్కు వింతయు లేక - మది రాక్షి నాదు

చెక్కిళ్లు నులిమించి - చీకాకు సేసి,
'దిక్కు గల్గిన చోటఁ - దీవ్రతఁ బోయి,

మొఱఁ బెట్టు కొ'మ్మని - మూతులు పొడిచి,
దురుసుగా మెడఁబట్టి - త్రోయించె నిపుడు;

ఏమని చెప్పుదు - నింక మీఁదటను?
భామిని! తరిగొండ - పతి సుతుఁడైన

వనజాసనుం డిటు - వ్రాసె నా నుదుటఁ;
గనుక నా కర్మ మీ-గతిఁ జేసెనమ్మ!

వ. అని దీనత్వంబునఁ బలికిన చెలిని లాలించి, తక్కిన చెలుల నేమించి యిట్లనియె: 274

## దరువు

పార్వతీ:- వింటీ రేమే? మీ రెల్లానూ వెలఁదూలారా!
నేఁ డా
దంటా సేయూ తంటా మచ్చాకంటులారా! ౧

జడుపూ లేక నా చెలినీ సఖియలారా!
తాను
మెడఁబట్టీ త్రోయించాఁదగునా? మెలఁతలారా! ౨

పలుమాఱు తా నంపెఁ జెలులా నెలఁతలారా!
నేనూ
బలమూనా దండింపా లేనా? పొలఁతులారా! 3

అపుడూ తన ............... నేమే యతివలారా?
నేనూ
కపటా మానసాను గానే! కన్యలారా! ౪

పదరే! మనమందూఁ బోదాము భామలారా!
దాని
మద మేమో చూచి వత్తాము మగువలారా! ౫

తరిగొండా హరి మిత్రూఁడు తరుణులారా!
దాని
కిరవైనా చనువిచ్చేనేమో యింతులారా? ౬

వ. అని పలికి, చెలులం దోడ్కొని, మందాకినీ మందిరంబునకుఁ బోయి, పార్వతి పరమేశ్వరునిఁ జూచి యిట్లనుచున్నది: 275

## ❀ పార్వతీ పరమేశ్వరుల సంవాదము ❀

### దరువు

పార్వతీ:- ఏర! సర్వేశ? యిదేర! సర్వేశ?
యిదేర! సర్వేశ? యిదేరా! సర్వేశా? ॥పల్లవి॥

అయ్యయ్యో! నా సఖి నన్యాయముగ గంగ
దయ్యామువలెఁ గొట్టఁ దగునా? సర్వేశా!॥ఏర!॥ ౧

ఈ తీరుగాఁ బట్టి దూతిక నణంచిన
పాతకి నిపుడేమి చేతు సర్వేశా? ॥ఏర!॥ ౨

దానిఁ గొట్టిన రీతి నేను గంగను బట్టి
పూని కొట్టినఁ గాని పోను సర్వేశా! ॥ఏర!॥ 3

కేడించి నే దీని నోడించి విడిచెదను;
నేఁడు నా ప్రాణైనఁ జూడు సర్వేశా! ॥ఏర!॥ ౪

కూఁతురనుచుఁ దరిగొండా నృహరి వచ్చి
నీతిఁ జెప్పిన విడువ నేను సర్వేశా! ॥ఏర!॥ ౫

వ. అనిన విని, శివుం డిట్లనుచున్నాఁడు: 276

పర:-తే.గీ. అటకు నే వత్తు; నింతలో నవసరముగ
నేల వచ్చితి విచటి? కో యిందు వదన!
వచ్చితివి, రమ్మి! కూర్చుండు! వార్త లాడు!
కోప మెందుకు నీకిట్టు కుధర తనయ? 277

## దరువు

పార్వతీ:- నాగభూషణ! నీ నీతి బాగాయె లేరా!
నీ నీతి బాగాయె లేరా! నీ నీతి బాగాయె లేరా!
వర:- నాగాయానా! నా తప్పేమీ? వేగా< దెల్పావే! ౧

పార్వతీ:- ఓరీ! నా చెలి నది దండింప నోర్చి యుంటివా?
సామి! నీవె యోర్చి యుంటివా?
వర:- సరసిజాక్షి! యా చందాము< జూడలేదే! ౨

పార్వతీ:- ఇందె వున్నా వా<డావై నీ వెఱు<గా కుందూవా?
జాణా! నీ వది యెఱు<గా కుందువా?
వర:- ఇందు బింబా నిభానన! యే నదెఱు<గానే! 3

పార్వతీ:- ఇంకా నాతో పలుమాటికి బొంక వద్దోయీ!
సామి! నీవు బొంక వద్దోయీ!
వర:- పంక జాక్షి! యిందుకై నే బాస< జేసేనే! ౪

పార్వతీ:- తరిగొండా హరి మిత్రా! నీ ధర్మ మెఱు<గనా?
నీ ధర్మ మెఱు<గనా? నీ ధర్మ మెఱు<గనా?
వర:- తరుణీ! నే< జేసిన యా ధర్మ మేమే? ౫

పార్వతీ:-
తే.గీ. మదిని ధర్మముగలవాని మాడ్కి నీవు
బాస< జేసెద నంటివి భయము లేక,
నైన మంచిది నేను కా దన<గ నేల?
నేమి చేసెదు బాస? విశ్వేశ! చెపుమ! 278

వ. అనిన శంకరుం డిట్లను చున్నా<డు: 279

వర:-సీ. నిశ్చయంబుగ నది నే నెఱుంగ నటంచు
గరళమైనను జొచ్చి కడచి వత్తు;

పార్వతీ:- గళమందు గరళంబుఁ గడఁగి తాల్చిన నీకు
గరళంబుఁ జొర మహాగణ్య మేర?

వర:- నళినాక్షి! నా మాట నమ్మికగా నేను
ఫణినైనఁ జేతులఁ బట్టి విడుతు;

పార్వతీ:- ఫణిరాజునే దాల్చి ప్రబలు వానికిఁ జాల
ఫణులఁ జేపట్టు టే భయము లేర?

వర:-తే.గీ. కొమ్మ! యే సత్య మిఁక నీకు నమ్మికవునె?

పార్వతీ:- ఎన్ని సత్యములైన నిదేటి నిజము?

వర:- నేఁడు నా సత్య మిది చూడు నీలవేణి!

పార్వతీ:- చూచినా నన్ని, యిఁక నెన్ని చూడవలెర?

వ. అని పలికి, చాలించి, జాహ్నవినిఁ జూచి యిట్లను
చున్నది: 280

## ❁ గంగా గౌరీ సంవాదము (సవతుల కయ్యము) ❁

### ద్విపద

పార్వతీ:- ఓసి మందులమారి! యోసి మిటారి!
ఓసి గయ్యాళి! యో-శోసి! నా సఖినిఁ

గొట్టించినావఁట! - క్రోధించి మించి,
ధట్టించినావఁట! - దంభంబుఁ జూపి,

తిట్టించినావఁట! -తెగి మెడఁ బట్టి
నెట్టించినావఁట!- నీవు గర్వించి,

చెనఁటివై పిఱికి-పి-చ్చిక మీఁదఁ గినిసి
యెన లేని బ్రహ్మాస్త్ర- మేసిన రీతిఁ

దగవు భావింపక- దానిఁ గొట్టినను,
పగ దీఱునే నీకు?- బలము గల్గినను

నిదె నేను వచ్చితి- నెదిరింప రమ్ము!
కొదుకక పోరాడు- కొట్టు నన్నిపుడు;

పొంగుచు నాతోడఁ- బోరాడ వెఱచి,
దొంగ తనంబుగాఁ- దోయధిలోను

డాఁగిన, ధరణిలో- డాఁగిన,మింట
డాఁగిన, శంభు జ-టన్ జొచ్చియున్నఁ,

బాయక మీ యన్న- బ్రహ్మ వచ్చినను,
నీ యబ్బ తరిగొండ- నిలయుఁ డిచ్చటికిఁ

దా వచ్చి వలదన్నఁ- దాళ నీ మీఁద,
రావె! నా కెదురుగా- రావె! యో గంగ!

## ద్విపద

గంగా:- ఓహోహో! వగలాఁడి!- యో చిన్నెలాఁడి!
యోహోహో! పొడవుగా- నుట్టి పడేవు;

చట్రాతి బిడ్డనన్- శౌర్యంబు చేత
నిట్రాయి వలె నిందు- నిలిచి,గర్వించి,

నా యబ్బ తరిగొండ- నరమృగేశ్వరుని,
నా యన్న బ్రహ్మను- నా నిమిత్తమునఁ

దలఁచితి; విది నీకు- ధర్మమే యిపుడు?
తలకొని నా సరి- దానవై నన్ను

వావిరి సాధింప- వలసి యుండినను
రావె! నా కెదురుగా - రావె! నా సవతి!

### దరువు

పార్వతి:- ఏమే మందాకిని! యింత నీ తెఱుఁగక
కోమలి నా సఖిని కొట్టిన దేలే? ౧

గంగా:- కొట్టితే కొట్టితి; కొమ్మ! నీ చెలినిఁ
జేపట్టి వచ్చి మాకు భయముఁ జూపేవా? ౨

పార్వతి:- నెయ్యమునా నేను నీతో మాట్లాడితే
గయ్యాళి! నన్నింత గద్దించే వేమే? 3

గంగా:- కయ్యాము చేయ నిక్కడికే వచ్చి, పెద్ద
దయ్యాము వలె నుండి దాక్షిణ్య మేమే? ౪

పార్వతి:- గట్టిగా నా తోను రెట్టింప వచ్చితే
ధట్టించి నే నిన్నుఁ గొట్టక పోనే! ౫

గంగా:- ధట్టించి నను నీవు కొట్టేనంటివి
పట్టి చూచుకో గుండె భద్రాముగానూ ౬

పార్వతి:- మదమేనుఁగును జూచి మతి క్రొవ్వి సూకర
మదలించి నట్టుండె యతివ! నీ మాటా ౭

గంగా:- ముదమున శివుఁ డున్నది చూచి యూరకే
పదరకే! నేనుంటే పదరెద వేమే? ౮

పార్వతి:- తరిగొండ హరికి సోదరిననే భయమైనా
తరుణీ! నీ కిటు లేక తరిమే వదేమే? ౯

## దరువు

గంగా:- నీలకంఠుఁ డున్నాఁడని చాలా తాళుకొంటిఁ గాని,
శైలజా! లేకుంటే నిన్ను సరకూ సేతునా? ౧

పార్వతి:- అంగజారి యున్నాఁడని సంగాతిగ తాళిన కు
రంగ లోచన! నీ వెంత నంగనాచివే? ౨

గంగా:- నంగానాచినే యో సారంగయాన! నీవనే కు
రంగా వాహతతికి నే భుజంగ కాంతనే! ౩

పార్వతి:- ఇంచూకైనా నన్నూ మదిలో నెంచాకా మాటాలాడేవూ;
మంచి, దైతే జాణావే! నీ మహిమా దెలిసేనూ ౪

గంగా:- లోకమూలలోనూ జలమూ లేకుండా నేఁజేసినపుడూ
నీకూఁ గల ప్రతాపామెల్లా నాకూఁ దెలిసెనే! ౫

పార్వతి:- నీకూఁ గలిగీ యుండే మహిమా నాకూ లేదనుచూ
నేఁడు పోకిళ్లామారి! నీ విట్లా పొంగఁ బోకువే! ౬

గంగా:- శ్రీకారా తరిగొండా నారసింహునికీ పట్టినైనా
నాకూఁ గల్గియుండే మహిమా నీకు గలుగునా? ౭

## దరువు

పార్వతీ:- ఓసి! నీకు మహిమ గలిగి యుంటే నాకు
భయమటే? ౧

గంగా:- ఓసి! నీకు భయము లేకపోతే నాకు కొదువటే? ౨

పార్వతీ:- ఓసి! నీవంటి పలుగాకి మహిమా నేనూ మెత్తునా?
3

గంగా:- ఓసి! నీవంటి సీమాటి మోమూ నేనూ జూతునా? ౪

పార్వతీ:- ఓసి! చూడక నీ వావలఁ బోతే పీడా బోయెనే! ౫

గంగా:- ఓసి! పీడాబోతే దూడావలె నాడుచుండవే! ౬

పార్వతీ:- ఓసి! చుట్టుపట్ల వారు జూడా మిట్టీ పడాకే! ౭

గంగా:- ఓసి! మిట్టి పడే వంటే చెంప లదరఁగొట్టేనే! ౮

పార్వతీ:- ఓసి! కొట్టేనంటి వైనా, మించి కొట్టి చూడవే! ౯

గంగా:- ఓసి! కొట్టితే నా కేమి భయము? గ్రుడ్లు ద్రిప్పకే!౧౦

పార్వతీ:- ఓసి! గ్రుడ్లు ద్రిప్పే నీ మీఁదనె సొడ్లు వేతునే! ౧౧

గంగా:- ఓసి! సొడ్లు వేసే నిన్ను వడి సుళ్లఁ బెట్టేనే! ౧౨

పార్వతీ:- ఓసి! నీ వడిసుళ్లాకు నేనేమైనా జడుతు నఁటవే?౧3

గంగా:- ఓసి! మడియా సవతి! నీ వెంతా గడుసు దానవే!౧౪

పార్వతీ:- ఓసి! తరిగొండా హరికీ నా గడుసుఁదనము
దెలుసునే! ౧౫

గంగా:- ఓసి! తరిగొండా హరి నిందూ తలఁపరాకువే! ౧౬

పార్వతీ:- ఈ మాట మరువాకే జాహ్నవీ!
గంగా:- నన్నేమీ చేసేవే? వో శాంభవీ! ౧

పార్వతీ:- అయితే తెలిసే లేవే! జాహ్నవీ!
గంగా:- మంచి, దైనంత కానీవే! శాంభవీ! ౨

పార్వతీ:- నీ వెంత దంటావె జాహ్నవీ?
గంగా:- ఓసి! నీ కంటె దంటెవరె శాంభవీ? ౩

పార్వతీ:- నా తోనె రెట్టించి నిలిచేవా?
గంగా:- నీవు, నాతో ప్రతాపించి గెలిచేవా? ౪

పార్వతీ:- మదకరి మశకము నెంచునా?
గంగా:- అయితే, ఓసి! ఉదధి కాలువను లెక్కించునా? ౫

పార్వతీ:- అద్రితోఁ దగరు పోట్లాడునా?
గంగా:- మంచి, దాదిత్యుఁడు మంచూ కోడునా? ౬

పార్వతీ:- వెన్నుకు పండ్లు వచ్చునా?
గంగా:- అయితే, గుండ్రాయి గునగున నడచునా? ౭

పార్వతీ:- వ్రేలు వాచీ ఱోలంతాయెవే!
గంగా:- తేపు ఱోలు వాచీ వ్రేలెడంతయ్యేవే! ౮

పార్వతీ:- మంచిది, విభుని రానియ్యనే!
గంగా:- పో! పో! మళ్లీ నీ కడకు రానియ్యనే! ౯

పార్వతీ:- ఇపు డీతని నిందుండ నియ్యనే!
గంగా:- పో! పో! ఇఁకమీఁద నందు రానియ్యనే! ౧౦

పార్వతీ:- తరుణిరో! నా కన్న యెక్కువా?
గంగా:- అయితే, మఱి నీవు నా కన్న ఎక్కువా? ౧౧

పార్వతీ:- నే లేక జగములు గలుగునా?
గంగా:- ఓసి! నే లేక జగములు చెలఁగునా? ౧౨

పార్వతీ:- అంత పుట్టించిన దెవ్వరే?
గంగా:- యిపు, డంతటి కాధార మెవ్వరే? ౧౩

పార్వతీ:- ఆదిని పుట్టిన దెవ్వరే?
గంగా:- మంచి దంతాకు పరమైన దెవ్వరే? ౧౪

పార్వతీ:- అంతకూ పర మాది బ్రహ్మమే!
గంగా:- యిపు డా బ్రహ్మమున కే నాధారమే! ౧౫

పార్వతీ:- అతఁ డనాధారుఁ డౌటెఱుఁగవా?
గంగా:- నీ వది దెలిసితే వాదుఁ జేతువా? ౧౬

పార్వతీ:- పదరాకే! పదరాకే! జాహ్నవీ!
గంగా:- యిట్ల వదరాకే! వదరాకే! శాంభవీ! ౧౭

పార్వతీ:- తరిగొండ హరి కిన్ని చెప్పెనే?
గంగా:- నా తండ్రి చెప్పిన ధర్మ మొప్పెనే! ౧౮

## దరువు

పార్వతీ:- ఓసి! ముల్లో కముల నంత మునుముంచఁగా నోడి
సుళ్ల నా నవతి! నీ వెవతెవే?
గంగా:- నన్నుఁ జొరఁబడి కొట్టుట కెవతెవే? ॥ఓసి॥ ౧

పార్వతీ:- ఉన్న నీళ్ల మాయముఁ జేయ నెవతెవే? శివుని
నెత్తిపై నెక్కా నీవెవతెవే? ఓసి! యెవతెవే?

గంగా:- ఓసి! కడపాట జనములు విడి బాడి కబళించే
మడియా! నా సవతి! నీ వెవతెవే? ॥ఓసి!॥ ౨

పార్వతీ:- నన్ను మార్కొని కొట్ట నీ వెవతెవే? శివుని
ఎడఁబాయకుండా నీ వెవతెవే?

గంగా:- నన్ను హెచ్చూ తక్కువ లాడ నెవతెవే?
ఓసి! యెవతెవే? ॥ఓసి!॥ ౩

పార్వతీ:- ఓసి! వెనకా సీమలనుండి యాడూచు దిగి వచ్చి,
నా కాఁపురముఁ గొన నెవతెవే?

గంగా:- సరిగా నాతో కొట్లాడ నీ వెవతెవే?
శివుని చీకాకు పఱచ నీ వెవతెవే? ॥ఓసి!॥౪

పార్వతీ:- యిట్ల చిందూలు ద్రొక్క నీ వెవతెవే?

గంగా:- ఓసి! కంటీకి మింటీకి రెంటీకి నుంటీనీ,
తుంటారి సవతి! నీ వెవతెవే? ॥ఓసి!॥ ౫

పార్వతీ:- యిట్ల కుట్టు మాటలాడ నీ వెవతెవే?

గంగా:- నా యింటికి రాను నీ వెవతెవే?
ముక్కంటిని దండింప నీ వెవతెవే? ॥ఓసి!॥ ౬

పార్వతీ:- ........................................................

........................................................

గంగా:- ఓసి! హరికి పుత్రిక నానె భయమట్ల
మఱచి, శివునిఁ బిల్వ నీ వెవతెవే? ॥ఓసి!॥ ౭

పార్వతీ:- చాల తఱుమావచ్చేవు నీ వెవతెవే?

గంగా:- నన్నుఱిమి చూచేవు నీ వెవతెవే?
ఇట్లా వుడ్డాడింప నీ వెవతెవే? ॥ఓసి!॥ ౮

పార్వతీ:- ..............................................................
..............................................................

గంగా:- తరిగొండా హరికి సోదరి వీవు, సుత నేను
ధరలో నెక్కువ తక్కువకు నీవెవతెవే? ॥ఓసి!॥౯

పార్వతీ:- నన్నూ తక్కువ జేయ నీ వెవతెవే? హరుని
ఫరువా జేయవు నీ వెవతెవే?

గంగా:- వట్టిబాసఁ జేయింప నీ వెవతెవే? ॥ఓసి!॥ ౧౦

## దరువు

పార్వతీ:- ఓసీ! మెండొడ్డ వచ్చేవు! పిండికూరలు దిన్న
కండ కావరమటే? గయ్యాళి సవతీ! ౧

గంగా:- ఓసి! తిట్టావచ్చే వేమే? గుట్టూగా కల్లుద్రావి,
పొట్ట పోసరమఁటే? బూటకపు సవతీ! ౨

పార్వతీ:- ఓసి! నడివీథిలో నిలిచి విడిబాడి నీవాలె
తడఁబడ సారాయిఁ ద్రావితి నఁటవే? ౩

గంగా:- నీ రీతి దనుజూల నెత్తు లదరఁ గొట్టి
ఘోరంపు రక్తాముఁ గ్రోలితి నఁటవే? ౪

పార్వతీ:- ఓసీ! తిరుగా ఎనుపోతూలఁ జంపించి
జాతరఁ బెంచి మాలిన్యముఁ దిందునఁటవే? ౫

గంగా:- ఓసీ! చుట్టు పట్ల వారు జూచి హసింప
నీ గుట్టు నేను బైట పెట్టుదు నఁటవే? ౬

పార్వతీ:- ఓసీ! యిట్టట్టె రమ్మంటె యిల్లెల్ల చేకొని
కట్టిఁడి! నన్నేల రట్టు జేసెదవే? ౭

గంగా:- రట్టాడి సవతి! నీ విట్టి మాటాడితే,
యెట్టైన నీ సాటి దిట్టన్ గానఁటవే? ౮

పార్వతీ:- వేడూకా శివునిఁ గూడుకొంటివి, నాతో
తోడాని సరి మాటా లాడెద వేమే? ౯

గంగా:- ఓసీ! కూటా కాళీ వెట్ల యీడాకు వస్తివి?
యాడాను నీ బుద్ధి వీడావు గదవే! ౧౦

పార్వతీ:- వెలఁదిరో! నా కన్న వెనక వచ్చితి; వింత
కులుకు మాటలు నీకు కూడాదు పోవే! ౧౧

గంగా:- ఓసి! తొలుత వచ్చిన చెవులఁ ద్రోసి, పిమ్మట వచ్చే
వలనొప్ప కొమ్మూలు వాఁడిగాదఁటవే? ౧౨

పార్వతీ:- వింటివే! పరమేశ! విశదముగా నేఁడు
దంట జాహ్నవి నన్ను దండించే విధమూ ౧౩

వర:- భామ మందాకినీ బలవంతురాలే! యీ
వామాక్షితో నీవు వాదాడేదేలే? ౧౪

పార్వతీ:- చనువిచ్చి దాని కిచ్చకమూలు పలికేవు
ఫణిధర! నీవెంత పక్షపాతివి రా? ౧౫

వర:- పక్షపాతినిఁ గానె! పనిఁబూని యిరువూరి
రక్షింపఁదలఁతునే! రాకేందువదనా! ౧౬

**పార్వతీ:-** వగమీఱ నిను వాఁడు వలచీ వచ్చెను; నేఁడు
జగదీశ! నను దాని సాటిఁ జేసితివా? ౧౭

**వర:-** వెలఁది! నీ విటు దాని వేతేలఁ జేసేవు?
కలకంఠి! నా రెండు కన్నులె మీరు. ౧౮

**పార్వతీ:-** తరిగొండ హరికి సోదరిని నే నై యుండి
సరవిని నీళ్లాతో సాటౌదు నఁటరా? ౧౯

**వర:-** తరిగొండా హరికినీ తనుజ మందాకిని, సో
దరి నీవు; మీకు భేదము లేదు లేవే! ౨౦

**వ.** అనిన విని పార్వతి రోషంబున నిట్లనుచున్నది:281

**దరువు, మధ్య మావతి రాగము**

**పార్వతీ:-** ఈడు గాని వగలాఁడి నాతో
జోడు వచ్చునా? ॥పల్లవి॥

పోఁడిమిగా చిన్ననాఁడు కూడినట్టి వాడుకచే
వేడుకనూ వీడనాడు టింతే గాని ॥ఈడు॥ఉప పల్లవి॥

కనులందు కామూని నిల్ప నేర్చునా?
కనుచూపులోనె తేలించ నేర్చునా?
మనసెఱిఁగి నీతో మాట్లాడ నేర్చునా?
కనకాము ఇనుమూ సాటౌనా? సామీ! ॥ఈడు॥౧

మీఱి కళలంటే మేర దెలుసునా?
మార తంత్రాము మర్మ మెఱుఁగునా?
ఏర! నీ మీఁది కోరి కెఱుఁగునా?
ఏఱు వారిధి సాటౌనేరా? సామీ! ॥ఈడు॥౨

చండ భాస్కర వహ్ని శశి నేత్రా!
నిండు సిరి శ్రీ తరిగొండా హరిమిత్రా!
చండిని పలుమాఱు చాల మెచ్చేవు,
కొండా మేరువు సాటౌనేరా? సామీ! ॥ఈడు॥3

## ❀ శాంభవి (పార్వతి) యోగ నిష్ఠ ❀

### ద్విపద

'భళి! భళి! పరమేశ! - బాగాయె వలపు!
నిలు! నిలు! నిఁక నేమి - నీతిఁ జెప్పెదవు?

ఇల నేఱు జలరాశి, - యినుము హేమంబు,
మలినంపు మశకంబు - మత్తగజంబు,

గట్టును మేరువు, - కాకి కోకిలయు,
రట్టడి బకమును - రాజహంసయును

సరి సరి యని పల్కు - జడుని కైవడిని
పరసాత్మ నగు నన్ను - సాటిఁ జేసితివి;

జలము మాయముఁ జేసె - జాహ్నవి యనుచు
కళవళంబున గొప్ప-గాఁ జూచినావు;

దాని సామర్థ్య మిం-తట నిల్చె; నింక
నేను గావలెనంటె - నిఖిల భూతముల

గంగతో మాయంబు-గాఁజేసి, యవలఁ
బొంగుచుఁ దరిగొండ-పురధాముఁడైన

శ్రీనివాసుని యాజ్ఞ-శిరసావహించి,
పూని క్రమ్మఱ వేతె - భూతజాలముల

మొనసి పుట్టింపనా? - ముక్కంటి!' యనుచు
కనుబొమల్ ముడివెట్టి - కను లెఱ్ఱఁజేసి,

కామాది శత్రు వ-ర్గమును పోఁదరిమి,
యా మీఁదఁ బద్మాస-నాసీన యగుచు,

మునుకొని భ్రూమధ్య-మున దృష్టి నుంచి
కనుచు, రేచక పూర-కంబులు చేసి,

కదియించి కేవల - కుంభకంబునను
వదలక నిలిచి.................................

భూమిలో నడఁచి, యా-భూమిని జలము
లో ముంచి, జలము నా-లో హుతాశనుని

చేత నింకించి, హె-చ్చిన హుతాశనుని
వాతూలమునఁ జేర్చి, - వాయువు నపుడు

ఆ యాకసంబునం-దణఁచి, యా నభము
నా యహంకారమం, - దా యహంకృతిని

ఆ మహత్తత్త్వమం, - దా మహత్త్వంబు
నా మహా ప్రకృతియం-దతి వేగఁ గూర్చి,

ఆ ప్రకృతిని బ్రహ్మ-మందుఁ గల్పుటకుఁ
దాఁ బ్రయత్నముఁ జేసి, - తరిగొండ హరిని

మఱువక, సవిశేష-మాత్రమై యున్న
యెఱుకను భావమం-దేమఱకుండె.

వ. ఇవ్విధంబునఁ బార్వతి గూర్చున్నఁ జూచి, క్రమ్మఱ గంగా భవాని శివునితో నిట్లనుచున్నది:282

## ❃ గంగ యోగ ధారణ, శివుని తపస్సు ❃

గంగా:-

తే.గీ. వినుము! శంకర! వైరాగ్యమున గిరీంద్ర
తనయ గూర్చున్న వేళ, మోదమున నేను
నిన్నుఁ గవగూడియుండుట నీతి గాదు;
గాన యోగముఁ గావింతు నేను మగుడి. 283

వ. అని పలికి, వీరాసనాసీనయై కూర్చుండి, సవికల్ప యోగధారణఁ జేయుచుండ, నంతఁ పరమేశ్వరుండు భృంగీశ్వరునిఁ జూచి, యిట్లను చున్నాఁడు: 284

వర:- క. ఆ పార్వతి, యీ జాహ్నవి
యీ పగిది విరక్తలైరి; యిఁక సంసార
వ్యాపార మెవరికొఱ కిఁకఁ?
గాపట్య విరహిత తపముఁ గావించెదరా! 285

వ. అని పలికి, సిద్ధాసనాసీనుండై శివుండు స్వస్వరూపానుసంధానంబుఁ జేయుచుండె; నంత. 286

## ❃ విష్ణుదేవుఁడు కైలాసమునకు వేంచేయుట ❃

### ద్విపద

ఆ విధం బెఱిఁగి మ-హామహుండైన
శ్రీ విష్ణుదేవుండు - శేషాద్రి విభుఁడు

ఘన రత్న మకుటంబు, - కర్ణ కుండలము,
లనుపమ భుజకీర్తు, - లమల కౌస్తుభము

మొదలగు భూషణ-మ్ములు చాల వెలుఁగ
గద పద్మ శంఖ చ-క్రములు ధరించి,

అంగుగా నమరిన - హాటకాంబరము,
చుంగులు జాఱఁ, గ-స్తురి తిలకంబు

చందన, సుమదామ - చయములు మెఱయ,
నందియల్, మొల ఘంట-లందంద మొఱయ

గరుడునిపై నెక్కి - కైలాసమునకుఁ
దరిగొండ హరి వినో-దంబుగా వచ్చె.

వ. ఇట్లు వచ్చిన జగన్మోహనునిఁ జూచి బాల
మొదలైన శక్తులు సంతసించి, తమలోఁ దా
మిట్లనుచున్నారు: 287

**దరువు**

విష్ణుదేవుఁడు వచ్చెనమ్మా! అమ్మమ్మలార!
విష్ణుదేవుఁడు వచ్చెనమ్మా! ॥పల్లవి॥

జిష్ణుముఖామర సేవితుఁడై ఘన
వైష్ణవ జన పరివారముతో శ్రీ ॥విష్ణు॥ ఉప పల్లవి॥

ఇందూ నిభాననమున్నా, మందహాస మిం
పొందూ వెన్నెల చందామూనా
సౌందర్య మసదృశంబై, శత
కందర్పుల ధిక్కారముఁ జేయఁగ ॥విష్ణు॥ ౧

కనులందు కరుణా రసమూ మెఱయా,
వక్షః స్థలమున కమలాదీధితి బృందా మొఱయా,
కనకాంబర రుచులను గూడి, హారములును
తళుకు తళుకున మినమిన మెఱయఁగ ॥విష్ణు॥ ౨

తరిగొండ నారసింహుఁడైనా శేషాద్రి విభుఁడూ
ఉరుతర బ్రహ్మానందామూనా
గరుడు నెక్కి, గంగకు, శర్వాణికి,
హరునకుఁ బొడమిన యఱమఱఁ దీర్పను
॥విష్ణు॥ 3

## ❋ వికట భాషణుఁడు విష్ణుదేవునితో వినోదముగా సంభాషించుట ❋

వ. ఇవ్విధంబున వచ్చిన విష్ణుదేవునిఁ జూచి, యందొక్క వికట భాషణుండు. 'అహో! స్వామీ! మూరెడు ముక్కూ, చారెడేసి ఱెక్కలు గలిగి, బిఱ్ఱ బిగించుకొని, యెఱ్ఱగా వుండే యీ పెద్ద భూతముమీఁద కూర్చుండి, వచ్చి వున్నావు. వీఁడు యెవఁడు? వీని వుట్టు, వూర్వోత్తరంబులు దెలుపు'మనిన విని, సైరణ గలిగిన హరి నవ్వుచు వినోదంబుగా నిట్లనుచున్నాఁడు: 288

### ద్విపద

విష్ణు:- వినరోరి! తెలియంగ - విహగవల్లభుఁడు
పనిఁబూని యా కశ్య-ప ప్రజాపతికి

వినతకు సుతుఁడైన - వీరశేఖరుఁడు;
నను మనంబున నుంచి నాక లోకంబుఁ

జేరి యింద్రుని జయిం-చి, ముదంబు మీఱ
ధీరుఁడై యమృతమున్ - దెచ్చిన వాఁడు;

చిరమైన తల్లి దా - సీత్వంబుఁ దీర్చి,
యురగాశనుండన - నొప్పిన వాఁడు;

ముదమొప్పఁగా నిత్య-ముక్తుఁడై నన్ను
కుదురైన భక్తితోఁ గొలిచెడి వాఁడు;

ఇతని మహత్త్వ మీ-వెఱుఁగనేరకను
మతిచెడి యిపు డిన్ని-మాటలాడితివి;

అనువొందఁ దరిగొండ-హరినైన నేను
విని సహింపను నిన్ను-వికట భాషణుఁడ!

నన్నన్న సైరింతు; నా-భక్తవరుల
నన్న శిక్షింతు బ్ర-హ్మాదులనైన.

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! మీ భక్తుల మీఁద మీకు ఇంత అభిమానము వుండేది సంతోష మాయెను. నేను నీ భక్తుఁడనై వేడుకగా ఇంకా కొన్ని వికటోక్తులు అడుగుచున్నాను. కోపముఁ జేయఁ బని లేదు.

లోకములో కుండ కుమ్మర సారె గుండుగా నుండఁగాఁ జూచినాను. నీ కుడిచేతి కుండ కుమ్మర సారె కొనను తేకులు గలిగి యున్నది. ఇది యెట్టి కుమ్మరి సారె అయినది తెలియ లేదు; దయచేసి తెలుపు'మనిన దరహసిత వదనారవిందుండై దైవరాయఁ డిట్లనుచున్నాఁడు: 289

విష్ణు:-తే.గీ.పరఁగఁ గల్పాంత సూర్యబింబంబు రీతి
మించి దుష్టులఁబట్టి వధించి, పూర్ణ
చంద్రబింబంబు కరణి సజ్జనులఁ గాచు
చక్రమగు; నిదియుఁ గులాల చక్రమఁటర? 290

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! లోకములో వుండే కోడిగుడ్డు గుండుగా వుండును. నీ యెడమచేత

వుండే కోడిగుడ్డు కొన కూచిగా వున్నది. ఇది యేమి కోడిగుడ్డు అయినది దయచేసి తెలియజెప్పు' మనిన మందస్మితాస్యుండై మాధవుం డిట్లనుచున్నాఁడు:291

విష్ణు:-తే.గీ.అమృతవార్ధి మథింపఁగా నచటఁ బుట్టి,
మిక్కుటంబుగ నాచేతఁ జిక్కు పుణ్య
జనుల నేఁ(ద్రుంచినప్పుడు జయముఁ జాటి
నట్టి వరశంఖ మిది; కుక్కుటాండమఁటర? 292

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! లోకములో వడ్లు దంచే రోఁకండ్లు కొన, మొదలు వొక్క దిట్టముగా వుండును. మీ చేత నుండే రోఁకలి కొన వక లాగుగా, మొదలు వకలాగుగా నున్నది. ఇది యేమి దంచే రోఁకలి అయినది తెలియలేదు. నన్ను మన్నించి తెలియఁజెప్పు'మనిన, నగుచు నగధరుం డిట్లనుచున్నాఁడు: 293

తే.గీ. లోక కంటకులై, సురానీకములను
దఱుముచున్నట్టి దైత్యుల తలలు పగుల
నడుచు సాధన మగుచును, నెడమచేత
జోకగా నుండు గద యిది; రోఁకలఁటర? 294

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! లోకములో నుండే పిచ్చుకలకు కాళ్లూ, కండ్లూ, ఱెక్కలు, ముక్కు, తోఁక యేరుపడివుండును. నీ చేత వుండే పిచ్చుక ముక్కు కొన మాత్రం కొంచెం కూచిగా, కొదవ అంతా గుండుగా వుండుకొని, తోఁక నీ చేతికిచ్చి తల(క్రిందుగా వ్రేలాడుచున్నది. ఇది యేలాటి పిచ్చిక అయినది తెలియలేదు. కోపము సేయక తెలుపు'మనిన, వికసిత ముఖకమలుఁడై విష్ణుదేవుం డిట్లనుచున్నాఁడు:295

విష్ణు:-తే.గీ.పూని తరిగొండ హరినైన నేను, సిరియు
నరసమాడుచు నొకవేళ మురిసి చాలఁ
చెలఁగి కళలంట నేయ నేఁ జేతఁ బట్టు
బిసరుహము గాని, యిది యొక్క పిచ్చుకఁటర?296

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! నీ తొమ్ముమీఁద మినమిన మెఱయుచూ, కాళ్లూ, చేతులాడింపుచూ, కండ్లు మిణకరింపుచూవుండే యీ చిన్న పాప యెవరైనది తెలియలేదు. తెలియఁ జెప్పు' మనినఁ జిఱునవ్వుతో శ్రీకాంతుం డిట్లను చున్నాఁడు: 297

విష్ణు:-తే.గీ.మున్ను తరిగొండ హరినైన నన్నుఁ గూర్చి
వర తపముఁ జేసి, నా వక్షమందు
లలిత భూషణమై యున్న లక్ష్మి నిటులు
చిన్నపాపన కటుపోర! చెనఁటివాఁడ! 298

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! యివి యే లోకంబులో వుండే మిణుఁగుఱు పురుగు?' లనిన నారాయణుం డిట్లనుచున్నాఁడు: 299

విష్ణు:-తే.గీ.వర కిరీటాది భూషణావళులయందు
మంచి కుందనమందుఁ దాపించినట్టి
నాణ్యమై యొప్పు జీవరత్నములు గాని,
నీచమైనట్టి ఖద్యోత నివహ మఁటర? 300

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! యితఁడు గరుత్మంతుఁడు; ఇది చక్రము; ఇది శంఖము; ఇది గదా; ఇది పద్మము; ఈ యమ్మ లక్ష్మీదేవి; మీ మీఁద

వెలిఁగేవన్నీ జీవముఖులు - అంటివి గదా! సంతోష మాయెను. మఱి నీ వెవరైనది తెలియలేదు; తెలుపు'మనిన, హరి యిట్లనుచున్నాఁడు: 301

క. వర దధి కలశములోపల
నరుదుగ నుదయించి భక్తులగు వారలచే
గురుతర పూజలు గొనుచును
తరిగొండ నృసింహుం డనఁవాఁడనురా! 302

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! తరుచుచుండిన పెరుఁగు కుండలోఁ బుట్టి, తరిగొండ నారసింహుండనే పేరుఁ బెట్టుకొనివుండి, మహా భయంకరముగా కోర మీసములతో వండ్లు ఇగిలించుకొని, కండ్లు బిక్కరింపుచు, గోళ్లు పెంచుకొని వున్నాఁడు. నీవు చక్కనివానివలె వున్నావు. కాఁగా, నీ వా నారసింహుండవు గావు. మఱి యెవరో తెలుపు'మనిన శ్రీనివాసుండిట్లనుచున్నాఁడు: 303

విష్ణు:-క. ఘన తరిగొండ నృసింహుఁడ
ననినందుకు నీకు సంశయము దోఁచెఁ గదా!
విను! శేషగిరిని బలు సిరి
నెనయుచునున్నట్టి వేంకటేశ్వరుఁడను రా! 304

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! నీ పోలిక అంతా వేంకటేశ్వరునివలెనే వున్నది. నీకుడిచెయ్యి అందఱికి వరాలు ఇచ్చే పోలికెగా వున్నది. ఆ వేంకటేశ్వరుని కుడిచెయ్యి అందఱిని వరాలు తెమ్మని అడిగేపోలికెగా వున్నది కాబట్టి, నీవు

వేంకటేశ్వరుఁడవుగా తోఁచలేదు. మఱి నీవు ఎవరైనది
తెలియలేదు; నిజముగా నీవు ఎవరో తెల్పు' మనిన,
నగుచు శ్రీ వేంకటేశ్వరుం డిట్లనుచున్నాఁడు: 305

విష్ణు:-క. తరిగొండ హరిని వేంకట
గిరివాసుఁడ ననుట కింత గేలింపుచుఁ దొం
దర మాట లంటివిర! విను!
మఱియును వైకుంఠవాసుఁడను ఘనుఁడను రా! 306

వ. అనిన విని, 'అహో! స్వామీ! నీ వైకుంఠపురం
బెటువంటిది?' యనిన, వాసుదేవుం డిట్లను
చున్నాఁడు: 307

## ❄ వైకుంఠ పురము ❄

### ద్విపద

విష్ణు:- వెరఁగొప్ప వినరోరి! - వికట భాషణుఁడ!
విరజ కావల వేద - వేద్యమై తనరి,

బ్రహ్మాదులకు మూల-పాథేయ మగుచు
దివ్యలోకమున సు-స్థిరముగా నుండు

పొసఁగఁ దద్వైకుంఠ-పుర మెట్టి దనిన:
విసువక తెలిపెద - వివరించి వినుము!

కర మొప్పఁగా స్వప్ర-కాశంబులగుచుఁ
దఱచుగా నప్రాకృ-తంబులై మించి,

మిహిరాబ్జకాంతుల - మెచ్చక వెలుఁగు
బహు రత్న గోపుర - ప్రాకారములును,

మరకత స్తంభముల్, - మాణిక్యములను
చిరములై తగు హేమ-సింహాసనములు,

పట్టుగా నమరిన - స్ఫటిక కుడ్యములు,
దట్టంపు వజ్రాల - ద్వారబంధములు,

స్ఫటికపు కాంతి ద-ర్పణ కవాటములు,
బటువులౌ పగడాల - పంచ తిన్నెలును,

కొమరొప్ప ముత్యాల-కుచ్చుల నొప్పు
నమరేంద్ర నీల సౌ-ధాట్టాలకములు,

మంగళకర మణి - మంట పావళులు,
రంగైన రచ్చలు, - రాజవీథులును,

బంగారు కోటలు, - పద్మాకరములు,
శృంగార వనములు, - జిగి చప్పరములు

గలిగి, మహాద్భుత - క్రమముగా నుండు;
బొలుపొంద నటువంటి - పురములో నెపుడు

మురువొప్పఁగా నిత్య-ముక్తులు గొల్వఁ
దరిగొండ హరినై ము-దంబు రెట్టింప

శేష తల్పమునందు - సిరితోడఁ గూడి,
పోషింపు చుండుదు - భువన త్రయమును.

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! నీవు భువనత్రయంబును పోషించేవాఁడవైతే, పుట్టించేవాఁ డెవ్వఁడు? సంహరించేవాఁ డెవ్వఁడు? తెల్పు'మనిన, హరి యిట్లనుచున్నాఁడు: 308

విష్ణు:-తే.గీ.చెలఁగి కమలాననుఁడు సృష్టిఁ జేయుచుండు;
లీల వెలయఁగ నేను పాలింపుచుందు;
హరుఁడు లయమును పొందించు; నమర మాకు
మగ్గరికి మూఁడు పను లిట్లు మొనసియుండు.309

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! నీవు పోషించేవాఁడవైనది నిజమే కదా? మఱి నీ వెవరిని సంహరించినా?' వనిన హరి యిట్లనుచున్నాఁడు:310

## ద్విపద

విష్ణు:- వెలయఁ జెప్పెద నీకు - వినరోరి! నేను
చెలఁగి సూకర, నార-సింహరూపముల

నిలఁ దాల్చి కనకాక్ష - హేమ కశ్యపుల
బలవంతముగ బిగఁ - బట్టి చంపితిని;

ఆ మీఁద నే రాముఁ - డనఁగ జన్మించి,
భూమికి రాజనై - భూమిజ కొఱకుఁ

గడఁగి రావణ కుంభ - కర్ణుల నెల్లఁ
బడఁగూల్చితిని ఘోర - బాణ జాలముల,

అటమీఁద శ్రీకృష్ణుఁ-డన జనియించి,
తటుకున శిశుపాల - దంతవక్త్రులను

విదళించి మించితి; - వీర లాఱుగురు
మొదలుగాఁ గల - మూర్ఖ రాక్షసులఁ

దరిమి కొట్టుదుఁ గానఁ - దరిగొండ వాసుఁ
డరయఁగా దనుజారి - యందురు నన్ను.

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! నీవు 'పాలించేవాఁడ'నని మొదట చెప్పి, యిప్పుడు సంహరించితి నంటివి. సంహారకర్త రుద్రుఁడై వుండఁగాను, ఆతని వుద్యోగము మీఁద నీవు పై పోటీ చేసి, దనుజుల నంహరింవఁ దగునా?' యనిన, దనుజాంతకుండిట్లనుచున్నాఁడు: 311

## జంపె

విష్ణు:- నా సత్త్వ గుణముఁ గొని నాగకంకణుఁ డెపుడు
భాసురముగాఁ బ్రోచు భక్త సంతతినీ ౧

హరుని తామస గుణము నరుదుగాఁ గొని నేను
సుర కంటకుల నెల్లఁ దఱిమి కొట్టుదునూ ౨

హరునికిని నా గుణము, హరుని గుణమును నాకు
నరయ నన్యోన్యంబులై కలుగుచుండున్; 3

కరమొప్ప కనకమే కటక, మకుటములైన
కరణి నొకటై రెండుగా నుందు మిలనూ ౪

తరిగొండ పతి యనఁగ మెఱయుచుండెడి నాకు
హరునకును భేద మావంతయును లేదూ. ౫

## ❊ హరి హరులకు అభేదమును తెలుపుట ❊

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! శంకరునికి నీకు భేదంబు లేదంటివి. నీవు నల్లగా వున్నావు; శంకరుఁడు తెల్లగా వున్నాడు. కాఁగా, భేదమే వున్నది. భేదములేదని నీవు చెప్పిన లక్షణం బే'మనిన, లక్ష్మీపతి యిట్లనుచున్నాఁడు: 312

**ద్విపద**

విష్ణు:- వినరోరి! చెప్పెద - వికట భాషణుఁడ!
మునుకొనినప్పుడే - మునులును, నేను

మనుజు లందఱును మా-మైత్రి చిహ్నములు
ఘనముగాఁ దెలుతురు - గాక! యటంచు

శంకర తామస-సంబంధి నైల్య
మంకితంబగు దేహ-మమరఁ-దాల్చితిని;

పరఁగ నా శాంత సం-బంధి ధావళ్య
వర శరీరముఁ దాల్చె - వామదేవుండు;

అరయ నంతే గాని - హరునకు, నాకు
వెరసి చూచిన వస్తు - భేదంబు లేదు;

చిరముగా నన్ను భూ-షించిన వారె
పుర సంహరునిఁ జాల - భూషించువారు;

హరుని భూషించిన - యటువంటివారె
పొరిఁబొరి నన్నును - భూషించు వారు;

అతని భక్తులును నా-కన్యులు గారు;
హితముచే నా భక్తు-లిందు మౌళికిని

అన్యులు గారు; మా-కందఱు నొకటె;
మాన్యులై యుందు; రే - మతములందున్న.

నటుగానఁ దరిగొండ - హరినైన నాకు
నిటలాంబకున కిట్టి - నెన రొప్పుచుండు;

సరస సృష్టి స్థితి - సంహారములకు
నరయ బ్రహ్మయు, నేను, హరుఁడు కర్తలము.

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! బ్రహ్మదేవుడు పుట్టించేదిన్నీ, నీవు రక్షించేదిన్నీ, రుద్రుండు సంహారంబుఁ జేసేదిన్నీ - యీ మూఁడున్ను ఆ వేదములు (వెల్లడించును). అది యట్లా (నుండనీ!). (మఱి) ఆ వేదములంటినైనా జీవుల యొక్క కర్మములే పుట్టించును; కర్మములే వృద్ధిఁ బొందించును; కర్మములే సంహరించును. - (అని పలుకును). అంతే కాని, మీరు ముగ్గురు పుట్టించే వారు గారు; రక్షించే వారు గారు; సంహరించే వారు గారు. (కర్మమే) అన్నింటికిని కర్తయై యుండునుగాన, కర్మముయొక్క స్వభావమును మీయందు ఆరోపించుకొని, 'యీ కార్యంబులు మేము చేస్తున్నాము' - అని అంటిరి గదా! ఆ యర్థమే నిజమైనట్లైతే బ్రహ్మ యుత్పత్తియందుఁ బుట్టిన హిరణ్యాక్షాదులను నీవు చంపితివి; అంధకాసురాది దైత్యులను శంకరుండు ఖండించె. వారి యొక్క కర్మమే ఖండించెనని తప్పించు కొంటిరైనా కడతేఱుఁదురు. లేక, అహము వహించినట్లాయెనా, ఆ రాక్షసులను జంపిన బ్రహ్మహత్యలు మిమ్మందఱిని విడువ' వనిన విని వికావిక నవ్వి, విష్ణుదేవుం డిట్లనుచున్నాఁడు: . 313

## ద్విపద

విష్ణు:- భళి! భళి రా! వక్ర - భాషణ! మేము
చెలరేఁగి ఖలుల శి-క్షించి, సాధువుల

నలరఁ బ్రోచిన బ్రహ్మ-హత్యలు మాకు
కలుగునె? యిటు పల్కఁ-గాఁ దగునె?

అరయఁగా నవి గాక - యఖిల ధర్మములు
నెఱిఁగిన ట్లుపదేశ - మియ్య వచ్చితివి;

కర్మంబు కర్తని - కడఁగి పల్కితివి;
కర్మంబు జడమది - కర్త యెట్లగును?

ఇది నిర్ణయించుట - కిది వేళ గాదు;
పదపడిఁ దరిగొండ - పతియైన నన్ను

భావింపుచున్నది - పార్వతి యిచటఁ,
బోవలె; నన్నింకఁ - బోనీర! యోరి!

వ. అనిన విని వాఁడు 'అహో! స్వామీ! పార్వతి నిన్ను భావింపవలసిన నిమిత్త మేమి? నీ వచటికిఁ బో వలసిన నిమిత్తమేమి? ఇది మాత్రము దయచేసి తెల్పు' మని నమస్కరించిన, హరి యిట్లనుచున్నాఁడు: 314

విష్ణు:-తే.గీ. హరుఁడు, గిరిజయు, గంగయు నఖిలలోక
ములను మాయంబుగాఁ జేయ ముని తపములఁ
జేయుచున్నారు; నే నిందుఁ జేరి తపము
నుడుపవలెఁ; బోర! యింక నే మడుగవలదు.315

వ. అని పల్కి, వాని వీడ్కొనిపోయి, తపంబుఁ జేయుచున్న గంగాపార్వతులను, శివునింజూచి, హరి వెఱఁగుపడి భృంగీశ్వరునితో నిట్లనుచున్నాఁడు:316

## ❀ భృంగీశ్వరుండు - విష్ణుదేవుండు ❀

### ద్విపద

విష్ణు:- ఇది యేమి భృంగీశ? - యీ సదాశివుఁడు
కదలక తప మిట్లు - గావింప నేల?

అగజ మహాయోగ - మందుఁ గూర్చుండి,
జగములు వరుసగా - సమయింపనేల?

రమణి శ్రీగంగ వి-రక్తురాలగుచుఁ
గొమరొప్ప నీ రీతిఁ - గూర్చుండ నేల?

రహి మీఱ వీరి వై-రాగ్యముల్ మించ
బహువిధ బ్రహ్మాండ - భాండంబు లదరె;

వగచేత వీ రిట్ల - వ్రతముఁ బూనినను
నగరె లోకము విన్న - నా శాంతిపరులు;

కావున శ్రీగంగ-కడకు ముందుగను
నీవేఁగి, తరిగొండ - నిలయుఁడైనట్టి

నరహరి వచ్చి యు - న్నాఁడని చెప్పి,
కరములు మొగిచి, గం-గను బిల్వుమిటకు.

వ. అనిన విని, భృంగీశ్వరుండు హరినిఁజూచి, 'యహో! మహానుభావా! నీ కొమార్తె అయిన గంగాభవాని చూడ గయ్యాళిగా వున్నది. కాఁగా, నేఁ బిలువ వెఱతు' ననిన నగధరుం డిట్లనుచున్నాఁడు: 317

విష్ణు:-క. నా కూఁతురైన గంగకు,
నా కూరిమి చెల్లెలైన నగవర సుతకున్,
శ్రీ కంఠునకున్ కలహం
బీ కరణినిఁ గలుగ నేమి హేతువు భృంగీ? 318

వ. అనిన విని భృంగీశ్వరుండు చక్రినిఁ జూచి, 'అహో! స్వామీ! యేమి చెప్పుదును? చెప్పుటకు సంకోచంబుగా వున్నది. అయినా మంచిది. విన్నది, కన్నది మనవి చేసెద. చిత్తగింపుము.

వొనొన్నటి దినము కలహాశనుండైన నారదుండు వచ్చి, వక నవరత్న హారంబు గిరిజ కిచ్చెను. ఆ వైషమ్యంబున గంగ కోపంబుఁ జేసి, లోకంబులలో పుడిసెడు నీళ్లు లేకుండా మాయఁ జేసెను.

ఆ నిమిత్తంబున యింద్రాది దేవతలు వచ్చి శివునకు మ్రొక్కి 'మరల తోయంబులు దెప్పింపు'మని వినుతించి పోయిరి. అది కారణంబున హరుండు గంగను ప్రార్థించెను.

'బ్రహ్మదేవుండు ధరించిన శుద్ధ మాణిక్య హారంబు యిప్పించక, నీ మోముఁ జూడ' నని యీ గంగమ్మ రెట్టించెను. తన్నిమిత్తంబున శంకరుండు బ్రహ్మను పిలిపించి, ఆ మాణిక్య హారంబును యాచించి పుచ్చుకొని, గంగ కిచ్చెను. మాణిక్య హారంబు ధరియించి, మరల జలంబులు రప్పించి, గంగ శివునిఁ గూడి సుఖంబుగా నుండెను.

అంతలో పార్వతి శివుని తోడితెమ్మని వొక్కసఖిని గంగ నగరికి పంపించెను. అది వచ్చి హరునిఁ బిలిచి, గంగకు మ్రొక్కి, 'శివుని పంపించు' మనిన, యీ గంగమ్మ కోపించి మెడఁబట్టి నెట్టించెను. అది పోయి పార్వతికి మ్రొక్కి, 'కుయ్యో! మొఱ్ఱో!' యని మొఱఁ బెట్టుకొనెను. అందుకొఱకై పార్వతి గంగ యింటికి వచ్చి, 'నా సఖిని భయము లేక కొట్టించిన దేమి?' యని యడిగెను. అడుగఁగానే 'పో!పో! కొట్టించితే కొట్టించితిని. నాకేమి భయము?' అని యీ గంగమ్మ రెట్టించెను.

అది మొదలు పూర్వ పశ్చిమ సముద్రంబుల విధంబున విడిఁబడి కలహించిరి. అప్పుడు పార్వతి శివునిఁ జూచి, 'గంగ నన్నాడిన మాటలు వింటివి గదా?' యని నేమించి యడిగెను. అడిగితే శివుండు 'మందాకిని బలవంతురా'లని పలికెను. 'ఈ విధంబున గంగ నీళ్లు మాయముసేయఁగానే దానిని బలవతురా లంటివి గదా! అది యొక్క భూతంబును మాయంబుఁ జేసెను. నేను పంచభూత ప్రపంచం బంతయు మాయముఁ జేసి నా సహోదరుఁడైన తరిగొండ నారసింహుని యాజ్ఞఁ గైకొని, క్రమ్మఱ ప్రత్యేక ప్రపంచంబును పుట్టించెదను! నా సామర్థ్యంబుఁ జూడు' మని యీ విధంబునఁ గూర్చుండెను.

ఈ గౌరమ్మను జూచి, యహా గంగమ్మ గూర్చుండెను. ఈ యిద్దఱితో వేగలేక, విరక్తుండై శివుండు గూర్చుండెను. ఈ ముగ్గురిలో తప్పు యెవరిదో నీవు విచారించి యానతియ్య' మనిన ధర్మజ్ఞుండైన హరి యిట్లనుచున్నాఁడు: 319

## ద్విపద

విష్ణు:- వినర! భృంగీశ! యీ - వెలఁది శర్వాణి
దనరార నా సహో-దరి; గంగ నాకుఁ

జిన్న కూఁతురు; సదా - శివుఁడు మిత్రుండు.
పన్నుగా నే వీరి-పైఁ దప్పు వేను

వివరించి చెప్పదు - విశదంబుగాను,
భవునిపైఁ దప్పు లె-ప్పటికిని లేవు;

నగజపైఁ దప్పు లే-నాఁడును లేవు;
ముగురిలోఁ జూడ నా-ముద్దు కూఁతురినిఁ

దప్పులు బట్టుట - ధర్మంబు గనుకఁ,
జెప్ప వలసి వచ్చె - తప్పు శ్రీగంగ,

దిది యేమి? గంగ త-ప్పేమంటివేని?
అది విను! తన యింటి - కంపించి నట్టి

కొమ్మ పార్వతి సఖిన్ - కొట్టించెఁ గనుకఁ
గ్రమ్మి గంగకుఁ దప్పు-గలదన వలసె;

తన వారు పరవారు - తన వావి నెంచి,
తను ధర్మ మడిగినఁ - దథ్యంబుగాను

నున్న దున్నట్లుగా - నొగిఁ జెప్పవలెను;
పన్నుగాఁ దనవారిఁ - బక్షీకరించి,

తప్పిన నొప్పుగా - ధర్మంబుఁ దీర్చి
చెప్పిన వాఁడు దు-శ్శీల చిత్తుండు;

కావున గంగకు - గలుగు నేరంబు
భావించి తెలిసి చె-ప్పక యుండ నాకుఁ

దగవు గాదని గంగ-తప్పఁ జెప్పితిని;
యగజ కే నిట్లంటి - నని చెప్ప వలదు;

'అలర శ్రీ తరిగొండ - హరి వచ్చె' ననుచుఁ
బిలువు శ్రీగంగను - ప్రీతితో నిటకు.

వ. అనిన విని భృంగీశ్వరుండు గంగకడకుఁ బోయి 'మీ తండ్రియైన తరిగొండ నారసింహుండు వచ్చి, నిన్నుఁ జూడవలెనని పిలుచుచున్నాఁ'డనిన, దిగ్గున లేచి వచ్చి, హరినిఁ జూచి, కరకమలంబులు మొగిచి యిట్లనుచున్నది: 320

గంగా:-క. శ్రీకాంతా హృదయేశ్వర!
నాకాధిప వినుత చరణ! నాగ శయానా!
నా కన్నతండ్రి! నరహరి!
నీకు నమస్కారమయ్య! నిగమవిహారా! 321

వ. అని నమస్కరించిన నరహరి యిట్లనుచున్నాఁడు:322

నరహరి:-
తే.గీ. అమ్మ! చిరకాల ముత్తైదువగుచు నీవు
హరుఁడు, శర్వాణి కృపను నిన్నాదరింప,
లోక పావనివై కీర్తి మాకుఁ దెమ్మ!
చల్లగా నుండు గంగ! యీ జగతిమీఁద. 323

వ. అని దీవించిన తండ్రిముందఱ వినమిత ముఖారవిందయై, పదాంగుష్ఠంబున నేల వ్రాయుచు, మాఱు పల్కక, కన్నీరు నింపుచు నూరకుండిన కూఁతురిన్ జూచి, కనికరంబునఁ గన్నతండ్రి యిట్లనుచున్నాఁడు: 324

## ❀ గంగాదేవికిఁ గన్న తండ్రి హితోక్తి ❀

### ద్విపద

విష్ణు:- అమ్మ! శ్రీగంగ! నీ-పతి చింతతోడ
నెమ్మోము వంచి, క-న్నీరు నింపుచును

మొనసి పాదాంగుష్ఠ-మున వేల నున్న
లొనర వ్రాయుచుఁ బెంచు-చుండ నేమిటికి?

నెమ్మదితో నుండు - నీ కేమి భయము?
సమ్మతిపఱచెద - శాంభవిన్, శివుని.

ఇటమీఁద నొక మాట - నేను చెప్పెదను!
కుటిల కుంతల! నీకుఁ - గోపంబు వలదు;

రహిమీఱ రత్నహా-రమునకై పోరి,
మహిమ దీపింపఁ దా-మరస సంభవుని

యతిశయ మాణిక్య - హారంబు పతిని
హితవుగా నడితి; - విందు శేఖరుఁడు

నెళవుగా నది దెచ్చి - నీ కిచ్చె నిపుడు;
పొలుపొంద నుపశాంతిఁ - బొందియుండకను

కుధరజ సఖి నటు - కొట్టింప రాదు;
మధురస వాణి! నీ - మర్యాద గాదు;

నగజ నా చెల్లెలు, - నా బిడవు నీవు;
పగ యేల మీకు నా - బంధుత్వ మమర?

నొక వేళ నిర్ధతీ - కొక భర్త గనుక,
నొక మాట వచ్చిన - నోర్పుతో నీవు

పిన్న పెద్దంతర్వుఁ - బ్రీతితోఁ దెలిసి,
యన్నిట గిరిజ గౌ-ప్పనిపించ రాదె?

నీ యొక్క వంతలో నేఁ - దగ్గి పోనె?
మా యమ్మ! యింత తా-మస మేల వచ్చె?

తనయవై పుట్టి నీ-తల్లిదండ్రులకుఁ
గినిసి సత్పుత్రి యన్ - కీర్తిఁ దేవలయుఁ;

దరిగొండ హరి బిడ్డ - దంట యటంచు
నెరయ నా కపకీర్తి - నీవు దేవలెనె?

మంచిది గాని, ప్ర-మాదంబుచేత
మించిన పని కింత - మిడుక నేమిటికి?

ఇఁకనైన శర్వాణి - నేమి నీ వనక,
యొకటిగా నుండు! నే - నొకటి చేసెదను;

సంతోషమున నుండు! - శాంతి వహించు!
చింత నీకేల? నా-చిన్నారి కంద!

వ. అనిన విని, ఖిన్నురాలై గంగాభవాని యిట్లను చున్నది: 325

### ద్విపద

గంగా:- ఓ కన్నతండ్రి! యీ - యుర్విలోపలను
నీ కొక యపకీర్తి - నే నేలఁ దెత్తు?

పులి పిల్ల పులిగాక - పోవునే? నీకుఁ
గల శాంతి నా కేలఁ - గల్గక పోవు?

నా తప్పు వినవయ్య! - నాగకంకణునిఁ
బ్రీతితో రమ్మని - పిలువఁ బోయినను

ఘాతకురాలైన గౌరి - నా వెంట
భూతేశు నంపక - పోరాడె! గనుక,

నాకుఁ గోపము రాఁగ - నారంబు లెచట
లేకుండఁజేయఁగా, - లేచి శంకరుఁడు

పరువెత్తి వచ్చి నన్ - బ్రార్థింపఁ జూచి,
యెఱుకత చెప్పిన - యిక్కువ చేత

హారంబు నడిగితి - నాత్మ నాయకుని,
భోరునఁ దెప్పించి - భుజగ భూషణుఁడు

ఇచ్చిన, ధరియించి - యేను తోయములఁ
దెచ్చితి; నంతటఁ - దెగెఁ గలహంబు;

ఆ మీఁద శర్వాణి - యాక్రోశ మెసఁగ
నా మేలుసైఁపక, - నా చెంత నున్న

శివునిఁ బిల్చుట కొక్క - చెలినిఁ దా నంపె;
శివమెత్తిన ట్లది - 'శివు నంపు'మనుచు

గట్టిగా నను౦ దిట్టి, - కలహించి మించి,
మిట్టిపడిన, దాని - మీఁదఁ గోపంబు

వచ్చి కొట్టినఁ దప్పు-వచ్చెనే నాకు?
హెచ్చి తా నపుడె నా-యింటికి వచ్చి,

నిన్ను నా యయ్యను - నీచంపు మాట
లన్నది తప్పు గా-దా యద్రి సుతకు?

గాదేని నా తప్పు-గాని, నీ విటకుఁ
బూని వచ్చితివి; తె-ప్పున వీరి తపము

నుపశాంతి పఱచి నీ-వొకటిగాఁ జేసి,
యపకీర్తిఁ దప్పించు-మయ్య! భోగములు

నే నొల్లఁ దరిగొండ - నిలయ! వీ రిర్వురును
నా నందమున నుండు - టంతియే చాలు.

వ. అనిన విని నెనరున హరి గంగ నాదరించి, 'నీ వుపశాంతి వహించు'మని నియమించి, క్రమ్మఱ భృంగీశ్వరుండు శాంభవి సమీపంబునకుం బోయి యాలాగే ప్రార్థించి, 'తరిగొండ నారసింహుండు నిన్నుఁ జూడవచ్చినాఁ' డనిన, ఆ శబ్దంబు సూక్ష్మంబుగా వినఁబడిన, యోగంబుఁ గ్రమంబుగా నుపసంహరించి, కన్నులు దెఱచి, ధ్యేయస్వరూపుండై ముందఱ నిలిచిన హరినిఁ జూచి, లేచి, కరకమలంబులు ముకుళించి యిట్లనుచున్నది: 326

## ❋ పార్వతీ దేవి తరిగొండ శేషగిరీశుని సన్నుతించుట❋

పార్వతీ:-శ్లో॥సత్య జ్ఞానసుఖస్వరూప మమలం చక్రాయుధం శ్రీకరం,
నిత్యం నిర్గుణ మవ్యయం నిరుపమం నిర్వాణ బోధ ప్రదమ్।
ప్రత్యక్షానుభవామృతం శుభకరం పాపాద్రి వజ్రాయుధం,
దైత్యారిం తరిగొండ శేషకుధరాధ్యక్షం భజేஉహం సదా॥ 327

శ్లో॥ సంతాపాంబుధి బాడబం సురుచిర స్వాంతం
జగత్కారణం,
శాంతం స్వచ్ఛ మమేయ మాద్య మచలం
జాంబూనదాభాంబరమ్।
క్షాంతం భవ్య సుఖాశ్రయం గురువరం సంసార
భూజచ్ఛిదం,
దాంతం శ్రీ తరిగొండ శేషకుధర్యాక్షం భజేఽహం
సదా॥ 328

క. శ్రీకర! సుగుణ గుణాకర!
లోకేశ్వర! ధర్మచరిత! లోకాతీతా!
శ్రీ కంఠ మిత్ర! శుభకర!
నీకు నమస్కారమయ్య! నీరజనాభా! 329

వ. అనిన విని హరి యిట్లనుచున్నాఁడు: 330

నరహరి:-క.లోకములన్ని నశించిన
జోకగ బ్రహ్మంబునందు సూక్ష్మతరంబై
ప్రాకట మహిమన్ వెలిఁగెడి
నీ కాశీర్వాద మగజ! నిర్మలహృదయా! 331

వ. అనిన విని పార్వతి! యిట్లనుచున్నది: 332

ద్విపద

పార్వతీ:- అన్న! మా గృహకృత్య - మంతయు నీకుఁ
జెన్నొందఁ దెలియు; నేఁ - జెప్ప నేమిటికి?

బహుకాలమున నుండి - పరమేశుఁ గూడి
విహిత సంసారంబు - వెలయఁ జేసితిని;

అలరితి వైరాగ్య - మాత్మలో నుంచి,
యెలమిని సంసార - మింక నే నెల్ల;

చెలఁగు మందాకిని - చిన్నది గనుకఁ
బొలుపొందఁగాఁ గామ - భోగ భాగ్యములు

కావలె; గంగకై - కాలకంధరుని
వేవేగ లేపుమీ! - విశ్వాత్మ! తపము

మించిన పిమ్మట - మెదలింప రాదు;
మించి కూర్చున్న నీ - మిత్రుని లేపు!

మతులిత తరిగొండ - హరి యమలాత్మ!
పతిని వైరాగ్యంబు - పాల్జేసె ననుచు

మనుజు లందఱి నింద - మనకేల? శివుని
ఘనముగా లేపి, శ్రీ-గంగ కర్పించు.

వ. అనిన విని హరి యిట్లనుచున్నాఁడు: 333

## ద్విపద

నరహరి:- ఓ తల్లి! నగజ! నీ - యోగాగ్నిచేత
భూతముల్ నశియించి - పోవుచుండఁగను,

సరగునఁ జూచి మో-సము వచ్చె ననుచుఁ
బరువెత్తి వచ్చితిఁ - బక్షీంద్రు నెక్కి,

గావున ననుఁజూచి - ఘనశాంతిఁ బొందు;
నీ విందు వైరాగ్య - నిష్ఠ చాలించు!

హరునకుఁ 'దరిగొండ-హరి వచ్చె' ననుచు
సరసంబుగాఁ జెప్పి-శాంతిఁ బొందించు!

నెరయ చిన్నది; నేర్పులు-నేరకుండినను
కరుణార్ద్ర దృష్టితో - గంగను బ్రోవు!

భామాలలామ! నీ-బంధుత్వముననను
నా ముద్దు కూఁతురిన్ - నమ్మి యిచ్చితిని;

గామరో! నీ వన్య-రాలవై యున్న
నీ మాడ్కి సవతిపై - నిత్తునే సుతను?

నీ వెఱుంగనిదేమి? నెలఁత! భావించు;
వేవేగ లేపుమీ! - విశ్వేశు నిపుడు.

వ. అనిన విని పార్వతి శాంతిఁ బొంది, నెనరుతో హరినిఁ జూచి యిట్లను చున్నది: 334

తే.గీ. అన్న! నీమైత్రిచే గంగ యెన్ని మాట
లనిన, గంగను నేనేమి యనిన, మాకు
మచ్చరంబేల నిల్చుఁ? దామసముచేత
నింత పనియయ్యెఁ; నిఁక భేదమేల మాకు? 335

## ❁ అక్క చెల్లెండ్ర సయోధ్య ❁

వ. అని పలికి, గంగను బుజ్జగించి యిట్లనుచున్నది:336

ఆ.వె. గంగ! నీవు నేను కచ్చెలాడిన వేళ
నిన్ను నేను నంటి, నన్ను నీవు
నంటి, వట్టి కలఁక హరి దీర్చినా; డింక
హరుని తపము మాన్ప నబల! రావె! 337

వ. అని పలికిన, గంగ యుపశాంతిఁ బొంది, యిట్లనుచున్నది: 338

ఆ.వె. తండ్రి తోడఁబుట్టు తగ నీవు మేనత్త,
వమర శివునిఁ గూడినందు వలన
అక్కవైతివి; మంచి, దటుగానఁ గనరేల?
హరుని తపము మాన్ప నగజ రావె! 339

వ. అని గంగా పార్వతు లన్యోన్యంబుగాఁ బోయి,
శివునిఁ జూచి మ్రొక్కి, యిట్లనుచున్నారు: 340

## దరువు

పార్వతీ, గంగా:-
గంగ నేను ఒకటి యైతే అంగజారీ! నీ కీ తపము
సంగతి గాదు లేవోయీ! చంద్ర శేఖరా! ౧

పార్వతీ, గంగా:-
తనర గిరిజా, నేను చేయు తపములు మానితి; మింక
నెనరువా మమ్మేలవోయీ! నీలకంధరా! ౨

పార్వతీ, గంగా:-
నిన్నుఁ జూడా మా తా రిగొండా నిలయూఁ డిందూ
వచ్చినాఁడూ
కనులు దెఱచి చూడవోయి! కరుణాసాగరా! 3

వ. అని యిట్లు గంగా పార్వతులు పిలిచినా, పరమేశ్వరుండు నిష్ఠాగరిష్ఠుండై పలుకకుండిన, భయాక్రాంతలై, భృంగీశ్వరుని చేతఁ బిలిపించి చూచి, యప్పటికినిఁ బలుక కుండినఁ జింతింపుచు, పార్వతి హరినిఁ జూచి యిట్లనుచున్నది: 341

పార్వతీ:-తే.గీ.
అన్న! మే మెంత పిలిచిన నహిధరుండు
కనులఁ దెఱవఁడు; నీవైనఁగాని యితనిఁ

త్రీతి మీఱఁగఁ బిలువుఁడు! పిలువరేని
మరునిఁ బిలిపించు; వేయించు మార్గణముల.342

వ. అనిన విని హరి 'యిప్పుడు శివునిఁ బిలుచుటకు వేళ గాదు. మన్మథునిఁ బిలిపించుటకు సందియంబుగా నున్నది. అది యేమి సందిగ్ధంబనినఁ జెప్పెద విను'మని పార్వతితో మఱిన్నిట్లనుచున్నాఁడు: 343

నరహరి:-

తే.గీ. స్థూలదేహంబు రుద్రుని పాలు చేసి,
సూక్ష్మదేహంబుతో నుండు సూనశరుఁడు;
వచ్చి చెనకినఁ దత్పూర్వ వైరమునను
శివుఁడు మఱి యేమి చేయునో శిఖరిజాత? 344

పార్వతి:-

ఆ.వె. అన్న! యొక్కమాట విన్నవించెద, సూన
శరుఁడు హరునిమీఁద శరము లేసి
వేగ వచ్చి గంగ వెనుక డాఁగిన మరుఁ
డేల నొచ్చిపోవు నింకమీఁద? 345

## ❁ పార్వతి కోరికపై శ్రీహరి మన్మథుని రప్పించుట ❁

వ. అనిన విని పార్వతినిఁ జూచి, యుక్తి యుక్తమే యని హరి మరుని రావింపుచున్నాఁడు: 346

### ద్విపద

అప్పుడు మదనుండు - హరునిపై బలము
ముప్పిరి గొనఁగఁ గ్ర-మ్ముచును కీరములు,

కలకంఠములు, నీల-కంఠంబు, లళులు,
మలయానిలుండు తా-మస వైరి యగుచుఁ

దన గెల్పు నిక్షు కో-దండంబుఁ బూని,
ఘన తర పుష్ప మా-ర్గణము లందుకొని,

కోరి కోకిలలచేఁ - గూచి చేయించి,
ధీరాత్ముఁడగు చర్థి - నీ రీతి తోడఁ

గమనీయ శుక తురం-గము నెక్కి, దాని
దుమికించుకొనుచు, బల్-దుండగీఁడగుచుఁ

దన తండ్రి యైనట్టి - తరిగొండ హరినిఁ
గనుచు మ్రొక్కుచు వచ్చెఁ - గైలాసమునకు.

వ. ఇట్లు వచ్చిన మరునిఁ జూచి, యందున్న కాంతలు తమలోఁ దా మిట్లనుచున్నారు: 347

**దరువు**

మరుఁడూ వచ్చెనూ; పుష్ప
 శరుఁడూ వచ్చెనూ ॥పల్లవి॥
మన పరమేశ్వరుని మీఁద పుష్ప
 బాణము లేయాఁదలంచీ
 ॥మరుఁడూ॥ఉపపల్లవి॥

పొదూగ చిగురుటాకు
 బాకూ మొలనూ జెక్కూకోనీ
గేదాఁగీ కత్తియూ, మల్లె
 కేడెమూ చేపట్టూకోనీ ॥మరుఁడూ॥ ౧

చక్కాఁదానాములకెల్లా
 సదనామై కుల్కూచూ. మంచి
చక్కెర విల్లెక్కూ బెట్టీ
 శంభూమీఁదా దృష్టిఁ బెట్టీ ॥మరుఁడూ॥ ౨

నగధీరూఁడై తారిగొండా
నరహరీ సాహాయమునా
జగము లెఱుఁగా శివునీ గెలిచి
జయభేరీ వేయించేనానీ ॥మరుఁడూ॥ 3

వ. ఇట్లు వచ్చిన మరుండు హరికి, గిరిజకు, గంగకు నమస్కరించి, వారి దీవన లందుకొని, క్రమ్మఱఁ దండ్రినిఁ జూచి యిట్లనుచున్నాఁడు:348

శ్లో॥ వర దుగ్ధాంబుధి మధ్యభాగ శయనం వాణీశ సంసేవితం,
సుర రాజప్రముఖామరార్చిత పదం శుండాల సంరక్షణమ్।
పరమ జ్ఞాన నిజాత్మకాఖ్యసదనం ప్రఖ్యాత గోవర్ధనో
ద్ధరణం శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్షం భజేஉహం సదా॥ 349

వ. అని పలికి, మరి యిట్లనుచున్నాఁడు: 350

## ఏలలు

మన్మథుఁడు:-

కన్నాతండ్రీ! పావకాక్షూఁడువ్వా చోటి కయ్యో! యిట్లా
నన్నూ రప్పించినా వేమయ్యా? వో వాసూదేవా!
నాకేమో భయామయ్యీనయ్యా! ౧

తరిగొండ వరహరి:-

పరఁగా నేనిందే యున్నాను,
భయమేమీ నీకూ రానీనూ;
హరునిమీఁదా శరమూ లేయారా!
గిరిజా మఱుఁగూన నుండారా! వో పంచాబాణా!౨

మన్మథుఁడు:-
హరునీ యురమూ కుసుమా శరమూ
లొరయానేయా, నతఁడూ కన్నూ దెఱచీ
నప్పుడా కోపాగ్నినీ వో యత్తా!
గిరిజా! తెప్పునా చల్లార్పావే! పూనీ. 3

పార్వతీ:- అనలామూనూ చల్లార్పానూ మన గంగా
యిందుండాఁగానూ
మొనసీ భయమేమీ లేరా! వో
మేనల్లూఁడా! ముక్కంటీపై శరమూ లేయారా! ౪

మన్మథుఁడు:-
పన్నాగా భరణూఁ డగ్గీకన్నూ దెఱచీ
నన్నూఁ జూచే; నున్న నీ వద్దముగా రావే!
వో యక్కా! గంగా!
హరునీ కంటీమంటా నణఁపావే! ౫

గంగా:- తమ్మూఁడా! మీ బావా గురు ఉ
రమ్మూనాటా సూనాస్త్రములా
ఱిమ్మూ ఱిమ్మూ భయమేలా?
వో కుసుమాబాణా!
కొమ్మూ! కొమ్మూ! అభయా మిచ్చేనూ. ౬

మన్మథుఁడు:-
అయ్యూ! తారీగొండా వాసా!
కయ్యూమూ శివునీతోనూ
చెయ్యేత్తి చేసి జయింతువా? వో వాసుదేవా!
సెలవిచ్చీ పంపూమూ సరగూవా ౭

తరిగొండ వరహరి:-

ఆ.వె. పంచబాణ వినర! పార్వతియును, నేను
హరుని కంటి మంట నణఁప లేము;
గంగ మఱుఁగునుండి గరళకంఠునిమీఁద
నేయు! శరము లింక నేల తడవు? 351

## ❋ మదనుని బాణప్రయోగముచే శివుఁడు తపమునుండి మేల్కనుట ❋

### ద్విపద

అని హరి సెలవిచ్చె; - నపుడు మారుండు
విని గంగ మఱుఁగున - వీరుఁడై నిలిచి,

ఘన తపో నిష్ఠుఁడై - కదలకున్నట్టి
యనలాక్షు నీక్షించి - హాస్యంబుఁ జేసి,

ఫక్కున నవ్వి 'యో-బావ! యో మామ!
చిక్కితి విపుడు నా-చేత నిక్కముగ,

ఆనాఁడు నీవు ఫా-లాగ్నిచే నన్ను
పూని హింసించిన-ప్పుడు బుట్టినట్టి

పగ దీఱఁగాఁ బుష్ప - బాణజాలములఁ
దెగువగా నిన్ను మ-ర్దింపక పోను.'

అని పల్కి తుంట వి-ల్లపు డెక్కుపెట్టి,
యనువొప్ప తుమ్మెద - నారి సారించి,

మురువుగాఁ బుష్పాస్త్ర-ములను సంధించి,
సరవిఁ బ్రత్యాలీఢ - చరణుఁడై నిలిచి,

త్రిపురాంతకుని మీఁద - దృష్టి సంధించి,
యపుడు సూనాస్త్రంబు-లా తరిగొండ

హరి మెచ్చ హరుని తా-మ్మాటు నాటనేసి,
మరుఁ డిట్టులనియెఁ గ్ర-మ్మఱ నవ్వికొనుచు.

## దరువు, అట తాళము

నా దిక్కూ జూడవోయి బావా! నీ
వైరాగ్యాము నా చెంత సాగదోయి బావా!॥పల్లవి॥
మోదంబునఁ గనుమూసి తపసివై
యే దెసఁ జూడ; విదేమి తపము రా?
॥నా దిక్కూ॥ఉప పల్లవి॥

ముచ్చూతపమూఁ బూనీ నీవూ గంగా, పార్వతులా
మొనసీ బెదరింపుచున్నావు;
పచ్చ విల్లుఁ గొని వచ్చితి నే, ని
న్నచ్చుగ గెలిచెద; నిచ్చట నిడువను
॥నా దిక్కూ॥ ౧

పరమా బ్రహ్మచారూలనైనా చలనా మొందించే
పాటి ఘనుఁడాను నేనూ గాన
మెఱవడిగా గృహమేధి వగుచు బహు
తరుణులు గల నినుఁ దఱుమక విడుతునె?
॥నా దిక్కూ॥ ౨

తరిగొండా నారసింహుఁడైనా శ్రీశేష
శైలధామూఁ డిందే యున్నాఁడు గాన
పరమేశ్వర! నీ ఫాలతలాగ్నికి
వెఱవను మునుపటి విధమున నిప్పుడు
॥నా దిక్కూ॥ 3

క. అని గారడములు చేయుచు
నలాక్షుని యురము నాట నరవిరి ములుకుల్
మనసిజుఁ డేసి గెలిచి, యటు
వెనుకను తన విజయభేరి వేయించె వడిన్. 352

వ. అప్పుడు శివుండు నిశ్చలంబైన మనంబు చలించిన నులికిపడి, పావకాక్షినిఁ దెఱచినఁ, దత్క్షణంబున గంగ మరుని వెనుక మేకొని, హరుని కంటి మంటను చల్చార్చె; నంత శంకరుండు మదనుండు చేసిన పనికిఁ గోపంబుఁ జేసి, భృంగీశ్వరునిఁ జూచి యిట్లనుచున్నాఁడు: 353

## ❀ హరుని యాగ్రహము - రతీదేవి శరణాగతి ❀

వర:-క. ఓరీ! భృంగీశ్వర! నే
నారూఢ తపంబుఁ జేయు నప్పుడు నన్నీ
నారాచంబుల నేసిన
మారుం డిపుడేడ? నేను మర్దింపవలెన్. 354

### దరువు, అట తాళము

మరుఁ డేఁడిరా? భృంగి! మరుఁ డేఁడిరా? భృంగి!
మరుఁ డేఁడిరా? భృంగి! మరుఁ డేఁడిరా?
॥పల్లవి॥

వంచించి నా మీఁద పంచబాణము లేసె;
మంచిది గాని, యా మరుఁడేఁడిరా?
॥మరుఁడేఁడి రా?॥ ఉపపల్లవి॥

ధట్టించి నను బట్టి కొట్టే వాఁడగుచు, నా
మట్టూ దెలియాలేని మరుఁడేఁడి రా? ॥మరుఁ॥ ౧

ఆ నాఁడు వచ్చి నాచే నొచ్చి, యా భీతి
మానసమున లేని మరుఁడేఁడి రా? ॥మరుఁ॥ ౨

పదపాడి తపమూను భంగము గావించి
మదమత్తుఁడైనాఁడు, మరుఁడేఁడి రా? ॥మరుఁ॥ 3

అర్యాఁడు తరిగొండా హరిమిత్రుఁ డనుచు నా
మర్యాద దెలియాని మరుఁడేఁడిరా? ॥మరుఁ॥ ౪

వ. అని యిట్లు విసరులాడుచు హరుఁడు మరుని వెదకుచున్నం జూచి భీతిల్లి, రతీదేవి వచ్చి, శివునకుఁ బ్రణామంబుఁ జేసి యిట్లనుచున్నది: 355

## దరువు

రతీ:- శరణు శరణు శరణూ మహానుభావా!
॥శరణు॥ పల్లవి॥

శరణు శరణు శ్రీకర! సుగుణాకర!
కరుణా సాగర! కామిత ఫలదా! ॥శరణు॥ఉప పల్లవి॥

శృంగారాంగ! భుజంగాభరణా! ఘన
గంగాధర! సారంగ ధృత కరా! ॥శరణు॥ ౧

గిరిజాధీశ్వర! పరమ చిదంబర!
తరిగొండ నృకేసరి వరమిత్రా! ॥శరణు॥ ౨

తే.గీ. నీలకంధర! మారుని స్థూల తనువు
నకట! నీ కిచ్చె; నతని సూక్ష్మాంగమునకు
మేలుఁ గోరుదుఁ గనుక, నా మీఁద దయను
పురుష భిక్షముఁ బెట్టవే! భూతనాథ! 356

వర:-తే.గీ. విను! రతీదేవి! నినుఁ జూచి, మనసిజుండు
చేసినందుకుఁ దెగక రక్షింపవలసె;
'నింకమీఁదట నన్నుఁ దా నెదిరి చెనక
వలవ'దని చెప్పు; మిఁకఁ బోవె! వారిజాక్షి! 357

వ. అని సెలవిచ్చిన విని, శివునకు, గంగా పార్వతులకు నమస్కరించి, హరుని దృష్టిపథంబునం బడనియ్యక, మదనుం దోడ్కొని, హరి యనుమతంబున నిజస్థానంబునం జేరె; నంతఁ బార్వతీదేవి పరమేశ్వరునకు మ్రొక్కి, యిట్లనుచున్నది: 358

పార్వతీ:-
తే.గీ. చంద్రశేఖర! నినుఁ జూడఁ జక్రధరుఁడు
కరుణ మెఱయఁగ వైకుంఠపురమునుండి
వచ్చియున్నాఁడు చూడుము! వార్తలాడు;
మఱల నన్నును, శ్రీగంగ నాదరింపు! 359

వ. అని సహృదయంబుగాఁ బలికిన, సంతసించి, యిందుశేఖరుం డిట్లనుచున్నాఁడు: 360

## దరువు

వర:- నా మిత్రుఁ డేఁడె నగజాతా? ఎంత
ప్రియమైన వాఁడె నగజాతా? ॥పల్లవి॥

ఇచ్చట నడచిన ముచ్చట మనమునఁ
జెచ్చెరఁ గని విచ్చేసెను వెనరున ॥నా మిత్రుఁ॥ ౧

తామస తపములతో మనముండుట
కా మధుసూదనుఁ డేమనుకొనునో?॥నా మిత్రుఁ॥ ౨

తరిగొండ నృకేసరి వెనరున కే
మఱి మఱి హృదయము కరఁగుచునున్నది
॥నా మిత్రుఁ॥ 3

వర:-తే.గీ. ఎచట నున్నాఁడె నా మిత్రుఁ డిందువదన?
పార్వతీ:- ఇదిగొ! ముంగిట నిలిచినాఁ డిందుమౌళి!
వర:- ఇంటికే పిల్వరాదఁటె యిగురుఁబోణి!
పార్వతీ:- నీవు చెప్పక వచ్చునా నీలకంఠ? 361

వర:- తే.గీ. గంగ నీవైన నీ తండ్రికడకుఁ బోయి
మ్రొక్కి పిలిచితివో? లేదొ? ముద్దుగుమ్మ!
గంగ:- నీలకంధర! తపసివై నీవు కనులు
దెఱవకుండిన తఱి నెట్లు హరినిఁ బిలుతు? 362

వర:- ఆ.వె. పంచశరుఁడు నాకుఁ బగవాఁ డగుచునుండి,
పగఱ నాకు నేఁడు బంధువయ్యె;
నెట్లననినఁ జక్రి నీక్షించుటకు నన్ను
మేలుకొలిపి, దొడ్డ మేలు చేసె. 363

## జంపె

పరమేశ్వరుఁడు, పతులు:-
హరి వచ్చి తడవయ్యె; నకట! నిట కిఁకనైనఁ
బురుషోత్తమునిఁ బిలువఁ బోదాము రారే! ౧

ఓ గంగ! యో నగజ! యూరకే తడవేల?
భోగిశయనునిఁ బిలువఁ బోదాము రారే! ౨

సరసముగ నాప్రాణ సఖుఁడైన తరిగొండ
పుర నాయకునిఁ బిలువఁ బోదాము రారే! 3

వ. అని తన సతులం దోడ్కొని హరి చెంగటికిం
బోయి, హరుం డిట్లనుచున్నాఁడు: 364

## ❋ శివ కేశవుల మైత్రీ సమాగమము ❋
## (చుట్టరికపు సంభాషణలు)

### ఏలలు

వర:- ఓహోహో! యెన్నాళ్లకూ నేనూ
శ్రీహరీ! నిన్నూఁ జూచితీ
అహాహా! మోదమాయె నోయీ! వో వో చక్రాపాణీ!
యింతింతానీ చెప్పాలేనోయీ! ౧

తరిగొండ నృసింహుఁడు:-
అహాహా! నిన్నూ నేఁ జూచి, కన్నూ
లాహ్లాదాపొందీనావీ యీ
మహిమా యేమంటే వినవోయీ! వో వో శూలాపాణీ!
మైత్రీ చిహ్నా మింతే గదవోయీ! ౨

వర:- మీ యాడా బిడ్డా లుండీనా
మా యింటీకి వచ్చి గిరిజా
చేయు పూజా లందూకోవోయీ! వో వో చక్రాపాణీ!
శ్రీ గంగా నాదరింపావోయీ! 3

తరి:- గంగా నాదరింపా సర్వ
మంగళా యున్నాది; నీవూ
సంగతీగా మన్నింపావోయీ! వో వో శూలాపాణీ!
చల్లానీ చూపూ చూడావోయీ! ४

వర:- చల్లగాఁ జూచినావే! నీ
చెల్లెలికీ, కూఁతురికీ
మెల్లగా బుద్ధీ చెప్పావోయీ! వో వో చక్రాపాణీ!
మించి కొట్లాడుచున్నా రోయీ! ౫

తరి:- ఒక్కా రీతి నత్తా కోడా;
లొక్కా రీతి నక్కా చెల్లె;
లిక్కాడా నన్యూలూ లేరోయీ! వో వో శూలాపాణీ!
యేలా కొట్లాడెదరు లేవోయీ? ౬

వర:- నళినాక్షా! శ్రీతారిగొండా
నారాసింహ దేవా! నీకూ
తెలియనీ వాదము లేదోయీ! వో వో చక్రాపాణీ!
త్రిగుణామూ లద్భుతామూ లోయీ! ౭

## ద్విపద

తరి:- విను శివ! త్రిగుణముల్ - విఫలంబు లగుచు
మొనసి యొక్కొక కాల-మున విజృంభించి,

మన యంత వారిచే - మాటి మాటికినిఁ
బను లెవ్వి యైనఁ ద-ప్పక గొనుచుండు;

అటుగాన శ్రీగంగ-కగజ కీ కలహ
మిట వచ్చి పెట్టెను-హెచ్చి తామసము,

కోపవాక్యంబు లా-గుణ వికారంబు;
లా పార్వతికి గంగ - కణమర గలదె?

నీ కేల యీ చింత - నిగమాంత వేద్య!
నీ కాంతలను గూడి - నెమ్మది నుండు!

తడవాయె నే వచ్చి, - తరిగొండ కిపుడు
కడువేగ సెలవీవె! - కరుణాంతరంగ!

## ద్విపద

వర:- "ఏమోయి? గోవింద! - యింటికి రాక
యీ మాడ్కిఁ బోను కా-శ్లెట్లాడె నీకు?

తోడఁబుట్టిన దానిఁ - దొలుత నిచ్చితివి;
పోఁడిమి నటమీఁదఁ - బుత్రి నిచ్చితివి;

మామవు, తగు బావ-మఱఁదివి గనుక
నా మందిరమున కీ-నాఁటికి దయను

వచ్చితి, విపుడు మా-వాంఛలు దీరె;
నిచ్చట నుండవే! - యిఁకఁ గొన్ని నాళ్లు'

అన విని తరిగొండ - హరి హరున్ జూచి
మనము రంజిల్లఁగా - మఱి యిట్టులనియె:

తరి:-ఆ.వె. అగజ యోగ వహ్ని యతిశయించిన వేళ
జీవు లంద తేఁడ జెదరినారొ?
చూచి వారి వారి స్వస్థలంబుల నుంచి,
యన్న మియ్యవలయు నభవ! నేను. 365

వర:-క. విను మా జీవుల కన్నము
లొనరఁగ నీవేళ నొసఁగి యుండుదుము గదా?
తనియఁగ రేపటి దినమున
కనువుగ నొనఁగూర్ప నొసఁగు మన్నములు హరీ! 366

తరి:-ఆ.వె. అన్ని జంతు తతుల కాహారముల నిచ్చి
వచ్చి తిటకు, కొదువ వచ్చె నొకటి;
జాతిలోని కప్ప లే తెరువాయెనో?
వాటి కన్న మియ్య వలెఁ బురారి! 367

వర:-ఆ.వె. సిరియు, నీవు నిచట శీఘ్రంబుగా మాకుఁ
గల పదార్థములను కరుణ మెఱయ
నారగించి పోయి, యటమీఁదఁ గప్పల
కియ్యరాదె యన్న మిందిరేశ? 368

తరి:-ఆ.వె. అగచరాళి, రాళ్లయందున్న కప్పలు,
నన్నుఁ దలఁపుచున్న న్యస్త భరులు
గుడువ, కన్న మేను గుడువ నోటికిఁ బోదు;
జాలి పుట్టు నాకు నీలకంఠ! 369

వర:-క. శ్రీలలనాధిప! నీ మది
జాలిటువలె నుండినపుడు చెంఁదగు నింకన్;
లాలితముగ నా యొద్దను
చాలా దయ నుంచవోయి! జలజదళాక్షా! 370

## ❃ పరమశివుని ప్రభావములు ❃

### ద్విపద

తరి:- నీలకంధర! విను - నీ ప్రభావములు
నా లక్ష్యమున నుండు - నాటులు దేరి,

అవి యెట్టులనిన మ-హాద్భుతంబుగను
దివిజుల గావ సం-దేహంబు లేక

కుదురుగా బహు కాల-కూటమున్ మ్రింగి,
వదలక మృత్యు దే - వతను గెల్చితివి;

కాలునిఁ దోలి, మా-ర్కండేయ మునిని
శ్రీలొప్పఁగాఁ జిరం-జీవిఁ జేసితివి;

ఇవి మొదల్గాఁగ న-నేక చిత్రంబు
లవిరళంబుగఁ జేసి-నట్టి ధీరుఁడవు;

పరమేశ్వరుండవు, - భవ మోచకుఁడవు,
గురుతరాఖిల జగద్ - గురుఁడవు నీవు;

ప్రణవ కారణ మీవు, - ప్రణవార్థ మీవు;
పరిపూర్ణుఁడవు, పర-బ్రహ్మంబు నీవు

గాన నీకును నాకుఁ - గల్గిన మైత్రి
మానసంబులయందు - మఱపేలఁ బుట్టు?

'నిలువు మిచ్చట' నని - నీవు చెప్పినను
నిలువక పోదునే-నే నెంతకైన?

భేకంబులకు మేఁతఁ - బెట్టక రాఁగ
నా కిట్టి త్వర గల్గి-నది, యేమి సేతు?

మంచిది యిది యొక్క - మాట, నే నిచట
నంచితంబుగ వచ్చి - యారగించెదను;

అఱ లేక తరిగొండ - హరియైన నాకు
సిరికిని సెలవిమ్ము! - చిత్తంబునందు

నిను నేను మఱువను - నిశ్చయంబుగను,
నను నీవు మఱువకు - నగజాధినాథ!

వ. అవిన విని హరుండు హరితో నిట్లనుచున్నాఁడు:371

## ❀ శ్రీహరి కల్యాణ గుణములు ❀

### ద్విపద

వర:- నీరజోదర! విను - నేను, శర్వాణి
కోరి నీ కల్యాణ - గుణము లే వేళఁ

బొగడుచునుందు మె-ప్పుడు నదెట్లనిన:
నగణిత క్షీరాబ్ధి - నసురులు, సురలు

మథియింపు చుండఁగా - మందరం బనెడి
కుధరంబు గ్రుంగఁగాఁ, - గొంకక నీవు

కమఠమై దానిఁ ద-క్కక చరించితివె?
యమరుల కమృతంబు - నంది యిచ్చితివె?

ఇట్టి నీ మహిమ నీ-వెన్నక, విషముఁ
బట్టి నే మ్రింగిన - పని గొప్ప యనుచు

ఘనముఁ జేసితి; విది - కల్యాణ గుణము.
వినుమది యెట్లన్న - విశదంబుగాను

తన యెక్కు వెంతైనఁ - దలఁపక, యొరుల
పని నెక్కువను వాఁడు - పండితో త్తముఁడు;

కమలేశ! యిటువంటి - కల్యాణ గుణము
లమితంబు లగుచు నీ-యందొప్పుచుండు.

ఆ వేళ నన్నెక్కు - వంటివి; యహహా!
నీ వేమి తక్కువ? - నిత్య కల్యాణ!

బ్రహ్మలఁ గన్నావు; - బహు విచిత్రములు
బ్రహ్మాండములఁ గుక్షి - భరియించినావు;

పరమ సాత్త్వికుఁడవు, - పరమామృతుఁడవు,
పరమాత్ముఁడవు, పర-బ్రహ్మంబు నీవు

గనుక నీకును నాకుఁ-గలుగు సఖ్యంబు
మన మనంబులయందు - మఱపేల వచ్చు?

నే వేడ్కగా నిన్ను -నిలువు మన్నపుడు
నీ వొప్పకుందువే? - వెనరుండఁగాను,

అల రాతిలోఁ గప్ప - లన్నంబు లేక
కలఁగునో యను భీతిఁ-గలఁగి పోవలసె;

మంచిది, నాకు స-మ్మతమె యీ మాట,
సంచరింపక యొక్క - చట్రాతి నడుమ

నున్న కప్పల కన్న - మొసఁగువాఁ డెవరు?
క్రన్నన నీవు గాఁ-గా విచారించి,

కరుణ మీఱ ననన్య-గతికుల కెల్లఁ
జిరముగా నిట్లు పో-షింపు చున్నావు;

తరిగొండ పురవాసు - దయకు నా మనము
కరఁగుచున్నది వెన్న-కైవడి నిపుడు.

తరి:- ఆ.వె.అహము గల్గి, యొరుల నడిగి, కష్టముఁజేసి
బ్రతుకు వారి కొఱకు బాధ లేదు;

## ❀ పరస్పరాభివందనములు ❀

వర:-తే.గీ. పాలనమునకుఁ గర్తవై ప్రజలనెల్లఁ
దల్లివలె నీవు ప్రోవఁగా నెల్ల యెడల,
నజుఁడు, నేనును సృష్టి, సంహారములను
జేయుటకు మేలు గలిగె లక్ష్మీహృదీశ! 373

తరి:-క. సాకార, నిరాకారము
లేకాకారముగఁ జేసి, యెఱుకకు నెఱుకై,
శ్రీ కైలాసాధిపుఁడగు
నీకు నమస్కార మభవ! నిత్య పరశివా! 374

వర:-క. ప్రాకట మహిమన్ జీవులఁ
జేకొని రక్షింప సర్వ శేషివి యగుచున్
వైకుంఠంబున వెలిఁగెడి
నీకు నమస్కారమయ్య! నీరధిశయనా! 375

తరి:-క. శైలజ, గంగయు, నీవును
శ్రీ లొప్పఁగ నుందు రిచట, జీవుల కెల్లన్
పాలనముఁ జేయ బోయెదఁ
జాలా దయ నుంచవోయి! చంద్ర కిరీటా! 376

వర:-క. జీవులఁ బాలన సేయను
పోవలె; నిది నీకు నాకుఁ బొత్తగు కార్యం;
బేవేళను నా మీఁదను
నీవును దయ నుంచవోయి! నీరజనాభా! 377

తరి:-క. ఓ పరమేశ్వర! నీ నా
రూపంబులు రెండునైన, రూఢిగ మనమ్మై
వ్యాపించు సత్త యొక్కటి;
దీపద్వయమైన నేమి? శిఖి యొకటె కదా! 378

వర:-క. కావున సంయోగ, వియో,
గావిర్భావములు లేవు; హరి! నే నెపుడున్
నీ వున్న చోట నుండుదు;
నీవును నేనున్న చోటనే గల వనఘా! 379

## ❀ గంగా పార్వతుల స్తుతి, మంగళ గీతములు ❀

వ. అని శివుండు పలికిన యఖండైకరసైక వచనంబులకు హరి సంతసించి, గంగా, పార్వతులను జూచి 'మీ రిరువు రేక వాక్యంబుగా శివునిఁ గూడి సుఖంబుగా నుండుఁ' డనిన, వారు కొన్ని ప్రియోక్తులు చెప్పచుఁ, దాంబూలాది మంగళద్రవ్యంబులు సమర్పించి, హరికి, సిరికి నమస్కరించి; రంతఁ బార్వతి మతి న్నిట్లనుచున్నది: 380

పార్వతీ:-శ్లో॥సూర్యాది గ్రహ తారకాంతరగతం, సూక్ష్మాది
సూక్ష్మం, జగత్
కార్యాకార్య వివేచనం, ముని నుతం, కారుణ్య
సద్వారిధిమ్।
తుర్యాతీత సమాధిపూర్ణ, మచలం, దూరీకృతాఘం,
మహా
ధైర్యం శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం
సదా॥ 381

వ. అని పార్వతి నమస్కరించె; నంత గంగ యిట్లనుచున్నది: 382

గంగా:-శ్లో॥అర్యాత్మాంబురుహాంతరంగ నిలయం హంస
స్వరూపం, లసత్
చర్యం, సర్వమయం, సురారి వినుతం, షడ్వర్గ
గర్వాపహమ్।
శౌర్యాటోప సురారి నిగ్రహ, మజం, సాధు
వ్రజోద్ధారణం,
స్థైర్యం శ్రీతరిగొండ శేషకుధరాధ్యక్షం భజేఽహం
సదా॥ 383

వ. అని గంగా పార్వతులు ఆరాత్రికంబులు గైకొని మంగళములు పాడే విధం బెటువలెను: 384

## దరువు

గంగా, పార్వతీ:-

మంగామనోహర! మనుజ మృగేశ్వర!
మంగళం, జయ మంగళం ॥పల్లవి॥

శృంగార రసయుత సంగీత లోల! వి
హంగాధిపతి యానా! మంగళం ॥మంగా॥ ౧

సారా!ఽఽగమ విచారా! ఽంబునిధి గం
భీరా! ఽఖిలా ధారా! మంగళం ॥మంగా॥ ౨

రామా! ఽవనీజాభిరామా! నృపాల ల
లామా! దనుజ భీమా! మంగళం ॥మంగా॥ 3

నందానందాన! గోవిందా! పాలిత ముచు
కుందా! సదానందా! మంగళం ॥మంగా॥ ४

ఈశా! తరిగొండా నగరాధీశా! శేషాచలా ని
వేశా! చిదానందాకాశా! మంగళం ॥మంగా॥ ౫

వ. అని యిట్లు మంగళంబులు పాడిన, హరి సంతుష్టాంతరంగుండై, వారితో నిట్లనుచున్నాఁడు: 385

## ❋ వీడ్కోలుపులు ❋

### దరువు

తరి:- తిరిగీ వచ్చే మమ్మా! పోయి
తిరిగీ వచ్చే మమ్మా! ॥పల్లవి॥

గిరిజా! పరమేశ్వరునిఁ గూడి నీవు భా
గీరథి నాదరించూ ॥తిరిగీ వచ్చే॥ ఉప పల్లవి॥

గంగా! నీ వర్పించినట్టి మంగాళా ద్రవ్యమూల చేతా
సంగాతీగా సిరియూ నేనూ సంతుష్టుల మైతి మింక ॥తిరిగి॥ ౧

తరుణీ మందాకినీ! నీవు గిరిజా ననుసారించుకోనీ
పరమేశ్వరూనిఁ గూడి, లోక పావనివై యుండు! మేము ॥తిరిగి॥ ౨

పరమేశా! నీ సతులానూ చేపట్టి వేడ్క నుండు మిందు,
కరుణ మెఱయ తారిగొండా పురవాసుల నాదరించి ॥తిరిగి॥ 3

వ. అని పలికి, హరి పరమేశ్వరుని, గంగా పార్వతులను వీడ్కొని, నిజనివాసంబుఁ జేరి, భేకంబులకు మేపులు పెట్టి, సకలలోక పాలనంబుఁ జేయుచుండె; నంతఁ బరమేశ్వరుండు గంగా పార్వతులను జూచి, యిట్లనుచున్నాఁడు: 386

## ❃ శివుఁడు పత్నులను లాలించుట ❃

### ద్విపద

'రావె! శ్రీపార్వతి! - రావె శ్రీ గంగ!
భావించి మీరు త-పంబులు చేసి,

హరిని రప్పించితి; - రటుగాన నేను
పరమ సంతోష సం-భరితుండనైతి;

అక్క చెల్లెండ్లు మీ-రధిక లిద్ధరణి,
నెక్కువ తక్కువ - లెన్నఁగా వశమె?

కలికి! నా దేహంబుఁ - గైకొంటి వగజ!
నెలఁత! జాహ్నవి! నీవు - నెత్తి కెక్కితివి;

మీ చిత్తముల నేను - మెలఁగుదుఁ; గరుణ
జూచి రక్షింపరే! - సుందరు లార!

అని యిట్లు తరిగొండ - హరి మిత్రుఁ డపుడు
మనము రంజిల్లఁ గ్ర-మ్మఱ నిట్లు లనియె:

### దరువు

కలకంఠీ! హొయలుగా వే శైలకన్యా! రావే! వో
యలివేణీ! నీ గబ్బి గుబ్బా లంటా నిచ్చేవే! ౧

భామినీమణిరో! జహ్నుబాలా! రావే! సుఖ
సీమ ని న్నేలేను; వినుత శీలా! రావే! ౨

తరిగొండా హరిసఖుఁడానాని దయఁ జూడరే! మీ
మురిపెమూ లీడేఱా నాతో ముచ్చాటాడరే! 3

క. అని యిట్లు విశ్వనాథుఁడు
తన సతులను గారవించి, తద్దయుఁ బ్రీతిన్
ఘనరత్న మేడ లోపల
నొనర సుఖస్థితినిఁ గూడి యుండెను వేడ్కన్.387

## ❁ గంగా పార్వతుల చెలుల సంబరములు ❁

వ. తదనంతరంబు గంగా పార్వతుల చెలులు సంతసించి, తమలోఁ దామిట్లనుచున్నారు: 388

### దరువు, సువ్వి పాట

సారసాక్షి పార్వతికీ, సఖియ మందాకినికీ
పేరుగా మహేశునీకి పెండ్లి చేతమా? ॥సారసాక్షి॥ ౧

అనుచు నభము పెండ్లిపంది రందముగను గావించి, భూమి
ననువు మీఱఁగాను పెండ్లి యరుఁగుఁ జేసిరీ. ॥సారసాక్షి॥ ౨

వాసి మీఱ మాన్య సతులు వరుస నపుడు పెండ్లిఁ జేసి
భాసురముగ శోభనములు పాడి రిట్లనీ॥సారసాక్షి॥ 3

### దరువు, శోభానే

శోభానే! శోభనమే!
శోభనమే! నిత్యశోభనమే! ॥పల్లవి॥

గిరి కార్ముక మొనరించీ,
ఉరగము నారిగ బిగియించీ,
పరఁగ శ్రీహరియను బాణముఁ దొడిగీ,
పురములు గెలిచిన పుణ్యునకూ ॥శోభానే!॥ ౧

గిరి గర్భంబున నుదయించీ,
హరునిఁ జేపట్టి మోదముఁ బెంచీ,
సురలను బ్రోచీ, అసురుల గెలిచిన
పరమ పతివ్రత పార్వతికీ ॥శోభానే!॥ ౨

తరిగొండ హరి పాదమునఁ బుట్టీ,
తనర మహేశుని చేపట్టీ,
కరుణను సకల లోకముల రక్షించిన
సరసిజలోచన జాహ్నవికీ ॥శోభానే! 3

వ. అని శోభనంబులు పాడి, మౌక్తికంబులు దెచ్చి,
శివునిఁ జూచి యిట్లనుచున్నారు: 389

## దరువు

తలఁబ్రాలు పోయవయ్యా! శంకర!
నీవు తలఁబ్రాలు పోయవయ్యా! ॥తలఁబ్రాలు॥ ౧

అలర గిరిజ, గంగ మొదలైన
సతుల శిరములందూ ॥తలఁబ్రాలు॥ ౨

తలఁగి మురిపెమునా నాణి
ముత్యాములు నీ దోసిటఁ బట్టి
॥తలఁబ్రాలు॥ 3

అమర తారిగొండా నారహరి
మిత్రా! వేడూకా మీరా ॥తలఁబ్రాలు॥ ४

వ. అనిన విని శివుండు సంతసించి, తన సతుల శిరంబులందు మౌక్తికంబులు నించెఁ; దదనంతరంబునఁ జెలులు మంగళంబులు పాడే విధం బెటువలెను: 390

## ❋ మంగళ హారతి ❋

### దరువు

శైల జాత నాయకాయ జయ మంగళం
త్రి, శూల సారంగ ధరాయ శుభ మంగళం॥పల్లవి॥

కరిరాజ చర్మాంబరాయ కామిత ఫల ప్రదాయ
సరసిజ భవ సన్నుతాయ జయ మంగళం॥శైల జాత॥౧

ఉరగరాజ భూషణాయ ఉర్వీజన పోషణాయ
సురమౌని సంరక్షణాయ శుభ మంగళం
॥శైల జాత॥౨

ఇందుకళాధరాయ సనందనాది మౌనిబృంద
సందేహ నివారణాయ జయ మంగళం
॥శైల జాత॥3

కందర్పాది శతధారాయ కలి కలుష నివారణాయ
సుందరాస్య సద్విగ్రహాయ శుభ మంగళం
॥శైల జాత॥౪

గరళ కంధరాయ శ్రీ గంగాధరాయ భవహరాయ
సరస సత్య భాషణాయ జయ మంగళం
॥శైల జాత॥౫

తరిగొండ నృహరి మిత్రాయ వర కైలాసాధీశ్వరాయ
సురరాజ సంసేవితాయ శుభ మంగళం
॥శైల జాత॥౬

## ❀ సమర్పణము ❀

### ద్విపద

అని యిట్లు [1]సకల లో-కాధీశుఁడైన
ఫణిభూషణుని పేరఁ, - బార్వతి పేర,

జలజాత దళనేత్రి - జాహ్నవి పేర
విలసితంబుగ, రాచ-వీడను పురిని

లలిమీఱఁగాను స-లక్షణంబుగను
నెలకొని, భక్తుల - నేలెడి భద్ర

కాళీశ్వరునకు జ-గత్ ప్రసిద్ధునకు
ఫాలాక్ష సుతునకు - భవ సంహరునకు

దక్షాంతకునకు సుం-దర విగ్రహునకు
మోక్ష దాయకునకు - మోద చిత్తునకు

[2]రమణీయునకును శౌ-ర్యప్రతాపునకు
విమల సాహసుఁడైన - వీరభద్రునకు

సలలితమైనట్టి - సద్భక్తి తోడ
వలనొప్పఁగా నంద-వర కులోద్భవుఁడు

[3]వరకీర్తి కానాల-వంశవర్ధనుఁడు
గురుతర వాసిష్ఠ - [4]గోత్ర పావనుఁడు

---

1. లోకలోకాధీశుఁడైన- అ,ఆ, క, కా.
2. రమణీయునకు నుజ్జ్వల ప్రతాపునకు-గ.
3. వరకీర్తి కానాల వంశ వర్ధనుఁడు- అ, ఆ, క, కా;
 నరులెన్నఁదగిన కానాల వంశజుఁడు-గ.
4. గోత్రపావనుఁడు- అ, ఆ, క, కా; గోత్రోద్భవుండు-గ.

వసుధమీఁదను కీర్తి-వంతుఁడై చాల
[5]రసికుఁడౌ కృష్ణార్యు - రమణి మంగాంబ

[6]వరపుత్రి వెంగమాం-బ ధరిత్రిమీఁదఁ
దరిగొండ నృహరి పా-దంబులు మదిని

భావించి మ్రొక్కి, సు-బ్రహ్మణ్య గురుని
సేవించి, ఘన శేష-శిఖరీంద్రుఁ గొలిచి,

కరమొప్ప శివనాట-కంబను కృతిని
ఇరవొందఁగా రచి-యించి, వేడుకను

పరమ భక్తిని వీర-భద్రున కొసఁగె.

---

5. రసికుఁడు-అ, కా.

6. "సమర్పణము" నందలి యీ ఘట్టం (ఏడు పంక్తులు)

i ) అ, ఆ- అనే రెండు ప్రతుల్లో ఈ క్రింది విధంగా ఉంది:-

"వరపుత్రి వెంగమాంబ ధరిత్రిమీఁద
నరుదుగాఁ దరిగొండ హరి కటాక్షమున
నరగున నీ కథ సద్భక్తిఁ జేసి
పరమభక్తిని వీరభద్రున కొసఁగె."

ii) క, కా- అనే రెండు ప్రతుల్లో ఈ క్రింది రీతిగా ఉంది:-

"వర పుత్రి వెంగమాంబ ధరిత్రిమీఁద .
నరుదుగాఁ దరిగొండ హరికటాక్షమున
సరసత శివవిలాసంబను కథయుఁ
గరమర్థితో యక్షగానంబుఁ జేసి
పరమ భక్తిని వీరభద్రున కొసఁగె
ధరలోన నాచంద్ర తారార్కముగను."

## ❀ ఫలశ్రుతి[7] ❀

వరభక్తి నీ కృతి - వ్రాసిన వారు,

సంతతం బీ కృతిఁ - జదివిన వారు,
వింతగా వే వేళ - వినుచున్న వారు

ప్రకటిత భాగ్య సం-పన్నులై వెలసి,
యకలంక పరతత్త్వ - మందుఁ జెందుదురు.

నన్నేలు తరిగొండ - నరసింహ కృపను
పన్నుగా నీ కృతి - ప్రఖ్యాత మగుచు

భూచక్రమందు వి-స్ఫురణ దీపింప
నాచంద్ర తారార్క-మై యొప్పుఁ గాత!

❀ ❀ ❀ ❀ ❀

<u>**NOTE**</u> :- "శివనాటకము" యొక్క సమగ్రప్రతులు అయిదింటిలోను వ్రాయసకాండ్ర వక్కణలు (లేఖన కాలాది వివరములు) ఈ క్రింది ప్రకారంగా ఉన్నాయి:-

**i)<u>"గ" (ప్రధావ) ప్రతి చివర</u>:-**

శ్రీతరిగొండ్ల లక్ష్మీనృశింహ్వాయ నమః
శ్రీంశ్రీంశ్రీంశ్రీంశ్రీంశ్రీం జేయునూ.

---

7. ఈ "ఫలశ్రుతి" ఘట్టం (తొమ్మిది పంక్తులు)

i) అ, ఆ, - అనే రెండు ప్రతుల్లో ఈ క్రింది విధంగా ఉంది:-

"ధరణిలో నీ కథ ధన్యులై వేడ్క
వ్రాసినఁ, జదివిన, వలనొప్ప వినిన
నాచంద్ర తారార్కమై యొప్పుఁగాత!"

ii)క, కా-ప్రతుల్లో "ఫలశ్రుతి" లేదు.

హేవిళంబ్బి నామ సంవ్వత్సర శ్రావణ శు.౪ సోమవారముకు సరి అయ్యి ౧౮౯౭ సంవ్వత్సరం అగష్టునెల తే3దీకి పూర్తిగా వ్రాయడము ముగిశెను.

ఈ మాతృక విజయం నామ సంవ్వత్సర ఫాల్గుణశుద్ధిలు గరిడిమిట్ట చిదంబరయ్య్య కొమారుడు సర్పప్ప వ్రాశ్ని మాతృకనుపట్టి గరిడిమిట్ట గంమ్మంన్న కొమారుడున్ను, వెంగమాంబ్బ గారికి మునిమనుమడున్ను అయ్యి గంగ్గాధరప్ప వలన యెత్తి వ్రాయబడ్నది. శ్రీకృష్ణాపణము.

ii)"అ" <u>ప్రతి చివర:-</u>

శివ విలాసం సంపూర్ణం. మంగళమహా శ్రీశ్రీశ్రీశ్రీశ్రీశ్రీం జేయునూ.

క్రారయు సుంన్నయు దీర్ఘం
బ్బారయ తలకట్టు కియ్య యతి దప్పినచో
క్రూరగతి తిట్టవలవదు
అరశి రక్షింపవలయు అక్షర దక్షులూ.

iii)"ఆ" <u>ప్రతి చివర:-</u>

వ్రాలా శబ్ధలు తప్పలు
చాలంగ్గా గలవు, శబ్దసంగతు లెరుగన్;
గేలింబెట్టక తిట్టక
పోలంగ్గా దిద్దరయ్య్య బుధజనులారా!

అబద్ధంవా సుబద్ధంవా మమ దోషో నవిద్యతే.

సాధారణ సంవ్వత్సరం భాద్రపద బ ౧౧
[illegible] హుగుటూరి వీదింటి

నారణప్ప గారి కుమారులు శివరామప్పగారు గుడియాతం వెంకటసుబ్బైయ్యగారికి త్రివ్యాళల యందు ఆకల్పాంతం వంశాభివృద్ధిరస్తు యని ఆశీర్వదించి వ్రాసియిచ్చిన శివవిలాస గ్రంథానికి అయురారోగ్య అష్టైశ్వర్యాభివృద్ధిరస్తు.

శ్రీ సుగుణ పురి వారి పరమ ప్రకాశ సచ్చిదానంద నారాయణేశ్వర తారక బ్రంహ్మ జగద్గురుమూర్తి నిరంజన పరమాత్మా రామచంద్ర సుబ్రహ్మణ్య చెన్న కేశవాయ నమః

iv) "క" ప్రతి చివర:-

యాదృశం పుస్తకం దృష్ట్వా తాదృశం లిఖితం మయా,
అబద్ధం వా సుబద్ధంవా మమ దోషో నవిద్యతే.

v) "కా" ప్రతి చివర:-

శివ పారిజాతము సంపూర్ణము.

౧౮౮౦ సంవత్సరం య్యేప్రేల్ నెల తే౧౬దికి సరి అయ్ను విక్రమనామ సంవత్సర చైత్ర శుద్ధ౭ శుక్రవారం వరకు వంగిమళ్ల గ్రామంలో వుండె తిరుమల శెట్టి వెంకట చిన్నయ్య భార్య అయ్ను తిమ్మక్కకు తిరుపతి మారెళ్ల సుబ్బన్న వ్రాశియిచ్చిన శివపారిజాతము.

యాదృశం పుస్తకం దృష్ట్వా తాదృశం లిఖితం మాయా।
అబద్ధం వా సుబద్ధం వా మమ దోషో న విద్యతే॥

